# అమృతసారము

రచన

విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు



ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# అమృతసారము

( తాళ్ళపాక అన్నమాచార్యులవారి
అధ్యాత్మ సంకీర్తనలకు సీసపద్యానుసరణము)

రచన

**విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు**

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
2008

# AMRITASARAMU

(Adaptation of AnnamaCharya's Adhyatma Sankirtanas into 'sisam' Verses)

by

**Vidwan Mudivarti Kondamacharyulu**

T.T.D. Religious Publications Series N0: 430
© All Rights Reserved

T.T.D.First Edition: 1992

Re-print: 2008

Copies : 1,000

*Published by*

**Sri. K.V. Ramanachary, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P.* at**

Chief Editor's Office, TTD, Tirupati.

***Printed at***

Tirumala Tirupati Devasthams Press,
Tirupati.

# ముందుమాట

వానకు తడియనివారూ, తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనల్ని ఆలకించి ఆనందించనివారూ ఉండరని చెప్పడం అతిశయోక్తి కాదు. అన్నమాచార్యులు విష్ణుదేవుని నందకాంశలో (1408-1503) అవతరించాడని ప్రసిద్ధి. హరికీర్తనాచార్యుడనీ, పదకవితా పితామహుడనీ ప్రఖ్యాతి వహించాడు. భక్తిమత ప్రచారానికై తెనుగులో పదకవితకు నూతనంగా పట్టం కట్టిన ఈ పరమభాగవతోత్తముడు శ్రీవేంకటేశ్వరస్వామిమీద రచించిన కీర్తనలు 32 వేలు. వీటిలో పాండురంగవిఠలుడు, అహోబల నారసింహుడు, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు స్తుతించబడినప్పటికీ అన్నీ శ్రీనివాసమూర్తికే అంకితం చేయబడ్డాయి. ఈ దేవుళ్లందరూ తిరుమలేశ్వరుని ప్రతిరూపాలే అని అన్నమయ్య అభిప్రాయం. ఈయన రచించిన ప్రతి పాట శ్రీవైష్ణవ సిద్ధాంతాన్ని చాటుతుంది.

అన్నమాచార్యుల పదాలను, ఆధ్యాత్మిక సంకీర్తనలనీ, శృంగార సంకీర్తనలనీ రెండుభాగాలుగా విభజించడం జరిగింది. ఔచిత్యపూరితమైన అలౌకిక శృంగారం అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో చోటుచేసికోగా, ఐహికాముష్మికముల అశాశ్వత శాశ్వతత్వాలనీ వివరిస్తూ, ముక్తికి భక్తియే ప్రధానసాధనమనీ ఆధ్యాత్మిక సంకీర్తనలు చాటుతుంటాయి. చదువురానివారికి సైతం వేదాంతంలోని రుచులు చూపించి వారిని సంస్కారసంపన్నుల్ని చేయగల శక్తి అన్నమయ్యపదాల కుందనటానికి కారణం ఆయన ప్రజల భాషనూ, జానపదులకు సుపరిచితాలైన మాటల్ని సేకరించి తన కీర్తనలో వాటికే ప్రాధాన్యమివ్వడమే. మధ్యయుగాల్లోని తెలుగుభాషా సౌందర్యాన్ని పరిశీలించడానికి అన్నమయ్యపదాలు కరదీపికలనీ, అవి జాతి సంస్కృతిలో ఒకభాగంగా కలసిపోయిన కవితలనీ నిస్సందేహంగా చెప్పవచ్చు.

**"శ్రుతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞాన సారంబులై**
**యతిలోకాగమ వీథులై విపులమంత్రార్థంబులై నీతులై**
**కృతులై వేంకట శైలవల్లభ రతిక్రీడా రహస్యంబులై**
**నుతులై తాళులపాక అన్నయవచో నూత్నక్రియల్‌చెన్నగున్".**

అని సాహితీవేత్తల ప్రశంస లందుకున్న అన్నమాచార్యుల పదాల్లో మూడువందల ఆధ్యాత్మిక సంకీర్తనలను ఎన్నుకొని విద్వత్కవిశేఖరులు శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులవారు ఈ అమృతసారాన్ని రచించారు. అమృతబిందువు ల్లాంటి ఒక్కొక్క కీర్తనలోని సారాన్ని "సీసాల" కెక్కించిన ఘనత శ్రీకొండమాచార్యుల వారికే దక్కింది.

అన్నమయ్యను ఆంధ్రదేశంలో అనేక ప్రక్రియల్లో ప్రచారంచేస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానములు కవిగారిచే 1986లో తొలుదొల్తగా ప్రచురితమైన అమృతసారాన్ని స్వీయప్రచురణగా స్వీకరించి 1992లో ముద్రించింది. ప్రతిపద్యానికి సరళ తాత్పర్యం సమకూర్చడంవల్ల, అన్నమయ్యపాటల్లోని పదబంధాలే చెక్కుచెదరకుండా పద్యాల్లో చొప్పించడంవల్ల పాఠకులను విశేషంగా అలరించిన ఈ పుస్తక పునర్ముద్రణావసరం గుర్తించి మళ్లీ ప్రచురిస్తున్నాం. భక్త జనావళి మా కృషిని ఎప్పటివలె ఆదరించి ఈ అమృతసారాన్ని తనివితీరా ఆస్వాదిస్తారని మా విశ్వాసం.

(కె.వి.రమణాచారి)
కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి.

శ్రీమాన్ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు
1-9-34/ 5/1, రామ్‌నగర్,
హైదరాబాదు-600 048
28-5-86

# అభినందనమ్

ఏడుకొండల వెంకన్న కన్న పరదైవతం మరిలేదని దృఢంగా విశ్వసించిన ఐకాంతిక భక్తుడు అన్నమయ్య. తమిళ ఆళ్వారుల విలక్షణమైన భక్తిమార్గాన్ని తెలుగువారికి పరిచయం చేసిన మహానుభావుడు ఆయన !

ఆ అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తలను మథించి "అమృతరసము నింపి సీసాల తొలితొలి నింపుమీర పాఠకోత్తములారా! మీ పాఠి నిడితి" అంటూ సోదరులు శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులుగారు అందిస్తున్న ఈ 'అమృతసారం' పాఠకులను మరింత సులభంగా పరవశులను చేయగలదనడంలో సందేహం లేదు.

చంపూప్రబంధాన్ని ద్విపదగానో, గద్యంగానో తెలుగులోంచి తెలుగులోకే అనువదించే సంప్రదాయం మనకు ఇదివరకే ఉంది కాని, సంగీతసాపేక్షాలయిన సంకీర్తనలను సరళంగా, సర్వజనసుబోధంగా సీసపద్యాలలోకి అనువదించగలగడం శ్రీకొండమాచార్యులు సాధించిన అపూర్వసిద్ధి! అందుకు ఆయనను నేను అభినందిస్తున్నాను.

ప్రొఫెసరు
**సి. నారాయణ రెడ్డిగారు, ఎం.ఏ.పి హెచ్.డి., డి.లిట్.**
వైస్ ఛాన్సెలరు
ఆంధ్రప్రదేశ్ ఓపెన్ యూనివర్సిటి
6-3-645, సోమాజిగూడా,
హైదరాబాదు-500482
21-6-1986

మీ లేఖ అందింది. 'అమృతసారం' పంపి నాఅభిప్రాయాన్ని కోరినందుకు కృతజ్ఞతలు. అన్నమాచార్యుల సంకీర్తనలలోంచి 300ల కీర్తనలను ఏరుకొని వాటిని సీసపద్యాలుగా మలచిన మీచేతి ఒడుపు ప్రశంసనీయం. అన్నమాచార్యుల కృతులు ధాతుమాతువులకు సమగ్ర సేతువులు. అవి సంగీతానికి ఎంతబాగా ఒదుగుతాయో కవితా పరిపాకాన్ని అంతగా ఒడిసిపట్టుకొన్నాయి. అందువల్ల మీ చేతిలో ఆ పదాలు పద్యాలుగా ప్రవహించాయి. ఆ పదాల్లోని పంక్తులను కొన్నిటిని యథాతథంగా సీసపద్యాల్లో ఇమిడించిన మీ ఉక్తిచతురత మెచ్చుకో దగింది. ఒక్కమాటలో చెప్పాలంటే మీరు సంతరించిన పద్యం పాటపాడినంత ధారాధురీణంగా సాగిపోయింది. భక్తిశతకాలను చదువుకొనే ఆసక్తి ఉన్నవాళ్ళకు ఈ పద్యరచనద్వారా అన్నమాచార్యులను మరింత సన్నిహితం చేసినందుకు మీకు నా అభినందన.

**కళాప్రపూర్ణ** ఫోన్ : 231701
**డాక్టర్ దాశరథి, డి.లిట్.** 104-(సి.బ్లాక్) మాతృశ్రీమందిరం
కేంద్రసాహిత్య అకాడమీసభ్యులు, హైదర్‌గూడా, హైదరాబాదు
ఆకాశవాణి, దూరదర్శిని గౌరవప్రయోక్త, -500029
ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు, అక్షయజ్యేష్ఠ పూర్ణిమ
భారతప్రభుత్వ సామూహికగాన జాతీయోద్యమ
కేంద్రసమితి సభ్యులు

# సుధావృష్టి

సప్తాచలస్వామి సన్నిధానము భక్తికి ముక్తికే గాక సాహిత్యసృష్టికీ, సమ్యగ్దృష్టికీ,కవితాసుధావృష్టికీ కాణయాచి.

నాడు అన్నమాచార్యులవారి నుండి నేడు కొండమాచార్యులవారి వరకు అవిచ్ఛిన్నంగా సాహితీసృష్టి సాగుతున్నది.

తిరుపతి ఆధ్యాత్మిక కేంద్రమేగాక, సాహిత్యకేంద్రం కూడా. కీ.శే.రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు, కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు మరి యెందరో మహానుభావులు తిరుపతినుండి ఆంధ్రసాహితీలోకాన్ని సుసంపన్నం చేస్తూ వచ్చారు.

అన్నమయ్య సంకీర్తనలు తెలుగుసాహిత్యంలో కొత్తమలుపు. ఆయన పదసర్జనశక్తి నిరుపమానము. అన్ని వేలకీర్తనలు మరెవరైనా మరే భాషలోనైనా రచించిరా? "నభూతో నభవిష్యతి" అనవచ్చును. పదిహేనవశతాబ్ది గొప్పపుణ్యం చేసుకున్నది.

పదకవితా పితామహులు వసుధపై పదముమోపి పదసాహిత్యాన్ని ప్రజల కందించారు. విద్వాన్ ముదివర్తి కొండమాచార్య స్వామివారి తిరుపతి నివాసం మరొక విశిష్టమైన సాహిత్య ప్రక్రియా సర్జనమునకు తోడ్పడినది. అన్నమాచార్యులవారి అధ్యాత్మసంకీర్తనలు రమారమి రెండువేలకు పైగా ఉండవచ్చును. వాటిలో మూడువందల సంకీర్తనలను ఎన్నుకుని వాటిని సీసపద్యములుగా మలచినారు.

అన్నమయ్య సంకీర్తన సాహిత్యము అమృతము. తత్సారము సీసాలలోనికి దింపినారు ముదివర్తివారు. ఈ ఆలోచన కలగడంలోనే విశిష్టత కలదు. ఆచరణలోకి తేవడంలో గొప్ప సాహసము కలదు.

అమృతసారము మూడువందల సీసాలలో నేడు మనకు లభ్యమైనది.

పల్లవిని సృష్టించినవారు అన్నమాచార్యులవారు. అంతకుముందు పాటలు ఈ రూపమున నుండెడివికావు. పల్లవిలేని పాట ప్రాణము లేని మాటల మూట.

శ్రీమాన్ కొండమాచార్యులవారు భక్తిరసావేశపూరితములు, ఆధ్యాత్మికములు అయిన కీర్తనలనే సీసములుగా మలచినారు. కవిగారు అన్నమయ్య శృంగారకీర్తనల వైపు పోలేదు.

అన్నమయ్యకీర్తనలు కొన్ని సీసపద్యమునకు సన్నిహితంగా వుంటాయి. ఉదాహరణకు--

"హీన దశల బొంది యిట్లనుండుట కంటె
నానా విధులను నున్ననాడే మేలు"

ఇది పల్లవి. దీనిలోని రెండవ పంక్తిని-
"నానా విధుల నున్ననాడె మేలు"

అని సర్దితే సీసం అగుతుంది. మొదటిపంక్తి సీసపాదంలోని అర్ధభాగమే; అక్షరం మార్చ నక్కర లేదు.

సీస పద్యముగా మలచడానికి వీలైన కీర్తనలు అన్నమయ్యలో వున్నాయి. అయితే ఆచార్యులవారు అట్టి కీర్తనలను మాత్రమే తీసుకోలేదు.

వారు విషయక్రమముగా కీర్తనలు ఎన్నుకున్నారు. వేంకటాద్రి మహిమతో ప్రారంభించి శ్రీనివాసుని పరబ్రహ్మస్వరూపమును తెలుపుచు, స్వామిమహిమలను వక్కాణించుచు, జీవుని రక్షించవలసిన బాధ్యత పరమాత్మదే యని చెప్పుచు, శరణాగతి యొక్కటే పరమగతియని పలుకుచు, మోక్షసాధనకు భక్తిని మించి మరొకమార్గము లేదని రూఢిపరచుచు తుదిని మంగళాశాసనముచేసి ముగించినారు. ఈ క్రమము అత్యంతసమంజసముగా నున్నది.

సీసపద్యములు స్వతంత్రముగా రచించుట ఒకయెత్తు; కీర్తనలు ఆధారముగా వానిలోని పదాలను భావాలను సీసపద్యములలో కుదించుట ఒకయెత్తు. ఈ రెండవ తీరు కష్టసాధ్యమైనది. కాని కవిగారు సుసాధ్యము చేసి చూపినారు.

ఉదాహరణకు, అధ్యాత్మ సంకీర్తనల తొలిసంపుటి పుట ముప్పదిలోని నలువదియారవ కీర్తన:

ఈ కీర్తన "మంగళము" తోనే ప్రారంభమగును. శ్రీమాన్ కొండమాచార్యులవారి సీసములోని తేటగీతిలోని తుదిపంక్తులలో "మంగళము" కనిపించును.

"మౌని సురవంద్యునకు జయమంగళమ్ము
మహిత మంగేశునకు శుభమంగళమ్ము."

అన్ని సీసములలో ఇట్లున్నదని నే ననుటలేదు. పల్లవిలోని మాటలతోనే సీసము ఎత్తుకొన్న ఘట్టములు లేకపోలేదు.

"నాపాలి ఘననిధానమవు" అన్న కీర్తనలోని పల్లవి పూర్వభాగమును యథాతథముగ "నా పాలిఘన నిధానమవునీవే" అంటూ సీసం ఎత్తుకున్నారు.

సీసము, ద్విపద-ఈ రెండు తాళానికి ఒదిగేరీతిగా పాడుటకు అవకాశం ఉంది. అటు పద్యానికీ, ఇటు పదానికీ మధ్యగా వుండేవి ఈ రెండు ఛందస్సులు.

కీర్తనలలో త్రిశ్ర మిశ్రాది గణాలున్నా, ఖండగతిగణాలు ఎక్కువ. ఇవి అయిదుమాత్రల గణాలు.

సీసపద్యపాదంలో ఆరు ఇంద్రగణాలు ఉంటాయి గనుకనూ, ఇంద్రగణాలలో భగణం, నలం తప్ప తక్కినవి అయిదుమాత్రల గణాలు అవడం వల్లనూ, కొన్ని సందర్భాలలో కీర్తనలలోని పంక్తులకు, చిన్న సవరణలతో యథాతథంగా సీసరూపం కల్పించవచ్చును. అట్టి అవసరాలలో శ్రీ ఆచార్యులవారు ఆ అవకాశమును చక్కగా ఉపయోగించుకున్నారు.

భావములు, పదములు అన్నమాచార్యులవారివే అయినను, కొండమాచార్యులవారి సీసములు మూలరచనలవలె ధారాశుద్ధితో పోతన్నగారి సీసములవలె సాగినవి. అది కవిగారి అశేషప్రతిభకు నిదర్శనము. ఉదాహరణకు అమృతసారము-పద్యసంఖ్య 189

"ఇతర దూషణముల నెడసి నప్పుడుగాక
అతి కాముకుఁడు గాని యపుడు గాక
మతి చంచలత్వమ్ము మానినప్పుడు గాక
గతి యేల గల్గు? దుర్గతులు వీడు?

దీనికి మూలము రేకు10, సంఖ్య 62

## చరణము:

"ఇతరదూషణములు యెడసినగాక
అతి కాముకుఁడు గాని యప్పుడుగాక
మతి చంచలము గొంత మానినఁగాక
గతి యేల గలుగు, దుర్గతు లేల మాను"

మూలమునకు అత్యంత విధేయములై గూడ స్వతంత్రరచనలవలె సాగిన ఈ పద్యములు హృద్యానవద్యములు.

'అమృతసారము'లో నేను గమనించిన మరొక విశేషము పద్యమునకు ముందు ఒక పంక్తిలో అవతారికను పొందుపరచుట. ఇది పాఠకునకు ఎంతగానో తోడ్పడును. ఇక పద్యము తుదిని తాత్పర్యము సరళమైన భాషలో సామాన్య పాఠకునికి సుబోధకముగా నుండునట్లు రచించుట. ఇది నేటి పాఠకలోకమునకు ఎంతో అవసరము.

"దివ్యమౌ హరినామ దీపంబు చాలదా?
పాపాంధ కారంబు పాఱఁదోల;
ఘనమైన హరినామ కనకాద్రి చాలదా?
దారిద్ర్య దోషంబు తరిమివేయ"

ఇది కొండమాచార్యులవారి సీసము. (అమృతసారము, పద్యసంఖ్య 224)

ఇక అన్నమాచార్యులవారి మూలకీర్తన (52) "చాలదా" తో ప్రారంభ మవుతుంది, పద్యంలో 'చాలదా' అన్నమాట పాదార్థం తుదిని వచ్చినది. పాటకు అది సొగసు; పద్యానికి ఇది సొగసు.

ఇట్లనేక విశేషలక్షణములతో 'అమృతసారము' లోని ప్రతిపద్యము భక్తి రసావేశభరితమై అలరారినది.

ఈ 'అమృతసారము' లోని 250వ పద్యమునకు ఆచార్యులవారు సమకూర్చిన అవతారిక 'భక్తి వినా ఇతరములైన ఏ యుపాయముల చేతనూ భగవంతుడు వశ్యుడు కాదు' అను వాక్యము లోనిది అన్నమయ్య దృఢ విశ్వాసము.

శ్రీకృష్ణపరమాత్మ గీతలో చెప్పినది అదే.

"యదృచ్ఛయా మత్కథాదౌ
జాతశ్రద్ధస్తు యః పుమాన్,
న నిర్విణ్ణో నాతి సక్తో
భక్తి యోగోఽస్య సిద్ధిదః."

ఆ శ్రియ:పతి భక్త పరాధీనుడు. శరణాగతత్రాణుడు.

హృద్యాన వద్యపద్యవిద్యా పరివృఢులు, అమరసందేశము, వీరమనీడు, కూనలమ్మ, నారాయణమ్మ, పూర్ణాహుతి వంటి అనేక కావ్యరాజములు రచించిన కవిశిఖామణులు ముదివర్తి కొండమాచార్యులవారు.

అన్నమయ్యగారి అధ్యాత్మ సంకీర్తనావళి అమృతమైతే ముదివర్తివారి ఈ సీసపద్య త్రిశతి అమృతసారము.

ఇది శ్రీవేంకటాద్రీశ్వర గళసీమలో అనర్ఘరత్నహారము, స్వస్తి.

డాక్టరు జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు
'కరుణశ్రీ'

కల్యాణభారతి,
రవీంద్రనగర్, గుంటూరు-6
24-6-'86

# శ్రీ సూక్తము

ముదివర్తి సుకవితా కౌ
ముది వర్తిలు కువలయప్రమోదావహమై
హృదయంగమమై శారద
మృదుపదలావణ్య మాధురీసంగమమై.

పాలసముద్రమౌ తెలుగుబాసను చక్కగ త్రచ్చె, నందచం
దాల పదాల నిచ్చెను సుధన్ విబుధాళికి "అన్నమయ్య" మున్;
చాలినభక్తి నా యమృతసారమునే వడగట్టి మేలి సీ
సాలకు పట్టియిచ్చె బుధసంతతి కిప్పుడు "కొండమయ్య" తాన్.

పూచిన నందివర్ధనము పువ్వుల చల్లదనమ్ము గుండెలో
దాచిన వేమొ నీదు కవితల్ మదికిన్ గదు హాయి గూర్చెడిన్;
వాచవులూరు నీమధురవాక్కులకున్ కరుణార్ద్రమూర్తి శే
షాచల చక్రవర్తి "అహహా" యనుచున్ దలయూచి మెచ్చెలే.

ఒండొకసీస మొండొక సముజ్జ్వల శారద మందహాసమై
గుండెలు గ్రుమ్మరింప సమకూర్చె బహూకృతిగా మహాకృతిన్;
కొండ కయిన్ ధరించి తరికొండ భరించియు, నేడుకొండలం
దుండెడు సామి అందుకొనకుండునె? కొండయ కొండమల్లెలన్.

విచ్చిన తమ్మిమొగ్గలు స్రవించిన వెచ్చని తేనెసోన లం
దిచ్చెను భావుకాళికి త్వదీయ మనఃకమలాకర మ్మహో!
హెచ్చిన సంబరాన కురియించిరి కమ్మని పూలవాన ల
య్యచ్చర లంబరాన మధురామృతసారము నిచ్చ మెచ్చుచున్.

పువ్వులపాన్పుపై పవ్వళించినయట్లు
మలయమారుతము పై నొలసినట్లు
స్వామిపుష్కరిణిలో స్నానమాడినయట్లు
కొండకొ మ్మెక్కి కూర్చుండినట్లు
ఆనందనిలయమే అవతరించినయట్లు
శేషాచలేంద్రు దర్శించినట్లు
బ్రహ్మోత్సవము గాంచి పరవశించినయట్లు
తిరుమలేశుని లడ్లు తిన్నయట్లు

అన్నమాచార్యుడే పద్య మల్లుకోర్కి
కొండమాచార్యురూపు గైకొన్నయట్లు
"అమృతసారమ్ము" చవిచూచు సమయమందు
తోచుచుండు రసజ్ఞసందోహమునకు.

ఉన్న చిన్నమాట నుగ్గడించెద చెవుల్
విన్నమాట కనులు కన్నమాట
అమృతసారకవి "మహాకవి" యని మెచ్చె!
స్వామివచ్చె! ఆశిషమ్ము లిచ్చె!

శ్రీమాన్ పద్మావతీనాథః స్వామీ సప్తగిరీశ్వరః,
శ్రీవేంకటేశ్వరః పాయాత్ కొండమాచార్య సత్కవిమ్.

ఇతి శుభమ్.

సరస్వతీ పుత్ర, కళాప్రపూర్ణ
డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులుగారు

మోచంపేట,
కడప.
28-6-86

# నాలుగు మాటలు

అన్నమయ్య, అన్నమాచార్యులు, అన్నమయ్యంగార్--ఇవీ ఆయనజీవితంలో మూడుదశలు. ఆయన తఱచూ శాసనాల్లో అన్నమయ్యగానే కనపడతాడు. అన్నమయ్యంగార్ అని కూడా వొక్కొక్కచోట ప్రత్యక్షమవుతాడు. సాధారణంగా వైష్ణవులలో ఆచార్యులు అనే పరస్పరం పిలుచుకుంటారు. కొందరు రాను రాను, నామాలసైజు ఎక్కువ చేస్తారు. దానికితోడు కడుపు కూడా సహకరిస్తుంది.

అప్పటినుంచీ వారు అయ్యంగార్ ఔతారు. మరి అన్నమయ్యలో ఈ మానసిక పరిణామాలు నేను ఊహించలేను. కానీ, వాళ్ళూ-వీళ్ళూ అయ్యంగార్ పేరు తగిలించుకుంటారు. ఆయన మొదలు నందవరీకుడు. తర్వాత విశిష్టాద్వైతం పుచ్చుకున్నాడు. శంఖచక్రలాంఛనాలూ జరిగినాయి. ఆ కాలంలో చాలామంది నందవరీకులు వైష్ణవులైనవారు వున్నారు. వారిలో ఎంతమందికి విశిష్టాద్వైతం అరిగిందో చెప్పలేము. అన్నమయ్యలో మాత్రం అది కుసుమితమై, ఫలితమైంది. చిన్ననాటినుంచే వేంకటేశ్వరుని పైన పదాలు పాడటానికి ఆరంభించినాడు. బాహ్యవైష్ణవానికన్నా, ఆంతరికమైన సంస్కారం అతనిలో బహుముఖాలుగా విజృంభించింది.

అన్నమయ్యపైన తిక్కనప్రభావం ఎక్కువగా కనబడుతుంది. ఆయన యతిప్రాసల్లోకూడా తిక్కనామాత్యుడే సాక్షాత్కరిస్తాడు. కానీ శిష్యుడు గురువును అన్నిరీతులా మించిపోయినాడు. తిక్కనామాత్యునికి వ్యాసుని భారతం అందుబాటులో వుంది. బ్రహ్మాండమైన కథ. ఆ నిచ్చెన మీద ఎక్కి ఆయన, ఎన్నో చాకచక్యాలు కనబరుస్తూపోయినాడు. కానీ అన్నమయ్యది ఆకాశఖడ్గచాలనం. ఆ గర్భగుడిలో వుండే వెంకటేశ్వరుడు తప్ప ఏ ఆధారమూ లేదు. ఆయన్ను ఆధారంగా చేసికొని, ముప్పైరెండువేల కీర్తనలు చెప్పడం, చెప్పిన ప్రతి కీర్తన గూడా హృదయోద్గారం కావడం--ఆశ్చర్యకరమైన విషయం.

ఇంకా ఆంధ్రసాహిత్యం గమనింపవలసినంతగా గమనించడం లేదుగానీ- ఆయన విరాట్స్వరూపుడు. అనితరసాధ్యమైన సంస్కారం; దానికి

పదునుపెట్టే నిండుజీవితం. బహువిధాలుగా జీవితాన్ని అనుభవించిన అదృష్టశాలి అన్నమయ్య. అందుకే ఆయన కీర్తనల్లో ఎంతో వైవిధ్యం కనపడుతుంది. త్యాగరాజు, దీక్షితులు మొదలైనవారి కీ నిండు జీవితంలేదు. వారు కేవల నాదయోగులు. వారికి సాహిత్యం ఆలంబనం మాత్రమే. అన్నమయ్య సాహితీయోగి. ఆయనకు తనభావాలు చెప్పడానికి సంగీతం వొక ఆలంబనం మాత్రమే.

తిక్కన శిష్యుడైన అన్నమయ్య పదరచనలకు ఎందుకు చేయి వేసినాడు? ములుబాగల్లో వుండిన శ్రీపాదరాయల పలుకుబడి అన్నమయ్యపైన పనిచేసి వుంటుందని నా వూహ. ద్వైతులు చాలాదినాలు శాస్త్రాల్లోనే విహరించేవారు. కానీ కొంతకాలానికి తమభావాలు ప్రజల్లోకి వ్యాపించలేదే అనే అతృప్తి వాళ్ళకు మొదలైంది. దాంతో వాళ్ళు పద రచనలకు మొదలుపెట్టినారు. శ్రీపాదరాయలు ఆ మార్గాన్ని ఎక్కువగా ప్రోది చేసినట్లు కన్పడుతుంది. ఆ ప్రభావం అన్నమయ్యపైన పడి వుంటుంది.

మధ్వాచార్యుల మొదటి శిష్యుడైన నరహరితీర్థులే పదరచనకు మొదలు పెట్టినారని కొందరంటారు. దానిలో సత్యమెంతవున్నా, శ్రీపాదరాయల కాలంలో మాత్రం అది బాల్యాన్ని తీర్చుకుంది. పురందరదాసులో బ్రహ్మాండస్వరూపాన్ని ప్రదర్శించింది. ఈ పదరచన ప్రభావం ద్వైతుల్లో ఎంత పలుకుబడి సంపాదించుకున్నదంటే, ప్రతి మఠాధిపతి కూడా కనీసం వొక్కపదమైనా వ్రాయవలెననే పద్ధతి యేర్పడింది. మొన్నటి రాఘవేంద్రస్వామి కూడా వొకపదం వ్రాసినాడు. దాసరకూటంలో, గురువు శిష్యునికి వాని సంస్కారా న్ననుసరించి ఒక ముద్ర నిస్తాడు. 'విజయవిఠల', 'పురందరవిఠల'- ఇత్యాదులు.

కనకదాసుకు 'చెన్నకేశవముద్ర'. దాసరదీక్ష ఒక పెద్ద తతంగం. మరి అన్నమయ్యలో 'వేంకటేశ' అనే శబ్దం చాలాసార్లు వస్తుంది. అది కూడా నియతంకాదు. "కొండలరాయడు" మొదలైన ఇతర పదాలనూ వాడతాడు. పైగా, పదకర్తలు ముద్రను కడపట చేరుస్తారు. ఇతనికి ఆ నియమం కూడా వున్నట్లులేదు. ఎక్కడో వొకచోట "వేంకటేశా" అంటాడు. అన్నమయ్య కూడా విఠ్ఠలునిపైన కొన్ని పాటలు వ్రాసినాడు. విజయనగరవీథులలో విఠ్ఠలుని ఉత్సవాలు సాగుతూన్నట్లు చెప్పినాడు. హంపిలో పాడుపడిన విఠ్ఠలాలయం-ప్రసిద్ధమైనది వొకటి వున్నది. రాయలవారే దానిని కట్టించినాడంటారు. అన్నమయ్య సాళువ· నరసింహరాయల కాలంవాడు. మరి యప్పటికే విఠ్ఠలాలయ నిర్మాణం జరిగివుండె

నేమో! అళియ రామరాయలకాలంలో వొకకథ జరిగిందట! పందరినుంచి రామరాయలో- మరెవరో విఠ్ఠలుణ్ణి తమ భక్తిప్రభావంతో విజయనగరానికి తీసుకొని వచ్చినారట! స్వామిసాన్నిధ్యం లేక పందరిలోని భక్తులు చాల కష్టపడుతూండినారట! అప్పుడు ఏకనాథుని పూర్వుడొక్కడు స్వామిని తనభక్తితో బంధించి, మరలా పందరికి తీసుకొని వెళ్ళినాడు.

ఏకనాథుడు మహారాష్ట్రభాషలో భాగవతం వ్రాసినాడు. పరమభక్తుడు. ఆతడు భాగవత పీఠికలో ఈ వృత్తాంతాన్ని బ్రహ్మాండంగా వర్ణించినాడు. మనచరిత్రలో ఇంకా ఎన్నో విశేషాలు గడ్డకు రావలసినవి వున్నవి.

అన్నమయ్య సంస్కృతంలోనూ కొన్నిపదాలు వ్రాసినాడు. అదంతా తిక్కన సంస్కృతమే. ఈ నడుమ సుమారు పదివేల వరకు అనుకుంటాను-అన్నమయ్య కృతులు గడ్డకు వచ్చినాయి. గాయకులు త్యాగరాజ సంగీతాన్ని జోడించి పాడుతున్నారు. పొత్తుకుదరక వాళ్ళుపడే అవస్థజూస్తే అయ్యో పాప మనిపిస్తుంది. ఆయన సంగీతం భజనసంప్రదాయానిది. పైగా ఆ నాటికీ, ఈ నాటికీ రాగస్వరూపాలు ఎంతగానో మారిపోయినాయి. ఎలాగైతేనేమి, ఏదో వొకరీతిగా, ఆయన పాటలు ప్రచారంలోకి వస్తున్నాయి. సంతోషింపదగ్గ విషయం.

మిత్రుడు కొండమాచార్యులు అన్నమయ్య పదాలను మున్నూటికి పైగా పద్యాలలో నిబంధించినాడు. పదాలను పద్యాలుగా ఎందుకు వ్రాయడం? సంగీతజ్ఞానం లేనివాళ్ళు చదువుకొని ఆనందించడానికి ఈ రచన పనికివస్తుంది. పైగా, ప్రతీరచనకు ముందు సంపుటము, రాగిరేకుల సంఖ్యగూడా యిచ్చినాడు. క్రింద, లలితమైన భాషలో తాత్పర్యముకూడా వ్రాయబడింది. ఈ పరిశ్రమ అంతా అన్నమయ్యపైన కొండమాచార్యులకు గల గొప్ప భక్తివిశేషాన్ని తెలుపుతుంది. భగవద్భక్తితోపాటు-భాగవతభక్తి గూడా మాకు అవసరమే. పైగా ఆయన, పద్యాలుగా మార్చడంలో క్రొత్తపదాలు ఎక్కడా చేర్చలేదు. అన్నమయ్య పదాలనే, ఛందస్సులో నిబంధించుకుంటూ పోయినాడు. ఈయన పరిశ్రమ గొప్పది. కొండమాచార్యుల యితర కావ్యాలు నేను చదివినాను. ఆయనది లలితమైన చిత్తవృత్తి; లలితతరమైన భాష; ఆంధ్రసంస్కృతాలలో సరసమైన పాండిత్యం. అన్నమయ్య కొండమాచార్యులను ఆకర్షించడంలో ఒక కారణముంది, ఇద్దరిదీ లలితమైన చిత్తవృత్తి; మిత్రుడు కొండమాచార్యులు చేసినపని ప్రశస్తమైనదే.

----

మహాకవి
ఆచార్య ఆత్రేయగారు

5, ఫస్ట్ క్రాస్‌రోడ్డు
రాజా అన్నామలైపురం,
మదరాసు-600028
7-7-86,

మహర్షీ.......!

ఇది వట్టిసంబోధనం కాదు; సందర్శనం. అన్నమాచార్యుని సంకీర్తన సాగరాన్ని మథించి అందులో అమృతాన్నికాదు, అమృతసారాన్ని తేల్చి సీసాలలోకి దింపినారు మీరు.

ఇంతవరకు ఎవ్వరూ యిటువంటి ప్రయత్నం చేసినట్టు నా కెరుకలేదు. ఈ తలపు మీకు కలగడమే ఆశ్చర్యము. బహుశా అన్నమాచార్యుడే 'నా సంకీర్తనలను ఎవరి కిష్టమువచ్చినట్టు వారు రాగములు మార్చి మాటలు మార్చుకొని పాడుకొని వాడుకొంటున్నారు. వాటిని సీసాలలో బంధిస్తే అవి చెక్కుచెదరవు' అని మీలో ఆవహించి ఆదేశించినారేమో!

సంకీర్తనకు ఒక పల్లవి, అనుపల్లవి, చరణములు, ప్రతిచరణము తర్వాత పల్లవి రావలెను అన్న విభాగాన్ని ప్రప్రథమంగా చేసిన వాగ్గేయకారుడు అన్నమాచార్యుడు. అటువంటి విభాగమున కాస్కారమేలేని సీసాలలోకి వీటిని అనువదించడం అసాధ్యము. అసాధ్యాన్ని సాధ్య మనిపించినారు మీరు.

"బ్రహ్మకడిగినపాదము" లో అన్నమయ్య తప్పిన క్రమము సరిదిద్దినారు ఇలా ఆ రాగిరేకులకు ఎన్నో రకాల మెరుగుపెట్టినారు.

మీ పాండితిని గురించి, మీ కవితాధార, శైలిని గురించి వ్రాయగల అర్హత నాకు లేదు. ఈ నాలుగు మాటలు భక్తిపూర్వకంగా చెప్పినవే. అలాగే స్వీకరించండి.

కళాప్రపూర్ణ తిరుపతి
డాక్టర్ విద్వాన్ విశ్వంగారు
9-7-86
ప్రధాన సంపాదకులు,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

# ప్రస్తావన

సాహిత్యంలో వివిధప్రక్రియ లున్నవి. ఏ ప్రక్రియ విశిష్టత దానిది. దేని సౌందర్యం దానిది. దేనిలోనైనా ఏ భావాన్నైనా, ఏ భావననైనా, రమణీయంగా చెప్పవచ్చు. చెప్పేవానిమీద అతని కా ప్రక్రియపై ఉన్న అధికారంమీద ఆధారపడి ఉంటుంది.

అదికాక ఒక్కొక్కప్రక్రియ ఒక్కొక్క సంస్కారం గలవారికి రస్యమాన మౌతుంది. ఇంతకూ వీటన్నిటికీ ముఖ్యాతి ముఖ్యమైన లక్ష్యం ఆ రస్యమానతే!

ఒకపాటో, పదమో, పద్యమో, నాట్యమో- ఏ కళఅయినా మన సంస్కార విభిన్నతనుబట్టి, విశిష్టతనుబట్టి మన హృదయాన్ని ద్రవింపజేస్తుంది. మనకు తెలియకనే ఒకానొక ఊహాప్రపంచంలో తేలిపోజేస్తుంది. అందుకై పడేశ్రమను వ్రాసేవాడేకాక చదివేవాడూ పంచుకోవాలి.

అన్నమయ్యను నేను కవిగానే చూస్తాను. గొప్పకవిగా, మహాకవిగా, అపారప్రజ్ఞావిశేష ధురంధరునిగా భావిస్తాను. ఆయన ఏమి చెప్పినా అది కేవలం పండితులకు మాత్రమే కాక సామాన్యులకోసం కూడా చెప్పినాడు. సామాన్యు లంటే అందరూ కాదు. సామాన్యులలోనూ కొంత రసజ్ఞత అంతర్గర్భితమై ఉంటుంది. అలాంటివారే, వారికి అర్థమయ్యేటట్లుచేస్తే, ఆ కళలతో పారవశ్యం చెందుతారు. అలా చెప్పడానికి తగిన ఏదో ఒకసంస్కార విశేషం అన్నమయ్యకు కలదనడానికి ఆయన వ్రాసిన వేలాదికీర్తనలే నిదర్శనం.

ఒకటా రెండా ముప్పైరెండువేలు, ఎలా రాయగలిగాడు? ఇన్నిటి నెలా అల్లగలిగాడు? వాటిని ఎలా అనుగుణంగా పాడగలిగాడు. జనాన్ని ఆడించగలిగాడు అన్నది మనం ఊహించుకోవడానికి అట్టే కష్టపడనక్కరలేదు.

ఆదిశంకరులు తన ముప్పైరెండేళ్ళ జీవితంలోనే ఎన్ని భాష్యాలు రాయలేదు! ఎన్ని కావ్యాలు రాయలేదు ! ఎందరితో వాక్యార్థాలు చేయలేదు! భారతదేశంలో ఎన్ని సుప్రసిద్ధక్షేత్రాలు పర్యటించలేదు! ఎన్ని పవిత్రతీర్థాలలో మునుక లిడ లేదు ! దిక్కుదిక్కులా మఠాలను స్థాపించి తాత్త్వికప్రచారం చేయలేదు!

అన్నమయ్య అలాగే తిరుమలేశునిపై అన్నికీర్తనల్ని ఒకానొక నిర్దిష్టముద్రతో రాసినా డంటే ఆశ్చర్యం లేదు.

అది ఆయా మహనీయుల ప్రజ్ఞావిశేషాలను బట్టి లభించే పాండిత్యం, కవిత్వం. దీనికి ఏ కొలతలూలేవు. ఏ నిర్దిష్టమార్గాలూ లేవు.

అన్నమయ్య రాసినవానిలో అధ్యాత్మకీర్తనలనీ, శృంగారకీర్తనలనీ, ఆయనే విభజించినాడు. ఈ విభజన కేవలం ఏదో ఒక లక్షణాన్ని బట్టి మాత్రమే, ఆ భాగంలో ఉన్నదీ, ఈ భాగంలో ఉన్నదీ ఆయన రాసిన ప్రతిపాటలో ఉన్నదీ అన్నీ ఒకానొక పరవశస్థితిలో పలికిన మాటలే.

మన దురదృష్టం కొలది, ఆ సాహిత్యం తామ్రశాసనాలవలె రాగిరేకులపై చెక్కించడంవల్ల మిగిలినదికానీ, ఆయన సంగీతం మాత్రం పరంపరాగతంగా మనవరకూ రాలేదు. అందువల్లనే కావచ్చు ఆ తర్వాత క్షేత్రయ్య, త్యాగయ్యలవలె కాని, సమకాలీనుడైన పురందరదాసువలె కానీ జనుల నోళ్ళలో అన్నమయ్యకీర్తనలు నానలేదు. అలాంటివేవో ఒకటి రెండు మాత్రమే ఉన్నవి. ఉదాహరణకు ఈ క్రిందిపాట–

జో అచ్యుతానంద జో జో ముకుంద
రావె పరమానంద రామగోవింద ॥జో॥

అంగజుని గన్న మా యన్న యిటు రారా
బంగారుగిన్నెలో ᳚బాలు పోసేరా
దొంగ నీ వని సతులు పొంగుచున్నారా
ముంగిట నాడరా మోహనాకారా ॥జో॥

గోవర్ధనంబెల్ల గొడుగుగాఁ బట్టి
కావరమ్మున నున్న కంసుఁ బడగొట్టి
నీవు మధురాపురము నేలఁజేపట్టి
ఠీవితో నేలిన దేవకిపట్టి ॥జో॥

**అంగుగాఁ దాళ్ళపా కన్నయ్య చాల**
**శృంగారరచనగాఁ జెప్పె నీ జోల**
**సంగతిగ సకలసంపదల నీవేళ**
**మంగళము తిరుపట్ల మదనగోపాల ॥జో॥**

ఇది ఎక్కడచూచినా విన్నా ప్రతితెలుగుతల్లి పాడడం మొన్న మొన్నటిదాక ప్రసిద్ధమైన సంగీతఫణితి. ఆ తర్వాత మిగిలినవి అంతగా జనంలో, భజనకీర్తనలలోగాని, చినచిన్న రసజ్ఞ సదస్సులలోగాని మనకు వినిపించలేదు.

అందువల్ల ఆ పాటల్ని కొన్నిటినైనా సర్వజనరసనలపై నర్తనం చేయించే విధానం ఏమిటో ఆలోచించగా ఈ ముదివర్తి కొండమాచార్యులుగారు అనుసరించిన పద్ధతి బహుచక్కనిదిగా తోచినది. వారు ఒక్కొక్క అన్నమయ్యపాటను వరుసలో కాక, వారికి నచ్చినవిధంగా ఒకానొక క్రమం వచ్చునట్టుగా సీసపద్యాలలో రాసినారు. వానిని చదివితే, ఇది చాలా చక్కని అన్నమయ్య భావప్రచార పద్ధతిగా అనిపించింది. వారు ఇప్పటికి మూడువందల పాటలను మాత్రమే సీసాలలో పోసినారు, అవిచాలు జనంలో, సంగీతము దొరకని అన్నమయ్యపాటల ప్రచారానికి. పాటలు పాడడం తెలిస్తేకాని జనాని కవి జ్ఞాపకముండవు. పూజ్యులు, ప్రత్యేకించి నాకు ఆప్తులు, సన్నిహితులు అయిన వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తిరుమల తిరుపతి దేవస్థానములవారి అభ్యర్థన మేరకు ఆ సాహిత్యాన్ని సంస్కరించి ప్రచురించ నారంభించగా, శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు కొన్నిటిని స్వరతపరిచినారు ఇంకా పలువురు స్వరతపరుస్తూ వస్తున్నారు.

ఆ పాటల ప్రచురణకు, ఆయా సంపుటాల పునర్ముద్రణకు సంపాదకత్వం వహించిన శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు చేసిన పరిశ్రమ ప్రశంసనీయం. ఏమైనా వాటి కొక స్థిరత్వస్థాయి ఇంకా లభించినట్టు కన్పించదు. అయినా నేనీమాటను ప్రస్తావవశంగా అంటున్నానే కానీ వారందరి పరిశ్రమను తక్కువ పరచాలన్న ఉద్దేశంతో కాదు.

అలాగే అన్నమయ్య సాహిత్యపరిశోధకులు, ఆయన భాషలోని అపురూపమై అరిగిపోయి వాడుకలోనుంచి జారిపోయిన అనేక పదాల అర్థాలను విశదీకరిస్తూ ఒక సమగ్ర నిఘంటువును సిద్ధపరచడం తమ బాధ్యతగా స్వీకరిస్తే ఎంత బాగుండును ! ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానంవారు అన్నివిధాలా సహ కరిస్తారని నా విశ్వాసం.

ఈ పాటలను పద్యాలుగా మలచడంవల్ల వచ్చిన అందచందాలను, ప్రాచుర్యపద్ధతిని తెలియజేయడానికి ఒకేఒక ఉదాహరణమిస్తాను.

**అన్నమయ్య కీర్తన:**

**శ్రీరాగం**

భావించరే చెలులాల పరమాత్ముని
చేవదేరి చిగురులో చేఁగయై యుండెను ॥పల్లవి॥

మలసి పన్నీట హరి మజ్జనమాడేవేళ
కలశాబ్ధిఁదేలే మాణికము వలె నుండెను
అలరి కప్పురపుకాపు అవధరించేటి వేళ
మొలచిన వెన్నెల మొలకయై యుండెను ॥భావిం॥

అంచలఁ దట్టుపుణుఁగు అవధరించేటివేళ
యెంచ నంజనాద్రిపై యేనుగై వుండెను
మించిన హారములెల్ల మేన నించుకొన్నవేళ
మంచిమంచి నక్షత్రమండలమై యుండెను ॥భావిం॥

వున్నతి నలమేల్మంగ నురమున నుంచువేళ
పెన్నిధై పూచినట్టి సంపెంగవలె నుండెను
వన్నె శ్రీవేంకటేశుఁడు వరము లిచ్చేటివేళ
తిన్ననై యందరి భాగ్యదేవతయై యుండెను ॥భావిం॥

పద్యానువాదం:

శౌరి పన్నీటిలో జలక మాడెడివేళఁ
గలశాంబునిధి మానికమ్ముఁ బోలె
నలరి కప్రపుకాపు నవధరించెడివేళ
మొలచిన వెన్నెల మొలకఁ బోలె
నడరి తట్టుపునుంగు నలఁదుకొనెడివేళఁ
గాటుకగుబ్బలి గజముఁ బోలె
మెఱసెడి హారముల్ మేనఁ దాల్చెడివేళ
లలితనక్షత్రమండలముఁ బోలె

ఉరమునం దలమేల్మంగ నుంచువేళ
పూచినటువంటి సంపెంగపువ్వుఁ బోలె
వరము లిచ్చెడివేళ సప్తగిరివిభుఁడు
తనకుఁ బోలికఁ గనరామి తన్నుఁ బోలె.

ఇది చదివితేచాలు మీకు వేరుగా దీనిని విస్తరించి విశదీకరించవలసిన అవసరంలేదు.

అన్నమయ్య పాటలను అన్యచ్ఛందోబద్ధం చేసి చెప్పడానికి తగిన శక్తిసామర్థ్యాలు కూడా అంత సులభసాధ్యాలుకావు. శ్రీ ముదివర్తి కొండమాచార్యులుగారు చేయితిరిగిన కవులు. ఛందస్సులోని మెలకువలు ఆయనకు బాగా తెలుసు. ఇందుకు ఉదాహరణగా ఆ పాటలను సీసపద్యాలలో వ్రాయడంలోనే కనబడుతుంది.

ఈయన కవిత్వాన్ని గూర్చి నే నిప్పుడు కొత్తగా చెప్పవలసిన అవసరం లేదు. ఇప్పటికే వారి కవితామృతంతో తనిసి తలలూపుతున్న తద్జ్ఞులు ఎందరో కలరు.

మరీ చర్విత చర్వణంగా రాయడం గ్రంథవిస్తరానికి కారణమౌతుందితప్ప మరొకందుకు అది పనికిరాదు. ఆ విధంగా విస్తరించి రాయడం నా అలవాటూ కాదు. అలాంటిది నా కిష్టమూ లేదు.

శ్రీ ఆచార్యులగారి ఈ మహాప్రయత్నం బహుధా శ్లాఘనీయమని మాత్రం ఒక్కమాటతో చెప్పి ఊరకుంటాను. ఇలాగే ఆయన మరికొన్ని కీర్తనల్ని కూడా పద్యబద్ధం చేసి, అన్నమయ్య పాటలకు ప్రాచుర్యాన్ని జనంలో కల్పించడానికి నిమిత్తమాత్రులు కాగలరని ఆశ; ఆశంస.

ముఖేముఖే సరస్వతీ.

----

శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు
తాళ్ళపాక వాఙ్మయ పరిష్కరణశాఖ,
అన్నమాచార్య ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి
15-7-86

# సారస్వతయజ్ఞము

గ్రంథకర్తయగు శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులు కరుణవీరాది రసములయందు తెలుఁగు నుడికారముల బిగువుతో, చక్కని పాకముతో, ఆస్వాద్యములైన కావ్యములను పండించినారు. వా రిప్పటికే మహాకవులకోవలో శ్రీయో, చుక్కయో అందుకోగలిగినారు. వీరు నాకు చిరకాలమిత్రులు. నా ఎఱుకలో అంతర్ముఖులు. వీరి "నారాయణమ్మ" నాకు 'అపిగ్రావా రోది తృపి దళతి వజ్రస్య హృదయమ్' అనిపించినది. వీరినిగూర్చి నేనేమి ఎక్కువవ్రాసిన అది న్యూనోక్తిగనే భావింపవలసియున్నది. కాని, లోకము దాని నన్యథా భావించును.

సాధారణముగా కావ్యము యశస్సుకో, అర్థార్జనకో కాగా ఏకొన్నో పరనిర్వృతికి స్థానమైనవి. కాని ఈ ఛందో ఉంతరరచన అట్టిది కాదు. ఇది శివేతర క్షతికి, వ్యవహారవేదిత్వమునకు, పరనిర్వృతికి కూడ నిండునెలవు. ఆచార్యులవారికి పూర్వరచన లన్నియు యశోఉర్థములను పండించగా, ఈ రచన భగవత్ప్రాప్తికి మూలకందమై నిలువగలదు. దీనితో ఆచార్యులవారు ఇహపరములను గుత్తగొన్నట్లయినది.

వీరి కవిత వీరి ధర్మపత్నికి సవతి. వీరు ధర్మపత్ని నుజ్జగించి,సవతిపైననే ప్రేముడి గలవారని, వీరి కవితావ్యాసంగము ఈ అపవాదును ఆచార్యులవారికి అంటగట్టినది.

చిరకాల కవితాభ్యాసము కొండమాచార్యులను అన్నమాచార్యదాసుని గావించినది. అన్నమయ్యకు కొండలయ్య దైవము. ఈ కొండమాచార్యులకు అన్నమాచార్యులు దైవము. శ్రీవైష్ణవ సంప్రదాయములో భగవద్భక్తికంటె భాగవతభక్తి చాల గొప్పది. వీరు ఈ రచనకు సీసముల నెన్నుకొనుటలోనె వీరి ఛందోవిజ్ఞానము పూచి, వికసించినది. వీరు, అన్నమయ్యకీర్తనలను ఒకటికి పదిమారులు అధ్యయనము చేసి ఆయన భావములను ఆయన పదములతోనె చిరుమార్పులతో రచించుట చూడగా అన్నమయ్యయే సీసపద్యములపై

**మమకారముతో ఇట్లు వ్రాసినాడా? అనిపించుచున్నది. "పాడితేపాట–చదివితే పద్యము" అనికదా పెద్దలమాట. అన్నమయ్య పాడి, పాడించినాడు. ఈ కొండమయ్య చదివి, చదివించుచున్నాడు. ఉదాహరణమున కొక పాట, ఒక పద్యము**

పాట

శ్రీరాగం

ఇతరులకు నిను నెఱుఁగఁ దరమా
సతత సత్యవ్రతులు సంపూర్ణ మోహవిర–
హితు లెఱుఁగుదురు నిను నిందిరారమణా ॥పల్లవి॥

నారీకటాక్ష పటు నారాచ భయరహిత–
శూరు లెఱుఁగుదురు నినుఁ జూచేటి చూపు
ఘోర సంసార సంకుల పరిచ్ఛేదులగు–
ధీరు లెఱుఁగుదురు నీదివ్యవిగ్రహము ॥ఇత॥

రాగ భోగ విదూర రంజితాత్ములు మహా–
భాగు లెరుఁగుదురు నినుఁ బ్రణుతించు విధము
ఆగమోక్త ప్రకారాభిగమ్యులు మహా–
యోగు లెఱుఁగుదురు నీ వుండేటి వునికి ॥ఇత॥

పరమభాగవత పదపద్మ సేవా నిజా
భరణు లెఱుఁగుదురు నీ పలికేటి పలుకు
పరగు నిత్యానందపరిపూర్ణమానస–
స్థిరు లెఱుఁగుదురు నినుఁ దిరువేంకటేశ ॥ఇత॥

సంపు1. పాట 252

పద్యము

సీ. నారీజనకటాక్షనారాచదూరులౌ
శూరుల కెఱుక నిన్ జూచుచూపు
ఘోరసంసార సంకుల పరిచ్ఛేదులౌ
ధీరుల కెఱుక నీదివ్యమూర్తి
రాగభోగవిదూర రాజితాత్ములు మహా
భాగుల కెఱుక నీ ప్రణుతి విధము
ఆగమోక్తప్రకారాభిగమ్యులు మహా
యోగుల కెఱుక నీయున్న యునికి

తే. పరమ భాగవతాంఘ్రిసేవా నిరతులు
పావనాత్ముల కెఱుక నీపలుకు పలుకు
సతతసత్యవ్రతులు మోహజాలముక్తు
లెఱుఁగుదురు నిన్ను తదితరు లెఱుఁగ లేరు. (పద్యము117)

ఈపాట, పద్యముల రెండింటిని ప్రక్కప్రక్కన పెట్టి చదివిన సహృదయులకు ఆచార్యులవారి రచనాపటిమ వెల్లడియగును. అన్నమాచార్యుల కీర్తనలన్నీ యతులతో, ప్రాసయతులతో, ప్రాసములతో సీస పద్యములకు, ఆటవెలఁది తేఁటగీతి పద్యములకు ఒదిగినట్లు, వృత్తములకు ఒదుగవు. ఈ రహస్యమునూ, "కవికి-కంసాలికి సీసము సులభము" అను రచనామర్మమునూ గుర్తెఱిగిన ఆచార్యులవంటివారు తప్ప, వేరొక్క రీ పనిని చేయజాలరు.

దీనిలో ఇంకొక్క రహస్యఫలము గూడ ఉన్నది.

"కర్ణం గతం శుష్యతి కర్ణ ఏవ
సంగీతకం సైకతవారిరీత్యా,
ఆనందయ త్యంతరనుప్రవిశ్య
సూక్తిః కవే రేవ సుధాసగంధా."

అనిన కవివచనములను నమ్మినవారికి అన్నమయ్యపాటలకంటె కొండమయ్యపద్యాలె రుచి.

కొండమాచార్యులుగారు అన్నమయ్యభావములను, పదములను, వానిలోని లగువు బిగువులను పూర్తిగ పసిగట్టినారు గాని, ప్రతిపాటయందును అన్నమయ్య ముద్రించిన వేంకటేశ్వరపదమును, తత్పర్యాయపదములను, అన్ని పద్యములలో ముద్రించలేకపోయిరి. ఇది పెద్దదోషముగాదు. ఛందస్సు మారుటచేత పదము లిరుకు పడి అట్లు జరిగియుండునేమో! 54, 62, 66, 117 వగైరా పద్యములు ఇందుకు గుర్తు.

తే. "సర్వసాక్షికి ధర్మసంస్థాపకునకు
భక్తభవభంజనునకుఁ గైవల్యపతికి
మౌనిసురవంద్యునకు జయమంగళమ్ము
మహిత మంగేశునకు శుభమంగళమ్ము."

----

# కతిపయ పండితాభిప్రాయములు

## శ్రీ గుంటూరు శేషేంద్ర

దేశిచ్ఛందంలో మీరు అన్నమయ్యను అమృతస్రోతస్విని చేసి తెలుగు నేలమీద పారించారు. తెలుగుప్రజలంతా మీకు అధమర్ణులే.

## శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

ఆనాడు అన్నమయ్య కీర్తనలరూపంలో భక్తిరసామృతాన్ని పంచిపెట్టాడు. ఈనాడు మీరు ఆ అమృతసారాన్ని మధురమైన సీసములలో అందించారు. మీ కవిత సరళసుందరభావబంధురం.

## శ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు

"అన్నమాచార్యులే యిట్టు లవతరించి
వ్రాసెనేమొ కీర్తన లన్ని సీసములుగ."
"దాసత్వము భక్తియు పెన
వేసిన మీ పద్యరచన ప్రీతి యొనర్చెన్"

## శ్రీమాన్ కుంటిమద్దిశేషశర్మ.

వెదకితివా పాటలలో
పదములు? తమయంత వచ్చిపడి సీసములో
నొదిగినవి; కొండదేవర
పదములు మది గునిసినట్లు పండితవర్యా!

మీ యమృతసారసంగత
పీయూషధునీ ప్రసారపేశలపద ని
శ్శ్రేయసద భారతీగ్రై
వేయకమును గాంచినాఁడ విబుధస్తుత్యా!

## డా॥ తుమ్మపూడికోటేశ్వరరావు

అన్నమాచార్యులు కొండన్నపై చెప్పిన వేలకీర్తనల్లో సారాన్ని నేటి కొండమయ్య సీసాల్లో భద్రంచేయటం చాలా ఆనందదాయకమైన విషయం. మీపద్యం గురించి క్రొత్తగా చెప్పేదేముంది? శేషేంద్ర ఏనాడో చెప్పినారు.

## డా॥ జి.వి.సుబ్రహ్మణ్యం

అన్నమాచార్యులవారి మూడువందల అధ్యాత్మసంకీర్తనలకు మీరిచ్చిన సీస పద్యాలరూపం ఎంతో మధురంగా ఉన్నది. మూలంలోని తెలుగుదనాన్ని, తేటదనాన్ని, వ్యంగ్యవైభవాన్ని, అలంకారసౌకుమార్యాన్ని తెలుగుపద్యాల్లోకి మీరు తీసుకొని రాగలిగినందులకు హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. అనువాదమైనా, స్వతంత్రరచనలాగా సీసపద్యాలు జాలువారేటట్లు చేశారు. అన్నమయ్య సంకీర్తనల్లాగానే మీ సీసపద్యాలు కూడ తెలుగువారి ఆదరాభిమానాలను పొందగలవని ఆశిస్తున్నాను. అన్నమయ్యరచన అమృతం. మీరచన అమృతసారం.

## డా॥ నందూరి రామకృష్ణమాచార్య

పదకవిపై చిన్నచూపు ఉన్న ఆంధ్రదేశంలో పద్యకవితాశిల్పంలో సిద్ధహస్తుడైన ముదివర్తికొండన్న అన్నమయ్య సంకీర్తనలు ముచ్చటైన మూడు వందలసీసాలలో సాహితీద్రాక్షాసవంచేసి అందించడం గొప్పవిశేషం. మీరు ఇన్ని సీసాలు గుండెలో పండించుకొన్న భక్తిపరిణతితో వ్రాయటం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఇంతభక్తి కుదరటం కేవలం పూర్వజన్మపుణ్య పరిపాకం. అన్నమాచార్యులతో పోటీపడితే భక్తిపరుగుపందెంలో కొండమాచార్యులు కొంత వెనుకపడవచ్చునేమోగాని ప్రౌఢకవితాపాటవంలో ముందంజలోనే ఉంటాడని మీ సీసపద్యాలు తీర్పుచెపుతున్నాయి. మీరు అన్నమయ్యసంకీర్తనలు సీసాలలోకి అనువదించడం కేవలం నిరహంకారపూరితమైన “దాసోహం” భావమే.

## శ్రీ వావిలాల రామమూర్తి

ముదినైన నాకు వర్తిగ
సదమలకావ్యమగు నమృతసారము నిల్చెన్
మదిc దిరుమలేశు ముక్తి
ప్రదుcగాంచితి; నీ‘గృహోఖ్య’ రంజిలె నేస్తూ!

## శ్రీ చిల్లరకృష్ణమూర్తి

నమ్ముము నాదుమాట గురునాథ! నిజమ్మిది; దివ్యకావ్యస
స్యమ్ములఁబ్రోదిసేయు కవిచంద్రులు మీరు; మనోజ్ఞవైఖరిన్
కమ్మని తేటతెన్గునుడికారము సొంపులు గుల్క సీసప
ద్యమ్ముల నన్నమార్యకవితాసుధనింపి తెలుంగువారి హ
స్తమ్ముల కెత్తినా రమృతసారము ముక్తిరమావిహారమున్
కొమ్మల డాఁగి కోయిలలు కోటిగళమ్ముల పాడినట్లు పు
ష్పమ్ముల మూగి తుమ్మెదలు శ్రావ్యముగా నినదించినట్లు కీ
రమ్ములు వేదపాఠము స్వరమ్మును దప్పక పల్కినట్లు మే
ఘమ్ముల పందిటన్ నెమలిగండులు నాట్యము చేసినట్లు పా
త్రమ్ముల దుగ్ధమున్ బితుకు దంటల గాజులు మ్రోగినట్లు వా
టమ్ముగ నొద్దు సేర కెరటమ్ములు సవ్వడి సేసినట్లు తో
రమ్ముగ వీణియల్ మొరసి రాగసుధల్ కురియించినట్లు నా
కమ్మున దేవతాకవినికాయము బల్ తల లూచినట్లు మో
దమ్మున యోగిపుంగవులు ధ్యానసమాధి మునింగినట్లు చి
త్రమ్ముగ దృశ్యముల్ పలువిధమ్ముల మానసవీథి దోచె మీ
కమ్మని కావ్యమున్ జదువగా ! కవివర్యులటన్న మీరెగా !

# అభివాదనము

భక్తి శృంగార రసధునుల్ పార మొరసి
పఱవఁ దంబురమీటుచుఁ బాదయుగళి
గజ్జియలు మ్రోయ వృషశైలకాంతు మ్రోల
నాడుచుం బాడు నన్నమయ్యకు జొహారు. 1

పదియునాఱేండ్ల వయసున ఫణిగిరీశు
స్వామిపుష్కరిణీ తటాంచలమునందుఁ
గాంచి రససిద్ధిగన్న సత్కవిపదాబ్జ
ములకు సతతంబు సాఁగిలి మ్రొక్కు లిడుదు. 2

ఆడినట్టిమాట యమృత ప్రబంధమ్ము
పాడినట్టిపాట పరమగాన
మగుచు నెగడఁ దిరుమలప్ప మెప్పులు గొన్న
అన్నమయకు భక్తి నంజలింతు. 3

తీయతీయనైన తేటతేట తెనుంగు
నుడుల వినని కనని కదు బెడంగు
పదము లెవఁడు మూఁడుపదులపై రెండువేల్
సెప్పె నతనిఁ గొలుతుఁ జిత్త మలర. 4

జోలలు సువ్వాలలు ని
వ్వాళులు జాజఱలు గొబ్బిపాటలు కొట్నాల్
లాలలు తందానలు బల్
మేలుకొలుపు లితఁడు శౌరిమీఁద రచించెన్. 5

ఫణిరాజ పర్వతాధిపుఁ
బ్రణుతించెన్ బదకవిత్వపరమేష్ఠి రస
ధ్వనిగర్భ మృదుల కృతులన్
గనిచి నిగమసారభూత నిభృతార్థమ్ముల్. 6

కప్పురంపుఁ జలువ కన్నెగేదఁగి తావి
పుట్టతేనె తీపి పుక్కిలించు
తాళ్ళపాక కవివిధాత కైతలఁ జొక్కు
వారె ధన్యతములు వారె ఘనులు. 7

పచ్చికస్తురి కుంకుమప్రసవరజము
పునుఁగు మేదించి వేంకటభూధరేంద్రు
నవకమగుమేని కలఁదిన నలుగుబాణి
సురభిళించెడి అన్నయ సూరివాణి. 8

అన్నమయ్యపాట లాంధ్రవేదమ్ములు
తరువఁ దరువ సుధలు దందడించు;
విమలమతులు జ్ఞానవిజ్ఞానసంపన్ను
లనుభవించి సౌఖ్య మందఁగలరు. 9

పదకవిబ్రహ్మపలుకులు భావములును
పద్యములయం దిమిడ్చితి; పాటఁ బాడ
వలఁతు లెవ్వరుగా రట్టివారికొఱకు;
ఆ మహామహుఁడేడ? ఈ యల్పుఁడేడ? 10

అతని నుడికడలిం ద్రచ్చి యమృతరసము
నింపి సీసాలఁ దొలిఁదొలి నింపుమీఱ
పాఠకోత్తములార ! మీ పాణి నిడితి
వెల దలంపఁగ సులభమ్ము ఫల మధికము. 11

----

# అంకితము

ప్రాతరారంభవేళల పద్మగర్భ
శివ మహేంద్రాది దేవతాశ్రేణి సలుపు
మేలుకొలుపులకున్ కనుల్ లీల విచ్చి
జగములేలు దొరా ! నీకు జయము జయము. 1

కలఁడు కలం డను నాతఁడు
కలఁడో లేఁడో యటంచు గజబుద్ధులు శం
కిలకుండ వేంగడమ్మున
నిలిచిన శ్రీ శ్రీనివాస ! నీకు నమస్సుల్. 2

సంపదలయందు మఱపులు, సంకటముల
మ్రొక్కులు స్వభావమైయున్న యుక్కివులము,
అందినం జుట్టు పాదము లందకున్నఁ
బట్టుకొను క్షుద్రులము కోపపడకు మయ్య! 3

తలఁచిన దలఁపకయున్నన్
గొలిచినఁ గొలువకయయున్నఁ గొద లెంచక నిన్
దలఁచిన కొలిచిన వానిగఁ
దలఁచుచు నన్గావ నీకు దండములు హరీ! 4

గుడిగట్టకున్నఁ గట్టిన
గుడిఁ జొచ్చి "నమోఽచ్యుతాయ గుణినే" యని నీ
యడుగుల నొక తులసీదళ
మిడని దరిద్రుండ దోసమెంచకు స్వామీ! 5

నీ కృప నేర్చిన నుడుగుల
నీకథలన్ నుడువఁబోక నియమస్థుఁడనై
కాకమ్మకతలు సెప్పితి
చీకొట్టక నన్ను దరికిఁ జేర్చుకొనఁగదే ! 6

**చదివి చెడుచున్న నన్నున్**
**పదిలముగా మంచిదారిఁ బట్టింపనిచోఁ**
**దుదకు దయనీయుఁ డెందును**
**వెదకిన దుర్లభుఁడు నీకు వేంకటరమణా!** 7

సంధ్యవార్చి యెన్నొ సమ లాయె తిరుమణి
దిద్ది నుదుట నెన్నొ దినము లరిగె;
జపము తపము లేని జన్మ మియ్యది శాస్త్ర
విధి నతిక్రమించి విఫలుఁడైతి. 8

అరువదేండ్లేగినన్ బహిరంతరంగ
శత్రువుల గెల్వఁజాలని చవట నైతి;
కుడుపు పెట్టిన వానిని, కడుపుగొట్టు
వాని సమబుద్ధిఁ గనుఁగొను జ్ఞాన మిమ్ము. 9

చెడఁదిరిగి కొంపఁజేరిన
కొడుకునొడల్ గడిగి కూడుగుడ్డల నిడి ప్రే
ముడిగాంచు జనకుకైవడి
నడజడి దొలఁగించి కరుణ నరయుము తండ్రీ! 10

వడ్డికాసులవాఁడవు వరదుఁడ వని
యెఱిఁగి గురిగింజ యెత్తు బంగరువు నీకుఁ
గాన్కవెట్టక హేమాద్రి గాంక్షసేతు
నింత కృపణుని నసుఁ బ్రోతు వెంత వింత! 11

నేను నాకున్న దంతయు నీకె చెంద
నింక నీ కర్పణము సేయ నేమి గలదు?
నిన్నె శరణమ్ము పొందితి; నీదుబాస
తలఁపునకుఁ దెచ్చుకొమ్ము సీతాకళత్ర! 12

ఆయురారోగ్య విత్తగృహాన్న పాన
వస్త్రతతి వేడలేదు విపత్తి నేని;
తరుణ కిసలయారుణ భవచ్చరణ యుగళి
నంజనగిరీశ! యొసఁగు మనన్యభక్తి. 13

కులధన కులదైవతములు
తలిదండ్రులు బంధుజనులు దాతలు త్రాతల్
చెలులు సమస్తము నీ వని
తలఁచిన నీ దాసదాసుఁ దగ నోము మయా ! 14

నిరసించినను భవత్పద
సరసిజముల వీడ; జనని చనుగుడుచు శిశున్
నిరసించుఁ గాక కినుకన్-
చరణములన్ బుడుత వీడఁ జాలఁడు గాదే ! 15

అమృతస్యంది భవత్పద
కమలనివేశితమనస్వి కాంక్షించునె య
న్యము? మధునిర్భరతామర
సముఁ దుమ్మెద విడిచి గొబ్బి చాయకుఁ జనునే? 16

పరుల తలవాకిట వసించి పనులు చేసి
ప్రస్తుతించి గడించిన బైసి లేదు;
నీకు సల్పు నమస్క్రియ నిఖిలశుభము
లిచ్చు నశుభమ్ము లణఁచునం చిపుడ తెలిసె. 17

అగణిత మహిమాస్పదుఁ డగు
భగవంతు నినున్ వృషాద్రిపతిఁ బూజింపన్
పొగడల పొన్నల మీటెడు
నిగమాగమ సూక్తి సమితి నే నెట దెత్తున్? 18

భానుకోటిప్రభా భాసమాన కిరీట
దీధితి పుంజమ్ము తిమిర మణఁప
రాకేందువదన విరాజిత ఘనసార
కస్తూరికా పుండ్ర కాంతు లొప్ప
మకరకుండల నూత్న మాణిక్య రోచులు
గండభాగమ్ముల కళుకు మీఱ
శాతకుంభ దుకూల చారు మౌక్తిక రత్న
హారశోభలు దిక్కులందుఁ బర్వ

శంఖచక్రాసి దీప్తులు చౌకళింప
పాదకటక ద్యుతి చ్ఛటల్ పారుకాడ
సాంగ శృంగార రుచి సమాలింగితాంగ
విభవు నిను మెచ్చ శారదావిభుని తరమె? 19

భవుని గుడిలోన శక్తి దేవళము లోనఁ
గార్తికేయు కోవెలలోనఁ గంటి నిన్నె:
నీకు శేషంబు విశ్వంబు; నిఖిలదేశ
తాంతరాత్ముండ వీవె శేషాచలేంద్ర! 20

కృతివి కృతజ్ఞుఁడవు దయా
మతివి వదాన్యుఁడవు వశివి మహనీయ దయా
మృతజలధివి గరుడాచల
పతివి జగద్గతివి నీవె ప్రణతార్తిహరా! 21

సేనానాథుఁడు విష్వ
క్సేనుఁడు; వాహనము గరుడి; శేషుఁడు తల్పం-
బానందిత సకల భువన
మానిత వైభవుని మెచ్చ మాటలు గలవే? 22

తలఁపు గలిగించి గుడిలోఁ
గలముం గనఁజేయ నీదు కట్టడ గాఁగన్
దలఁచి లిఖించితి;మోఱకు
తెలివియుఁ దేటయును నిట్లె తెలవాఱుఁ గదా ! 23

నీ కైకాంతిక భక్తుఁడు
నాకున్ గురుఁ డన్నమార్యు నవరసభావ
శ్రీకములు కృతుల కియ్యవి
ప్రాకటపద్యములు; నీదు పదముల నిడితిన్. 24

పసివానితొక్కుపలుకులు
విసువక విని యలరు తండ్రివిధమున నాయీ
పసలేని పద్దియమ్ముల
ముసిముసినగవులను వినుచు మోదింపు ప్రభూ! 25

స్వాతిచినుకులకై శుక్తిచందమునను
కాచుకొనియుంటి; కోనేటిగట్టుపొంత
పలుకరింతువొ? గరుడగంబమ్ముచెంత
దర్శన మ్మిత్తొ? పాపిని దయ దలంపు. 26

కుక్కమొఱ విన్నవానికి
గ్రక్కున నాశ్రితులఁ బ్రోచు ఘనునకు నీకున్
మ్రొక్కి యిటు విన్నవించితి
దిక్కన్యము నాకు లేదు తిరుమలనాథా! 27

మమ్ముఁ గన్నమ్మ అలమేలుమంగతోడఁ
జల్లఁగా నెల్లకాలము సకలభోగ
భాగ్యములతోడ వర్ధిల్లి భక్తకోటి
నిండుదయ నేలు తిరుమలకొండరెడ్డి! 28

అంజలి యిదె నీకు నఖిలాండనాయక!
వందన మ్మిదె మౌనివంద్య! నీకు
ప్రణిపాత మిదె నీకు భక్తకల్పద్రుమ?
కేలుమో డ్పిదె కృపాశీల ! నీకు
ప్రణతి యిదే నీకు పతితపావననామ!
జోహారిదే సర్వసులభ ! నీకు
కైవార మిదె నీకు కైవల్యదాయక !
దండ మిదే శుభదాయి! నీకు

జోత లివె నీకు భువనవిఖ్యాతచరిత!
మ్రొక్కు లివె ముగ్ధమోహనమూర్తి! నీకు
చాఁగిలింత లివే దేవసార్వభౌమ !
ఏటికో ళ్ళివె శ్రీ వేంకటేశ ! నీకు. 29

----

# గురుపరంపరా ప్రస్తుతి

శ్రీశైలేశ దయాపాత్రం ధీభక్త్యాదిగుణార్ణవమ్,
యతీంద్రప్రవణం వందే రమ్యజామాతరం మునిమ్.

లక్ష్మీనాథసమారంభాం నాథ యామున మధ్యమామ్,
అస్మదాచార్యపర్యంతాం వందే గురుపరంపరామ్.

యో నిత్యమచ్యుత పదాంబుజయుగ్మరుక్మ
వ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే,
అస్మద్గురో ర్భగవతోఽస్య దయైకసింధోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే.

మాతా పితా యువతయ స్తనయా విభూతిః
సర్వం యదేవ నియమేన మదన్వయానామ్,
ఆద్యస్య నః కులపతే ర్వకుళాభిరామం
శ్రీమత్తదంఘ్రి యుగళం ప్రణమామి మూర్ధ్నా.

భూతం సరశ్చ మహదాహ్వయ భట్టనాథ
శ్రీ భక్తిసార కులశేఖర యోగివాహాన్,
భక్తాంఘ్రిరేణు పరకాల యతీంద్రమిశ్రాన్
శ్రీమత్పరాంకుశమునిం ప్రణతోఽస్మి నిత్యమ్.

# శ్రీనివాస స్తుతి

శ్రీ వేంకటాద్రినిలయః కమలాకాముకః పుమాన్,
అభంగురవిభూతిర్న స్తరంగయతు మంగళమ్.

శ్రీ వేంకటాచలాధీశం శ్రియాఽధ్యాసితవక్షసమ్,
శ్రితచేతనమందారం శ్రీనివాస మహం భజే.

అఖిలభువనజన్మ స్థేమభంగాదిలీలే
వినత వివిధభూతవ్రాత రక్షైకదీక్షే,
శ్రుతిశిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే
భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా.

నాన్యం వదామి న శృణోమి న చింతయామి
నాన్యం స్మరామి న భజామి నా చాశ్రయామి,
భక్త్యా త్వదీయచరణాంబుజమంతరేణ
శ్రీ శ్రీనివాస పురుషోత్తమ దేహి దాస్యమ్.

శ్రియః కాంతాయ కల్యాణనిధయే నిధయేఽర్థినామ్,
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్.

# నివేదనము

వృషశైలాధిప ఏవ దైవతం నః
వృషభాద్రీశ్వర ఏవ దైవతం నః,
ఫణిశైలాధిప ఏవ దైవతం నః
భగవాన్ వేంకట ఏవ దైవతం నః.

శ్రీ శ్రీనివాసః పరదైవతం నః
శ్రీ శ్రీనివాసః పరమం ధనం నః,
శ్రీ శ్రీనివాసః కులదైవతం నః
శ్రీ శ్రీనివాసః పరమాగతి ర్నః.

వక్రాబ్జే భాగ్యలక్ష్మీః కరతలకమలే సర్వదా ధానలక్ష్మీః
దోర్దండే వీరలక్ష్మీః హృదయసరసిజే భూతకారుణ్యలక్ష్మీః,
ఖడ్గాగ్రే శౌర్యలక్ష్మీః నిఖిల గుణగణాడంబరే కీర్తిలక్ష్మీః
సర్వాంగే సౌమ్యలక్ష్మీః మయి తు విజయతాం సర్వసామ్రాజ్యలక్ష్మీః.

శ్రీర్వర్చస్య మాయుష్య మారోగ్య
మావీదాచ్ఛోభమానం మహీయతే,
ధాన్యం ధనం పశుం బహుపుత్రలాభం
శతసంవత్సరం దీర్ఘమాయుః.

–ఋగ్వేద ఖిలభాగం 5-87-23 ఎ

# అమృతసారము

అవతారిక: శ్రీ వేంకటాద్రి మహిమను వర్ణిస్తున్నాడు.

**సీ. వేదముల్ శిలలయి వెలుఁగులీనెడు కొండ**
**పున్నెమ్ము లేఱులై యున్న కొండ**
**బ్రహ్మాది లోకాలపై ప్రకాశిలు కొండ**
**అంభోనిధుల్ చఱులైన కొండ**
**అమరులు మృగజాతమయి చరించెడు కొండ**
**తాపసుల్ తరువులై తనరు కొండ**
**కొల్లఁగా సంపదల్ గుహల నిండిన కొండ**
**అటు వరమ్ముల కొటా రయిన కొండ**

**తే. కడిఁది మహిమలు తెట్టెలుగట్టు కొండ**
**అల వికుంతమ్ము కాణాచి యయిన కొండ**
**నాల్గుచేతుల హరి సోబనంపుఁ గొండ**
**దంబు మీఱెడు తిరువేంగడంపుఁ గొండ.** 1

ఈ కొండలో వేదాలే శిలలై వెలుగులను వెదజల్లుతుంటాయి; పుణ్యాలే ఏళ్ళై ప్రవహిస్తుంటాయి. బ్రహ్మలోకం మొదలు పదునాల్గులోకాలకంటె గొప్పదై ప్రకాశించేది, సముద్రాలే చఱులుగా ఉన్నది ఈ శైలం. దేవతలు మృగాలై ఈ గిరిలో తిరుగుతుంటారు. ఇక్కడి గుహల్లో సంపదలు కోకొల్లలుగా ఉంటాయి. వరాలకు ఈ కొండ కొటారు. ఆశ్చర్యకరములైన మహిమలు ఇక్కడ తెట్టెలుగట్టి ఉంటాయి. వైకుంతానికి ఈ పర్వతం కాణాచి-అనగా వైకుంఠమే ఇదని భావం. చతుర్భుజుడైన శ్రీహరి నివసించే శుభప్రదమైన శైలమిది. ప్రతిష్ఠతో కూడినదీ, పాపాన్ని దహించేదీ గనుక ఈ గిరి తిరువేంగడ మయింది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| కట్టెదుర వైకుంఠము | 282 | 471 | 3 | 317 |

అవ: శేషాద్రి వైభవం అభివర్ణిస్తున్నాడు.

**సీ. పదివేల శేషుల పడగలమయ మదే**
**హరివాస మదిగొ! అల్లదిగొ! చూడుఁ;**
**దదె వేంకటాచల మఖిలోన్నతోన్నత;**
**మదియె బ్రహ్మాదుల కత్యపూర్వ;**
**మదియె నిత్యనివాస మగణిత మునికోటి;**
**కానందమయ మదే యంజలింపుఁ**
**దదె శేషశైలేంద్ర మనిమిష నిలయంబు**
**బంగారు శిఖరాల బ్రహ్మమయము**

**తే. అదియె కైవల్యపదము వృషాద్రిరాజ;**
**మంబుజాక్షునకున్ సిరులైన దదియె;**
**తలఁప సంపత్స్వరూపమై తనరు నదియె;**
**పావనమ్ముల నదియె పావనతరమ్ము. 2**

అదిగో చూడండి, ఆ పర్వతం ఆదిశేషుని అనేకములైన పడగలమయం. అదే శ్రీనివాసుని నివాసస్థానం. అల్లదిగో చూడండి. అదే వేంకటాచలం. అన్నిటికంటె మిక్కిలి ఎత్తయినది. అదే బ్రహ్మాదిదేవతలకు కూడ ఆశ్చర్యం కలిగించేది. మునులందరికి ఎల్లప్పుడు నివాసయోగ్యమైనది. ఆనంద స్వరూపమైనది. ఓ భక్తులారా ! నమస్కరించండి. అదే శేషాచలము. అచ్చటనే దేవతలు నివసిస్తారు. బంగారుశిఖరాలతో కూడిన పరబ్రహ్మము అదే. అదే మోక్షస్థానం. వృషాద్రి అని చెప్పబడే పర్వతరాజ మది. అది శ్రీవేంకటేశ్వరుని సంపదలకు నెలవు. అన్ని సంపదలకు కూడ ఆస్పదమై ఒప్పినది. పవిత్రములైన వానిలో నెల్ల అదియే పవిత్రతరము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| **అదివో అల్లదివో** | **4** | **23** | **1** | **15** |

అవ: భగవత్పరతంత్రుడై కలలో దర్శించిన శ్రీనివాసుని వర్ణిస్తున్నాడు.

సీ. ఇప్పుడు కలగంటి నెల్లలోకములకు
నప్పఁడౌ హరిఁ బరమాత్ముఁ గంటి
అతిశయంబైన శేషాచలాగ్రముఁ గంటి
ప్రతిలేని గోపురప్రభలు గంటి
కనకరత్నకవాట కాంతిపుంజము గంటి
ఘనమైన దీపసంఘమ్ము గంటి
అనుపమ మణిమయ మగు కిరీటము గంటి
కనకాంబర ద్యుతుల్ కనులఁ గంటి

తే. శంఖచక్రాదులను గంటి సాటిలేని
యభయహస్తము గంటి సహస్రకోటి
పద్మబాంధవ తేజముల్ ప్రబలఁ గంటి
మేటి గురుఁ గంటి నంతట మేలుకంటి. 3

ఇపుడే కలగన్నాను, ఆ కలలో సకలలోకాలకు జనకుడూ, పరమాత్మ స్వరూపుడూ అయిన స్వామినీ, ఎత్తయిన శేషపర్వతశిఖరాన్నీ, పోలికలేని ఆలయగోపుర కాంతులనూ, రత్నాలుతాపిన గుడి పసిఁడితలుపుల తళతళలనూ, దేదీప్యమానంగా వెలిగే దీపాలనూ, రత్నఖచితమైన స్వామివారి సాటిలేని కిరీటమునూ, బంగారు పీతాంబరపు నిగనిగలనూ, శంఖచక్రాలనూ, తులలేని అభయహస్తమునూ, సహస్రకోటిసూర్యులతో సమానమైన తేజోరాశినీ, గొప్పవాడైన ఆచార్యునీ దర్శించితిని. అంతలోనే మెలకువ పొందితిని (పరమసుఖాన్ని అనుభవించితిని).

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇప్పుడిటు కలగంటి | 6 | 38 | 1 | 25 |

అవ: శ్రీ వేంకటాచలమును, అందు నెలకొన్న శ్రీనివాసమూర్తిని వర్ణిస్తున్నాడు.

**సీ. మహనీయ ఫణిఫణామణుల శైలము గంటి**
**వైభవాస్పద మండపములఁ గంటి**
**నవరత్నఖచిత హేమ వితర్దికలు గంటి**
**రహి వహించెడు గోపురములఁ గంటి**
**పావనంబైన పాపవినాశనముఁ గంటి**
**కడలొత్తు నాకాశగంగ గంటి**
**దివ్యమ్ములగు బహుతీర్థమ్ములం గంటి**
**సూరులు మెచ్చు కోనేరు గంటి**

**తే. కంటి నఖిలాండతతికర్త; ఘన మునీంద్ర**
**భావగోచర మృదుపదాబ్జములఁ గంటి**
**వరదహస్తము గంటి శ్రీవాసమూర్తిఁ**
**జూడఁ గంటి నఘమ్ములు వీడుకొంటి. 4**

గొప్పదైన ఆదిశేషుని పడగలమీది రత్నాలతో ప్రకాశించే పర్వతాన్ని మొదట చూచాను. వైభవాలకు స్థానములైన మండపాలను పిదప దర్శించాను. నవరత్నాలు తాపిన బంగారపు టరుగులను తిలకించాను. అందాల గోపురాలను, పావనమైన పాపనాశనమునూ, దిగంతాలకు విస్తరించిన ఆకాశగంగనూ, దివ్యములైన అనేక తీర్థాలనూ, బుధులు మెచ్చు స్వామి పుష్కరిణినీ కనుగొన్నాను. అఖిలాండములకు కర్తయైన వానిని అవలోకించాను. మహామునీశ్వరుల హృదయాలలో గోచరించే శ్రీనివాసమూర్తి పాదపద్మాలనూ, వరదహస్తమునూ వీక్షించాను. పాపాలకు వీడ్కో లిచ్చాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కంటి నఖిలాండ | 84 | 58 | 4 | 399 |

అవ: శ్రీనివాసుడే వేదోక్త పరబ్రహ్మస్వరూపు డనుచున్నాడు.

**సీ. ఏ మూర్తి భువనమ్ము లెలమి పాలించునో**
**యే మూర్తి సకల లోకైక హితుఁడొ?**
**ఏ దేవు దేహమం దీ ప్రాణు లుదయించి**
**యే దేవు దేహమం దివి యణఁగునొ?**
**ఏ వేల్పు పదయుగం బిలయు నాకాశంబొ?**
**యే వేల్పు నిశ్వాస మీ మరుత్తొ ?**
**ఏ స్వామి జీవుల నెల్ల రక్షించునో?**
**యే స్వామి మోక్షమ్ము నీయఁ గలఁడొ?**

తే. ఎవఁడు నిత్యుండొ?సత్యుండొ?యెవఁడు సూక్ష్ముఁ?
డెవ్వఁడు ఘనుండొ? అద్వంద్వుఁ డెవఁడొ?స్తుత్యుఁ
డెవ్వఁడో వాఁడె పరమాత్ముఁ; డీ వృషాద్రి
మందిరుం డిందిరావధూసుందరుండు. 5

ఎవడు ప్రపంచాలను పాలించేవాడో, ఎవడు సకలలోకాలకు హితం చేసేవాడో, ఎవనినుండి ప్రాణులన్నీ పుట్టినవో, ఎవనియందు లయిస్తున్నవో, ఎవని పాదాలు భూమ్యాకాశాలో, ఈ గాలి ఎవని ఊర్పో, ఎవడు జీవరక్షకుడో, మోక్షప్రదాత ఎవడో, నిత్యుడు, సత్యుడు, సూక్ష్ముడు, ఘనుడు, అద్వయుడు, స్తుతింప నర్హుడు, లక్ష్మీవల్లభుడు, పరమాత్ముడు ఎవడో అతడే వృషభాద్రిపై నివసించే శ్రీనివాసుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నిత్యాత్ముఁడై | 12 | 75 | 1 | 51 |

అవ: ఎదుట సాక్షాత్కరించిన శ్రీ వేంకటేశ్వరుని అభివర్ణిస్తున్నాడు.

సీ. **మహిమ లన్నియు మూర్తిమంతమైనట్టులు**
**కోటికోర్కులు రూపుగొన్న యట్లు**
**శృంగారరస మంగసంగత మైనట్లు**
**మింటికిఁ జైతన్య మొంటినట్లు**
**పరమకారుణ్యాబ్ధి ప్రత్యక్షమైనట్లు**
**మొలచి సుజ్ఞానమ్ము నిలిచినట్లు**
**పరఁగ నానందమ్ము ప్రతిఫలించిన యట్లు**
**సురల భాగ్యము పొడసూపినట్లు**

తే. **మేలికలుముల చెలి నలమేలుమంగ**
**వెడఁద యురమున నిడుకొని వేడ్కతోడ**
**దండిగా నిహపరములు పండినట్టు**
**లెదుట నున్నాఁడు శ్రీ వేంకటేశ్వరుండు.** **6**

అన్ని మహిమలు ఆకారాన్ని పొందినట్లుగా, కోరికలన్నీ ఏకమై రూపాన్ని సంతరించుకొన్నట్లుగా, శృంగారరసం శరీరాన్ని ధరించిన రీతిగా, ఆకాశానికే చైతన్యం అబ్బినట్లుగా, అపారమైన దయాసముద్రమే కట్టెదుట కన్పట్టినట్లుగా, జ్ఞానమే మొలచి నిలిచినట్లుగా, ఆనందమే ప్రతిబింబించినట్లుగా, దేవతల భాగ్యం తొంగి చూచినట్లుగా, సంపల్లక్ష్మి అయిన అలమేలుమంగను తన విశాలవక్షంపై ఉత్సాహంతో నిలుపుకొని ఇహపరాలు బాగా ఫలించినట్లు శ్రీ వేంకటేశ్వరస్వామి ఎదుటనున్నాడు.

| సంకీర్త | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పరము నిహము | 150 | 231 | 2 | 155 |

అవ: భగవంతుని దర్శించి ఆయన అవయవములు, ఆభరణములు చేతజూపుచు పరవశుడై పలుకుతున్నాడు.

**సీ. కంటిఁ గంటిని వాఁడె-ఘనమైన ముత్యాల**
**కంటసరుల్ పదకమ్ము లవియె**
**మగమానికముల వెలుఁగు కిరీటమ్మదే**
**శంఖచక్రములు హస్తముల నవియె**
**మ్రొక్కు మ్రొక్కుఁడు వాఁడె ముందర నున్నాఁడు**
**జిగి నగుమో మదే చెక్కు లవియె**
**పొక్కిట లోకముల్ భుజకీర్తు లయ్యవే**
**మా తల్లి యలమేలుమంగ యదియె**

**తే. ముంగయి మురారు లవె ; యదె మొలకటారు**
**పసిఁడి జలతారు పచ్చని బట్ట యదియె**
**యింగిత మెఱుంగు శ్రీవేంకటేశుఁ డనెడు**
**ముంగిటి నిధాన మగు మూలభూత మదియె. 7**

చూశాను, చూశాను-ఆతడే శ్రీనివాసుడు. గొప్ప ముత్యాల కంఠహారాలు, పతకాలు, వజ్రాలతో వెలిగే కిరీటం. చేతులలో శంఖచక్రాలు అవే చూడండి. అడుగడుగు దండాలవాడు మన ముందఱ నున్నాడు. నమస్కరించండి. చిఱునగవు చిందే మొగము, చెక్కిళ్ళు, కడుపులో లోకాలు, భుజకీర్తులు అవే తిలకించండి. మాతల్లి అలమేలుమంగ ఆమెయే, ముంజేతిమురుగులు, నడుమున కత్తి, బంగారంచుల పట్టుపుట్టం అవే. ఆకారవికారాలచే పరాభిప్రాయం తెలుసుకోగల శ్రీ వేంకటాధీశ్వరుడనే మన ముంగిటి పెన్నిధి, సకలమునకు మూలకారణ మైనవాడు అదుగో! అదుగో! వీక్షించండి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చూడఁ జూడ | 22 | 133 | 1 | 91 |

అవ: స్వామి దర్శనంతో పులకించి మధురోహలతో ఆయనను అభివర్ణిస్తున్నాడు.

సీ. సర్వభూషలతోడి సాకారమౌ పర
 బ్రహ్మం బిదే-బుద్ధి పరవశించె
చుక్కలతో నింగి నిక్కి నిల్చెనొ యేమొ?
 తులకించు రతనాల జలధి యేమొ?
పంచవన్నియ నీలపర్వతమో యేమొ?
 కమనీయమౌ సాంధ్యకాల మేమొ?
పున్నమయు నమాస ప్రోగయ్యెనో యేమొ?
 పగలు రాతిరి జతపడెనొ యేమొ?

తే. యోగిజనముల మధురంపు టూహ యేమొ?
బహుళవర్ణాంచితాంబుద పటలి యేమొ?
పన్నినట్టి బ్రహ్మాండాల బరణి యేమొ?
యెంచ నలవియె తిరువేంకటేశు రూపు. 8

సకలవిధాభరణాలతో రూపుగైకొన్న పరబ్రహ్మం ఇదే. నా బుద్ధి పారవశ్యాన్ని పొందింది. ఈ రూపం చూస్తుంటే చుక్కలతో నిండిన ఆకాశం నిక్కి నిలిచినట్లుంది. ఈయన మిలమిల మెరిసే రత్నాల సముద్రమేమో! అధిక కాంతిగల అంజనాద్రి యేమో! రమ్యమైన సంధ్యాసమయమేమో! పూర్ణిమయు అమావాస్యయు ఏకమైనవేమో! రాత్రింబవళ్ళ కలయికయేమో! యోగులయొక్క మధురమైన ఊహయేమో! నానావర్ణాలతో కూడిన మేఘసముదాయమేమో! బ్రహ్మాండాలు నిండిన బరణియేమో! శ్రీవేంకటేశ్వరుని ఆకారం ఊహించుట కలవిగాకుండా ఉన్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సందడిసొమ్ముల | 36౨ | 91 | 4 | 259 |

అవ: శ్రీనివాసుని నీలవర్ణము ననేక విధముల నూహించి సమర్థిస్తున్నాడు.

సీ. సిరి దొలంకు పగటి చీఁకటియా యితం
డెటిఁగియు నెఱుఁగనీఁ డిరవు గాన
హరినీల దర్పణంబా యేమి యీతండు
భాసిల్లు బహు విభవములతోడ
కలగుణం బటువలె కాఁబోలు లోకమ్ము
వెలి లోన నిటు కనిపించుఁ గాన
మేర మీటిన నీలమేఘమా యితఁడేమి
పొదలెడు భూరిసంపదలతోడ
కారుణ్యనిధి యట్ల కాఁబోలు ప్రాణుల
కోరిన కోరికల్ గురియుఁ గాన

తే. ఎంచ నాకాశతత్త్వమా యేమి శేష
భూమిధరపతి? యట్ల కాఁబోలు సకల
మా మహామూర్తియం దుదయంబు నంది
యా పరంజ్యోతి లోపల నణఁగుఁ గాన. 9

శ్రీ వేంకటేశ్వరుడు తన స్వరూపం కనిపించీ, కనిపించకుండా చేస్తున్నాడు. కనుక ఇతడు అందాలు చిందే పగటివేళనుండే చీకటా ఏమి? అనేక వైభవాలతో ప్రకాశిస్తున్నాడు, కాబట్టి యీ స్వామి ఇంద్రనీలమణి దర్పణమా ఏమి? ఇతనిలోని గుణ మిటువంటిదే కాబోలు! ప్రపంచం అద్దంలోపల వెలుపల గోచరించునట్లు విశ్వం ఇతని లోపల వెలుపల ప్రకాశిస్తున్నది. అధిక సంపదలతో అతిశయిల్లుతున్న శ్రియఃపతి హద్దుమీరి అంతటా ఆవరించిన నీలమేఘమా ఏమి? అంతే కాబోలు! దయానిధియైన ఈతడు ప్రాణులు కోరిన కోరికలను వర్షిస్తున్నాడు కదా! ఆలోచించగా ఈ శేషాద్రినాథుడు ఆకాశతత్త్వమా ఏమిటి? అట్లే కాబోలు! సమస్తమూ ఆకాశమునందే ఉదయించి అందే లయం చెందునట్లు స్థావర జంగమాత్మకమైన విశ్వమంతా ఈ మహామూర్తియందే పొడమి ఈ పరం జ్యోతియందే విలీనమవుతున్నది కదా!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సిరి దొలఁకెడి పగలు | 37 | 228 | 1 | 153 |

అవ: శ్రీనివాసుని చంద్రునిగా, కల్పవృక్షముగా,చింతామణిగా రూపిస్తూ అతని నీలిమకు కారణము నూహిస్తున్నాడు.

**సీ. దేవకీ జఠర వార్ధిని చందమామయై**
**వేడుక జనియించినాఁ డితండు**
**పరఁగ సోముఁడు నీలవర్ణుఁ డేమిటి కాయె?**
**నునుగందు కలయఁ బర్వెనొ మతేమొ!**
**ఇనవంశమున లోకహిత కల్పభూజమై**
**పోఁడిమి నుదయించినాఁ డితండు**
**ఏటికి సురతరు విటు నల్లనాయెను?**
**పెనుగొమ్మలోఁ జేవ పెరిఁగె నేమొ!**

**ఆ. శేషశిఖరి మీఁదఁ జింతామణి యితండు**
**మేచకాంగుఁ డగుచు గోచరించు.**
**నేలొకో? మహేంద్ర నీలమణి ప్రభల్**
**తనువు నెల్ల నలము కొనియె నేమొ!** **10**

దేవకీదేవి గర్భమనే సముద్రములో చంద్రుడుగా ఇతడు పుట్టినాడు. తెల్లని చంద్రుడు నల్లగా ఎందుకైనా దంటే అతనిలోని కళంకము శరీరమంతా వ్యాపించింది కాబోలు ! లోకమునకు మేలుచేయగోరి సూర్యవంశంలో ఇతడు కల్పవృక్షంవలె ఉద్భవించాడు. అయితే ఆ తెల్లని కల్పవృక్షం ఇటు లెందుకు నల్లనైనది అనగా పెద్దకొమ్మలోని చేవ నిలువెల్ల ప్రాకినదేమో! శేషశైలం మీదనుండే చింతామణి ఇత దెందుకు నలుపైనా డనగా ఇంద్రనీలమణి కాంతులు ఈతని శరీరాన్ని పూర్తిగా కప్పివేసినవి కాబోలు!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సకల సందేహమై | 64 | 332 | 1 | 221 |

అవ: శ్రీనివాసుని వివిధ శృంగారములు మెచ్చి, వరము లిచ్చేవేళ ఆతనికి సాటి ఆతడే అంటున్నాడు.

సీ. శౌరి పన్నీటిలో జలకమాడెడివేళ
కలశాంబునిధి మానికమ్ముఁ బోలె
నలరి కప్రపు కాపు నవధరించెడివేళ
మొలచిన వెన్నెల మొలకఁ బోలె
నదరి తట్టుపునుంగు నలఁదు కొనెడివేళ
కాటుక గుబ్బలి గజముఁ బోలె
మెఱసెడి హారముల్ మేనఁదాల్చెడివేళ
లలితనక్షత్ర మండలముఁ బోలె

తే. ఉరమునం దలమేల్మంగ నుంచువేళ
పూచినటువంటి సంపెంగ పువ్వుఁ బోలె
వరము లిచ్చెడివేళ సప్తగిరి విభుఁడు
తనకుఁ బోలికఁ గనరామి తన్నుఁ బోలె. 11

శ్రీహరి పన్నీటిలో స్నానం చేసేటప్పుడు పాలసముద్రంలోని మాణిక్యంవలెను, కర్పూరపు మైపూత నలదినపుడు పొటమరించిన వెన్నెల మొలక విధంగాను, ఉత్సాహంతో పునుగును శరీరానికి పూసుకొన్నపుడు అంజనపర్వతం మీది ఏనుగు చందముగాను, మెఱసే దండలు మెడలో వ్రేలాడవేసుకొన్నప్పుడు నక్షత్రమండలం రీతిగాను, గుండెపై అలమేలుమంగ తాయార్ల నెక్కించుకొన్నప్పుడు పూచిన సంపెంగపువ్వు మాదిరిగాను, వరాలు ఇచ్చేటప్పుడు తనకు సాటి తానే అవుతూ ప్రకాశిస్తున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| భావించరే చెలులాల | 229 | 165 | 3 | 111. |

అవ: శ్రీవేంకటేశ్వరుని ప్రశస్తి ఎట్టిదో చాటుచున్నాడు.

**సీ. వెలయ సప్తర్షులు వెదకి ప్రదక్షిణ**
**మాచరించిన పరమాత్ముఁ డితఁడె;**
**కోనేటిచెంత షడాననుండు తపంబు**
**గావించి కనుఁగొన్న దేవుఁ డితఁడె;**
**తన తీర్థయాత్రలో తాలధ్వజుఁడు కన్న**
**వేంకటాద్రీశుఁడౌ వేలు పితఁడె;**
**బ్రహ్మాండ వామన ప్రముఖ పురాణోక్త**
**సకల చరాచర జనకుఁ డితఁడె;**

**తే. పద్మజేంద్రాది దేవతల్ భక్తితోడఁ**
**గొలుచు పరతత్త్వ మితఁడె; వైకుంఠుఁ డితఁడె;**
**నారదాదుల సంకీర్తనలకుఁ జొక్కి**
**నిక్కు శ్రీశుండు భక్తహృన్నిలయుఁ డితఁడె.** 12

చక్కగా సప్తర్షులు వెదకి కనుగొని ప్రదక్షిణం చేసింది ఈ శ్రీనివాసునికే. సుబ్రహ్మణ్యుడు కోనేటివద్ద తపస్సుచేసి దర్శించింది కూడ ఈ స్వామినే. బలరాముడు తన తీర్థయాత్రలో వీక్షించినది కూడ ఈ దైవమునే. బ్రహ్మాండ వామనాది పురాణాలలో చెప్పబడినవాడూ, సకల చరాచరాలకు కారణమైన వాడూ ఈ వేంకటాద్రి ప్రభువే. బ్రహ్మ, ఇంద్రుడు మొదలైన దేవతలు భక్తితో కొలిచేది ఈ పరతత్త్వమునే. నారదాది మునిపుంగవుల స్తోత్రాలకు మైమరచి ఉప్పొంగిపోయే లక్ష్మీవల్లభుడు, భక్తుల హృదయాలు నెలవుగా కలవాడు ఈ శేషాద్రినాథుడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| శ్రీవేంకటేశుఁడు | 87 | 425 | 1 | 285 |

అవ: శ్రీ వేంకటేశ్వరుని సాటిలేని భోగమును మెచ్చుచున్నాడు.

సీ. కొండకోనలలోన కోనేటి సరిదండ
మెండైన బంగారు మేడలందు
నిద్దంపు జవరాలి నిండారు కౌఁగిట
నుండి లోకము లేలు దండి వేల్పు
నాల్గుచేతులతోడ నవ్వుమొగమ్ముతో
శంఖచక్రమ్ముల సౌరుతోడ
నేల మిన్నొకటిగా నిలుచున్న రూపుతో
మెఱసి కోరుకు లిచ్చు మేటివేల్పు

తే. నోర నీరూరఁ జవులతో నారగించి
జొంపమగు పూలపూజల సొంపు మించ
వేంకటాచల మిరవుగా వెలుఁగు వేల్పు
వేలుపులలోనఁ బ్రతిలేని వేలు పితఁడు. 13

శ్రీ వేంకటేశ్వరుడు కొండకోనల్లో ఉండే స్వామిపుష్కరిణి సమీపానగల బంగారుదేవాలయంలో అందమైన పద్మావతియొక్క బిగికౌగిటిలో నుండి లోకాలు ఏలే దేవుడు. నాల్గు చేతులతో, నవ్వురాజిల్లే ముఖంతో, శంఖచక్రాల శోభతో, మింటికి మంటికి ఏకంగా ఉన్న రూపంతో, భక్తుల కోరిక లీడేరుస్తూన్న దేవుడు. నానావిధరుచులతో నైవేద్యాలు ఆరగిస్తూ, పలురకాల పూలపూజలు అందుకుంటూ వేంకటాచలమే స్థానంగా ప్రకాశించే దేవుడు. దేవతలలో ఇతడు సాటిలేని దేవుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎల్లలోకముల | 361 | 359 | 4 | 241 |

అవ: వేంకటేశ్వరుని షాడ్గుణ్యసంపద నభివర్ణిస్తున్నాడు.

**సీ. అగణిత రవితేజుఁ డఁట కాంతి యది యెంత ?**
**దనుజాంతకుఁ డఁట ప్రతాప మెంత ?**
**మనసిజగురుఁ డంట మఱి చక్కఁదన మెంత ?**
**వనజజుపిత యంట ఘనత యెంత ?**
**గంగాజనకుఁ డంట కలితపుణ్యం బెంత ?**
**క్ష్మాభర్త యంట సింగార మెంత ?**
**ఇందిరావిభుఁ డంట యెంచ రాజస మెంత ?**
**మాయకు మగఁ డంట మహిమ యెంత ?**

**తే. తలఁప సర్వేశ్వరుం డంట కలిమి యెంత ?**
**విష్ణు వఁట యిర వెంత ?శ్రీ వేంకటాద్రి**
**పతి యయి దయాప్రపూర్ణుఁడై వరము లిచ్చు**
**వేయిరూపులవాఁ డంట విరివి యెంత ? 14**

లెక్కలేనంత మంది సూర్యుల వెల్గువంటి వెలుగు గలవాడట! మరి ఆ స్వామి కాంతి ఎంతో కదా! మిక్కిలి అందగాడని పేరుగాంచిన మన్మథునకే తండ్రియట! ఇక వీరి సౌందర్య మెంతో గదా! చతుర్ముఖుడు, సృష్టికర్త అయిన బ్రహ్మదేవునికే తండ్రియట! ఆ దేవుని గొప్పతనమెంతో కదా! ముల్లోకాలను పావనంచేసే గంగకే ఈయన జనకుడట! ఇక వీరి పుణ్యమెంతో కదా! సకలాన్ని భరించే భూదేవికి భర్త అంటారు. మరి వీరి శృంగారము ఎంతో కదా ! ఈ దేవుని లక్ష్మీపతిగా చెపుతారు. కాన ఈయన ఠీవి ఎంతో కదా! మాయాదేవిని వశపరచుకున్నవా డితడు. ఇక వీరిమహిమ ఎంతో కదా! సర్వానికి ప్రభువట! కనుక వీరి ఐశ్వర్య మేపాటిదో ! ఇతనిని సర్వవ్యాపకు డంటారు. మఱి వీరి చోటు ఏ పాటిదో ! వేంకటగిరికి పతియై కృపతో నిండిన మనసు కలవాడై వరాలిచ్చే ఈ దొరను బహురూపాలు గలవా దంటారు. అట్టి వీరి మహత్తు ఎంతో కదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమని పొగడవచ్చు | 383 | 482 | 4 | 325 |

అవ: స్వామి మహిమలు అభివర్ణిస్తున్నాడు.

సీ. **ఆదిదేవుఁ డనంగ నవతరించి యితండు**
**వేదముల్ వార్ధిలో వెదకి తెచ్చె;**
**ఖలదైత్యవరుల భార్యల నెల్ల నీతండె**
**మూలఁద్రోసి ముసుంగుపాలు సేసె;**
**వేవేల పడఁతుల వేడ్క నీతం డొంటి**
**యాలి మగనిరీతి ననుభవించె;**
**కడుపులో జగములు కదలకుండ నితండు**
**ఫణిరాజతల్పానఁ బవ్వళించె;**

తే. **అడుగుక్రింద లోకమునెల్ల నడఁచి యితఁడె**
**పొడ వెదిగి మింటిజలములు పొడిచి తెచ్చె;**
**వెలసి తిరువేంకటాద్రి జీవులకుఁ దన్నుఁ**
**జూడుఁ దని యీతఁడే ముక్తిఁ జూఱ విడిచె.** **15**

ఆదిదేవు డనగా అవతరించి ఈయన సముద్రంలో వెదకి వేదాలు వెలికి తెచ్చాడు. దుర్మార్గులైన రక్కసులను దునుమాడి వారి భార్యలకు వైధవ్యం కలిగించాడు. ఏకపత్నీ వ్రతునివలె ఇతడు పెక్కుమంది భార్యలతో కాపురం చేశాడు. ఉదరంలో నుండే లోకాలు కదలకుండా శేషశయ్యపై పవళించాడు. తన పాదం క్రింద లోకాలనణచి పొడవుగా పెరిగి ఆకాశగంగను తెచ్చాడు. వేంకటాద్రిపై నుండి తనను దర్శించండని ప్రాణులు ముక్తిని కొల్లగొట్టునట్లు చేశాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఆదిదేవుఁ డనఁగ | 63 | 324 | 1 | 216 |

అవ: సర్వవ్యాపి, సర్వప్రాణి సంరక్షకుఁడు శ్రీమన్నారాయణుడే యనుచున్నాడు.

**సీ. భూమిలోపలఁ జొచ్చి భూతకోటులనెల్ల**
**దీమసమ్మున మోచు దేవుఁ డితఁడు ;**
**చంద్రుఁడై బహువిధ సస్యముల్ గలిగించి**
**తేమను బండించు దేవుఁ డితఁడు;**
**దీపనాగ్నిగ జీవదేహాల యన్నమ్ము**
**దినదినం బఱిగించు దేవుఁ డితఁడు ;**
**ఏపున నిందఱ హృదయాలలో నిండి**
**తలఁపు మఱపు గూర్చు దైవ మితఁడు;**

**తే. వేదములచేత వేదాంతవిదులచేతఁ**
**దెలియఁ దగినట్టి దేవాదిదేవుఁ డితఁడు;**
**సిరిచెలువఁగూడి శేషాద్రిశిఖర మందు**
**పరిఢవిల్లెడు మా నోముపంట యితఁడు.** 16

సకలప్రాణికోటి కాధారమైన భూమిలో ప్రవేశించి ఓజోబలంతో జీవరాసులను భరించేవాడూ, చంద్రస్వరూపుఁడై కిరణాలచల్లదనంతో నానావిధములైన పైరుపచ్చలను ఫలవంతం చేసేవాడూ, జీవుల ఉదరాలలో జఠరాగ్నిరూపంతో అనుదినమూ ఆహారం పచనంచేసేవాడూ, ప్రాణుల హృదయాలలో ఉండేవాడూ, స్మృతిని, విస్మృతిని కలిగించేవాడూ, వేదాలచేత, వేదాంతులచేత ఎఱుంగదగినవాడూ అయిన ఆదిదేవుడు తన చెలియైన సిరితోగూడి శేషపర్వతశిఖరమందు ప్రకాశిస్తున్నాడు. ఇతడే మా నోముల పంట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అని యానతిచ్చె | 187 | 438 | 2 | 295 |

అవ: శ్రీ వేంకటేశ్వరుడే పరదైవతమని ప్రశంసిస్తున్నాడు.

**సీ. జలధి ద్రచ్చెడునాఁడు సకలదేవత లుండ**
**నెవ్వనిఁ జేరె లోకైకజనని ;**
**'ఆదిమూలమ ! ప్రోవు' మని దంతి మొఱ లిడ**
**చెచ్చెర నెవఁడు విచ్చేసి కాచె ;**
**పుడమి గొల్చెడునాఁడు పొడవగు వేల్పు లే**
**తని పాదముల క్రింద దాఁగినారొ !**
**కడలేని భువనముల్ గల్పించు పరమేష్ఠి**
**యెవని పొక్కిలిదమ్మి నవతరించె ;**

**తే. సురల యింద్రియములఁ జొక్కించు మన్మథుఁ**
**డెవనిపట్టి-యతఁడె యెక్కుడైన**
**దైవతంబు; భక్తతతిగోరిన వరమ్ము**
**లిచ్చువాఁడు వేంకటేశ్వరుండు.** 17

పాలకడలి చిలికేటప్పుడు పుట్టిన జగజ్జనని లక్ష్మి ఎవ్వని వరించిందో, గజరాజు "ఆదిమూలమా" కాపాడు మని మొఱపెట్టగా వెంటనే వచ్చి ఎవడు కాపాడెనో, త్రివిక్రముడై భూమిని కొలిచేనాడు దేవత లెవ్వని పాదాలక్రింద దాగిరో, అంతంలేని లోకాలను సృజించే బ్రహ్మదేవుడు ఎవని నాభికమలంనుండి పుట్టెనో, దేవతలను కూడ మోహింపజేసే మన్మథుని కన్నతండ్రి ఎవడో, అతడే పరమదైవం. అతడే భక్తులకు కోరిన వరాలిచ్చే శ్రీ వేంకటేశ్వరుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అతఁడే యెక్కుడు దైవ | 366 | 387 | 4 | 260 |

అవ:శ్రీమన్నారాయణుని హస్తం వర్ణిస్తూ ఆయన దశావతారచర్యలు కొనియాడుతున్నాడు.

**సీ. వెలలేని వేదాలు వెదకి తెచ్చిన చేయి**
**చిలుకు గుబ్బలిక్రిందఁ జేర్చు చేయి**
**కలికి భూదేవిని కౌఁగిలించిన చేయి**
**వలనైన కొనగోళ్ళవాఁడి చేయి**
**తనివోక బలిచేత దానమందిన చేయి**
**యొనరంగ భూదాన మొసఁగు చేయి**
**మొనసి యంబుధి నమ్ముమొనకుఁ దెచ్చిన చేయి**
**యెనయ నాఁ గలి ధరియించు చేయి**

**తే. పురసతుల మానములు పొల్లవుచ్చు చేయి**
**తురగరాజమ్ముఁ బఱపెడి దొడ్డచేయి**
**ప్రాణులకు ముక్తితెరువు గన్పఱచు చేయి**
**యభయ మిడుచేయి తిరుమలప్పన్న చేయి.** 18

సోమకాసురుడు దొంగిలించి సముద్రంలో దాచిన వెలలేని వేదాలను మత్స్యావతారమెత్తి వెదకి వెలుపలికి దెచ్చినది ఈ హస్తమే. దేవదానవులు అమృతం కొఱకు క్షీరసాగరం చిలుకునప్పుడు క్రుంగిపోతున్న మందరగిరిని కూర్మరూపం ధరించి పైకి లేవనెత్తినది ఈ హస్తమే. హిరణ్యాక్షుఁడు చాపచుట్టగా చుట్టి పుడమిని సముద్రంలో పడవేయగా వరాహరూపంతో పైకిదీసి భూదేవిని ఆలింగనం చేసుకొన్నది ఈ హస్తమే. నరసింహావతారం ధరించి హిరణ్యకశిపుణ్ణి సంహరించిన వాడి కొనగోళ్ళు గలది ఈ హస్తమే. దేవహితంకొఱకు వామనరూపం దాల్చి బలిచక్రవర్తి నుంచి దానం గ్రహించినది ఈ హస్తమే. పరశురాముడై తాను జయించిన భూమినంతటినీ కశ్యపునకు దానమిచ్చినదికూడ ఈ హస్తమే.

శ్రీ రామావతారంలో సముద్రుణ్ణి బెదరించి తన బాణాగ్రానికి గుఱిచేసినది కూడ ఈ హస్తమే. బలరామావతారంలో నాగలి ఆయుధముగా పట్టినది ఈ హస్తమే. బుద్ధావతారంలో త్రిపురాసుర స్త్రీల మానభంగానికి పాలుపడినది ఈ హస్తమే. కల్క్యవతారంలో దుష్టసంహారానికై గుఱ్ఱమెక్కి కళ్ళెము పట్టి నడిపించేది ఈ హస్తమే. జీవకోటికి ముక్తిమార్గం చూపేదీ, అభయమిచ్చేదీ ఈ తిరుమలేశుని హస్తమే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇందఱికి నభయంబు | 65 | 334 | 1 | 223 |

అవ: శ్రీనివాసుని చేతులు చేసిన వింతలను ముచ్చటిస్తున్నాడు.

సీ. పిసికి పూతనచన్ను బిగియించి పట్టిన
చిన్నారిపొన్నారి చేతు లివ్వి;
గునియుచుఁ దన్నెత్తుకొమ్మని తల్లిపైఁ
జెలువారఁ జాచిన చేతు లివ్వి ;
కినిసి గోవర్ధనగిరి పెల్లగించిన
పోఁతయినుము వంటి చేతు లివ్వి;
యమునలో గొల్లతొయ్యలులపై నిసుకలు
చిటపటఁ జల్లిన చేతు లివ్వి;

తే. శేషగిరియందు భక్తి దర్శింప వచ్చు
శ్రితులకు వరమ్ము లొసఁగెడు చేతు లివ్వి;
పరమ కైవల్యపదవికిఁ దెరువుసూపు
శ్రీనివాసుని రతనాల చేతు లివ్వి. 19

కటిక రక్కసియైన పూతన చనుదోయిని గట్టిగా పట్టినవి యీ చిన్ని చేతులే. నచ్చు పెడుతూ ఎత్తుకొమ్మని తనతల్లి యశోదపైకి అందంగా చాచినచేతు లివే. ఇంద్రునిపై కోపించి గోవర్ధనపర్వతాన్ని సమూలంగా పెల్లగించి పైకెత్తిన ఉక్కుచేతు లివే. యమునానదిలో గోపయువతులపై చిటపట ఇసుకలు చల్లిన చిలిపిచేతు లివే. శేషాద్రిలో భక్తితో తన దర్శనానికి విచ్చేయు భక్తులకు వరాలిచ్చే చేతులు కూడ ఇవే. పరమపదమునకు దారిచూపే శ్రీనివాసుని రత్నాలచేతు లివే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇన్ని లాగుల | 27 | 166 | 1 | 112 |

అవ: స్వామివారి హస్తమును అపోవక అభివర్ణిస్తున్నాడు.

**సీ. కరిరాజు గావఁ జక్రము పట్టిన కరమ్ము**
**కరితుండ మని చెప్పఁగాఁ జెలంగు;**
**వరదాయకమ్మైన బిరుదహస్తము కల్ప**
**తరుశాఖకును బోల్పఁదగి వెలుంగు;**
**జలధిఁ బుట్టిన పాంచజన్యముగల చేయి**
**కడలి తరఁగ యంచు నుడువ నొప్పు;**
**బలియు కాళియు తోకఁ బట్టిన కటికేలు**
**భుజగరాజ మ్మని పొగడఁ దగును;**

**తే. చందన విలిప్త చారు వక్షస్థలమ్ము**
**మంగకున్ పూలసెజ్జ యనంగఁ జెల్లు;**
**గరుడగిరిచక్రవర్తి శృంగార మెన్నొ**
**సొబగు పోలికలకుఁ దగి శోభమీఱు. 20**

గజేంద్రుణ్ణి కాపాడడానికి చక్రంపట్టిన ఆ చెయ్యి ఏనుగు తొండమునకు సాటియై చెలువొందుచున్నది. వరాలిచ్చే సమర్థమైన ఆ హస్తం కల్పవృక్షం కొమ్మకు పోల్పదగి ప్రకాశిస్తున్నది. సముద్రంలో పుట్టిన పాంచజన్యమనే శంఖాన్ని పట్టుకొన్న ఆ చేయి సముద్రతరంగముగా చెప్పుటకు తగి ఉంది. బలవంతుడగు కాళియుని తోకపట్టిలాగిన ఆ కటిహస్తం సర్పరాజమని శ్లాఘించుటకు యుక్తంగా ఉన్నది. చందనపుపూతగల మనోహరమైన ఆ ఉరము మంగతాయారునకు పూలపానుపని చెప్పనొప్పినది.

గరుడాద్రి సార్వభౌముడగు శ్రీ వేంకటేశ్వరుని శృంగారం ఎన్నో అందమైన ఉపమానములకు దగి కాంతితో పొలుపారుతున్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| శ్రీ వేంకటేశ్వరుని | 148 | 221 | 2 | 148 |

అవ: శ్రీ వేంకటేశ్వరుని పాదమును అభివర్ణించుచున్నాడు.

సీ. కామిని పాపమ్ము గడిగిన పాదము
బలరిపుఁ గాఁచిన భవ్యపదము
ప్రేమతో శ్రీసతి పిసికెడి పాదమ్ము
యోగులకు పరమ్ము నొసఁగు పదము
చెలఁగి వసుంధరఁ గొలిచిన పాద మ
య్యహిమౌళిఁ దాండవమాడు పదము
తలఁకక గగనమ్ము దన్నిన పాదమ్ము
బలితల మోపిన ప్రణుత పదము

తే. బ్రహ్మ గడిగిన పాదము బ్రహ్మ మగుచు
వెలయు పాదము గుఱుతుగా వేంకటాద్రి
తిర మనుచుఁ జూపు పాదమ్ము తిరుమలయ్య
పొగడపుపాద మిదె మాకుఁ బరమపదము. 21

శ్రీ రామావతారంలో అహల్యాశాపాన్ని పోగొట్టినదీ, ఇంద్రుని కాపాడినదీ, ప్రేమతో శ్రీమహాలక్ష్మి ఒత్తునట్టిదీ, యోగులకు మోక్షమిచ్చునట్టిదీ, వామనావతారంలో భూమిని గొలిచినట్టిదీ, శ్రీకృష్ణావతారంలో కాళియుని పడగలపై నాట్యం చేసినట్టిదీ, బలిచక్రవర్తితలపై మోపబడినట్టిదీ, త్రివిక్రముడై ఆకసము నాక్రమించునపుడు బ్రహ్మచేత కమండలు జలముతో కడుగబడినట్టిదీ, తానే బ్రహ్మముగా నొప్పునట్టిదీ ఈ పాదమే. శ్రీ వేంకటాచలమే స్థిరమైనదని చూపునట్టిదీ, అందియతో కూడినట్టిదీ అయిన ఈ శ్రీనివాసుని పాదమే మాకు పరమప్రాప్యం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| బ్రహ్మగడిగిన | 31 | 191 | 1 | 128 |

అవ: శ్రీనివాసుని శ్రీపాదమహిమను వర్ణిస్తున్నాడు.

సీ. ఇభరాజు దలఁచిన దీ పాదమే గదా
యిహపరా లిచ్చిన దిదియగాదె?
ఇంద్రాదు లరసిన దీ పాదమే గదా
యీక్షింప దుర్లభ మిదియగాదె?
ఇందిర కితవైన దీ పాదమే గదా
యిందఱు మ్రొక్కిన దిదియగాదె?
ఎలమి గంగను గన్న దీ పాదమే గదా
యిన్నింటి కెక్కుడు నిదియగాదె?

తే. ఈ పదమ్మేగదా యడ్డ మింతలేక
దిక్కు లన్నిట హయ మెక్కి తిరుగునదియు
సంకటమ్ములు హరియించు వేంకటాద్రి
నీ పదమ్మేగదా కూర్మి నిరవుకొనియె. 22

మొసలిచే పట్టుపడిన గజేంద్రుడు స్మరించినదీ, ఈ లోకంలో, పైలోకంలో సుఖాలిచ్చేదీ, తపః ఫలంగా ఇంద్రాదిదేవతలు సందర్శించినదీ, సామాన్యులకు దర్శింప నలవికానిదీ, లక్ష్మీదేవికి ప్రీతిపాత్రమైనదీ, సర్వజనులచే నమస్కరింపబడేది, పవిత్రమైన గంగానదికి జన్మస్థానమైనదీ, అన్నిటికంటే ఉత్కృష్టమైనదీ, కల్క్యవతారంలో అడ్డమాపులేక గుఱ్ఱమునెక్కి అన్నిదిక్కుల సంచరించేదీ, కష్టములు తొలగించేదీ అయిన శ్రీమన్నారాయణుని ఈ పాదమే వేంకటాద్రిపై ప్రేమతో నెలకొన్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఈ పాదమే కదా | 10 | 66 | 1 | 44 |

అవ: శ్రీనివాసుడు తన భక్తుల ననుగ్రహించిన వృత్తాంతం వక్కాణిస్తున్నాడు.

**సీ. కొండల నెలకొన్న కోనేటిరాయ వాఁడె**
**కొండలంత వరాలు గుప్పువాఁడు**
**కుమ్మరిదాసుఁడౌ కురువనంబికి కోరి**
**నట్టివరా లిచ్చినట్టివాఁడు**
**మాఱువల్కక తొండమాన్ చక్రవర్తి ర**
**మ్మన్న చోటికి వచ్చినట్టివాఁడు**
**అచ్చపువేడ్క ననంతాళువారికి**
**వెట్టికి మను మోసినట్టివాఁడు**

**తే. నచ్చిక దొలంక తిరుమలనంబితోడ**
**కట్టెదుట నిల్చి మాటాడినట్టివాఁడు**
**కంచి తిరుకచ్చినంబిని కరుణ తనదు**
**సన్నిధికి వేగ రప్పించుకొన్నవాఁడు.** 23

ఏడుకొండలపై నిలిచియుండే ఆ కోనేటిరాయడే కొండలంతవరాలను క్రుమ్మరించేవాడు. కుమ్మరిదాసుడైన కురువనంబికి కోరిన వరా లిచ్చినవాడు అతడే. అడ్డంచెప్పకుండ తొండమాన్ చక్రవర్తి రమ్మన్నచోటికి వచ్చినవాడు అతడే. అనంతాళువారికి కపటంలేని ప్రేమతో కూలి తీసుకోకుండా మట్టిమోసినవాడు అతడే. నమ్మిక కలుగగా భగవద్రామానుజుల మేనమామయగు శ్రీశైలపూర్ణులతో ఎట్టయెదుట నిలిచి మాట్లాడినట్టివాడు అతడే. దయతో కంచిలోని తిరుకచ్చినంబిని శీఘ్రంగా తన సన్నిధికి రప్పించుకొన్నవాడు ఆ తిరుమలేశుడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కొండలలో నెలకొన్న | 24 | 151 | 1 | 103 |

అవ: శ్రీ వేంకటాచలపతి సర్వప్రదు డనుచున్నాడు.

**సీ.** **ఏమఱక భజింప నెప్పు డేనియు నేమి**
**వలసిన నిచ్చు దైవత మితండు**
**కనఁగఁ గన్నులనిచ్చు ; కాళ్ళిచ్చు నడువంగఁ;**
**బనిచేయఁ జేతులు, బలము నిచ్చుఁ;**
**దన్నుఁ దలంపఁ జిత్త మ్మిచ్చుఁ; బొగడంగ**
**సొబగుమాటల నిచ్చు ; సుతుల నిచ్చుఁ;**
**జొచ్చినచోటులఁ జొచ్చి సుఖ మ్మిచ్చుఁ;**
**బ్రాయమ్ము నిచ్చుఁ దీర్ఘాయు విచ్చు**

**తే.** **పట్టికొలువఁ బ్రాణమునకుఁ బ్రాణ మిచ్చు;**
**నెట్టి పదవులనైనఁదా నిట్టె యిచ్చు ;**
**నొనర లోకమ్ములకు నెల్ల నొకఁడె వేల్పు**
**వింతవిభవాల వేంకటవిభుఁడు సుమ్ము.** **24**

ఏమఱుపాటులేక సేవించినచో నెప్పుడు ఏది కావలెనో దాని నిచ్చేవాడూ, చూచుటకు కన్నులూ, నడచుటకు కాళ్ళూ, పనిచేయుటకు చేతులూ, శక్తీ, తన్ను స్మరించుటకు మనస్సూ, స్తోత్రం చేయుటకు సుందరమైన వచస్సూ, సంతానమునూ, భక్తుడు వెళ్ళినచోటికి వెళ్ళి క్షేమమునూ, వయసునూ, దీర్ఘాయుష్యమునూ, కొలిచేవారి ప్రాణానికి తన ప్రాణమునూ, ఎట్టి ఉన్నతపదవినైననూ ఇచ్చునట్టివాడు ఈ వేంకటగిరినాథుడే. ఇతడే సర్వలోకైక దైవము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమి వలసిన నిచ్చు | 28 | 172 | 1 | 116 |

అవ: మానవుడు పుట్టినది మొదలు గిట్టేవరకు భగవన్నామ సంబంధమే కల్గి ఉన్నాడు. అట్టి మనుజుడు మాధవుని మఱచిపోవడం శాస్త్రవిధి నతిక్రమించడమే అనుచున్నాడు.

**సీ. ఆదిమూలంబు బ్రహ్మణ్యదైవ మతండె**
**యతని మానుట లెల్ల నవిధిపూర్వ;**
**మెవనిపేరఁ బిలుతు రిలఁ బుట్టు జీవుల**
**నలి మాస నక్షత్ర నామములను;**
**అవల నెవ్వని కేశవాది నామములచే**
**నాచమనమ్ముల నాచరింత్రు;**
**చచ్చెడివారికి సన్న్యాసులకు గతి**
**వేని నారాయణాభిఖ్య జగతి ;**

**తే. నారదుండు దలంచెడు నామ మెవని?**
**దంబిక స్మరించు నామధేయం బెవనిది?**
**యెవనినామంబు తారకం బీశ్వరునకు**
**వాఁడె వరదుండు సప్తాద్రివల్లభుండు.** 25

జగతిలో జన్మించే మనుజునకు ఆ నెలనుబట్టి, నక్షత్రాన్నిబట్టి ఏ దేవుని పేళ్ళను పెట్టుదురో, ఆ మానవులు పెరిగి పెద్దవారైన పిదప ఎవని పేళ్ళతో అచ్యుతాయనమః, అనంతాయనమః, గోవిందాయనమః అని సంధ్యావంద నాదులందు ముమ్మారు జలము పుచ్చుకొందురో, మరణం సమీపించినవారికీ, సన్న్యాసులకూ ఎవని నారాయణనామమే దిక్కైనదో, నారదుడు ఎల్లప్పుడు వల్లించేది ఎవనినామమో, పార్వతీదేవి శ్రీరామరామ రామ అని జపించేది ఎవనినామధేయమో, ఎవనిపేరు శంకరునకు తారకమంత్ర మైనదో, అతడే వరదాయకుడైన ఏడుకొండలరాయడు. అతడే సకలచరాచరములకు మొట్టమొదటి కారణం. అతడే బ్రహ్మణ్యదేవుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అతఁడే బ్రహ్మణ్య | 26 | 358 | 3 | 241 |

అవ: ఆశ్రితులకు వరాలిచ్చే వేంకటేశ్వరుని అభినుతిస్తున్నాడు.

**సీ. అతఁడే పరబ్రహ్మ మతఁడె లోకేశ్వరుం**
**దతనికంటె నధికు లరయ నెవరు?**
**కమలసంభవ లక్ష్మిగలదె యెవ్వరికేని?**
**కమలనాభునికి నొక్కనికెగాక ;**
**కమల గర్భుఁడు నాభిగలఁడె యెవ్వరికేని ?**
**నమరవంద్యుండు శ్రీహరికె గాక ;**
**అంద ఋండెడిభూమి యన్యుల కున్నదే**
**యఖిలాండపతికె యాలయ్యెఁ గాక ;**

**తే. పాదములయందు గంగ శ్రీపతికిఁ గాక**
**పరుల కున్నదె? అభయమ్ము పగటు నేరు**
**పెందుఁ గలదు నారాయణునంద గాక?**
**కలఁడె శ్రితవరదుండు వెంకన్న గాక.** **26**

శ్రీ వేంకటేశ్వరుడే పరబ్రహ్మస్వరూపుడు. అతడే అన్నిలోకాలకు ప్రభువు. పద్మం నాభియందుగల ఆ మహావిష్ణునికి దప్ప అష్టదళపద్మంలో జన్మించిన శ్రీ మహాలక్ష్మి మరెవ్వరికైనను దక్కినదా? లేదు. దేవతలచే మ్రొక్కబడు ఆ నారాయణునికే గాని మరెవ్వరి బొడ్డుననైనను పద్మంలో పుట్టిన బ్రహ్మ ఉన్నాడా? లేదు. సర్వమునకు ఆధారమైన భూదేవి ఆ అఖిలాండపతికేగాని మరెవ్వరికేని ఇల్లాలైనదా ? లేదు. పవిత్రమైన గంగానది ఆ శ్రీపతిపాదాలనుంచి పుట్టిందే గాని మరి ఇతరుల పాదాలనుండి కాదుగదా ? అభయప్రదానం చేసే నేర్పు ఆ గోవిందునికి తప్ప మరెవ్వరికేని ఉన్నదా ? లేదు. ఆశ్రితవరదుడు ఆ వేంకటాచలపతి గాక మరెవ్వ దున్నాడు ? లేదని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అతఁడే పరబ్రహ్మ | 282 | 470 | 3 | 316 |

అవ: భంగీ విభేదంతో నృసింహావతారాన్ని వర్ణిస్తున్నాడు.

**సీ. శ్రీనివాసవిభుండె తానైన స్వామికి**
**ముందుగా జయ పెట్టి మ్రొక్కు లిదరె**
**కరసహస్రము లవే కడు భయంకరములౌ**
**ఖరనఖాయుధముల కాంతు లవియె**
**సిరి తొడపై నదే సింగంపుమో మదే**
**దంష్ట్రలు వజ్రదంతమ్ము లవియె**
**జడలు మూపున నవే శంఖచక్రము లవే**
**మణిధగద్ధగితమౌ మకుట మదియె**

**తే. నిడుదనాలుక యయ్యదే నీలిమచ్చ**
**వెడఁదయుర మదె వేదాద్రి వేంకటాద్రి**
**చుక్కగమి మొలపూసలై నిక్కుచున్న**
**పాపహర నరకేసరి రూప మదియె. 27**

శ్రీనివాసుడే నృసింహస్వామి అవతారం ధరించాడు. ఆయనముందు నిలబడి జయజయధ్వనులు చేయుచు దండములు పెట్టండి ! అవిగో వేయిచేతులు. భయం కలిగించే వాడిగోళ్ళనే ఆయుధాలకాంతు లల్లవిగో ! అదిగో! తొడపైన లక్ష్మీదేవి. అదిగో! సింహముఖం. అవే కోరలు. వజ్రాయుధం వంటి దంతాలు అవే. మూపుపై జడలవిగో ! అవే శంఖచక్రాలు ! మణులచే ధగధగలాడే కిరీటం అదిగో ! పొడవైన నాలుక అదిగో ! నల్లని శ్రీవత్సమనే పుట్టుమచ్చగల విశాలమైన వక్షస్థలం అదిగో! నక్షత్రాలే మొలనూలులోని పూసలుగా నింగికెగసేవాడు, పాపాలు పోగొట్టేవాడూ అతడే! వేదాద్రిపై, వేంకటాద్రిపై వెలసిన నరకంఠీరవ రూపం అదే !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మొక్కరే మొక్కరే | 176 | 379 | 2 | 255 |

అవ: అహోబల నృసింహుఁడే శ్రీనివాసుడని వర్ణించుచున్నాడు.

**సీ. వదనంబు జ్వలనంబు; భానుచంద్రులు కనుల్;**
**శస్త్రము లెండ; హస్తములు దిశలు;**
**కాలచక్రము నోరు ; గ్రహములు దంతమ్ము;**
**లంబుదశ్రేణి దివ్యాంబరములు;**
**శైలముల్ చరణాలు ; జానువుల్ జగములు;**
**క్ష్మ పిఱుం; దంతరిక్షంబు నడుము;**
**మితిలేని వేదముల్ మెఱయు కేసరములు;**
**వారాసు లెల్లఁ గృపారసంబు;**

**తే. అంతు లుఱుములుగాఁగ నత్యంతరౌద్ర**
**రమ్యరూపమ్ముతో భక్తరక్ష సల్పు**
**నంజనాద్రి నహోబిలమందు నెవఁడు;**
**వేంకటనృసింహు నాతని వేడ్కఁ గొలుతు. 28**

అగ్నియే ముఖంగా, సూర్యచంద్రులు కన్నులుగా, ఎండ ఆయుధాలుగా, చేతులు దిక్కులుగా, కాలచక్రం నోరుగా, గ్రహాలు దంతాలుగా, మేఘాలు వస్త్రాలుగా, పర్వతాలు పాదాలుగా, పిక్కలు లోకాలుగా, భూమి పిరుందుగా, ఆకాశం నడుముగా, వేదములు జడలుగా, సముద్రాలు దయారసంగా, గర్జనలు ఉరుములుగా, భయానక రమణీయ రూపంతో భక్తులను కాపాడేవాడూ, అంజనాద్రిలో అహోబిలంలో వెలిగే దేవుడెవడో ఆ వేంకట నృసింహస్వామిని వేడ్కతో కొలుస్తున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అహోబలేశ్వరునకు | 152 | 243 | 2 | 163 |

అవ: శేషగిరిపై సాక్షాత్కరించిన నృసింహస్వామిని వర్ణించుచున్నాడు.

**సీ.** **వాఁడెపో ప్రహ్లాదవరదుండు వాఁడెపో**
**భక్త వత్సలుఁడు కృపాపరుండు**
**తెల్లని మేనితో తీఁగె నవ్వులతోడ**
**మంచిగందపుఁ బరిమళముతోడ**
**హార కేయూర భూషాంబరావళితోడ**
**శతకోటి సూర్యతేజమ్ము తోడ**
**శంఖచక్రములతో జంటపూసరులతో**
**కోఱలతో వాఁడిగోళ్ళతోడ**

**ఆ.** **నిక్కుఁజెవులతోడ నిటల నేత్రముతోడ**
**నంబుజాసనాదు లభినుతింప**
**సిరులగద్దెఁ గొల్వు సింగారమైనాఁడు**
**శేషశిఖరి నారసింహవిభుఁడు.** **29**

అతడే ప్రహ్లాదునికి వరాలిచ్చినవాడు, భక్తులందు వాత్సల్యం కలవాడు. దయగలవాడు. తెల్లని శరీరంతో, తీగెలువారే నవ్వులతో, మంచిగందపు సువాసనలతో, ముత్యాలహారాలు, భుజకీర్తులు, నగలు, వస్త్రాలు-వీటితో, కోట్లకొలది సూర్యుల వెల్గువంటి వెలుగుతో, శంఖచక్రాలతో, జంట పూలదండలతో,కోఱలతో, పదనైన గోళ్ళతో, నిక్కపొడుచుకొన్న చెవులతో, నొసటి కన్నుతో, బ్రహ్మాదిదేవతలు స్తోత్రం చేస్తుండగా శోభమీరిన సింహాసనంపై శేషాద్రి నరసింహుడు శృంగారంగా కొలువు తీరినాడు. సేవించండి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వాఁడెపో | 172 | 355 | 2 | 238 |

అవ: శ్రీ వేంకటేశ్వరునే శ్రీరామచంద్రునిగా కీర్తించుచున్నాడు.

సీ. రాముఁడు లోకాభిరాముఁ డిందీవర
శ్యాముఁడు త్రైలోక్యధాముఁ డితఁడె
వరుఁడు సీతకు పరాత్పరుఁడు కోదండ దీ
క్షాగురుఁ డవితథశరుఁ డితండె
స్థిరుఁడు మంగళగుణాకరుఁడు సేవక శుభ
కరుఁడు దైతేయసంహరుఁ డితండె
ధీరుఁడు లోకైకవీరుఁడు భవబంధ
దూరుఁడు ధర్మవిచారుఁ డితఁడె

తే. అవికలుఁడు బలుఁ డినకులుం డచలుఁ డితఁడె !
పుణ్యుఁ డీతఁడె సర్వశరణ్యుఁ డితఁడె
కోరి తిరు వేంగడమ్మునఁ గుదురుకొన్న
మాపతి యితండె బ్రహ్మస్వరూపుఁ డితఁడె ! 30

లోకములకు మనోహరుడు, నల్లగలువలవలె నల్లనివాడు, ముల్లోకములకు స్థానమైనవాడు, సీతకు భర్త, ప్రకృతికంటె పరుడైన జీవునికంటె పరుడు, ధనుర్విద్యకు గురుడు, వ్యర్థంకాని బాణం కలవాడు, నిలుకడ గలవాడు, శుభకరములగు గుణములకు గని యైనవాడు, దాస్యం చేసేవారికి శుభాన్నిచ్చేవాడు, రాక్షసులను పుటమార్చినవాడు, ప్రాజ్ఞుడు, ఎల్లలోకాలకు ఒకేవీరుడు, సంసారబంధాలచే కట్టువడనివాడు, ధర్మముచే విచారించి తెలియదగినవాడు, వైకల్యం చెందనివాడు, బలం కలవాడు, సూర్యవంశంలో పుట్టినవాడు, చలించనివాడు, పుణ్యవంతుడు, అందరికి రక్షకుడు అయిన ఈత డిప్పుడు అపేక్షతో వేంకటాద్రిలో నెలకొనియుండే లక్ష్మీవిభుడు; ఆ పరబ్రహ్మస్వరూపుడు ఈ శ్రీనివాసుడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| రాముఁడు | 148 | 219 | 2 | 147 |

అవ: రామావతారచరిత్ర సంగ్రహముగా తెలుపుతూ ఆ రాముడే శ్రీ వేంకటేశ్వరుడై విలసిల్లుతున్నా డనుచున్నాడు.

సీ. మనుజుఁడై దశరథ తనయుఁడై హరి పుట్టి
గామిడి తాటకన్ భూమిఁ గూల్చె ;
యజ్ఞమ్ము రక్షించె; హరువిల్లు ఖండించెఁ ;
బ్రేమతో జానకిఁ బెండ్లియాడె ;
మడియించె ఖరదైత్యు ; మారీచు వధియించెఁ;
గెడపెను వాలి; సుగ్రీవుఁ బెంచె;
జలనిధి బంధించె; ఖలుని రావణుఁ ద్రుంచె,
వడి విభీషణు లంక కొడయుఁ జేసె;

అ. సీతతో నయోధ్య సింహాసన మ్మెక్కి;
కవలబిడ్డలఁ గుశలవులఁ గనియె;
కమలఁ గూడి నేఁడు గరుడాద్రిపై నిల్చి
కౌతుకమున జగముఁ గాచుచుండె. 31

శ్రీ మహావిష్ణువే దశరథనందనుడై మానవుడుగా అవతరించాడు. బలవంతురాలైన తాటకను చంపినాడు. సీతను పెండ్లాడినాడు. ఖరుడు, మారీచుడు అనే దానవులను సంహరించినాడు. వాలిని చంపి సుగ్రీవునికి పట్టం కట్టించినాడు. సముద్రాన్ని బంధించినాడు. నీచుడైన రావణాసురుణ్ణి వధించాడు. విభీషణుని లంకకు రాజుగా చేసినాడు. సీతతో అయోధ్యకు మరలివచ్చి పట్టాభిషిక్తుడైనాడు. లవకుశులనే అమడబిడ్డలకు తండ్రియైనాడు. ఆ రాముడే ఇప్పుడు లక్ష్మీసమేతుడై గరుడశైలంమీద ఉంటూ కుతూహలంతో లోకాలు కాపాడుతున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చెప్పితే నాశ్చర్యము | 382 | 477 | 4 | 321 |

అవ: తనివితీరక రామావతార విశేషములు ఉగ్గడించుచున్నాడు.

సీ. **గౌతమునతిపాలి కామధేను వితండు**
**కౌశికుపాలిటి కల్పతరువు;**
**సీతమ్మపాలిటి చింతామణి యితండు ;**
**దాసులపాలిటి దైవ మితఁడు;**
**సుగ్రీవుపాలిటి చుట్టంబ యీతండు;**
**మారుతిపాలి సామ్రాజ్య మితఁడు;**
**పరఁగ విభీషణుపాలి నిధానమ్ము**
**జనకుపాలిటి హరిచందనమ్ము;**

తే. **శబరిపాలి తత్త్వపు రహస్యంబు; గుహుని**
**పాలి ఆదిమూలము; శ్రితపటలిపాలి**
**కొంగుబంగార; మలమేలుమంగ విభుఁడు**
**వేంకటాద్రీశ్వరుఁడు రఘువీరుఁ డితఁడు.** **32**

గౌతముని భార్య అహల్యపాలిటికి కామధేనువై ఆమె శాపం పోగొట్టిన వాడూ, విశ్వామిత్రుని యాగం సంరక్షించి ఆయన పాలిటికి కల్పవృక్షమైనవాడూ, సీతాదేవికి చింతామణివంటివాడూ, సుగ్రీవుని కిష్కంధకు అధిపతి చేసిన ఆప్తబంధువూ, అంజనేయునికి సామ్రాజ్యం వంటివాడూ, విభీషణునిపాలిటి పెన్నిధీ, తండ్రి దశరథునకు సంతోషం కల్గించే మంచిగంధంవంటివాడూ (వెన్నెల, కల్పవృక్షం), శబరికి తత్త్వరహస్యమైనవాడూ, గుహునికి ఆదిమూలమైనవాడూ, ఆశ్రయించిన వారికి కొంగుబంగారమైనవాడూ, అలమేలుమంగకు భర్తయైనట్టి శ్రీ వేంకటేశ్వరుడే ఆ రామభద్రుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| రామచంద్రు | 325 | 147 | 4 | 93 |

అవ: స్వామి స్వరూప రూప గుణ వైభవములను కీర్తించుచున్నాడు.

సీ. గోపాంగనాశ్రేణి గుబ్బచన్నుల మీఁదఁ
బొలుపారు కస్తూరిపూఁత యితఁడు;
తాపసోత్తముల చింతాసౌధములలోన
దీపించు సుజ్ఞానదీప మితఁడు;
జలధికన్యాపాంగ లలితేక్షణములతోఁ
గలసి వెలుంగు కజ్జల మితండు
జలజాసనుని ముఖజలధి మధ్యమునందు
లభియించు నమృతంపులప్ప యితఁడు;

తే. ఏతదఖిలంబునకును దా నీశుఁ డగుచు
భూతములయందుఁ బొదలెడు పురుషుఁ డితఁడు
సప్తశైలాధినాథుఁడై సకలభువన
పాలనాధూర్వహుం డౌచుఁ బరఁగు నితఁడు. 33

ఈ శ్రీ వేంకటేశ్వరుడే గోపికల కుచములమీద ఒప్పునట్టి కస్తూరిపూత. గొప్ప తపస్వుల ధ్యానమనే మేడలలో ప్రకాశించు జ్ఞానమనే దీపము ఇతడే. శ్రీదేవియొక్క అందమైన కడగంటి చూపులతో కూడి ప్రకాశించే కాటుక ఇతడే. బ్రహ్మదేవుని ముఖములనే సముద్రం నడిమి భాగములో దొరికే అమృతరాశి ఇతడే. కనుపించే ఈ సమస్తమునకు తాను ఏలికయై ప్రాణులందుండే పరమపురుష పదవాచ్యుడు ఇతడే. ఏడుకొండల రాయడై ఎల్లలోకాలను పాలించుటలో సమర్థుడైన ప్రభువై యొప్పినవాడు ఇతడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏతదఖిలంబు | 28 | 170 | 1 | 115 |

అవ: భగవంతుని అద్భుతచర్యలు ముచ్చటిస్తున్నాడు.

సీ. బిఱుసైన యొకకొండఁ బెనుబాముతోఁ జుట్టి
బిరబిరఁ ద్రిప్పిన పిన్నవాఁడు
గుఱుతైన యొకకొండ గొడుగుగా నొకచేతఁ
బెఱికిపట్టిన కడు పిన్నవాఁడు
బెడిదంపు శిశుపాలు పెనుమ్రోఁత మ్రోయంగఁ
బెడచేత వేసిన పిన్నవాఁడు
పడవేసి చాణూరుఁ బట్టి యురముఁ ద్రొక్కి
పిడికిటఁ జంపిన పిన్నవాఁడు

తే. బొడ్డుఁ దామరలోపల దొడ్డవయసు
పెద్దబిడ్డను గనినట్టి పిన్నవాఁడు
పెక్కు రూపులవాఁడయి వేంకటాద్రిఁ
బిక్కటిల్లిన వాఁడె యీ పిన్నవాఁడు. 34

కఠినమైన మందరపర్వతానికి పెద్దపామైన వాసుకిని చుట్టి గబగబ త్రిప్పినవాడును, గోవర్ధనగిరిని అడుగుతో పెల్లగించి వ్రేలికొనతో గొడుగుమాదిరి పట్టినవాడును, క్రూరుడైన శిశుపాలుని పెద్దధ్వని ఏర్పడునట్లు ఎడమచేత కొట్టినవాడును, చాణూరుని పడద్రోసి రొమ్ముత్రొక్కి పిడికిటి గ్రుద్దులతో చంపినవాడును, తాను చిన్నవాడైనను వయసు మీఱిన బ్రహ్మను తన బొడ్డుదామరనుండి పుట్టించినవాడును, పలురూపులు ధరించినవాడై ఇపుడు వేంకటాద్రిపైనున్న ఈ పిల్లవాడే శ్రీనివాసుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| బొడ్డు తామెరలోన | 54 | 36 | 4 | 385 |

అవ: దుష్టశిక్షణ, శిష్టరక్షణకై శ్రీకృష్ణుడుగా అవతరించిన శ్రీ మహావిష్ణువే శ్రీ వేంకటాచలపతియై భక్తులకు వరప్రదానం చేస్తున్నా డనుచున్నాడు.

**సీ. వసుదేవునకును దేవకిదేవికిని పట్టి**
**లలి సుభద్రాసాత్యకులకు నన్న**
**గొంతి మేనల్లుఁడు గొల్లెతల మగండు**
**పంచపాండవులకు బావమఱఁది**
**బలరాము తమ్ముండు పంచసాయకు తండ్రి**
**మేటరి యభిమన్యు మేనమామ**
**అనిరుద్ధు తాత శూరుని కన్గు మనుమండు**
**పౌరవ యాదవ బాంధవుండు**

**తే. మించి శ్రావణ బహుళాష్టమీ నిశీథ**
**మం దవతరించె శ్రీకృష్ణుఁ డసురశిక్ష**
**యమరరక్ష యొనర్ప; శేషాద్రి నిపుడు**
**చేయి ముంచి వరమ్ములు శ్రితుల కొసఁగు. 35**

శ్రావణమాసంలో బహుళపక్షమందు అష్టమీతిథి నడురేయి శ్రీ మహావిష్ణువు శ్రీకృష్ణుడనే పేరుతో దేవకీ వసుదేవులకు ముద్దుబిడ్డడుగా జన్మించాడు. ఇతడు సుభద్రకు సాత్యకికి అన్న. కుంతీదేవికి మేనల్లుడు. గొల్లపడతులకు మగడు. పాండవులకు బావమరది. బలరామునికి తమ్ముడు. మన్మథునికి తండ్రి. వీరుడైన అభిమన్యునకు మేనమామ. అనిరుద్ధునకు తాత. శూరు డనే అతనికి మనుమడు. పురువంశము వారికీ, యాదవవంశమువారికీ చుట్టము. ఇంత బలగంతో కూడి దేవతలకు క్షేమాన్ని, రాక్షసులకు వినాశాన్నీ కలిగించాడు. ఇప్పుడు శేషపర్వతంలో నిలబడి వచ్చిన వారందరికీ చేత జవిరి వరా లిస్తున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అదర శ్రావణ | 328 | 160 | 4 | 107 |

అవ: కృష్ణావతారములోని భగవంతుని అద్భుతచేష్టలు వర్ణిస్తున్నాడు.

**సీ. వెన్నముద్దలవాఁడు వేల చేఁతలవాఁడు**
**పిన్నవాఁడైనను బిరుదులాఁడు**
**బాలెంత చనుబ్రాలు బండి విఱుగఁ దన్ని**
**గాలిరక్కసు మొలుగంగ మోది**
**రోలఁ గట్టువడుచు రూఢి మద్దులఁ గూల్చి**
**జననికి నోట విశ్వమ్ముఁ జూపి**
**కొండ వ్రేలందాల్చి గోకులమ్మును గాచి**
**మించి గొల్లెతలతో మేలమాడి**

**తే. నలువ కెదురొడ్డి పసిబాలకులను దెచ్చి**
**ధరఁ బదార్వేల చెలుల నుద్వాహ మాడి**
**శేషగిరి నిల్చి లచ్చితో శ్రితులకెల్ల**
**సకల వరము లొసంగు కృష్ణమ్మ యితఁడె. 36**

గొల్లయిండ్లలో వెన్నముద్దలు దొంగిలించినవాడు, అనేకములైన పనులు చేసినవాడు, చిన్నవాడైనను ప్రతిజ్ఞావంతుడు, చనుబాలతో కూడ పూతన ప్రాణములు గ్రోలినవాడు, శకటాసురుని భంజించినవాడు, సుడిగాలిరూపంలో వచ్చిన తృణావర్తుడనే దైత్యుని మూల్గునట్లు చావమోదినవాడు. జననిచే రోటికి కట్టివేయబడి సంగడిమద్దులను గూల్చి నలకూబర మణిగ్రీవులకు నారద శాపవిమోచనము కలిగించినవాడు, యశోదకు తననోట ప్రపంచముచూపినవాడు, గోవర్ధనమనే పర్వతమును చిటికెనవ్రేలితో నెత్తి గోవులను గోపకులను కాచినవాడు, గొల్లపడతులతో శృంగారచేష్టలు నెఱపినవాడు, బ్రహ్మకు ఎదురు నిలిచి పసిపిల్లలను తెచ్చినవాడు, పదహారువేల వనితలను పెండ్లాడినవాడు, ఈనాడు వేంకటాద్రిపై లక్ష్మితో గూడి భక్తులకు అన్ని వరాలిచ్చే ముద్దులకృష్ణుడు ఇతడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వెన్నముద్ద కృష్ణుఁడు | 391 | 529 | 4 | 357 |

అవ: భగవంతు డెవ రెవరికి ఎట్లెట్లు తోచునో వివరించుచున్నాడు.

**సీ. వరదుండు నిఖిల దేవతలకు వంద్యుండు;**
**గరదుం డసురులకుఁ గంటకుండు;**
**పరమాత్ముఁ డంబుజభవ శివాదుల కెల్ల;**
**నన్యులకుఁ ద్రిమూర్తులందు నొకఁడు;**
**దేవుండు సనకాది దివ్యర్షులకుఁ; బర**
**దైవమ్ము సకల వేదమ్ములకును;**
**కైవల్య మొసఁగెడు ఘననిధి; విధికి మ**
**హావిధి; జడులకు యాదవుండు;**

**తే. తెలిసినఁ దెలియుఁ; దేమియుఁ దెలియకున్నఁ**
**దొలఁగుఁ; డితఁడాద్యుఁ; డితఁ డసాధ్యుం; డభేద్యుఁ;**
**డచలుఁ డీతండు; భీకరుం; డభయదాత;**
**కలిమలధ్వంసి యితఁడె వేంకటవిభుండు. 37**

అతడు దేవతలందరికి నమస్కరింపదగినవాడు; వరా లిచ్చేవాడు. రాక్షసులకు విషం పెట్టేవాడు; వారికి పరమశత్రువు. బ్రహ్మ మహేశ్వరాదులకు అతడు పరమాత్మ. సామాన్యులకు హరి హర హిరణ్యగర్భులనే త్రిమూర్తులలో ఒకడుగా తోచేవాడు. సనకాది దేవర్షులకు అతడు దేవుడు. వేదాలకు దైవము. మోక్షమునిచ్చే మహానిధి అతడు. విధికి కూడ విధియైనవాడు. మూర్ఖులు మాత్రం అతనిని యాదవు డనుకొంటారు. అతడు తెలిసిన వారికే తెలిసేవాడు; తెలియనివారికి తెలియబడదు. ఇతడు ఆద్యుడు. అసాధ్యుడు, అభేద్యుడు, అచలుడు, భయంకరుడు, అభయ మిచ్చేవాడు, కలికల్మషాన్ని నాశనంచేసేవాడు, అతడే యీ వేంకటేశ్వరుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తెలిసిన తెలియుఁడు | 62 | 317 | 1 | 212 |

అవ: శ్రీనివాసుని భక్తప్రియత్వము కొనియాడుచున్నాడు.

సీ. కారి కుమారు చక్కని మాటలకుఁ జొక్కి
ఘనవేదముల గుట్టు గనినవాఁడు
తీరని వేడ్కతో తిరుమంగయాళ్వారి
మ్రుచ్చిమికూటికి మురియువాఁడు
విష్ణుచిత్తుని బిడ్డ వేనలి నిడి యిచ్చు
కమ్మపూసరుల కేఁకారువాఁడు
సిరిచెల్వ చేయివేసిన గగ్గురుపు దాల్చి
కౌఁగిటిలోఁ జేర్చి కరఁగువాఁడు

తే. వాఁడె తిరువేంకటేశుండు వాఁడిచుట్టుఁ
గైదువున్ వలచేతిలోఁ గలుగువాఁడు
. మామ కొమరిత యలమేలుమంగఁ గూడి
శేషగిరి మాడువున నివసించువాఁడు. 38

కారిపుత్రుడైన నమ్మాళ్వార్ల యింపైన పలుకులకు (తిరువాయి మొళి పాశురములకు) పరవశించి వేదముల రహస్యాలు తెలుసుకొన్నవాడును, తిరుమంగయాళ్వారు దారిదోపిడి చేసి తెచ్చిపెట్టే దొంగతిండికి సంతోషపడే వాడును, విష్ణుచిత్తుని కొమార్తె గోదాదేవి ధరించి యిచ్చిన కమ్మని పూలదండలకు ఆసపడేవాడును, లక్ష్మీదేవి తనమీద చేయి వేసినంతనే గగుర్పాటు చెంది ఆమెను కౌగిలించుకొని ఆనందించువాడును, కుడిచేత చక్రం పట్టుకొన్నవాడును అయిన ఆ వేంకటాచలపతి తనమామ కూతురు అలమేలుమంగతో శేషపర్వతం మేడలో నున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వాఁడె వేంకటేశుఁడనే వాఁడె | 20 | 121 | 1 | 83 |

అవ: భగవంతునికి భక్తులపై గల వాత్సల్యమును వర్ణించుచున్నాడు.

**సీ. పడుచు మాటనక యా ప్రహ్లాదు ముందరఁ**
**ప్రత్యక్షమైన దైవం బితండె**
**అడవిజంతు వనక యా దంతి మొఱ విని**
**పరుగున వచ్చి కాపాడె నితఁడె**
**ఆఁడు కూయి యనక యా ద్రుపదాత్మజ**
**మానంబు గాఁచిన మాన్యుఁ డితఁడె**
**పేదవాఁ డన కతిప్రీతిఁ గుచేలున**
**కైశ్వర్య మొసఁగిన యాఢ్యుఁ డితఁడె**

**తే. వీరు వా రనకుండ నెవ్వారి కయిన**
**భక్తి వేఁడిన వరములు రక్తి నిచ్చు**
**వేలుపులరాయఁ డీతండె వేంకటాద్రి**
**విష్ణు వీతండె; మా కంటి వెలుఁ గితండె.** 39

పిల్లవాని మాటలని నిర్లక్ష్యం చేయక ప్రహ్లాదు నెదుట ప్రత్యక్షమైనవాడు, అడవిజంతువని ఉపేక్షించక ఆ గజరాజు మొఱ ఆలించి పరుగెత్తి వచ్చి కాపాడినవాడు, ఆడుదేమో అరుస్తున్నదని పెడమొగం పెట్టక ద్రౌపది మానాన్ని రక్షించిన పూజనీయుడు, బీదవాడని గెంటింపక మిక్కిలి ప్రీతితో కుచేలునకు సంపద లిచ్చిన మహనీయుడు, వీరు వారు అనే భేదం లేకుండ భక్తితో తన్ను ప్రార్థించిన వారి కందరికీ ఆసక్తితో వరము లిచ్చేవాడు, దేవతలకు దేవుడు, మా కన్నులకు వెలుగూ ఈ వేంకటాద్రిపై నుండే విష్ణువే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సులభుఁడు | 82 | 394 | 1 | 264 |

అవ: శ్రీనివాసుడు భక్తసులభు డనుచున్నాడు.

సీ. చేరరాని యడవి శిలయయి పడియున్న
మునిపత్ని శాపమ్ము చనిన యట్లు
తీరని కర్మముల్ తీరుఁబో శ్రీహరి
పాదముల్ దలఁచెడి వారి కిట్లె;
కడు బీదయై పూటగడుపు కుచేలుండు
బలుసంపదలు పొంది బ్రతికినట్లు
కలుగని సిరులెల్లఁ గలుగుఁబో మాధవుఁ
గొలిచిన వారికిఁ గోరినట్లె;

తే. మించు కృప ధ్రువు పట్టమేలించి నట్లు
నమ్మి సేవించువారి మన్ననలఁ గాచు;
మూఢులకునేని సులభుఁడై మ్రోల నిలుచు
వేడ్కఁ దనుఁబాడ శేషాద్రి విట్ఠలుండు. 40

కీకారణ్యంలో రాయిగా పడియుండిన గౌతమమునిభార్య అహల్య శాపం తీరిన విధంగా శ్రీహరిపాదాలు తలంచేవారి తీరని కర్మాలు కూడ తీరిపోతాయి. కటికపేదరికంతో పూటగడుపుకునే కుచేలుడు నానావిధములైన సంపదలు పొంది బ్రతికినట్లుగా మాధవుని కొల్చినవారికి దుర్లభములైన సంపదలుకూడ కోరినవి కోరినట్లుగా చేరగలవు. ధ్రువుణ్ణి పట్టాభిషిక్తుణ్ణి చేసినట్లే నమ్మి కొలిచే వారిని స్వామి మన్నించి కాపాడగలడు. మూఢులైనా సరే ప్రీతితో తన్ను స్తుతిస్తే చాలు సులభంగా ఎదుట ప్రత్యక్షమయ్యే వాడు శేషాద్రినివాసుడైన శ్రీనివాసుడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నమ్మితే నితఁడే | 357 | 336 | 4 | 226 |

అవ: భగవంతుని దొంగగా చిత్రిస్తూ ఆయన దశావతార చర్యలను వర్ణిస్తున్నాడు.

సీ. వేఁడిపాలును వెన్న వెరఁజిన గజదొంగ
వీఁడుగో వీఁడుగో వింతదొంగ
వెలయ నీటను చొప్పు వేసెడి గజదొంగ
తలఁ గాననీకుండ దాఁగు దొంగ
తలఁకక ధారుణి ద్రవ్వు కన్నపుదొంగ
సరి సందెజామునఁదిరుగు దొంగ
అడుగుక్రింద జగమ్ము నడఁచు గడుసుదొంగ
యదరి తల్లికినైన నలుగు దొంగ

తే. అడవి నెలవైన దొంగ; నీలాంబరము ధ
రించు దొంగ; యింతుల మోసగించు దొంగ;
రాణ కెక్కు గుఱ్ఱపుదొంగ మానితాంజ
నాద్రి మూసిన ముత్యమై యలరు దొంగ. 41

వేడిపాలను వెన్నపూసను జుఱ్ఱిన గజదొంగ ఇతడే. అబ్బురపు దొంగ ఇతడే. సముద్రంలో మార్గంవేసిన మత్స్యరూపుడు, తల అగపడకుండ దాగిన కూర్మాకారుడు, జంకక భూమిని లేవనెత్తిన వరాహావతారుడు, సంధ్యాకాలంలో నృసింహుడైనవాడు, వామనుడై తనపాదం క్రింద లోకాల నణచినవాడు, తల్లిపట్లకూడ కోపంచూపిన పరశురాముడైనవాడు, అరణ్యమే స్థానంగా కలిగిన శ్రీరాముడైనవాడు, నల్లని వలువలు ధరించిన బలరాముడైనవాడు, త్రిపురకాంతలను మోసగించిన బుద్ధ స్వరూపుడు, గుఱ్ఱంమీద స్వారి సాగించే కల్కిరూపుడు–ఇపుడు అంజన పర్వతంపై మూసిన ముత్యంలాగా మెదలక ఉండే శ్రీ వేంకటేశ్వరుడే ఆ గడిదొంగ.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వీఁడెవో యిదె వింతదొంగ | 63 | 322 | 1 | 215 |

అవ: దశావతారచర్యలు పొడుపుకథవలె అత్యద్భుతముగ వర్ణించు చున్నాడు.

సీ. ఎడయఁడు తనరెక్క లెగసి పోవఁగ లేఁడు
కడు దాఁగుఁగాని దొంగయును గాఁడు
వడిఁ గ్రిందువడును సేవకుఁడు కానేకాఁడు
వెడగోళ్ళు పెంచును విటుఁడు గాఁడు
మిగులఁ గుఱుచవాఁడు మింటికంటెఁ బొడవు
జగడగొండి మునివేషములు వేయు
మగువకై పోరాడు మఱి రక్కఁడును గాఁడు
తగు కాఁపు [illegible] యును దెలుపు

ఆ. తగిలి పైకొనందు తరుణుల వలపించు
రౌతు గాఁడు తేజి రక్తి దోలు;
నెవఁడొ కాని తిరుగు నెప్పుడు శేషాద్రి
తలఁపులోన నుండు దవ్వుల నుండు. 42

తనకు ఱెక్కలున్నవి కాని పైకి ఎగురలేడు. మహావిష్ణువు మత్స్యావతారం ధరించాడుకదా! చేపకు రెక్క లుంటాయిగాని అది నీటిని వదలి వెలుపల ఎగుర లేదనుట తెలిసిన విషయమే. అత దెవ్వరికి కానరాకుండా దాగి ఉంటాడు కాని దొంగ కాదు. స్వామి కూర్మావతార మెత్తినపుడు మందరగిరిని మూపున దాల్చి దానిక్రింద అణగియుండెనని తాత్పర్యం. నేలకు వ్రాలును గాని సేవకుడు మాత్రం కాడు. అతడే వరాహమూర్తి. సముద్రమగ్నయైన ధరణిని నారాయణుడు వరాహరూపంతో క్రింద్రై లేవనెత్తెననుట. వికారంగా గోళ్ళు పెంచుకొంటాడు; విటుడు కాడట! విటపురుషులు గోళ్ళు పెంచి తమ ప్రేయసులకు నఖక్షతాదు లిత్తురని తెలియవలెను. నృసింహస్వామి విటుడు కాకపోయినను హిరణ్యకశిపుని

తొమ్ము చీల్చుటకు గోళ్ళు కల్గియుండెనని భావము. అతడు పొట్టివాడైనను ఆకసమునంటే పొడగరి అనుటలో విరోధం భాసిస్తుంది. వామనావతారంలో మొదట కుఱుచవాడైనను పిదప గగనము కంటె ఎత్తుగ ఎదిగినా డనుట ప్రసిద్ధమే కదా! అతడు యుద్ధాలు చేస్తుంటాడు; తానేమో ఋషివేషంతో ఉంటాడు. మునివేషములో నున్నవాడు జగడ గొండి కావడం విరోధం. ఇక్కడ పరశురాముడై ఇరువదియొక్కమారు క్షత్రకులసంహారం చేసిన సంగతి అనుసంధించుకోవలెను. తాను లోలుడు కాకున్నను రమణికై రణము సల్పును. అతడు శ్రీరాముడని ఎరుగవలెను. కాపుపనులు చేస్తుంటాడు. కాని తెల్లటివాడు. మండుటెండలో కాయకష్టం చేసేవారు నల్లగా ఉండడం సహజం. కాని ఇతడు తెల్లగా ఉంటాడు. అతడే బలరాముడు. బలరాముడు నాగలి ధరించినవాడు. యమునానదిని త్రవ్వి హస్తినాపురికి తెచ్చినవాడు. కనుక కాపుపనులు చేసేవాడైనాడు. పైగా అతడు తెల్లని వాడని పురాణాలలో తెల్లమవుతుంది. తానుస్త్రీలవెంట పడదు గాని వారు తన వెంటపడేటట్లు చేస్తాడు. ఇది బుద్ధావతార వ్యవహారం. తాను గుఱ్ఱపురౌతు కాడు. కాని అశ్వము నెక్కి ఆసక్తితో స్వారి సాగిస్తాడు. ఇది కల్క్యవతారచర్య. ఆ మహానుభావుడెవడో కాని ఎప్పుడూ శేషగిరిపై తిరుగుతుంటాడు. ఆ దివ్యమూర్తి మన మనస్సులలోనూ, వెలుపలనూ వెలుగుతుంటాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎవ్వఁడో కాని | 12 | 74 | 1 | 50 |

అవ: సకలమునకు కర్త విష్ణువే యని ప్రశంసించుచున్నాడు.

**సీ. పరమేష్ఠి గావించు బ్రహ్మాండ సంసృష్టి**
**హరునిలో నున్న సంహారశక్తి**
**పాకశాసను పరిపాలనా దక్షత**
**తలఁపఁ గాలత్రయ ధర్మములును**
**పంచభూతముల రూపరసాదిగుణములు**
**అల నవగ్రహ విహారాదికములు**
**విశ్వాత్మకుండైన విష్ణుని మహిమలే**
**వర్ణింప సర్వంబు వైష్ణవంబె;**

**తే. అఖిల మాయావిలాసముల్ హరి మహిమలె;**
**పరమపద భోగములు నృకేసరి మహిమలె;**
**ఇంతయేటికి? మంతున కెక్కినట్టి**
**సకల మా తిరువేంకటేశ్వరు మహిమలె. 43**

బ్రహ్మదేవుడు చేసే బ్రహ్మాండముల సృష్టి, ఈశ్వరునిలో నుండే సంహారశక్తి, ఇంద్రునిలోని పాలనాసమర్థత, భూత భవిష్య ద్వర్తమాన కాలముల ధర్మాలు. పృథివ్యప్తేజోవాయ్వాకాశము లనే పంచభూతాలకు సంబంధించిన శబ్ద స్పర్శ రూప రస గంధములు, నవగ్రహాల సంచారాలు ఇవన్నియు విశ్వరూపుడు, సర్వవ్యాపి అయిన నారాయణుని మహిమలే కాని వేఱుకావు. ఆలోచించగా సకలం విష్ణుమయమే. మాయవిలాసములన్నీ, పరమపద భోగాలన్నీ–ఇంతెందుకు ప్రసిద్ధి కెక్కిన సమస్తమూ ఆ తిరుమలనాథుని మహిమలే కాని అన్యము కావు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| విష్ణుఁ డొక్కఁడే | 171 | 345 | 2 | 232 |

అవ: నవవిధ భక్తిమార్గముల పేర్కొని వాటి మహిమను ఉగ్గడిస్తున్నాడు.

సీ. భయనివారణము గోపాల సంస్మరణమ్ము
జయకారణమ్ము కేశవుని వినుతి
అయుతపుణ్యఫలంబు హరికథా శ్రవణమ్ము
కమలేశు దాస్యమ్ము కర్మహరము
అఖిలసంపన్మూల మచ్యుతు పదసేవ
కీర్తిదమ్ము మురారి కీర్తనమ్ము
సుఖసాధనము నరసఖుతోడి సఖ్యమ్ము
వరదాయి గోవింద వందనమ్ము

తే. భోగము పురాణపూరుషు పూజనమ్ము
యోగ మాత్మనివేదన: మున్నతంపు
వేంగడమ్మునఁ గొలువున్న విభుని శరణు
రమ్యకైవల్యపదవికి రాచబాట! 44

గోపాలనామం స్మరిస్తే భయాలు తొలగిపోతాయి. కేశవుని కీర్తిస్తే జయం లభిస్తుంది. హరికథలు వింటే అనేక పుణ్యాలు ఆచరించడం వల్ల కలిగే ఫలం సమకూడుతుంది. కమలయొక్క భర్తను సేవిస్తే కర్మ లన్నీ హరించిపోతాయి. అచ్యుతుని పాదాలు అర్చిస్తే అన్ని సంపదలు అబ్బుతాయి. అర్జునుని చెలికానిమైత్రి అంతులేని సుఖాలకు సాధనమవుతుంది. గోవిందునకు నమస్కారం చేస్తే వరాలు పొందవచ్చు. పురాణపురుషుడు-శ్రీనివాసుని పూజవల్ల భోగాలు అనుభవించ వచ్చు. తమ ఆత్మను వేంకటేశ్వరునికి నివేదించడం యోగ మవుతుంది. ఎత్తయిన వేంకటాద్రిపై కొలువుండే స్వామిని శరణు వేడడం మోక్షానికి రాజమార్గం వంటిది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇంతకంటె | 245 | 259 | 3 | 175 |

అవ:పద్మావతీ శ్రీనివాసులే తన తల్లిదండ్రులనీ, వారి యనుగ్రహమే తనకు బహువిధ సంపదలనీ పలుకుతున్నాడు.

సీ. గోపాలకృష్ణుని చూపె పసులపాడి
గోపికాప్రియుకృప కూర్మివనిత
శ్రీపతి యనుకంప సిరిసంపదలు పితా
మహుపితచిత్తమ్మె మా కొమాళ్ళు
జలధిశాయికరుణ సకలరత్నములు పీ
తాంబరుప్రేమ చీనాంబరాలు
గరుడకేతనుని యాదరువె యందలములు
అచ్యుతు నామమ్మె ఆయు ్వరయ

ఆ. అమృతమథను మహిమ యదియ గాదెల కొల్చు
అసురవైరియండ అభయదాయి
అంజనాద్రివిభుని యడుగులె హర్మ్యమ్ము
లతని సఖియె తల్లి అతఁడె తండ్రి. 45

గోవులను పాలించే కృష్ణుని కటాక్షవీక్షణమే నాకు పశువులపాడి; గోపికావల్లభుని కృపయే నాకు అనుగు చెలి. లక్ష్మీభర్తదయయే నాకు సిరిసంపదలు. పితామహు డనబడే బ్రహ్మకు తండ్రియైన మహావిష్ణువు యొక్క మనస్సే నా సంతానము. పాలకడలిలో పవళించే నారాయణుని కరుణయే నాకు వివిధ రత్నాలు. పచ్చని పచ్చడం గలవాని ప్రేమయే నాకు పట్టుపుట్టములు. ఆ గరుడధ్వజుని ఆధారమే మాకు అందలాలు. నాశరహితుడైన ఆ నందనందనుని నామస్మరణమే నా కాయుష్యము. అమృతము చిలికించిన ఆ మాధవుని మహిమయే నా గాదెలందు నిండిన ధాన్యము. అంజనపర్వతాధిపతి పాదాలే నా భవనాలు. అతని పత్ని అలమేలుమంగయే నాకు తల్లి. అతడే నాకు తండ్రి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అన్ని విధముల | 309 | 51 | 4 | 35 |

అవ: శ్రీనివాస పరబ్రహ్మము, స్వామిపుష్కరిణి, శేషాద్రి-ఇవే పరమసేవ్యము లనుచున్నాడు.

సీ. స్వామిపుష్కరిణిలో స్నానమాడుటె నాకు
నఖిలతీర్థావగాహన ఫలమ్ము
సరిలేని వేంకటాచల విహారమె నాకు
బహుళ పుణ్యక్షేత్ర వాసఫలము
పద్మావతీప్రాణపతి కీర్తనమె నాకు
నల నిగమాగమాధ్యయన ఫలము
కమలపత్రాక్షుని కైంకర్యమే నాకు
సకలకర్మల యనుష్ఠాన ఫలము

తే. తిరుమలయ్య ప్రసాదంబు తినుటె నాకు
శస్త హరివాసరోపవాసముల ఫలము
పరమపదనాథు నిశ్చలభక్తి నాకు
జపతపోయోగ సంజాత సత్ఫలంబు. 46

దేశంలో అన్ని తీర్థాలలో స్నానం చేసిన ఫలం స్వామి పుష్కరిణిలో స్నానం చేస్తే లభిస్తుంది. అన్ని పుణ్యక్షేత్రాలలో నివాసం చేసిన ఫలం నాకు వేంకటాద్రిపై తిరగడంచేత చేకూరుతుంది. వేదాలు, శాస్త్రాలు చదవడంవల్ల కలిగే ఫలం పద్మావతీ ప్రాణవల్లభుని నామ సంకీర్తనం వల్లనే సమకూరుతుంది. సకల సత్కర్మలు ఆచరించటంవల్ల వచ్చే ఫలం స్వామికైంకర్యం చేతనే వస్తుంది. ఏకాదశినాడు ఉపవాసం చేసి ద్వాదశినాడు పారణ చేసిన ఫలం తిరుమలయ్య ప్రసాదాన్ని స్వీకరించడంచేత ప్రాప్తిస్తుంది. జప తపో యోగాదులవల్ల కలిగే ఫలం వైకుంఠునిపై గల నిశ్చల భక్తిచేతనే కలుగుతుంది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సర్వోపాయముల | 333 | 132 | 2 | 89 |

అవ: పరమాత్ముని ఆశ్రయించిన వారికి ఎందును ఎట్టి కొఱత ఉండ దనుచున్నాడు.

**సీ. ఇందిరావిభుఁడు మ మ్మేలెడువాఁ డుండ**
**నిహపరసుఖముల కేమి కొఱఁత?**
**బ్రహ్మదేవుని గన్నవాఁడు మాలో నుండ**
**నింక నాయుస్సున కేమి భ్రాంతి?**
**చక్రాయుధధరుండు సాధురక్షకుఁ డుండ**
**మాకు భయమ్మను మాట యెచట?**
**కడఁగి భక్తులఁ బ్రోచు గంగాజనకుఁ డుండ**
**నఘపంకపటలి మమ్మంటు టెడ?**

**తే. ఇతరులను వేఁడి చే సాఁచనేల మాకు?**
**భూసతీభర్త బంట్ల మంభోధిశయను**
**దాసులము పాడిపంటల తఱుఁగె మాకు?**
**వేంకటేశుఁడు వర మీయ వెలితి గలదె? 47**

సమస్తసుఖాలకు సంపదలే మూలం. అట్టి సంపదలకు అధిదేవత లక్ష్మీదేవి. ఆమె భర్తయే మమ్ముకాపాడువాడై యుండగా ఈ లోకంలో, పరలోకంలో మాకు సుఖాలకు ఏమికొఱత? ఆయువు నిచ్చేవాడు బ్రహ్మదేవుడు. అతనిపుట్టుకకే కారణమైనవాడు మాలో ఉండగా ఇక ఆయుష్యమునకు లోటేముంది? సాధువులను రక్షించేవాడు, చక్రము చేపట్టినవాడు మాకుండగా భయమనే మాటకు మఱి తావెక్కడ? భక్తులను కాపాడేవాడూ, లోకపావనియైన గంగను గన్నవాఁడూ మా పాల నుండగా పాపమనెడు బురద మాకు అంటదుగదా! మేము భూదేవిభర్తకు బంట్లము. కనుక మాకు పంటకు కొరత లేదు. పాలకడలియందు శయనించిన వానికి సేవకులము గనుక మాకు పాడికి కొరతలేదు. ఇన్ని విధముల ఒప్పియున్న కొండంతదేవుడు శ్రీ వేంకటేశ్వరుడు మాకు అండగా నిలిచి వరము లిచ్చుచుండగా ఇతరులను వేడవలసిన అవసరం మాకులేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చాలుఁ జాలు | 264 | 371 | 3 | 250 |

అవ: భగవంతుడు సర్వసము డనుచున్నాడు.

**సీ. బ్రహ్మ మొక్కటె పురే! బ్రహ్మ మొక్కటె బళా!**
**పరికింప జగమంత బ్రహ్మమయము**
**హీనాధికములు లే వీ జంతుకులమున**
**హరియె జీవుల కెల్ల నంతరాత్మ**
**బంటునిద్రయు మహా ప్రభునిద్ర యొక్కటే**
**మాల, బాపఁడు మెట్టు నేల యొకటె**
**విరులపై విష్ఠపై విసరు గాలి యొకండె**
**యేన్గు కుక్కలమీఁది యెండ యొకటె**

**తే. సుర నరాండజ మృగ కామసుఖ మొకండె**
**అన్నము దురన్నముం దిను నాఁక లొకటె**
**పావనులఁ బాపులన్ సరిగావఁ జాలు**
**స్వామి శ్రీవేంకటేశ్వరు నామ మొకటె. 48**

బ్రహ్మ మొక్కటే. ప్రపంచమంతయు బ్రహ్మమయమే. ప్రాణిసముదాయంలో హెచ్చు తగ్గులు లేవు. జీవు లందరిలోని అంతరాత్మ ఆ శ్రీ హరియే. బంటునకు ప్రభువునకు నిద్ర సమానమే. మాలజాతివాడు, బ్రాహ్మణుడు త్రొక్కేనేల ఒకటే. గాలి పూలపైన అమేధ్యంపైన సమానంగానే వీస్తుంది. భేదం చూపదు. ఏనుగుమీదను, కుక్కమీదను కాచే ఎండ ఒకటే కాని వేఱుకాదు. దేవతలకు, మానవులకు, పక్షులకు, మృగములకు కామసౌఖ్య మొక్కటే. శిష్టాన్నము తిన్నను, దుష్టాన్నము తిన్నను ఆకలిమాత్ర మొకటే. అట్లే పుణ్యాత్ములను, పాపాత్ములను సమానంగా రక్షించుటకు సమర్థమైనది శ్రీ వేంకటేశ్వరుని నామ మొక్కటే గాని మరియొకటి కాదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తందనాన | 177 | 385 | 2 | 259 |

అవ: హీనుడైన భక్తుని ఎంతో గొప్పవానిని చేసేవాడు భగవంతుడే అని ఆయన ఔదార్యాన్ని కొనియాడుతున్నాడు.

**సీ. పతిగ లేరెడువాని పట్టంపు రాజుగా**
**నిరతిభోగము లిచ్చి నిలిపినట్లు**
**క్షోణిలో నతిపాతకుని నన్ను నిత్తడిం**
**గొనితెచ్చి మేల్మికుందనముఁ జేసె;**
**కుక్కమాంసము మెక్కు కులహీను నాచార**
**విలసితు విప్రుఁ గావించినట్లు**
**కష్టదేహిని నన్ను గానుగపిండిని**
**తొడితెచ్చి కమ్మకస్తూరిఁజేసె**

**ఆ. చెడుగు దోమ దెచ్చి సింగపుఁ గొదమగా**
**నెమ్మిఁ బెంచినట్లు నీచు నన్ను**
**చిడిపిరాయి దెచ్చి చింతామణిగఁ జేసె**
**నెంతవాఁడు వేంకటేశ్వరుండు.** **49**

నేలరాలిన ధాన్యాన్ని ఏరి తిని బ్రతికే కటిక దరిద్రుణ్ణి సకల భోగాలు సమకూర్చి చక్రవర్తిని చేసినట్టుగా భూమిలో మిక్కిలి పాపాత్ముడనైన నన్ను ఇత్తడి వంటివాణ్ణి అనుగ్రహించి పదాఋవన్నె బంగారంచేసినాడు. కుక్కమాంసం మెక్కే హీనుని సదాచారసంపన్నుడైన బ్రాహ్మణునిగా చేసినట్లు, కాయకష్టం చేసుకునే గానుగపిండివంటి నన్ను ఉద్ధరించి కమ్మకస్తురిగా చేసినాడు. చెరుపుచేసే దోమను తెచ్చి సింగపు పిల్లను గావించి ప్రీతితో పెంచినట్లు, గుల్లరాయివంటి నీచుడనైన నన్ను వెలగట్టరాని చింతామణిగా చేసినాడు. వేంకటేశ్వరస్వామి ఎంత గొప్పవాడు! అతడు అగణ్య, అద్భుత, అనిర్వచనీయ శక్తి సంపన్ను డనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇంత సేసెటో | 46 | 282 | 1 | 188 |

అవ: పరమపురుషుని పలుతెఱగుల ప్రస్తుతిస్తున్నాడు.

**సీ. ఇందీవరశ్యాము నిందిరా కుచ తటీ**
**చందనాంకిత లస చ్చారువక్షు**
**మందారమాలికా మకుట సంశోభితు**
**కందర్పగురు నరవిందనాభు**
**బృందారకాధీశ వందిత పాదాబ్జు**
**నందనందను ముచికుందవరదు**
**వేదసంరక్షకు వేదమార్గవిహారు**
**నాగమపుంజపదార్థు నిత్యు**

**తే. పుండరీకాక్షు భవదూరు భువనరక్షు**
**కలుషభంజను సర్వాత్ము గరుడగమను**
**శ్రీధరు చిరంతనున్ చిదచిద్విశిష్టు**
**వేంకటాచలనిలయు సేవింతు భక్తి. 50**

నల్ల గలువవలె నల్లనివాడు, ఇందిరయొక్క కుచప్రదేశాల మీది చందనముచే ముద్రింపబడిన, ఒప్పిదమైన, అందమగు రొమ్ముకలవాడు, మందార పుష్పమాల తోడి కిరీటముతో ప్రకాశించేవాడు, మన్మథునికి తండ్రి, పద్మం నాభిలో కలవాడు, దేవరాజైన ఇంద్రునిచే నమస్కరింపబడిన పద్మములవంటి పాదాలు కలవాడు, నందుని కుమారుడు, ముచికుందునకు వర మిచ్చినవాడు, వేదముల నుద్ధరించిన వాడు, ఉపనిషత్తులనే వీథులలో విహరించేవాడు, వేదములయొక్క పదములకు అర్థమైనవాడు,శాశ్వతుడు, తెల్లదామరలవంటి కన్నులు కలవాడు, పుట్టుక లేనివాడు, లోకాలకు రక్షకుడు, పాపహరుడు, సకల జీవాంతరాత్ముడు, గరుత్మంతునిపై పయనించేవాడు, లక్ష్మిని ధరించినవాడు, సనాతనుడు, ప్రకృతితో, జీవునితో చేరినవాడు, వేంకటాద్రి స్థానముగా కలవాడు అగు శ్రీనివాసుని భక్తితో భజిస్తాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వందే వాసుదేవం | 8 | 53 | 1 | 35 |

ఇంకా మఱికొన్ని కీర్తనలలోని పదాలతో– పై పద్యం నిర్మితం.

అవ: శ్రీనివాసుని స్వరూప రూపగుణములను వర్ణించుచున్నాడు.

సీ. **నీలజీమూత సన్నిభదేహు నాజాను**
**బాహు సంఫుల్లాబ్జపత్రనేత్రు**
**నందనందను వేణునాదవినోదు ము**
**కుందు మందరధరు కుందహాసు**
**అరవిందనాభు నిత్యానందు గోవిందు**
**కౌశేయవసను నాగపతిశయను**
**నముచిసూదనవంద్యు నందకధరు చరా**
**చర లోకజనకు వాత్సల్యపూర్ణు**

తే. **ఆదిదేవు ననంతు వేదాంతవేద్యు**
**మధురిపు ననాదినిధను రమాకళత్రు**
**వరదు భయహరు వామను వాసుదేవు**
**రాక్షసాంతకు వేంకటరమణుఁ గొలుతు.** **51**

మేఘంవంటి నల్లని శరీరం కలవాడు, పొడవైన చేతులు కలవాడు, బాగుగా పూచిన తామరరేకులవంటి కన్నులు కలవాడు, నందుని పుత్రుడు, పిల్లన గ్రోవిని ఊదడంలో ఉత్సాహం కలవాడు, మోక్షము నిచ్చువాడు, మందరగిరి నెత్తినవాడు, మొల్లలవలె తెల్లని నవ్వులు కలవాడు, కమలం బొడ్డున కలవాడు, ఆనందస్వరూపుడు, భూమిని అలరించినవాడు (గోవులను కాపాడేవాడు), పచ్చనిపట్టు కట్టినవాడు, ఆదిశేషునిపై పరుండువాడు, నముచి అనే రాక్షసుని చంపిన ఇంద్రునిచే నమస్కరింప బడువాడు, నందక మనే ఖడ్గాన్ని చేత ధరించినవాడు, స్థావర జంగమాత్మకమైన విశ్వమునకు కారణమైనవాడు, వాత్సల్యరసంతో నిండినవాడు, ఆదిదేవుడు, అనంతుడు, ఉపనిషత్తులచే ఎఱుంగదగినవాడు, మధు వనురక్కసునికి శత్రువు, ఆద్యంతములు లేనివాడు, లక్ష్మీదేవికి భర్త, వరాలిచ్చేవాడు, భయాన్ని తొలగించేవాడు, వామనుడు, వసుదేవుని పుత్రుడు, రాక్షసాంతకుడు, అయిన శ్రీ వేంకటేశ్వరుని సేవిస్తున్నాను.

ప్రథమ సంపుటములోని 267, 289,312,314,323 సంకీర్తనలలోని పదాలతో పై పద్యం నిర్మితం.

అవ: నృసింహావతారమును వర్ణిస్తున్నాడు.

**సీ. ఉడికెడు కోపంపుటూర్పులఁ గొండలు**
**పొడిపొడియై నభమ్మునకు నెగయ**
**బెడిదంపు రవమునఁ బిడుగులు దొరఁగంగఁ**
**గాలాగ్ని కణములు కనుల నురల**
**గుటగుటధ్వానముల్ కుత్తుక గులుకంగ**
**తటతట పెదవులు దౌడ లదర**
**నీళ్ళతీవియలు నుచ్చిళ్ళు నోటం గ్రమ్మ**
**గోళ్ళమెఱుంగులు కొనలుసాగ**

**తే. దుష్టుని హిరణ్యకశిపుని దొడికిపట్టి**
**తొడల నిడుకొని యదుముచుఁ గడుపు చించి**
**కరుణతో భక్తుఁ బ్రహ్లాదుఁ గాచినావు**
**శేషశైల నృసింహా! జేజేలు నీకు. 52**

ఉడికిపోతున్న కోపంవల్ల పుట్టిన ఊర్పులవల్ల కొండలన్నీ పొడియై ఆకాశానికి ఎగురుతుండగా, భయంకరగర్జల వల్ల పిడుగులు పడుతుండగా, కన్నులనుంచి ప్రళయకాలపు టగ్నికణాలు రాలుతుండగా, కోపంవల్ల కంఠంలో గుటగుటధ్వనులు జనింపగా, తటతటమని పెదవులు దౌడలు అదురుతుండగా, నోటియందు నీళ్ళతీగెలు, నురుగు క్రమ్మగా, గోళ్ళకాంతులు వ్యాపించగా, దుష్టుడైన హిరణ్య కశిపుని ఒడిసిపట్టి తొడలపై పండబెట్టుకొని అదుముచు పొట్టచీల్చి భక్తుడైన ప్రహ్లాదుని కృపతో కాపాడినావు. శేషశైలమందు వేంకటేశ్వర నామధేయంతో విలసిల్లే ఓ నృసింహస్వామీ! నీకు జోహార్లు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఘోరవిదారణ నారసింహ | 11 | 68 | 1 | 46 |

అవ: రామావతార విశేషాలు మెచ్చుతున్నాడు.

సీ. వెరవున హరువిల్లు విఱుగఁ దీసిననాఁడె
వీరరాక్షసకోటి వెన్ను విఱిగె
వనవాస మనియెడి వ్రతము పట్టిననాఁడె
యహితుల మదులలో నడలు పుట్టె
వలనుగ దండకావనముఁ జొచ్చిన నాఁడె
బలికొంపఁ జొచ్చిరి పలలభుజులు
మొకరి శూర్పణఖ పెన్ముక్కుఁ గోసిననాఁడె
క్రూరదైత్యులయాస కోఁతపడియె

తే. అదరి మారీచుపై నమ్ము విడిచినపుడె
విడిచి రసురులు తమతమ వేడుకలను
బడి విభీషణు నీవు చేపట్టినపుడె
మల్లెవట్టిరి రక్కసుల్ మైథిలీశ! 53

ఉపాయముతో నీవు శివధనుస్సును విఱిచినపుడే వీరులైన రాక్షసుల వెన్నెముకలు విఱిగి పోయాయి. వనవాసంచేయుట అనే వ్రతానికి నీవు పూనినపుడే శత్రువులైన అసురుల మనస్సులలో భయం జనించింది. నేర్పుతో దండక అనే అడవిలోనికి నీవు ప్రవేశించినపుడే రక్కసులు భీతిచెంది బలిచక్రవర్తి నివాసమైన పాతాళం చేరి దాగుకొన్నారు. అవక తవకగా మాటాడిన శూర్పణఖ పొడుగుపాటిముక్కును నీవు తెగగోయించినపుడే దుర్మార్గులైన దానవుల ఆశలన్నీ తెగిపోయినవి. విజృంభించి నీవు మారీచునిపై బాణం వేసిననాడే దైత్యులు తమ సంబరములు మాని వేసినారు. శరణాగతుడైన విభీషణునికి నీవు ఆశ్రయ మొసగినపుడే ఓ సీతాపతీ ! శ్రీనివాసా ! దనుజులకు చీడపట్టినది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమని చెప్పఁగవచ్చు | 348 | 281 | 10 | 188 |

అవ: అంతంత పనులు సాధించిన వానికి ఇవెంత అనుచున్నాడు.

**సీ. నాఁడు రావణు తలల్ నఱకినవాఁడవు**
**నా పాపములు నేఁడు నఱకరాదె?**
**వాలుమగంటిమి వార్ధి గట్టిన వాఁడ**
**విట్టి నా హృదయాబ్ధి గట్టరాదె?**
**కుంభకర్ణాదులఁ గొట్టి గెల్చినవాఁడ**
**విటు గెల్వరాదె నా యింద్రియముల?**
**ధూర్జటి చాపమ్ము ద్రుంచినవాఁడవు**
**తొడిఁ ద్రుంచరాదె నా దుర్గుణముల?**

**తే. శరణనిన శత్రుసోదరుఁ గరుణఁ గాచు**
**ఘనుఁడ విదె నేను శరణంటిఁ గావరాదె?**
**దొడ్డుకొంచెము లెంచకు తోయజాక్ష!**
**అటు జగన్మంగళమున కేదైన నేమి ? 54**

ఆనాడు రావణాసురుని తలలు నఱికినావుగదా ! మరి ఈనాడు నాపాపాలను నఱక గూడదా ? మిక్కిలి పౌరుషంతో సముద్రానికి సేతువు నిర్మించావు కదా ! నేడు నా మనస్సనే సముద్రాన్ని బంధించ రాదా? కుంభకర్ణాది రాక్షసులను పడగూల్చి విజయం సాధించిన నీవు నా యింద్రియాలను గెల్వలేవా? శివుని విల్లు ఖండించినావు. నా దుర్గుణాలను వెంటనే ద్రుంచరాదా ! పగవాని సహోదరుడైన విభీషణుడు శరణన్నంతనే కాపాడిన ఉదారుడవు. నేను శరణుజొచ్చినాను గదా ! నన్ను కాపాడరాదా ? తామరపూలవంటి కన్నులుగల ఓ వేంకటేశ్వరా ! హెచ్చు తక్కువలు పాటించకు; జగన్మంగళానికి ఏదైనను ఒకటేకదా! రావణాదుల వధ జగన్మంగళానికైన విధముగా నాలోని దోషముల రూపుమాపుట లోక కల్యాణానికే అగునని తాత్పర్యం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| రామా రామభద్ర | 186 | 437 | 2 | 294 |

అవ: పంచేంద్రియములచే పరమేశ్వరుని పరిపూజించ అశక్యమను చున్నాడు.

**సీ. నాకు నాల్క యొకండె నీకు నామము లెన్నొ**
**యే తీరునన్ నుతియింతు నయ్య !**
**నాకుc గన్నులు రెండె నీకు మూర్తు లవెన్నొ**
**సొరిది నే లాగునc జూతు నయ్య !**
**నాకుc జేతులు రెండె నీకుc బాదము లెన్నొ**
**చెలcగి యే రీతిc బూజింతు నయ్య !**
**నాకుc జెవులు రెండె నీకు గాథ లవెన్నొ**
**యే లీల విని భజియింతు నయ్య !**

**తే. శరణు శరణు మహాప్రభూ ! శరణ టంచు**
**నీదు డాగులు మోచి నిన్నే యనన్య**
**గతిగ నెఱనమ్మియున్నాcడc గావు మయ్య !**
**గరుడశైలనివాస ! సంకటవినాశ ! 55**

కష్టాలు పోగొట్టే గరుడాద్రినివాసా ! శ్రీనివాసా ! నాకు నాలుక ఒకటే. నీకు వెయ్యి పేర్లు. నిన్నే రీతిగ పొగడ గలను ? పొగడలేనని తాత్పర్యం. నాకు రెండే కండ్లు. నీకు రూపా లెన్నో. కనుక ఏ లాగున నీ అనంతరూపాలు చూడగలను ? నాకు చేతులు రెండే. నీకు పాదాలు లెక్కలేనన్ని. కనుక ఎట్లా నీ చరణాలు పూజించగలను ? నాకు చెవులు రెండే. నీ చరిత్రలు బోలెడు. వాటిని వినే దెట్లా? నిన్ను భజించే దెట్లా ? ఓ మహాప్రభూ ! శరణు శరణంటూ నీ ముద్రలు- శంఖ చక్రాలు భుజముల ధరించి వేఱు గతి లేనివాడనై నా మదిలో నిన్ను నమ్మి ఉన్నాను. నన్ను కాపాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఒక్కమాటు శరణని | 279 | 455 | 3 | 306 |

అవ: శ్రీనివాససేవకుడైన ఆంజనేయుని ఆశ్చర్యకరములైన చర్యలు అభివర్ణించి అతనిని భజింపు డనుచున్నాడు.

**సీ. మాయాబిలముఁజొచ్చి మగుడి యంబుధిలోని**
**ఛాయాగ్రహముఁ జంపి సరగ దాఁటి**
**కొంకక లంకిణిం గొట్టి జానకిఁ గాంచి**
**కదలియొడ్డునఁ గల కపులఁ గలసి**
**మధువనిం జొరఁబాఱి మధువులఁ జూఱాడి**
**వడి రాఘవున కామెవార్త దెలిపి**
**రావణాద్యసురుల రాముచేఁ జంపించి**
**యోగ్యదంపతుల నయోధ్యఁ జేర్చి**

**తే. శిష్టరక్షణ మొనరింప శ్రీనివాసు**
**కొలువులో నిల్చియున్నాఁడు కూర్మిమీఱ;**
**భక్త జనులకు వలసిన వరము లిచ్చు**
**ప్రోడ హనుమంతు భజియింప పీడ తొలఁగు. 56**

మొదట స్వయంప్రభచే రక్షింపబడుచున్న గుహలో ప్రవేశించి, పిదప సముద్రం దాటుతూ, మధ్యలో ఛాయాగ్రహాన్ని చంపినాడు. లంకలో ప్రవేశించేటప్పుడు లంకిణి అనే రాక్షసిని కొట్టి సీతను చూచి, లంకనుండి మరలి సముద్రపుటొడ్డున వేచియున్న వానరులతో గలసి మధువనం జొచ్చి అక్కడి తేనెలను కొల్లలాడినాడు. వెంటనే జానకీ వృత్తాంతాన్ని శ్రీరామచంద్రునికి తెలిపినాడు. రామునిచే రావణాద్య సురసంహారం చేయించి పుణ్యదంపతులైన సీతారాములను అయోధ్యకు చేర్చినాడు. ఈ విధంగా దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించుటకై వేంకటేశ్వరుని కొలువులో ప్రీతితో నిల్చియున్నాడు. భక్తులకు కోరిన వరాలిచ్చే కార్యనిపుణుడైన హనుమను భక్తితో ఆరాధించండి. అన్ని బాధలు తొలగిపోతాయి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కలశాపురము కాడ | 147 | 216 | 2 | 145 |

అవ: మంచిబంటుకు ఉండవలసిన లక్షణములు పేర్కొని, అట్టి లక్షణాలు కలవాడు హనుమంతుడే యనుచున్నాడు.

**సీ. ఏలిక దేవుగా నెంచువాఁడే బంటు**
**తాలిమి గలవాఁడె తగిన బంటు**
**ప్రాలుమాలక పాటుపడు నాతఁడే బంటు**
**కనిపెట్టుకొనియుండు ఘనుఁడె బంటు**
**చెప్పిన తీరునఁ జేయువాఁడే బంటు**
**ఎదురుమాటాడని హితుఁడె బంటు**
**మిగుల నమ్మకముతో మెలఁగువాఁడే బంటు**
**ద్రోహిగాని యతండె దొడ్డ బంటు**

**తే. ధనముపట్టున శుద్ధుఁడే తగిన బంటు**
**వలనుగ రహస్యములు దాఁచువాఁడె బంటు**
**అక్కఱలయందుఁ దోడ్పడు నతఁడె బంటు**
**అదరుగుండియ లేనట్టి యతఁడె బంటు**
**సప్తశైలేంద్ర రఘుకుల చక్రవర్తి**
**మానక భజించు హనుమయే మంచి బంటు. 57**

తన ప్రభువును దేవునిగా భావించేవాడూ, ఓరిమి కలవాడూ, సోమరితనం లేని వాడూ, ఏలికను నమ్ముకొని యుండేవాడూ, చెప్పినపని తు, చ తప్పకుండ నెఱవేర్చేవాడూ, ఎదురుసవాళ్ళు వేయనివాడూ, తన యజమాని విశ్వాసానికి పాత్రుడైనవాడూ, ద్రోహం చేయనివాడూ, ధన విషయంలో దొంగ కానివాడూ, రహస్యం బయటికి పొక్కనీయనివాడూ, అవసరాలలో ఎంతగానో సహాయ పడేవాడూ, గుండెనిబ్బరం కలవాడూ, ఏడుకొండలరాయడుగా వెలసిన శ్రీరామచంద్రుని వదలక కొలిచేవాడూ అయిన హనుమంతుడే నిజమైన బంటు. అట్టివాడే తగినట్టి, ఘనుడైనట్టి, హితుడైనట్టి బంటు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| [illegible] | | 273 | [illegible] | 186 |

అవ: ఆంజనేయునికి అంగరక్ష విధించుచున్నాడు.

**సీ. వజ్రాయుధుండు నీ వదనమ్మునకు రక్ష**
**సూర్యుండు నీ శిరస్సునకు రక్ష**
**గ్రహతారకలు నీదు కన్నులకున్ రక్ష**
**కరయుగళికి ఖగేశ్వరుఁడు రక్ష**
**వాయుదేవుండు నీ పాదమ్ములకు రక్ష**
**వరుణుండు తొడలకు పరమరక్ష**
**వేదరాసులె నీదు విమలబుద్ధికి రక్ష**
**శ్రీవల్లభుండు కుక్షికిని రక్ష**
**బహురోమరాజికి పలుదేవతలు రక్ష**
**సరిలేని తోఁకకు శక్తి రక్ష**
**అంగతేజమ్మున కగ్నిహోత్రుఁడు రక్ష**
**వనజగర్భుఁడు గళమ్మునకు రక్ష**

**తే. హరుఁడు నీ సంధులకు రక్ష; ధరణి రక్ష**
**నాలుకకు; లోకముల నిట్టె యేలుమయ్య !**
**వేంకటాచలరాము దీవెనలతోడ**
**మేరుసంకాశగాత్ర ! సమీరపుత్ర ! 58**

మేరుపర్వతం వంటి శరీరంగల వాయుపుత్రా ! ఓ ఆంజనేయా! నీ ముఖమునకు ఇంద్రుడు, శిరస్సునకు సూర్యుడు, కన్నులకు గ్రహాలు, నక్షత్రాలు, చేతులజంటకు పక్షిరాజైన గరుత్మంతుడు, పాదాలకు వాయుదేవుడు, తొడలకు వరుణదేవుడు, ప్రసన్నమైన బుద్ధికి వేదరాసులు, బొజ్జకు విష్ణువు, రోమములకు దేవతలు, సాటిలేని వాలమునకు శక్తి, శరీర తేజస్సునకు అగ్నిదేవుడు, కంఠమునకు బ్రహ్మదేవుడు, అవయవసంధులకు ఈశ్వరుడు, నాలుకకు భూదేవి, రక్షణ కల్పించువారై యుండగా వేంకటాచలపతి ఆశీస్సు లందుకొంటూ లోకములను పాలించు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏలవయ్యా లోకమెల్ల | 379 | 459 | 4 | 309 |

అవ: శ్రీనివాసునకు మేలుకొలుపు పాడుతున్నాడు.

**సీ. ఎందాక నిద్ర నీ; కిదె తెల్లవాఱెను**
**నీళామనోహర ! మేలుకొనవె**
**కమలనాభుఁడ ! లెమ్ము గంగాదినదులెల్ల**
**తగ మజ్జనమ్ము సిద్ధ మ్మొనర్చె**
**హాటకాచలము సింహాసనం బయి యొప్పె**
**తోయజనేత్ర ! విచ్చేయవయ్య!**
**అబ్జగర్భుండు పంచాంగంబు వినిపింప**
**నియతిమై వాకిట నిలిచినాఁడు;**

**తే. కామధేనువు తోతెంచెఁ గనుట కిదివొ !**
**సురలు కూడిరి కొలువుకై; సరస నిలిచె**
**కమల కైదండ కదిగొ ! యఖండ మహిమ**
**లన్నియును నీక చెల్లె వృషాద్రినాథ ! 59**

ఓ నీళాపతీ ! ఇంకెంతసేపు నిద్రిస్తావయ్యా ! ఇదిగో! తెల్లవాఱినది. మేలుకొనుము. కమలం నాభియందుగల ఓ విష్ణుమూర్తీ! గంగ మున్నగు పుణ్యనదులు స్నానమునకు జలం సిద్ధ మొనర్చాయి. మేలుకొనుము. పద్మములవంటి కన్నులుగల వేంకటేశ్వరా! మేరుపర్వతం నీకు సింహాసనమై ఒప్పినది. దాని నెక్కుటకు దయచేయుము. తామరనుండి పుట్టిన బ్రహ్మదేవుడు వాడుక చొప్పున తిథివార నక్షత్రాదులు తెలుపుటకు వాకిట వేచియున్నాడు. కామధేనువు దర్శనానికి వచ్చి ఉన్నది. దేవతలు కొలువుకై చేరియున్నారు. చేయూత నిచ్చుటకై శ్రీమహాలక్ష్మి చెంత నిలిచి ఉన్నది. ఓ వృషగిరినాథా! ఈ యఖండవైభవము లన్నీ నీకే చెల్లినవి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎందాక నిద్ర | 186 | 436 | 2 | 294 |

అవ: స్వామిని మేల్కొల్పుచున్నాడు.

**సీ. నీ వేసములు మాని నీ యోగనిద్రను**
**జాలించి యిఁకనైన మేలుకొనుము**
**ఆలు పేయలకునై యఱచెడి; పిదుకంగ**
**వేళయయ్యెను వేగ మేలుకొనుము**
**ఆటలు మరగిన యర్భకుల్ మొగసాల**
**మిట్టాడఁ దొడఁగిరి మేలుకొనుము**
**వాడల గోపికల్ వచ్చి నిన్ ముద్దాడ**
**బాళితో నున్నారు మేలుకొనుము**

**ఆ. పెరుఁగు వంటకమ్ముఁ బ్రీతిఁ దెచ్చె యశోద;**
**పిలిచె నందగోపవిభుఁడు; వెడఁద**
**కనులు విచ్చి మేలుకొనుమయ్య ! మమ్మేలఁ**
**బన్నగాద్రిమీఁది బాలకృష్ణ ! 60**

నీ ఆటలనూ, యోగనిద్రనూ కట్టిపెట్టి ప్రొద్దెక్కినది గనుక ఇకనైన మేలుకో. ఆవులు దూడలకు పాలి మ్పుటకై అంబారవం చేస్తున్నవి. పాలు పితికేవేళ అయినది. ఆటలాడుటలో అభిరుచిగల బాలురు వాకిట గంతులేస్తున్నారు. గొల్లపల్లెలోని గొల్ల చేడెలు మోహంతో నిన్ను ముద్దాడ వచ్చియున్నారు. నీవు ఆరగించుటకై మీ తల్లి యశోదమ్మ ఎంతో వాత్సల్యంతో పెరుగన్నం తెచ్చి ఉన్నది. గోపరాజైన నందుడు నిన్ను పిలుస్తున్నాడు. శేషగిరిలో నెలకొన్న చిన్నికృష్ణా! విశాలములైన నీ కన్నులు తెఱచి మేలుకో! మమ్ము కృపతో ఏలుకో!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మిన్నక వేసాలు | 78 | 374 | 1 | 250 |

అవ: దర్శనార్థులై వచ్చిన భక్తుల నుద్ధరింపు మనుచున్నాడు.

సీ. ప్రళయకాలమునాఁడు బ్రహ్మాండకోటులు
సొలయక నీ కుక్షిఁ జొచ్చినట్లు
చెలఁగి నీ మఱుఁగున శ్రీ వేంకటాద్రిపై
నరులెల్లఁ జేరిరి కరుణఁ గనవె !
అసురబాధలు చెంది యఖిల నిలింపులు
గొనకొని మొఱపెట్టఁ గూడినట్లు
కోనేటిదండను గుములు గుములు గట్టి
ప్రాణు లొనర్చు ప్రార్థనము వినవె?

తే. సృష్టివేళ నా యా [illegible] జీవరాశి
నీ వలన నిల్చినట్లుల [illegible] జేరు
జ[illegible] [illegible]ందఁ దగుచోట్ల నునిచి యిట్టె
కావఁగదవయ్య ! వేడ్క వేంకటనగేశ! 61

ఓ వేంకటాద్రినాథా ! బ్రహ్మాండములన్నీ ప్రళయకాలంలో అలుపు లేకుండా నీ కుక్షిలోనికి ప్రవేశించిన విధంగా, వేంకటాద్రిపై మానవులందరూ ఉత్సాహవంతులై నీ అండ చేరినారు. వీరిని దయతో వీక్షించు. రాక్షస బాధలకు తట్టుకోలేక దేవతలంతా మొఱ పెట్టుకోవడానికి గుమిగూడినట్లుగా, కోనేటిగట్టున భక్తులు గుంపులు గుంపులుగా నిలిచి చేసే వేడికోలు వినవా ? భక్తులు దేవతుల్యులని భావం. సృష్టికాలంలో నీవల్ల జీవరాసులు ఆ యా చోట్ల నిల్చినట్లు ఈ జనాన్ని తగినతావులలో నిల్పి కాపాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| శరణాగత వజ్ర | 364 | 378 | 4 | 254 |

అవ: దాసుల కడగండ్లు స్వామివే అనీ, మొఱ పెట్టిన వారిని కాపాడిన చందంగా ఇప్పుడు తన్ను కాపాడుమనీ ప్రార్థిస్తున్నాడు.

**సీ. పాలసంద్రము మీఁదఁ బవ్వళించిన నీకుఁ**
**వేల్పుతండము మొఱవెట్టి నట్లు**
**విన్నవించితిమి మా విన్నపమ్ములు నిద్రఁ**
**జాలించి కృపతోడ నేలుమయ్య!**
**నిరతి ద్వారకలోన నెత్తమాడెడి నీకు**
**బెగడి ద్రోవది మొఱవెట్టినట్లు**
**క్రూరరాట్సభలలోఁ గుంది మా చేసెడు**
**మనవుల నాలించి మనుపు మయ్య!**

**తే. ఒనర రమతో వికుంఠమం దున్న నీకు**
**బెండువడి వారణము మొఱవెట్టి నట్లు**
**తెలుపుకొంటిమి బాధలు తీర్పుమయ్య!**
**నీదు దాసుల భంగముల్ నీవి గావె ! 62**

పాలకడలిలో నీవు పవళించియుండగా దేవసంఘాలు నీ వద్దకు వచ్చి మొఱపెట్టుకొన్న విధంగా నీ భక్తులమైన మేము నీ వద్ద చేరి మా విన్నపాలు విన్నవించుకొన్నాము గదా? నీ యోగనిద్ర చాలించి దయతో మమ్ము కాపాడు. ఆసక్తితో నీవు ద్వారకయందు రాణులతో పాచికలాడుచుండగా ద్రౌపది మొఱపెట్టుకొన్న రీతిగా కఠినులైన రాజుల సభలలో కష్టపడుతూ సల్పునట్టి మా మొఱలు ఆలకించి మమ్ము పాలించు. లక్ష్మీ దేవితోకూడి [illegible]తో ఏకాంతంగా ఉన్న నీకు సత్తువ గోల్పోయి మొఱ పెట్టిన గజరాజు కైవడి మొఱ పెట్టుకొన్నాము. వేంకటరమణా! మా సంకటములు హరించు. నీ దాసులకష్టాలు నీ కష్టాలే సుమా ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నీ దాసుల | 247 | 266 | 3 | 180 |

అవ: దైవమును తానున్న చోటికే తరలి రమ్మనుచున్నాడు.

**సీ. లవణాకరము దాఁటి లంకను సాధించి**
**మరల నయోధ్యకు మరలినట్లు**
**కైలాసయాత్రను గావించి క్రమ్మఱ**
**ద్వారకానగరికిఁ జేరినట్లు**
**గోమంత మెక్కి యకుంఠిత జయమంది**
**వేడ్కతో మధురకు వెడలినట్లు**
**వసిగొని త్రిపురాల వనితల బోధించి**
**యిందిర యొద్దకు నేగినట్లు**

**ఆ. అన్నిచోట్లనుండి యల్లెము గుడువంగ**
**వెన్నుఁడ వయి ప్రీతిఁ జన్నయట్లు**
**ప్రేమ మమ్ముఁ బ్రోవ మే మున్నచోటికి**
**వేగ రాఁగదయ్య! వేంకటేశ ! 63**

ఉప్పుసముద్రం దాటి లంకను జయించి అయోధ్యకు తిరిగి వచ్చిన విధంగా (ఇది రామావతార వృత్తాంతం), సంతానం కోసం కైలాసానికి యాత్రచేసి మరల ద్వారకకు మరలివచ్చిన మాదిరిగా, గోమంతమనే పర్వతా న్నెక్కి అడ్డులేని విజయం పొంది ఉత్సాహంతో మధురానగరానికి మరలి వచ్చిన చందంగా (ఈ రెండుపనులు కృష్ణావతారంలోనివి), సందుచూచుకొని త్రిపురాసుర స్త్రీలను కామప్రేరితలను కావించి మరల శ్రీ మహాలక్ష్మి చెంతకు చేరుకున్న తీరున (ఇది బుద్ధావతార విషయం), వేంకటాచలపతీ ! నీవు ఎందరు భార్యలో అందరు కృష్ణులుగా నయి అందరి ఇండ్లలో మనుగుడుపులకు బిరబిరపోయినట్లు వాత్సల్యంతో మమ్ము కాపాడడానికి మేముండే తావునకే శీఘ్రంగా రావా ? రమ్మని తాత్పర్యం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| విచ్చేయవయ్య | 275 | 433 | 3 | 291 |

అవ: హనుమంతుని అసాధ్యకృత్యములు శ్లాఘిస్తున్నాడు.

సీ. ఉంగ్ర మ్మెగుర వేసి యుదధిలోఁ బడకుండ
నింగికిఁ జెయిసాఁచె నీదు బంటు;
జలనిధి లంఘించి జంబుమాలిని నక్షు
నేలను గలిపించె నీదు బంటు;
దశకంఠు తొమ్ము బ్రద్దలుగాఁగ గ్రుద్దెను
నిదుర్రాటి కెనయైన నీదు బంటు;
నడురేయి పగలుగాఁ గడఁగి మందులకొండ
పొదగలిచి తెచ్చె నీదు బంటు;

ఆ. పరఁగ నిన్ని సేసి బ్రహ్మపట్టమునకు
నిలిచియున్నవాఁడు నీదు బంటు
పవన నందనుండు ఫణిపర్వతాధీశ !
భువనజాలమెల్లఁ బ్రోచుచుండె. 64

ఓ శేషగిరీశ్వరా ! నీ బంటు హనుమంతుడు ఉంగరం నింగికి ఎగుర వేసి సముద్రంలో పడకుండా చేతికి చిక్కించుకొన్నాడు. సాగరం దాటినాడు. జంబుమాలిని, అక్షకుమారుణ్ణి సంహరించాడు. రావణాసురుని తొమ్మును బ్రద్ద లగునట్లు గ్రుద్దినాడు. అర్ధరాత్రి పట్టపగలై వెలుగొందగా ఓషధి పర్వతాన్ని - ద్రోణాద్రిని అడుగు కదలించి తెచ్చాడు. ఇన్ని ఆశ్చర్యకరములైన కార్యాలుచేసి భవిష్యత్తులో బ్రహ్మపదవిని అలంకరించుటకు సంసిద్ధంగా నున్నాడు. అతడీ లోకాలకు రక్షకుడై ఉన్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నేలమిన్ను నొక్కటైన | 11 | 69 | 1 | 47 |

అవ: వారి వారి కర్మలకు అనుగుణంగా బుద్ధులు పుట్టించునట్టివాడు భగవంతుడే యనీ, ఇతరులపాట్లు చూచియైనా బుద్ధితెచ్చు కొని మెలగండని హెచ్చరిస్తున్నాడు.

**సీ. కనక కశిపు పాటు వినఁడా దశాస్యుండు**
**హరికి విరోధియై యణఁగినాఁడు**
**కంసభూపతి గతి గానఁడా కురురాజు**
**శౌరికి పగతుఁడై దోరినాఁడు**
**మురదానవుని జాడ యెఱుఁగఁడా నరకుండు**
**చక్రికి నహితుఁడై సమసినాఁడు**
**బలిచన్న మార్గంబు దెలియఁడా బాణుండు**
**కలన నెదిర్చి భంగపడినాఁడు**

**తే. వారి వారి కర్మమ్ములు వారి వారిఁ**
**జుట్టుకొనఁ దెల్వి మాల్చితి విట్టు నీవె;**
**యెవరి నే మనవచ్చు కోనేటిరాయ !**
**యెలమి నిప్పటివారైన నెఱిఁగినారె? 65**

రావణాసురుడు హిరణ్యకశిపుడు పడ్డపాటు వినలేదా? విన్నాడు. అయినా హరితో విరోధించి అణగారినాడు. కురురాజు దుర్యోధనుడు కంసుని దుఃస్థితి కనలేదా? కన్నాడు. అయినా శ్రీకృష్ణునికి శత్రువై నశించాడు. నరకాసురునికి మురుడనే రాక్షసునికి పట్టినగతి తెలియదా? తెలుసు. అయినా చక్రాయుధుడికి అమిత్రుడై చచ్చాడు. బాణాసురుడు బలిచక్రవర్తి కష్టస్థితి ఎఱుగడా? ఎఱుగును. కాని యుద్ధంలో శౌరి నెదిర్చి అవమానంపాలైనాడు. ఓ కోనేటిరాయా ! నీ మాయచేత ప్రభావితులై, తెలివిమాలినవారై వారు తాము చేసుకొన్న కర్మలకు అనుగుణంగా ఫలాలు అనుభవించారు. ఈ విషయమై ఎవరినీ ఏ మనరాదు. ఆ కాలపు వారి విషయ మటుండనీ, ఈ కాలపువారైనా నిన్ను నిజంగా తెలుసు కొన్నారా? లేదని భావం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వారివారికర్మములే | 134 | 308 | 2 | 206 |

అవ: శత్రుమిత్రులనిచూడక తనతో సంబంధపడిన వారినెల్ల స్వామి సమభావముతో చూచు ననుచున్నాడు.

**సీ. ఒకమౌని నీ నామ ముచ్చరించి తరించె;**
**నీ పేరు విన కొక్కఁ డేపుమీఱె;**
**పూని నిన్ భూషించి భోగియయ్యె నొకండు;**
**కసిఁ దిట్టి యొకఁడు మోక్షమ్ము వడసె;**
**మహిమ పెంపొందె నిన్ మదినెంచి యొకయోగి;**
**తలఁప కొక్కండు నీ దరిని జేరె;**
**అతిభక్తి పనిసేసి యధికుఁ డయ్యె నొకండు;**
**పనిగొని యొకఁ డయ్యె పరమసఖుఁడు;**

**తే. కౌఁగిలి యొసంగి కొందఱు ఘనత గనిరి;**
**అఁగి నీను వెంటఁ ద్రిప్పి మేలందె పసులు;**
**దవ్వయిన దగ్గఱైనను తలఁచు మనసె**
**కారణముగాని యెల్ల రొక్కటియె నీకు. 66**

ఒకానొక మౌని (నారదుడు) నీ నామాన్ని జపించి తరించినాడు. నీ పేరు వినుటకైనా ఇష్టపడని వాడు (ఘంటాకర్ణుడు) కూడ అధిక్యాన్ని పొందినాడు. పూనికతో నిన్ను పొగడి భోగాలతో మించినా డొకడు (కుచేలుడు). కోపంతో నిన్ను తిట్టికూడ ఒకడు (శిశుపాలుడు) మోక్షాన్ని పొందినాడు. ఒకానొకయోగి (శుకుడు) నిన్ను మనసున ధ్యానించి మహిమచే అధికుడైనాడు. నిన్ను తలంచకనే ఒకడు (అజామిళుడు) నీ సన్నిధి చేరుకున్నాడు. మిక్కుటమైన భక్తితో నీకు సేవలుచేసి ఒకడు(ఉద్ధవుడు) గొప్పవా డైనాడు. నీచే పనులు చేయించుకొని మఱి యొకడు(అర్జునుడు) నీకు అనుగుచెలికాడైనాడు. నిన్ను కౌగిలించి నీలవేణులు కొందరు (గోపికలు) ఘనత వహించారు. పసరములు తమవెంట నిన్ను నడిపించుకొని మేలు పొందినవి. మిత్రులైనా శత్రులైనా నిన్ను తలచు టొకటే నిన్ను చేరుటకు కారణం. నిజంగా నీ కంద రొకటే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇందరు నీ కొక్కసరి | 302 | 8 | 4 | 6 |

అవ: శ్రీనివాస పరతంత్రతయే జన్మసాఫల్య మనుచున్నాడు.

**సీ. కమలాసనాదులు గానని నీ మీఁద**
**మమకారముం జేయ మనసు గలిగె;**
**అమరాధిపాదుల కందని నీ కొమ**
**రైన నామముఁ గొనియాడఁ గలిగె;**
**సనకాదులున్ గనుంగొనఁగఁ జాలని నిన్నుఁ;**
**బూటపూటకుఁ దలపోయఁ గలిగె**
**ఘన మునీంద్రులకు నగమ్యుఁడ వయియున్న**
**నిను భక్తితోడ వర్ణింపఁ గలిగె;**

**తే. చాలదా జన్మమునకు నీ పాలివార**
**మగుచు బ్రదుకంగఁ గలిగె? భవ్యంబునైన**
**నీ యిర వెఱుంగఁగాఁ గల్గె; నిన్ను ధరణి**
**శ్రీనివాస! పల్మాఱు దర్శింపఁ గలిగె. 67**

బ్రహ్మాదులకు కూడ గోచరింపని నీ మీద అభిమానము చూపుటకు మనసు కల్గింది. ఇంద్రాదులకు కూడ అబ్బని నీ నామస్మరణ మాకు అబ్బినది. సనకాది దేవర్షులు కూడ చూడజాలని నిన్ను ప్రతిదినము చింతించే భాగ్యము లభించింది. గొప్ప ఋషిశ్రేష్ఠులకు కూడ పొందరాని వాడవైన నిన్ను భక్తితో స్తోత్రంచేసే అదృష్టం కలిగింది. ఈ జన్మానికి ఇంతేచాలు. నీ భక్తులమై మనగల్గినాము. శుభకరమగు నీ స్థానమును కనగల్గినాము. శ్రీనివాసా ! మాటిమాటికి నిన్ను దర్శింప గల్గినాము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చాలదా మా జన్మము | 18 | 110 | 1 | 76 |

అవ: ఆయా మతస్థులచే పలు విధములుగా పేర్కొనబడుచున్న పరతత్త్వం ఒక్కటే అనుచున్నాడు.

**సీ. ఎంత పిండియు నిప్ప టంతియ యన్నట్టు**
**లెవ రెంత తలఁచిన నీవు నంతె;**
**కొలుతురు నిను వైష్ణవులు విష్ణు వనుచును;**
**శైవులు దలఁతురు శంభు ఁడనుచు;**
**నలరి కాపాలికు లాదిభైరవుఁ డండ్రు**
**శాక్తేయు లెంతురు శక్తి యనుచు;**
**పరమ వేదాంతులు బ్రహ్మం బటందురు;**
**తలఁపుల కొలఁది నిందఱు భజింత్రు;**

**తే. నీ వలన లేవు కొఱఁతలు; నీరు కొలఁది**
**తామరవు; మమ్ముఁ జేకొన్న దైవతమవు;**
**నీవె శరణంటి ని న్నెద నిలుపుకొంటి;**
**నాకుఁ బరతత్త్వ మీవె పన్నగ గిరీంద్ర! 68**

పిండికొలది రొట్టె అన్నట్లు ఎవ రెంతమాత్రంగా నిన్ను భావిస్తారో నీవూ వారికి అంతమాత్రంగానే గోచరిస్తావు. వైష్ణవులు నిన్ను విష్ణువని ఆరాధిస్తారు. శైవులు శివుడ వంటారు. కాపాలికులు సంతోషంతో నిన్ను ఆదిభైరవు డంటారు. శక్తిపూజాధురంధరులు నిన్ను శక్తిగా కొలుస్తారు. కరుడు గట్టిన వేదాంతులు నిన్ను పరబ్రహ్మగా భావనచేస్తారు. వారి వారి ఇష్టానుసారంగా ఎందరో నిన్ను ఎన్నోరీతుల సేవిస్తారు. నీటి మట్టమునకు తగ్గట్లు తామరాకు నిలిచేవిధంగా వారి వారి శక్తి ప్రమాణానికి అనుగుణంగానే నీ వుంటావు. నిజంగా నీలో హెచ్చు తగ్గులు లేవు. మమ్ము నీ వారిగా అనుగ్రహించిన దేవుడవు. నాకు నీవే రక్షకుడవు. నిన్నే నా మనసులో నిలుపుకొని ధ్యానం చేస్తుంటాను. ఓ శేషాద్రినాథా! నాకు మాత్రం పరతత్త్వం నీవే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎంతమాత్రమున | 179 | 393 | 2 | 265 |

అవ: నారదాదుల వలె తన్నును తరింప జేయుమని శ్రీనివాసుని వేడుచున్నాడు.

**సీ. ఎందఱో చెప్పఁగా నే వింటి విష్ణుఁడే**
**కడఁగి మోక్ష మొసంగఁ గర్త యనుచు;**
**మును వింటి నారదముని నిన్నుఁ బాడఁగా**
**నఖిల భువన పూజ్యుఁ డాయె ననుచు;**
**ఇపుడె వింటి ధ్రువుండు తపమున మెప్పించి**
**యున్నతోన్నత పద మొందె ననుచు;**
**పరఁగ వింటిని నీకు వాల్మీకి కృతి సెప్పి**
**యాదికవిగ ఖ్యాతుఁ డయ్యె నంచు;**

**ఆ. నలువతండ్రి వనుచు నానాజగమ్ముల**
**నరసి బ్రోచు ప్రభుఁడ వనుచు వింటి;**
**ఆసపుట్టి కొలుచు టందుకేగద నిన్ను**
**శేషశైలవాస ! శ్రీనివాస! 69**

విష్ణువే మోక్ష మిచ్చుటకు కర్తయని పలువురు పలుకగా విన్నాను. నారదుడు నిన్ను పొగడడంచేత సకలలోకాలకు పూజింపదగిన వాడైనాడని మునుపు విన్నాను. ధ్రువుడు తపస్సుచేసి నిన్ను మెప్పించి మిక్కిలి ఉన్నతస్థానాన్ని పొందినాడనీ ఇపుడే విన్నాను. వాల్మీకి నీకు కృతి చెప్పి ఆదికవిగా ప్రసిద్ధి కెక్కినాడనీ, నీవు బ్రహ్మకు తండ్రివనీ, అన్ని లోకాలను కాపాడే ప్రభుడ వనీ విన్నాను. శేషశైలవాసా ! శ్రీనివాసా ! అందుకే నేను ఆసపుట్టి నిన్ను కొలవడం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అందుకే పో | 167 | 325 | 2 | 218 |

అవ: భగవంతుని చర్యలు ఊహాతీతము లనుచున్నాడు.

సీ. అమరగణంబుల కమృత మిచ్చిన నీవు
పొంచి వెన్నలు దొంగిలించినావు
కరఁగి యా కరిరాజుఁ గరుణఁ గాచిన నీవు
కానల గోవులఁ గాచినావు
తలఁపఁ జతుర్ముఖాదులకుఁ జిక్కని నీవు
చెలుల కౌఁగిళ్ళలోఁ జిక్కినావు
పటుగతి బలిదైత్యు పట్టి కట్టిన నీవు
రోలఁ గట్టువడుచుఁ గ్రాలినావు

తే. పరమమూర్తివి బాలభావము భజించి
తేమి చిత్రంబు; శేషగిరీంద్రమందు
నిలిచితివి బొజ్జనిడుకొని నిఖిల విశ్వ;
మయ్య! నా జియ్య! నినుఁ గొనియాడఁదరమ? 70

దేవతలకు అమృతం పంచిపెట్టిన నీవు పొంచి వెన్నలు దొంగిలించావు. మనసు కరగి దయతో ఆ కరిరాజును కాపాడిన నీవు అడవుల్లో ఆవులు మేపినావు. బ్రహ్మాదులకుకూడ దర్శన మీయనట్టి నీవు అంగనల కౌగిళ్ళలో చిక్కినావు. బలిచక్రవర్తిని చాతుర్యంతో పట్టి కట్టి వేసినట్టి నీవు రోటికి బంధింపబడినావు. పరమపురుషుడవైన నీవు బాలభావం పొందినావు. ఇదేమి చిత్రమో ! సకల ప్రపంచాన్ని కుక్షిలో దాచుకుని శేషాద్రిపై ఇపుడున్నావు. ఓ తండ్రీ! నాదైవమా! నిన్ను శ్లాఘించుటకు నాకు శక్యమా?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇందుకే పో | 106 | 31 | 2 | 21 |

అవ: మానవజన్మ ఉత్తమమనీ, అట్టి జన్మ భగవదనుగ్రహముచే సంప్రాప్తమైనపుడు భక్తితో దానిని సార్థకం చేసుకోవలెననీ చెప్పుచున్నాడు.

సీ. **పసరమ్ముఁ జేసినఁ బ్రణుతింతునే మిమ్ము**
**వెస రాయిఁ జేసిన వెదుకఁ గలనె?**
**మ్రానుగాఁ జేసిన మది మిమ్ముఁ దలఁతునే?**
**పక్కిగాఁ జేసిన మ్రొక్కఁ గలనె?**
**మృగముగాఁ జేసిన మిమ్ముఁ బూజింతునే?**
**పురుగుగాఁ జేసినఁ బొగడఁ గలనె?**
**ఏ మెఱుంగని యప్పు డిటు మిమ్ముఁ గొలుతునే?**
**మొఱ లిడియెదఁగాక నరునిఁ జేయ?**

తే. **నింత ప్రాపంచికజ్ఞాన మిచ్చి నన్ను**
**నింత కధికారిఁ జేసితి; సంతతమ్ము**
**వంత లన్నియుఁ దీఱ మీ పాదయుగము**
**శర ణనెదఁ గాక! వేంకటాచలవిహార!** **71**

వేంకటాచలమందు విహరించునట్టి ఓ ప్రభూ ! నన్ను పసరంగా నీవు పుట్టించి ఉంటే నిన్ను కీర్తించగలనా ? కీర్తించ లేనని భావము. నన్ను రాయిగా చేసి ఉంటే అప్పుడు నిన్ను వెదుకగలనా ? వెదుకలేనని తాత్పర్యము. మ్రానుగా చేసిఉంటే నామనసులో నిన్ను తలచగలనా? లేనని అభిప్రాయం. నన్నొక పక్షిగా సృజించి ఉంటే నీకు మ్రొక్క లేనుగదా ! మృగంగా చేసి ఉంటే నీ పూజ చేయలేను గదా ! పురుగుగా చేసి ఉంటే నిన్ను పొగడనేర్తునా ? ఏమియు తెలియనప్పుడు నిన్ను సేవించగలనా ? లేనని భావము. మానవునిగా పుట్టించడం వల్లనే నిన్ను ప్రార్థించ గలుగుచున్నాను. ఈ పాటి లోకజ్ఞానాన్ని అనుగ్రహించి ఇంతకు నన్ను అధికారిగా చేసినావు. నా సంతాపాలన్నీ తొలగునట్లు సదా మీ పాదాలను శరణు జొచ్చుచున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమీ నెఱఁగనినాఁడు | 133 | 135 | 2 | 91 |

అవ: నిన్ను కొలువలేదని నన్ను కాపాడకుండుట తగదని భగవంతుని వేడుకొనుచున్నాడు.

సీ. **ఆడివచ్చిన బిడ్డ నపరాధి యని తల్లి**
**యోగిర మ్మిడి యోమకుండఁ దగునె?**
**వేడుక కాఁడు నేర్పిన వింతమాట వ**
**ల్లించు కీరము నదలించఁ దగునె?**
**తొడుకు మేసిన దంచు కదు బక్కగోవును**
**రోషించి వ్రేఁదు పోఁద్రోలఁ దగునె?**
**గోడిగపై నెక్కి గుఱ్ఱం బనుచు రౌతు**
**దాని చీఁకటితప్పు దలఁపఁ దగునె?**

తే. **ప్రాలుమాలిన యిల్లాలు పడుకఁ దటిని**
**వీడ లేదంచు భర్త కోపింపఁ దగునె?**
**తామసుఁడనై భవత్పదదాస్య మెపుడు**
**సలుపనని నన్ను నిరసింపఁ జనునె దేవ !** **72**

ఆటలాడి వచ్చినాడు, దోషి అని తల్లి తన బిడ్డకు అన్నంపెట్టి కాపాడదా? కాపాడుతుందని భావము. క్రీడాసక్తుడు చిలుకకు మాటలు నేర్పి అది మరల వింతగా పలుకుతుంటే దానిని అదలించవచ్చునా ? తగదని తాత్పర్యము. గొల్లవాడు దొంగపైరున పడిందని బక్కచిక్కిన గోవును కోపంతో కొట్టితరమడం న్యాయమా? కాదని గ్రహించవలె. గుఱ్ఱం ఆడుగుఱ్ఱాన్ని ఎక్కిందని రౌతు దానితప్పు నెంచదగునా? తగదని అర్థం. అలసిసొలసిభార్య పడుకబాయకుంటే సమయానికి నిద్ర లేవలేదని భర్త ఆమెను కోపించవచ్చునా? కోపించరాదు అని అభిప్రాయం. పై ని చెప్పిన రీతిగా ఓ ప్రభూ ! తమోగుణంచేత నీ పాదసేవ ఎప్పుడూ చేయలేదని నన్ను త్రోసిపుచ్చడం నీకు తగునా? తగదని తెలియునది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దేవ నీ యాధీనము | 147 | 214 | 2 | 143 |

అవ: స్వామి అనుగ్రహమునకై తన పాటులనెల్ల వెల్లడించు కొనుచున్నాడు.

**సీ. నీవు మెచ్చెద వని నేర్వకే పాడుదు**
**చన విత్తువని కొల్వు సలుపుచుందు;**
**మనసు రావలె నంచు మతీ వాకిలిం గాతు;**
**కృపఁ జూపఁ గలవంచు నుపవసింతు;**
**మొగమోడుదు వటంచు పొగడుదు గుణములు;**
**తప్పు లెంచ వటంచు దండ మిడుదు;**
**ఈప్సితార్థములెల్ల నిడుదని పూజింతు;**
**రక్షింతు వంచు మంత్రము జపింతు;**

**తే. కైవసము గావలె నటంచు కమ్మనైన**
**యిచ్చకమ్ముల నెఱపుదు; నెట్టుసేయఁ**
**గలవొ? నీ చేతిలోనిది గాదె బ్రతుకు?**
**దాసుఁడను నిన్ను వదలక తగిలినాఁడ. 73**

నేర్చుకొనకుండానే నీ మెప్పునకై పాడుతున్నాను. నాకు చన విత్తువని నీ కొలువు చేస్తున్నాను. నా పై నీకు మనసు పుట్టవలెనని నీ వాకిట కాచుకొని ఉన్నాను. నీవు కృపతో చూతువని ఉపవాసాలు చేస్తున్నాను. మొగమోటం చూపుతావని నీ గుణాలు పొగడుతున్నాను. నా తప్పులు మన్నిస్తావని దణ్ణం పెడుతున్నాను. నా కోరికలన్నీ ఈడేరుస్తావని నిన్ను పూజిస్తున్నాను. నన్ను కాపాడుతావని నీ మంత్రజపం చేస్తున్నాను. నీవు నా అధీనం కావాలని తీయతీయని ఇచ్చకాలు నెఱపుతున్నాను. నీవు ఏమి చేస్తావో? నా బ్రతుకు నీ చేతిలో ఉన్నది. స్వామీ! నేను నీ దాసుణ్ణి. నిన్ను వదలక వెన్నంటుతున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎట్టు సేయ | 161 | 296 | 2 | 198 |

అవ: ఏ యే భక్తులను భగవంతుడు ఎట్లా రక్షించినది వెల్లడించుచున్నాడు.

సీ. **గౌతము సతియం దకారణబంధుత్వ;**
**మిభమందు నార్త రక్షైక దీక్ష;**
**శరణాగతత్రాణ మరి సహోదరునందు;**
**శబరియం దసమ వాత్సల్య గరిమ;**
**ప్రహ్లాదునందు సేవకపారతంత్ర్యం; బ**
**నాథనాథత కపినాథునందు;**
**అభిమన్యుపుత్త్రునం దవ్యాజమగు ప్రేమ;**
**సకల భూతదయాప్తి శైలమందు;**

తే. **ఆపదుద్ధారకత్వంబు యాజ్ఞసేని**
**యందు; వరదాయకత్వంబు కందులేని**
**శేషగిరియందుఁ గంటిమి చిత్త మలర;**
**హరి హరీ! నీవె శరణంటి మందుకొఅకె.** **74**

ఓ శ్రీహరీ ! గౌతమమునిభార్య అహల్యకు శాపవిమోచనం కల్గించడములో ఆమెయందు నిష్కారణ బంధుత్వాన్ని నెరపినావు. గజేంద్రుని మొఅ విని రక్షించడములో నీ ఆర్తరక్షా దీక్షను రుజువు చేశావు. శత్రుని తమ్ముడైన విభీషణుని కాపాడి శరణాగతరక్షకు డనిపించుకొన్నావు. శబరి ఎంగిలి తిని ఆమెపై సాటిలేని నీ వాత్సల్యాన్ని చాటినావు. ఉక్కు కంబంనుంచి ఆవిర్భవించి ప్రహ్లాదునికి ప్రత్యక్షమై దేవుడు దాసులకు అధీనుడు అనే సంగతి ప్రకటించావు. సుగ్రీవుని సంరక్షించి దిక్కులేని వారికి దేవుడే దిక్కనుమాటను రూఢి గావించావు. పరీక్షిత్తునందు నిష్కపటమైన ప్రేమను ప్రదర్శించావు. గోవర్ధనాన్ని ఉద్ధరించి సకల భూతముల యందు నీకు గల దయను ప్రదర్శించావు. ఆపదలో నున్న వారిని ఉద్ధరించడమనే నీ వ్రతాన్ని ఎరుకపరచావు. మా మనస్సులు ఉప్పొంగగా వరములు కొల్లగా అనుగ్రహించే నీ స్వభావమును ఈ శేషగిరిపై చూచాము. ఓ హరీ ! అందువల్లనే నీవే శరణ మంటున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అరుదు నీ చెరిత్రము | 166 | 321 | 2 | 215 |

అవ: దేవతాసార్వభౌమత్వాదులు శ్రీనివాసున కెట్లు చెల్లుచున్నవో తెలుపుచున్నాడు.

**సీ. బహుదేవతా సార్వభౌముండ వన నీవె**
**భావింప భూదేవి పతివి గాన;**
**సకల బృందారక చక్రవర్తివి నీవె**
**చేతఁ జక్రమ్ము దాల్చితివి గాన;**
**అమరశిఖామణి యనుటకుం దగు దీవె**
**కౌస్తుభమణి మెడఁ గలదు గాన;**
**దివిజోత్తముఁడ వని తెలుప యుక్తుఁడ వీవె**
**పురుషోత్తమాభిఖ్య పొలుచుఁ గాన;**

**తే. 'దేవరాహుత్తరా' యాఖ్యదీపితుఁడవు**
**కిట్టి పెనురాతిగుఱ్ఱ మెక్కితివి గాన;**
**అంజనాచల దేవసింహంబ వీవె**
**నరమృగేంద్రాకృతి ధరించినావు గాన. 75**

ఓ ప్రభూ ! నీవు భూదేవిభర్తవు. కనుకనే దేవతలందరికీ సార్వభౌముడ వనదగి ఉన్నావు. చేత చక్రాన్ని పట్టినావు. అందుకనే దేవతలకు చక్రవర్తి వయినావు. కౌస్తుభమనే మణిని ధరించిన కారణంవల్ల దేవతలకు శిఖామణిగా వెలుగొందినావు. నీవు పురుషోత్తముడవు గాన దివిజోత్తముడ వని చెప్పబడు తున్నావు. రాతిగుఱ్ఱము నెక్కి తిరిగినావు. అందుచేత "దేవరాహుత్తరాయ" బిరుదంతో ప్రకాశిస్తున్నావు. నరసింహావతారాన్ని ధరించినావు గనుక అంజనపర్వతంలో దేవసింహంగా దీపిస్తున్నావు. శబ్దసాదృశ్యంచేత స్వామి పై విధంగా ఉత్ప్రేక్షించబడినాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| బిరుదు లన్నియు | 135 | 142 | 2 | 85 |

అవ: సకలమునకు కారణం శ్రీ వేంకటేశ్వరుడే అని నిరూపిస్తున్నాడు.

**సీ. దినవల్లభుఁడు రాక తెలవాఱునా రేయి?**
**వఱలునా తెలివి నీ కరుణలేక?**
**కృషికుండు లేకున్న వృషభంబు దున్నునా?**
**చేయింప కీవు నే చేయఁగలనె?**
**కుమ్మరి లేకయే కుండలు పుట్టునా?**
**పుట్టితినా నీవు పుట్టు వీక?**
**నిలువక రాట్నమ్ము నిలుచునా గుండ్రలు?**
**పాయునా భవము ప్రపత్తి లేక?**

**ఆ. మగఁడు లేని మనువు మఱి యుండునా? పర**
**మాత్మ నీవు లేక ప్రాణి నేను**
**బ్రదుకుబాటలోనఁ బయనించు చుంటినా?**
**దీనజనులపాలి తిమ్మరాయ! 76**

సూర్యుడు ఉదయించనిదే తెల్లవాఱదు. ఆ విధంగానే నీదయ లేనిదే జ్ఞానం కలుగదు. కృషీవలుదు లేక ఎద్దులు దున్నవు. నీవు చేయించక ఎవడునూ ఏమీ చేయలేడు. కుమ్మరి సంకల్పించకపోతే కుండలు పుట్టవు. నీ సంకల్పం లేకుంటే నేను పుట్టియుందునా? రాట్నం నిలువకపోతే గుండ్రలు నిలుస్తాయా? నీ ప్రపత్తి లేకుంటే జన్మలు తొలగునా? మగడులేని మనువు ఉండదుకదా? పరమాత్మవు నీవు లేకపోతే నీ యంశమైన నేను జీవనపథంలో ఇలా పయనించ గలనా? పయనించ లేనని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నెప్పున ధర్మ | 132 | 130 | 2 | 87 |

అవ: దైవమనుకుంటే ఎంతైనా తోడ్పాటు ఒసంగ గల దనుచున్నాడు.

సీ. వలెనన్న నుక్కుకంబమునుండి వెలువడి
కరుణతోఁ బ్రహ్లాదుఁగావ వటవె?
తేవలె నన్న వార్ధిం జొచ్చి నలువకు
వేదముల్ తెచ్చి యర్పింప వటవె?
పై కెత్త వలెనన్న పర్వతమ్మునె మోచి
లీలఁ బాల్కడలిఁ జిల్కింప వటవె?
రక్షింప వలె నన్నఁ బక్షపాతముఁ బూని
పంచపాండవుల రక్షించ వటవె?

తే. చంపవలె నన్నఁ గనకాక్షుఁ జక్కడంచి
నీరధి నిమగ్న ధారుణి నిలుప వటవె?
యెవరు నీ యంతవా? రెదురేది నీకు?
సరవి నీ సుద్దులను వింటి శరణ మంటి. 77

ఓ ప్రభూ! ఇనుపకంబమునుండి బయటికివచ్చి దయతో ఆ ప్రహ్లాదుని నీవు కాపాడలేదా! సముద్రంలోనికి జొరబారి వేదాలను వెదకి తెచ్చి బ్రహ్మ కిచ్చితివికదా! క్రుంగిపోయే మందరపర్వతాన్ని అలవోకగా పైకెత్తి పాలసముద్రాన్ని చిలికింపజేశావు గదా! పక్షపాతంతో పాండవులను రక్షించావుకదా! హిరణ్యాక్షుని వధించి సాగరంలో మునిగిపోయిన భూమిని పైకి తెచ్చినావుగదా! దేని నెట్లు చేయవలెననుకుంటే అట్లాచేయగల సామర్థ్యం నీకున్నది. నీవంటి శక్తి సంపన్నులు మరెవ్వరూ లేరు. నీకు ఎదురే లేదు. నీ చర్యలను గూర్చి విన్నాను. కనుకనే నీకు శరణ మంటున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నీ యంతటి | 108 | 47 | 2 | 32 |

అవ: నీ దాస్య మబ్బితే చాలు ననుచున్నాడు.

సీ. **ఎన్ని పుట్టువులైన నించుక వెఱవ నీ**
**కట్టె దాసుఁడనైన నంతె చాలు;**
**వెట్టిజాతికినైన వెఱవ నీ నామముల్**
**తిన్నగ నా నాల్క నున్నఁ జాలు;**
**దురితముల్ వేయైన వెఱవ నీ కైంకర్య**
**మవిరతం బబ్బిన నదియ చాలు;**
**వెస నింద్రియములకు వెఱవ నీ వాత్మలో**
**పెరరేఁచు వాఁడవై పెరుగఁ జాలు;**

ఆ. **కాల మెట్టు లయిన కర్మ మె ట్లయినను**
**వెఱవ నీదు కరుణ వఱలఁ జాలు;**
**దిక్కు నీవె నాకు దివియైన భువియైన**
**నరకమైన వెఱవ తిరుమలేశ!** **78**

ఓ తిరుమలేశా! నేను ఎన్ని జన్మలెత్తినాసరే కొంచెంకూడా భయపడను. ఎప్పుడూ నీకు దాసుడనై ఉంటే అంతేచాలు. వెట్టిజాతిలో పుట్టినా నీ తిరునామం నానాల్కపై నుంటేచాలు; అనేక పాపాల కయినా భయపడను. నీ కైంకర్యం నాకు సదా అబ్బితే అదేచాలు. ఇంద్రియాలకు నేను భయపడను. నా ఆత్మలో నీవు ప్రేరకుడవై ఉంటే అంతే చాలు. కాలానికీ, కర్మానికీ నేను భీతి చెందను. నీ కరుణ నాకుంటే చాలు. నీ దిక్కునాకు కల్గితే చాలు. స్వర్గం, భూమి, నరకం అన్నీ నా కొకటే; భయం లేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమీ నడుగనొల్ల | 33 | 403 | 1 | 270 |

అవ: తన చిహ్నాలు, బిరుదములు ధరించిన వారిపట్ల శ్రీనివాసుడు దయదలచగల డనుచున్నాడు.

సీ. కఠినచిత్తుఁడనైనఁ గానిమ్ము నొసఁటను
పట్టెనామమ్ములు పెట్టినాఁడ
మేను తో లెమ్ముల మిడికెడి దైనను
తమ్మిపూసల పేరు దాల్చినాఁడ
కావించునవి పాపకర్మమ్ము లైనను
భుజముల ముద్రలు పూనినాఁడ
అనుదినమ్మును పల్కునవి కల్ల లైనను
భక్తి నీ కీర్తనల్ పాడినాఁడ

తే. తామసగుణుండ నైనను ధరణి నీదు
తిమ్మఁడను పేరు ధరియించి తిరిగినాఁడ
నీదు గుఱుతులు చూచుకో! నీదు బిరుదు
లెంచుకో! దాసు న న్నేలు మిందిరేశ! **79**

ఓ ఇందిరాపతీ! నేను కఠినాత్ముడనే అయినప్పటికీ నొసట పట్టెవర్ధనములు పెట్టినాను. ఈ శరీరం తోలుతో, ఎముకలతో మసలే దైనను మెడలో తామర పూసల దండలు ధరించాను. చేసే వన్నీ పాపకార్యాలే అయినా భుజాలపై నీ శంఖ చక్ర ముద్రలు తాల్చాను. ప్రతినిత్యమూ అబద్ధాలు పలికేవాడినే అయినా భక్తితో నీ కీర్తనలు పాడినాను. తమోగుణం కలవాడినైనా తిమ్మడనే నీ పేరు పెట్టుకొని ఈ నేలపై తిరిగినాను. నీ గుర్తులు, నీ బిరుదాలు నాలో చూచి నీ దాసుణ్ణి నన్ను కాపాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నీ గుఱుతులు చూచుకో | 382 | 476 | 4 | 321 |

అవ: వేంకటాద్రిపై నెలకొన్న శ్రీనివాసుని దర్శించి స్మరించి ధన్యత గాంచితి మనుచున్నాడు.

సీ. చాలదా ధన్య మీ జన్మమ్ము మాకు నీ
పాలింటివారమై బ్రదుకఁ గలిగె;
కమలాసనాదులు గానని నీ మీఁద
మమకార ముంచంగ మార్గ మొదవె;
అమరాధిపున కేని యందంగరాని నీ
యమలనామము గొనియాడఁ గలిగె;
సనకాదులును జూడఁ జాలని నినుఁ దని
వోవంగ మదిఁ దలపోయఁ గలిగె;

తే. పరమమై దివ్యమైన నీ యిరవు మాకుఁ
గడకు నేఁ డిట్టిదని యెఱుఁగంగఁ గలిగె;
ఆశ్రితావన! శ్రీవేంకటాచలేశ!
క్షితిని బలుమాఱు నిను దరిసింపఁ గలిగె. 80

ఆశ్రయించిన వారిని కాపాడే వేంకటాచలపతీ! బ్రహ్మాదులకు కూడ చూడ శక్యముగాని వాడవగు నీ మీద మమకార ముంచుటకు మార్గం కలిగింది. ఇంద్రునికి కూడ అందనట్టి నీ పవిత్రనామం స్మరించే అవకాశం లభించింది. సనక సనందనాదులకు కూడ దర్శింప తరంకాని నీ రూపాన్ని తనివితీర మనస్సులో తలంచగలిగినాము. పరమము, దివ్యము అయిన నీ స్థానము ఈ వేంకటాద్రియే అని ఈ నాటికి తెలుసుకోగల్గినాము. ఈ భూమిపై మాటిమాటికి నిన్ను వీక్షింప గల్గినాము. నీ వారమై బ్రదుక గల్గినాము. ధన్యమైన ఈ జన్మ మాకు చాలదా?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చాలదా మా జన్మము | 18 | 110 | 1 | 76 |

అవ: తన న్యూనతను ఉగ్గడిస్తూ తన్ను మన్నించడంవల్ల భగవంతునికే పుణ్యం కలుగుతుందని చమత్కారంగా పలుకుతున్నాడు.

**సీ. అతిమూఢమతులలో నగ్రేసరుఁడ నేను**
**ప్రతిలేని ఘనగర్వపర్వతమను**
**సంసార సామ్రాజ్య సార్వభౌముఁడ నేను**
**పంచేంద్రియైకార్థ సంచయుఁడను**
**బహుయోనికూప సంపద దేలువాఁడను**
**కడ గానఁగారాని కర్మరతుఁడ**
**భావించి నా వంటి పరమనీచుని బట్టి**
**కాచినప్పుడు గదా ఘనత నీకు?**

**తే. ఏను లేకున్న నీ కృప కేది తావు?**
**నీవు నావల్లఁ కీర్తి పొందెదవు; నీకు**
**నా వలనఁ గల్గు పుణ్యము; నాకు బ్రదుకు**
**నీ వలనఁ గల్గు; మేలిట్లు నీకు నాకు. 81**

నేను మూఢబుద్ధులలో మొట్టమొదటివాడను. గొప్ప పర్వతమంత గర్వం కలవాడను. సంసారమనే సామ్రాజ్యానికి చక్రవర్తిని. పంచేంద్రియ విషయాల ననుభవించేవాడను. అనేక జన్మలలో నానా యోని కూపాలలో తేలినవాడను – బహుజన్మ లెత్తినవాడ ననుట. హద్దుపద్దులేని కర్మ లాచరించు వాడను. కాబట్టి ఆలోచించి నా వంటి నీచుణ్ణి ప్రయత్నంతో కాపాడినప్పుడే ఓ స్వామీ! నీకు ఘనత. నేనే లేకుంటే నీ దయకు పాత్రు డెవడు? నన్ను కాపాడడంవల్ల నీకు కీర్తి వస్తుంది. అంతేకాదు, నా వల్ల నీకు పుణ్యంకూడ లభిస్తుంది. నీ వల్ల నాకు బ్రతుకు ఏర్పడుతుంది. ఈ విధంగా నీకూ నాకూ మేలు కలుగుతుంది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నే నొక్కఁడ | 208 | 48 | 3 | 33 |

అవ: భగవంతునికి గల సర్వాధిక్యం చాటుచున్నాడు.

సీ. నీ కంటె ఘనుఁడ నేనే; నాకు నీ దిక్కు
గలదు; చెప్పఁగ నీకుఁ గలదె దిక్కు?
అనవరతంబు నీ వాధారమవు నాకు
నెవరు నీ కాధార మెందుఁ గలరు?
ఈవులు నీవు నా కీయంగఁ గలవు; నీ
కీవు లిచ్చెడివార లేడఁ గలరు?
నినుఁ దలంపఁగ నాకు నీ పేరు గలదు; నీ
కున్నదా తలపంగ నొకరి పేరు?

ఆ. నిన్నుఁ గొలుచు ప్రాపు నేఁడు నా కున్నది;
కలదె నీకు నొరులఁ గొలుచు ప్రాపు?
అరయ నీవు నాకు నంతరాత్ముండవు
అంతరాత్మ యెవ్వరయ్య నీకు? 82

నీవు నాకు దిక్కు. నీకు దిక్కెవరూ లేరు. కాబట్టి నీ కంటె నేనే గొప్ప వాణ్ణి. నా కెప్పుడూ నీవు ఆధారంగా ఉన్నావు. నీకు ఆధార మెవరు? ఎక్కడున్నారు? నాకు ఈవులు నీ వియ్యగలవు గాని, నీకు ఈవులియ్య గలవారు ఎక్కడున్నారు? స్మరించడానికి నాకు నీ నామ మున్నది, కాని నీకు తలంచడానికి ఇతరుల పే రున్నదా? సేవించడానికి నీ ఆశ్రయం నాకుంది. నీకు అట్టి ప్రాపు లేదుకదా! పరికింపగా నీవు నా అంతరాత్మవు. నీకు వేరే అంతరాత్మగా ఎవరూ లేరు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నేనేపో ఘనుఁడను | 310 | 57 | 4 | 39 |

అవ: సర్వసముడైన భగవంతుని తన గుణదోషములు స్మరింపక సంరక్షింపు మనుచున్నాడు.

సీ. **పూవులపైఁ గాసి పొరి ముండ్లపైఁ గాయు**
**వెలఁది వెన్నెల కేమి వెలితి గలిగె?**
**గోవుమీఁదను వీచి కుక్కమీఁదను వీచు**
**మారుతమ్మున కేమి మైల సోఁకె?**
**కులజుని యింటిపైఁ గులహీను నింటిపైఁ**
**గాయు నెండకు నేమి కష్ట మయ్యె?**
**పావనులం గాచి పాపిని నను్ఁగావ**
**ఘనమైన నీ కృప కడమ వడునె?**

తే. **అమరులం బ్రోచి నన్ను దీనాతిదీను**
**బ్రోవనిడి బ్రోవ నీ కేమి దోస మొదవు?**
**దేవుఁడవు సర్వసముఁడవు తిమ్మరాయ!**
**నాదు గుణదోషముల నెంచ నాయ మగునె?** **83**

పూలపైనా, ముండ్లపైనా సమానంగా ప్రసరించే నిర్మలమైన వెన్నెలకు ఏమి వెలితి గలిగింది? సమభావం వెన్నెలకు సహజగుణ మని భావం. గోవుమీద కుక్కమీద సమానంగానే గాలి వీస్తుంది. అది దానికి నైసర్గికగుణం. అందువల్ల దానికి మైలసోకలేదు గదా! ఉత్తమకులంలో పుట్టినవాని యింటిపై, హీనకులస్థుని యింటిపై సమానంగా కాచే ఎండకు ఏమికష్టం వచ్చింది? శ్రీ వేంకటేశ్వరా! పవిత్రులైన భక్తులను గాపాడి, పాపినగు నన్ను కాపాడితే ఘనమైన నీ దయకు తక్కువతనం ఏర్పడునా? దేవతలను కాపాడే నీకు దీనులలోనెల్ల దీనుడనైన నన్ను మంచిమార్గాన ఉంచి కాపాడితే ఏమి ఎగ్గవుతుంది? నీవు దేవదేవుడవు. అందరియెడల సమబుద్ధి కలవాడవు. నా గుణదోషములను లెక్కపెట్టడం నీకు న్యాయమా? అనగా నా మంచి చెడుగులను ఆలోచింపక కాపాడుమని భావం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నీవు సర్వసముఁడవు | 132 | 129 | 2 | 87 |

అవ: భగవంతుని మీద పరమవిశ్వాసం కలవారికి తక్కిన ఉపాయము లతో అక్కఱ లేదనుచున్నాడు.

**సీ. రక్షింతువో కాక రక్షింపవో యని**
**యెదలోని సంశయ మ్మెల్ల విడిచి,**
**ఇతరులచే ముంద ఱెట్లౌదునో యని**
**వెతతోడఁ గూడిన వెఱపు విడిచి,**
**వెరవున నీ రూపు వెదకి వీక్షింప లే**
**ననెడు నీరసభావ మంత విడిచి,**
**నీ మహామహిమలు నే నెఱుంగుదు నన్న**
**గర్వంబు సకలంబు కడకు విడిచి,**

**తే. అవల నన్యులపై నున్న యాస విడిచి,**
**చేకుఱిన పున్నెమంతయు నీకె విడిచి**
**యుల్లమందున నిను నమ్మియున్నవాఁడ**
**స్వామి! మఱి నాకు వేఱె యుపాయ మేల? 84**

ఓ ప్రభూ! నీవు కాపాడుదువో లేదో అనే సందేహాన్ని వదలిపెట్టినాను. మున్ముందు ఇతరులవల్ల నే నెట్లగుదునో అనే బాధతో గూడిన భయాన్ని వదలివేసినాను. ఉపాయంతో వెదకి నీ రూపాన్ని కనుగొనలేననే నీరసభావాన్ని వదలిపెట్టినాను. నీ గొప్పమహిమలు నాకు తెలియుననే గర్వాన్ని పూర్తిగా అవతలికి నెట్టివేసినాను. ఇతరులపై నున్న ఆశను వదలివేసినాను. సమకూడిన నా పుణ్యమంతా నీకు అర్పణ చేశాను. మనసులో నిన్నే నమ్మియున్నాను. స్వామీ! ఇక నాకు మరొక ఉపాయ మెందులకు? అక్కఱ లేదని భావం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నిన్ను నమ్మి | 145 | 202 | 2 | 135 |

అవ: తనకు భగవంతునకు గల తారతమ్యం వివరించి దేవుడే తనకు దిక్కనుచున్నాడు.

**సీ. పురుషోత్తముఁడ వీవు పురుషాధముఁడ నేను**
**నాయందు మంచితనంబు సున్న;**
**అంతమ్ము లేనట్టి యపరాధములు నావి**
**కడలేని కారుణ్యగరిమ నీది;**
**ని న్నెఱుంగని యట్టి నీచగుణము నాది**
**నను వీడనట్టి సద్గుణము నీది;**
**అందఱ యాచించునట్టి కర్మము నాది**
**సర్వులఁ బ్రోచు కర్మమ్ము నీది;**

**తే. పలువిధమ్ముల నిను దూఱ పలుకు నాది**
**వెంగలిని నన్ను రక్షించు విధము నీది;**
**ఉన్న తప్పంతయును నాది యోర్మి నీది;**
**జ్ఞాని వీవు రమేశ! యజ్ఞాని నేను. 85**

ఓ లక్ష్మీపతీ! నీవు పురుషులలో ఉత్తముడివి. నే నో పురుషులందరిలో అధముణ్ణి. నాలో మంచితనం సున్న. హద్దుపద్దులేని అపరాధాలు నాలో ఉన్నాయి. అంతంలేని దయాతిశయం నీలో ఉన్నది. నాలోని నీచగుణాలవల్ల నిన్ను మరచినవాణ్ణి నేను. నన్ను విడనాడనట్టి మంచి గుణం నీది. అందరిని యాచించడమే నా పని. అందరిని కాపాడడమే నీ పని. పలురకాలుగా నిన్ను దూషించుపద్ధతి నాది. మూర్ఖుని నన్ను రక్షించే పద్ధతి నీది. ఎన్నో నేరాలు చేయడం నా వంతు. వాటిని సహించడం నీ వంతు. నీవు సచ్చిదానంద జ్ఞానస్వరూపుడవు. నేనేమో మాయామోహితుడైన మూఢుణ్ణి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పురుషోత్తముఁడ | 109 | 53 | 2 | 36 |

అవ: పాపమునకు ఏది హేతువో అదే భగవత్పరమైతే పుణ్యహేతు వగును అనుచున్నాడు.

**సీ. మనసు చంచలమైన మతి నిన్నుఁ దలఁచిన**
**నెల్లర కిహపర హేతు వగును;**
**తనువు హేయమ్మైన తమి నిన్నుఁ గొలిచిన**
**వింతగా నెంతొ పవిత్ర మగును;**
**కర్మ బంధకమైన క్రమ్మి నీ సొమ్మైన**
**తగ ముక్తినొసఁగ నాధార మగును;**
**నిగుడు కోరికయైన నీ భక్తి కెక్కిన**
**ధర్మమ్ములన్ శ్రేష్ఠధర్మ మగును;**

**ఆ. జగము మాయయైన శరణంచు నిను వేఁడ**
**ప్రకటపుణ్యతపముఫలమె యగును;**
**కర్మకౌశలమునఁ గలుషమ్మె సుకృతమౌ**
**యిహమె యగును పరము వృషగిరీశ! 86**

ఓ వృషగిరినాథా? శ్రీనివాసా! మనసు చంచలమే అయినా నిన్ను తలచే ప్రతివారికి ఇహలోక పరలోక సుఖాలకు అది కారణ మవుతుంది. శరీరం నీచమయిన దయినా, ప్రీతితో నిన్ను కొల్చినచో ఆశ్చర్యకరంగా ఎంతో పవిత్ర మవుతుంది. కర్మలు బంధకారణాలైనా నీ కర్పితములైతే ముక్తికి సాధనా లవుతాయి. కోరికలు కోరగూడనివైనప్పటికీ ఆ కోరికలే నీ భక్తికొఱకైతే ధర్మాలలోనికెల్లా శ్రేష్ఠధర్మ మవుతుంది. ప్రపంచమే మాయామయం. అయినా నిన్ను శరణు వేడితే పుణ్య తపస్సుల ఫలమే అవుతుంది కర్మలు కలుషితములే అయినప్పటికీ సత్కర్మలు ఆచరిస్తే వాటివల్ల సుకృతమే ఏర్పడుతుంది. ఈ లోకమే పరలోకంగా మారుతుంది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పనిగొన | 172 | 351 | 2 | 236 |

అవ: భగవంతుడు దయదలచవలె గాని లేకున్న జీవుడు తనకు దానుగా పరమార్థము సాధించలే డనుచున్నాడు.

**సీ. పుట్టినప్పుడె నిన్ను పూని కొల్చెద నన్న**
**నందుకుఁ దగు తెల్వి యపుడు లేదు;**
**అలరి యా మీఁదట నర్చించెద నటన్న**
**వడి యౌవనమదమ్ము వశము గాదు;**
**అవల ప్రౌఢుండనై ధ్యానించెద నటన్న**
**ధనవాంఛ యేమియుఁ దడవనీదు;**
**తనువు ముదిసి నీకు తపము చేసెద నన్న**
**ఉన్న యోపికగూడ నూడిపోవు;**

**ఆ. ఎపుడు నిన్నుఁ గందు నిందిరాపతి వీవె**
**కనులముందర నిలిచి కావుమయ్య!**
**శరధిశయన! నీకు శరణాగతత్రాణ**
**బిరుద మున్న దనుట మఱవ కయ్య! 87**

పుట్టినవెంటనే ప్రయత్నముతో నిన్ను కొలువవలెనంటే అందుకు తగిన తెలివి అప్పుడు నాకు లేకపోయె. అటుపిదప పూజిస్తా మనుకొంటే దుడుకుప్రాయపు మదం నా వశం కాలేదు. అవతల కౌమారదశలో ధ్యానం చేదా మనుకుంటే ద్రవ్యంమీది ఆశ ఇతరాన్ని దేనినీ ఆలోచించ నీయదాయె. శరీరానికి వార్ధకం రాగా నినుగూర్చి తపస్సు చేదా మనుకుంటే ఉండే ఓపికకూడ ఊడిపోతుంది. నేను నిన్ను చూచే దెప్పుడు? లక్ష్మీ భర్తవు నీవు నా కన్నుల యెదుట నిలిచి నన్ను కాపాడు. పాలకడలిలో పవళించే ఓ స్వామీ! శరణన్న వారిని కాచువాడు అనే బిరుదు నీ కున్నదిగదా! మరచి పోవద్దు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎన్నడు నే గందు | 359 | 349 | 4 | 234 |

అవ: నిరంతర భగవన్నామ సంకీర్తనపరులను కలిదోషములు బాధింప లేవనియూ, వారు నిత్యతృప్తులై యుందురనియూ పలుకుచున్నాడు.

**సీ. పాప మెంతటిదైన పరిహార మొనరింపఁ**
**గలది నీ నామమ్ము గలదు నాకు;**
**కోప మెంతటిదైన గ్రొచ్చి శాంత మొసంగఁ**
**గలవాఁడ వాత్మలోఁ గలవు నాకు;**
**ధర నింద్రియము లెంత తఱిమిన రక్షింపఁ**
**గలది నీ శరణమ్ము గలదు నాకు;**
**కర్మబంధమ్ముల గ్రక్కున వదలింపఁ**
**గలది నిశ్చలభక్తి గలదు నాకు;**

**తే. కలియుగమ్మేని నీ కృప గలదు నాకు:**
**హితకరములైన యిష్టమ్ము లెల్లఁ దీర్పఁ**
**గలది నీదు సంకీర్తన గలదు నాకు;**
**తపము పండింప నాకు నీ తరుణి గలదు.** **88**

నేను చేయరాని పాపము చేసినప్పటికీ దానిని పోగొట్టగలిగిన నీ నామము(జపము) నా కున్నది. కోప మెంతగా ప్రబలినప్పటికినీ దానిని కూకటివ్రేళ్ళతో పెకలించివేసి శాంతిని సమకూర్చుటకు నీవు నా మనసులోనే ఉన్నావు. కన్ను ముక్కు చెవి చర్మము నాలుక అనే పంచేంద్రియాలు శబ్దస్పర్శ రూప రస గంధాలు అనే వాటి విషయాలమీదికి నన్నెంతగా తఱిమినప్పటికీ వాటిబారినుంచి కాపాడుటకు నీ శరణాగతి నాకున్నది. కర్మలనే కట్లను విప్పివేయగల్గిన నీ యందలి నిశ్చలభక్తి నా కున్నది. ఇది పాపపంకిలమైన కలియుగమే అయినప్పటికీ నీ కృప నాయందున్నది. మంచిని కలిగించే కోరికలు తీర్చడానికి నీ నామ భజన నాకున్నది. నా తపస్సును ఫలవంతం చేయడానికి నీ అర్ధాంగి శ్రీ మహాలక్ష్మి నాకు అండగా ఉన్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కలియుగ | 185 | 430 | 2 | 290 |

అవ: జీవుని సేవకత్వము, దేవుని రక్షకత్వము చాటుచున్నాడు.

**సీ. దండ మ్మిడుట నాది తప్పు సైచుట నీది**
**నిరుపమ కారుణ్యనిధివి గాన;**
**అండc జేరుట నాది యౌనౌ ననుట నీది**
**యాలించు వేల్పురాయcడవు గాన;**
**శరణుc జొచ్చుట నాది సరగcగాచుట నీది**
**భువనమాతకు వల్లభుcడవు గాన;**
**విరులు చల్లుట నాది వేవే లిడుట నీది**
**పొరిcబొరి శ్రితసులభుcడవు గాన;**

**ఆ. దాసుcడనుట నాది తప్ప కేలుట నీది**
**యాసదీర్చు వరదుc డగుదు గాన;**
**నీదు సేవనాది నెఱి గైకొనుట నీది**
**యీసు లేని స్వామి వీవు గాన. 89**

స్వామీ ! నీకు నమస్కరించడం నా వంతు. నా తప్పులన్నీ మన్నించడం నీ వంతు. కారణం నీవు సాటిలేని దయానిధివి కదా ! నీ చెంతకు జేరి మొఱపెట్టడం నా వంతు. ఆదరంతో ఔనౌనని అంగీకరించడం నీ వంతు. ఎందుకనగా భక్తుల మొఱ ఆలకించే దేవదేవుడవు గదా నీవు ! నిన్ను శరణు వేడటం నా వంతు. శీఘ్రముగా రక్షించడం నీ వంతు. ఏలనగా శరణాగతరక్షణకై నిన్ను ప్రేరించు లోకజననికి నీవు నాథుడవు గదా! పూలతో నిన్ను పూజించడం నా వంతు. కొల్లలుగా సిరులు క్రుమ్మరించడం నీ వంతు. ఎందుకన నీవు ఆశ్రయించిన వారికి సులువుగా లభించువాడవు గదా! నీ దాసుడ ననడం నా వంతు. తప్పక కాపాడడం నీవంతు. ఎందుకన దాసుల ఆశలు తీరునట్లు వరాలిచ్చే దాతవు కదా నీవు ! నిన్ను సేవించడమే నా వంతు. నా సేవలు స్వీకరించడం నీ వంతు. ఏలన నీవు ఈర్ష్యలేని శుద్ధసత్త్వ స్వరూపుడవైన శ్రీనివాస ప్రభుడవు గదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నే నేమిc జేయcగ | 185 | 433 | 2 | 292 |

అవ: శ్రీనివాసుని దయగల చిత్త మెటువలెనున్నదో యెఱుగ ననుచున్నాడు.

సీ. పలుజన్మముల నేను పానమ్ము సేసిన
చన్నుబా ల్గొలిచిన నెన్నియౌనొ?
తినఁగ ముప్పొద్దులఁ దెగిన కొల్చు లవెన్నొ?
సొమ్ముల కయినట్టి సొన్న మెంతొ?
చినుఁగఁ గోకలకుఁ జెల్లిన ప్రత్తి యెంతయో?
యిందందుఁ గట్టిన యిండ్ల వెన్నొ?
తలిదండ్రు లెందఱో? తరుణులు నెందఱో?
కడఁగి గడించిన కలిమి యెంతొ?

ఆ. పడిన యిడుమ లెన్నొ? కుడిచిన సుఖ మెంతొ?
కడకు బ్రదికినట్టి కాల మెంతొ?
యే నెఱుంగ; నీవ యెఱుఁగుదు; వీ పుట్టు
విచ్చినాఁడ వేమి యెంచినావొ? 90

కడచిన పలుపుట్టుకల్లో నేను త్రాగిన చనుబాలుకొలిస్తే ఎన్ని తూములవుతాయో! ముప్పూటలా నేను తిన్న ధాన్యాన్ని కొలిస్తే ఎన్ని పుట్లవుతాయో! నేను ధరించిన నగలకైన బంగారమెంతో కదా ! నే నెన్ని గుడ్డలు కట్టి చించినానో! ఆ గుడ్డలకయిన ప్రత్తి ఎన్ని బారువలో గదా ! ప్రతి జన్మలో ఆయా ఊళ్ళలో కట్టుకొన్న యిళ్ళెన్నో కదా ! పోయిన జన్మల్లో నాకు తల్లిదండ్రులు, భార్యలు ఎందరో గదా ! శ్రమించి సంపాదించిన ద్రవ్య మెంతో కదా ! పడిన కష్టాలు, అనుభవించిన సుఖాలు ఎన్నో కదా! తుదకు జీవించిన కాలమెంతో కదా ! ఓ ప్రభూ ! నే నెఱుగను. నీ వెఱుగుదువు. నీ వేమి తలచితివో కాని యిప్పటికి ఈ పుట్టువు నిచ్చినావు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అన్నియుఁ నడుగవే | 113 | 189 | 2 | 127 |

అవ: మానవులు సంసార వ్యామోహంలో పడిపోతున్నారే గాని ముక్తి పొందుట లే దనుచున్నాడు.

సీ. నిన్న భుజించి త్రేన్చిన యట్టి యన్నమే
యారగింపంగ నేఁ డాస రేఁపు;
తమిఁ గూడి రాతిరి తనివి తీర్చిన బోటి
మరల నిన్నటివలె మరులు రేఁపు;
కట్టి వీడిన మైలపుట్టమ్ము లుదికిన
నెప్పటివలెఁ గట్ట నిచ్చ రేఁపు;
మోసి మోసియుఁ దీసి మూల నుంచిన నగల్
మాయ యేమో తాల్ప మమత రేఁపు;

తే. ఈవు పట్టిన పంతమో యెఱిఁగి యెఱుఁగ
కేము చేసిన దోషమో? యింత మోహ
జనక సంసార వననిధి మునిఁగినాము;
మమ్ము రక్షింపు మలమేలుమంగరాజ ! 91

నిన్నటి దినం తృప్తిగా తిని త్రేపిన అన్నమే మళ్ళీ యీ నాడు కూడా బాగా తినవలెననే ఆశను పుట్టిస్తున్నది. ముందటిరాత్రి తృప్తి గొలిపిన తరుణి మరుసటిరేయికూడ కూడుటకు మరులుగొల్పుతున్నది. కట్టుకొని విప్పిన గుడ్డలే చలువ చేయగా మరునాడు ధరింపవలెనన్న కోరికను పుట్టిస్తున్నవి. ధరించి ధరించి తీసి మూలపెట్టిన నగలే మరల మరల ధరించవలెననే ఆశను కల్గిస్తున్నవి. నీవు పట్టిన పంతంవల్ల ఇట్లా బుద్ధిపుడుతున్నదో లేక తెలిసీ తెలియక మేము చేసిన తప్పిదాల ఫలమో ఏమో కాని చెప్ప నలవికానంత అజ్ఞానాన్ని పుట్టించే సంసార మనే సాగరంలో మునిగిపోయినాము. అలమేలుమంగాప్రియా ! మమ్ము కాపాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పెఱుగగఁ బెఱుగఁగ | 261 | 352 | 3 | 23 |

అవ: అంగనా వ్యామోహములో పడిన భవరోగ పీడితులకు శ్రీనివాసుడే వైద్యు డనుచున్నాడు.

**సీ. అతివ లనెడి పాము లధరముల్ గఱచిన**
**దర్పకవిషములు తలల కెక్కె;**
**మితిలేని రతులఁ దిమ్మిరిపట్టె తనువులు**
**మతిచెడె నిందుకు మందదేమొ?**
**పొలఁతుక లనియెడి భూతముల్ సోఁకిన**
**దిసమొలతోడుత ద్రిప్పటాయె;**
**చెనకులచే మేన జీరలు మెండాయె**
**మఱి యిందు కనుకూల మంత్రమేదొ?**

**తే. తరుణుల దృఢోపగూహనజ్వరము పట్టి**
**కాయమునఁ జెమ్మటలు దిగఁ గాఱఁ జొచ్చె;**
**నీవె భవరోగవైద్య ! దిక్; కెల్లజనము**
**లచ్చపు సుకమ్ము గనుటకు యంత్ర మేదొ? 92**

స్త్రీలనే పాములు పెదవులను కఱవగా మన్మథుడనే విషాలు తలకెక్కినవి. మితిమీరిన రతులలో తేలడంవల్ల శరీరం తిమ్మిరి పట్టింది. అంతేకాదు; బుద్ధికూడా చెడింది. ఇందు కేదిమందో ? మందు లేదన్నమాట. ఆడువారనే దయ్యాలు పట్టగా గుడ్డగోచి విప్పివేసి తిరగడ మవుతున్నది. గోటినొక్కులచే శరీరం మీద గీరలు అధికమైనవి. వీటిని పోగొట్టుకొనుటకు ఏమి మంత్రమో ! మంత్రము లేదన్నమాట. అంగనల గాఢమైన ఆలింగనాలు అనే జ్వరము తగిలి శరీరం నిండుగా చెమటలు కారుతున్నవి. సంసారమనే రోగానికి వైద్యుడవైన ఓ స్వామీ! ఇక మాకు నీవే దిక్కు . జను లందరు స్వచ్ఛమైన సుఖాన్ని పొందడానికి యంత్ర మేదో చెప్పు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| భవరోగ వైద్యుఁడవు | 262 | 356 | 3 | 240 |

అవ: నారాయణుని చర్యలు ఏవి చూచినా చోద్యములే యనుచున్నాడు.

సీ. పురుషోత్తమ ఖ్యాతిఁ బొదలి సుధంబంచఁ
దన్వి కావలసిన దైన్యమేల?
కరిరాజు గాచిన కరుణాపయోధివి
నరసింహమూర్తివై యుఱుమనేల?
శరణాగతత్రాణ బిరుదాంకితుండవు
పాపఁ గాళ్ళఁ బెనంగఁ దాఁపనేల?
భోగిరాట్పర్యంక భోగానుభవి వీవు
గరుడునిపై నెక్కి తిరుగ నేల?

ఆ. దేవతాధిపతిగ దీపించి యింద్రున
కవరజుండ వగుచు నడర నేల?
చిత్ర మేది గనిన శేషాద్రి స్థిరుఁడవై
జీవకోట్లలోనఁ జిక్కనేల? **93**

పురుషులలో ఉత్తముడనే ప్రఖ్యాతి పొంది అమృతం పంచడానికి ఆడుదానివి కావలసిన దయనీయమైన దశ నీ కెందుకు దాపురించింది ? గజేంద్రుని కాపాడిన దయాసముద్రుడవు. అయితే నరసింహావతారమెత్తి ఎందుకు గర్జించావు ? శరణన్న వారిని కాపాడే బిరుదం కలవాడవై పాప(పాము) కాళ్ళకు చుట్టుకుంటే తన్నినా వెందుకు? ఆదిశేషుడనే పాన్పుపై భోగాన్ని అనుభవించే నీవు గరుడుని మెడ నెక్కి ఎందుకు ఊరేగినావు? దేవతలకెల్ల ప్రభుడవై ఉండి ఇంద్రునికి తమ్ముడ వెందుకయినావు ? నీ చరిత్ర చాల విచిత్ర మైనది. శేషగిరిపై స్థిరముగా ఉంటూ అందరి మనస్సులలో కూడ ఉంటున్నావు. నీ కథ ఎవరికీ అంతుచిక్కడం లేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏది చూచిన | 23 | 140 | 1 | 96 |

అవ: భగవంతుడు సంకల్పమాత్రంతో చేయదగిన పనికి కూడా ఎంతో సన్నాహాన్ని చేస్తుంటా డనుచున్నాడు.

**సీ. కలహమ్ము కురుపాండవులకుఁ బెట్టఁగ నేల?**
**సారథికృత్యమ్ము సలుపనేల?**
**భూభార మణఁగింప బుద్ధి జనించిన**
**చక్రమ్ము వేయ దుర్జనులు తెగరా?**
**అరుదుగ సురల వానరులఁ జేయఁగ నేల?**
**జోక లంకాపురిఁ జుట్ట నేల?**
**కాకిపై వేసిన కసవె రావణు మీఁద**
**వేసిన పొలియఁడో దోసకారి?**

**తే. భక్తుఁ డటు పల్కనేల? స్తంభముననుండి**
**యవతరింపఁగ నేల? నీ వాత్మనుండి**
**తొలఁగిన హిరణ్యకశిపుండు త్రుంగఁ డటవె?**
**ఎంతకత నడపితివి కోనేటిరాయ !** 94

కౌరవులకు పాండవులకు ఎందుకు తగవు పెట్టినావు? అర్జునుని రథం నడపడానికి ఎందుకు పూనుకున్నావు ? భూభారాన్ని తొలగించడానికే గదా ! అంతమాత్రానికి ఇంత సంరంభ మెందుకు ? నీవు చక్రాయుధం ప్రయోగిస్తే ఆ దుర్మార్గులంతా చావరా? ఇది కృష్ణావతారంలోని విషయం. దేవతలను వానరులుగా పుట్టించి లంకను ముట్టడించకపోతే ఆ కాకాసురునిమీద విసరిన గడ్డిపోచను రావణునిమీద ప్రయోగించి ఉంటే ఆ దుష్టుడు సమసిపోడా? ఇది రామావతార విషయం; భక్తుడగు ప్రహ్లాదుడు స్తంభంలో హరి ఉన్నాడని పలకడం ఎందుకు? నీ వాస్తంభం నుండి నరసింహాకృతితో ప్రత్యక్షం కావడం ఎందుకు? అతనిలో అంతర్యామిగా ఉన్న నీవు తొలగిపోతే వాడు దొర్లడా? ఓ కోనేటిరాయా! అంతా నీకు చిన్నపనే అయినా లోకవిడంబనకై ఇంత తతంగం నడిపావు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎంతకత | 165 | 315 | 2 | 211 |

అవ: కర్మఫలము నీవు కూడా అనుభవించక తప్పదని దేవునితో పరియాచక మాడుతున్నాడు.

సీ. పాముఁ జంపిన యట్టి పాతకమ్మున నీకు
పాముపైఁ బవ్వళింపంగ వలసె;
కోమలిఁ జంపిన కొఱగామిచే నీకుఁ
గోమలి నెదఁ బెట్టుకొనఁగ వలసె;
బండిని విఱిచిన పాపమ్ముచే నీకు
బండిదోలుటకుఁ బాల్పడఁగ వలసె;
ప్రాణుల భవవార్ధి పడఁద్రోయు కొఱఁతచే
పాథోధిలో నీకు పండ వలసె;

ఆ. కొండ వెఱికినట్టి కొలచేత నీ కేడు
కొండలపయి చేరియుండ వలసె;
కర్మఫలము నీవె కడముట్టఁ గుడువంగ
ఇంక మాకు దారి యేది స్వామి? 95

పామును చంపినావు కనుకనే పాముమీద నీవు పండుకోవలసి వచ్చింది. స్త్రీని (పూతనను) చంపడమనే పనికిమాలిన పనిచేశావు. అందుకనే స్త్రీని (లక్ష్మిని) ఎప్పుడూ ఱొమ్మున ఎక్కించుకొని మోస్తున్నావు. నీవు బండిని విరిచావు. ఆ పాపంవల్ల నీవు (అర్జునునకు) బండితోలేవాడి వైనావు. జీవులను సంసారమనే సముద్రంలో పడద్రోశావు; ఆ లోపం వల్లనే నీవు సముద్రంలోనే పవ్వళింపవలసి వచ్చింది. కొండను (గోవర్ధన గిరిని) పెల్లగించిన దోషంచేత ఏడుకొండలపై నీవు ఉండవలసివచ్చింది. భగవంతుడివైన నీవే కర్మఫలం పూర్తిగా అనుభవిస్తుండగా మరి మాబోటివారికి దారి ఎక్కడిది ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎట్టివారికి | 45 | 277 | 1 | 185 |

అవ: అసురులు పుట్టడం, అధర్మం ప్రబలడం కూడ ఒకందుకు మేలే అనుచున్నాడు.

**సీ. అసురులు భువిఁ బుట్టు టది యుపకారమే**
**యసురులు బాధింతు రమరవరులఁ;**
**బొసఁగ వారలకునై వసుధ నీవు జనింపఁ**
**గనులారఁ జూచు భాగ్యంబు గలుగు;**
**ధర్మమ్ము తొలఁగి యధర్మ మొప్పిన మేలు**
**విన్నవింతురు నీకు వేదఋషులు;**
**ధర్మమ్ము నిలుపంగ ధరణిఁ బుట్టుదు వీవు**
**పరువడి సేవించి బ్రదుకఁ గలము;**

**తే. తలఁప నీ కంటె మేలు నీ దాసజనులె**
**యుందు వెప్పుడు నీవు వారున్నచోట;**
**చెప్పఁగా వారు నీ కథల్ చెవుల వినుచు**
**మేము తరియింపఁ గలము లక్ష్మీకళత్ర ! 96**

రాక్షసులు భూమిపై పుట్టడంకూడ మేలే. ఎందుకనగా వారు దేవతలను బాధిస్తారు. అపుడా దేవతలను కాపాడేందుకు నీవు భూలోకంలో అవతార మెత్తుతావు. మాకు నిన్ను సందర్శించే భాగ్యం కలుగుతుంది. ధర్మం నశించి అధర్మం పెచ్చుపెరిగినా మంచిదే. పరమఋషులు ధర్మం నిలబెట్టుమని నీకు మనవి చేస్తారు. అందుచే నీవు అవనిలో అవతరిస్తావు. అప్పుడు నిన్ను సేవించి మేము మనగలము గదా ! ఒక విధంగా ఆలోచిస్తే నీ కంటె మేలైనవారు నీ దాసులే. వారున్నచోట నీవూ ఉంటావు. ఓ లక్ష్మీనాథా! ఆ భక్తులు నీ కథలు చెపుతూంటే కర్ణపేయంగా విని మేము సంసారబంధ విముక్తులం కాగలం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఊరకైతే నిన్ను | 138 | 161 | 2 | 108 |

అవ: శరణు గోరకున్నను రక్షించవలసిన అక్కర భగవంతునిదే అనుచున్నాడు.

సీ. నెలకొని నాలోన నీవె యుంటివి గాన౯
దలఁపకున్నను నిన్నుఁ దలఁచినట్లె:
ఎలమి నందఱ నీవె యేలువాఁడవు గాన౯
గొలువకున్నను నిన్నుఁ గొలిచినట్లె;
నెక్కొని మిన్నెల్ల నీ పాదమే గాన
మ్రొక్కకున్నను నీకు మ్రొక్కినట్లె:
నిఖిలాక్షరంబులు నీ పేరులే గాన౯
బిలువకున్నను నిన్నుఁ బిలిచినట్లె;

తే. కమలషట్కంబునం దుంటిగాన నిన్ను
నెంచి పూజించకున్నఁ బూజించినట్లె:
అజ్ఞుఁడను గాన శరణమం చనకయున్న
నఖిలగతి వౌట శరణ మన్నట్లె దేవ ! 97

ఓ స్వామీ! నాలో నీ వున్నావు కాబట్టి నేను నిన్ను తలంచకున్నను తలచినట్లే. అందరిని పాలించేవాడవు. కనుక నేను నిన్ను కొలువకున్నను కొలిచినట్లే. ఆకాశమంతా నీ పాదమే కాబట్టి నీకు నమస్కారం చేయకున్నా చేసినట్లే. అక్షరాలన్నీ నీ పేరులే కనుక నా పలుకులన్నీ నిన్ను పిలిచినట్లే. మూలాధారాది షట్చక్రాలలో నీవు సంచరిస్తావు కనుక నేను నిన్ను పూజించకున్నా పూజించినట్లే. మూఢుడను కాబట్టి నీ శరణుగోరకున్నా సకల ప్రాణులకు నీవే గతివి కాబట్టి నిన్ను శరణు వేడినట్లే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చిత్తాన బెట్టకు | 169 | 337 | 2 | 226 |

అవ: కామాదులను జయించుటకు భగవంతుని అనుగ్రహం ముఖ్యమను చున్నాడు.

**సీ. మోహాంధకారమ్ము ముసురు; నందుకుఁ దోడు**
**దేహాభిమానమ్ము తిమురుచుండు;**
**పెనుసాహస పిశాచి పెరరేఁపు హింసకుఁ;**
**గోపాగ్ని సారెకు గుబ్బతిల్లు;**
**గర్వంబు కలనికిఁ గాల్రువ్వు; దాహపు**
**టాసలు మనసు నుయ్యాల లూపు;**
**బలుములు చూపు భావజ విలాసమ్ములు;**
**వేవేల సంపదల్ వేడ్క సేయు;**

**తే. ఎన్నిటికి నోపఁగలవాఁడ నే నొకండ?**
**నేది గతి? యిన్ని వసమగు టెట్లు నాకు?**
**నీవు దయతోడ నన్ను మన్నింపఁ గదవె**
**శ్రితసముద్ధరణోల్లాస! శ్రీనివాస! 98**

అజ్ఞానమనే చీకటి చుట్టుముట్టగా దానికి తోడు శరీరాభిమానం ముదురుతున్నది. సాహసమనే పిశాచి హింస చేయుమని ప్రోత్సహిస్తున్నది. మఱి కోపమనే అగ్ని మాటిమాటికి గుప్పు గుప్పుమని ఎగయుచున్నది. గర్వము ఇతరుల పైకి కాలు ద్రవ్వుచున్నది. తనను భస్మం చేసే ఆశలు మనస్సును ఉయ్యాల లూపుతున్నాయి. మన్మథవిలాసాలు తమ బలాన్ని ప్రకటిస్తున్నాయి. అధికములైన సంపదలు సంతోషాన్ని కలిగిస్తున్నాయి. నేను ఏకాకిని. ఎన్నింటి తాకిడులకు తట్టుకోగలను? నా కేదిగతి? ఇంద్రియాలు నా కెట్లు అధీన మవుతాయి? ఆశ్రయించిన వారిని ఉద్ధరించడంలో సంతోషంగల ఓ శ్రీనివాసా ! నీవు దయతో నన్ను మన్నించవయ్యా!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏది గతి | 162 | 300 | 2 | 201 |

అవ: నారాయణుడు అనుగ్రహించ కుంటే వాంఛలు మొదలైన జన్మ సిద్ధ దోషములు మాన వనుచున్నాడు.

**సీ. కోరిన కోర్కులు కోయని కట్టులు**
**తీఱవు నీవుగా త్రెంపకున్న;**
**బటువైన పగ్గాలు పాపపుణ్యమ్ములు**
**నీవు త్రోయక యవి నిలిచిపోవు;**
**జనుల సంగమ్ములు ఘనరోగములు నీవు**
**విడిపింపకున్న న న్వీడఁబోవు:**
**వినయ దైన్యమ్ములు విడని కర్మము లీవు**
**శాంతపఱుపకున్నఁ జనఁగఁబోవు:**

**తే. మలినచింతలు మయిలలు మడుఁగు లెల్ల**
**నీవు పోఁద్రోలకున్న నిన్నియును బోవు;**
**శరణు సొచ్చితి వృషగిరి సార్వభౌమ !**
**అలపు సొలపులు మాపి న న్నాదుకొనవె!** 99

అవిచ్ఛిన్నంగా పెరిగే కోరికలనే కట్టులు నీవు త్రెంచకుంటే అవి వదలవు. పాపపుణ్యాలు బటువైన పగ్గాలు. నీవు త్రోయక అవి నిలువవు. అందరితో కలయికలు గొప్ప రోగములు. నీవు విడిపించకుంటే అవి నన్ను విడిచిపెట్టవు. వినయముతో కూడిన దీనావస్థలు నన్ను విడువని కర్మాలు. నీవే వాటిని శాంతపరచకుంటే అవి తొలగిపోవు. కుత్సితపు టాలోచనలు, మడీమైలలు- ఇవన్నీ నీవు పోగొట్టకుంటే వదలిపోవు. ఓ వృషగిరి చక్రవర్తీ! నీ శరణు జొచ్చితిని. నా కష్టాలు పోగొట్టి సాయపడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అంతర్యామీ | 193 | 475 | 2 | 320 |

అవ: స్థితప్రజ్ఞుడే నారాయణస్వరూపు డనుచున్నాడు.

**సీ. తన యాత్మవలెనె భూతముల యాత్మల నెల్ల**
**ననయంబు గనుఁగొన్న యతఁడె నీవు;**
**తనుఁ గన్న తల్లిగా తదితరకాంతల**
**ననఘుఁడై తలపోయు నతఁడె నీవు;**
**సతత సత్యవ్రతాచార సంపన్నుఁడై**
**యతిశయిత మెలంగు నతఁడె నీవు;**
**ధృతిమీఱ ద్రవ్యంబు తృణముగా భావించు**
**హతకామనుండైన యతఁడె నీవు;**

**తే. నిక్కముగ మోదఖేదమ్ము లొక్కరీతి**
**నాదరింపుచు నున్నట్టి యతఁడె నీవు;**
**నిలిచి యొకచోట నుండవు నీ వనంగ;**
**నాదియును నంత్య మీవె శేషాద్రినిలయ ! 100**

తన ఆత్మవంటివే సకల ప్రాణుల ఆత్మలని తలంచువాడును, తన కన్నతల్లిని వలె పరకాంతలను పరికించువాడును, సత్యము, వ్రతములు, ఆచారములు అతిశయముగా కలవాడును, స్థిరుడై ధనమును, తృణమును సమానముగా నెంచువాడును. నిష్కాముడును, సుఖదుఃఖాలను ఏకరీతిగా భావించేవాడును ఎవడో అట్టివాడు నీవే అగుదువు. అనగా అట్టి మహాత్ముడు భగవంతుడే యనుట. ఓ శేషాద్రినిలయా! నీవు ఒకచోట నిలిచియుండవు. అనగా సర్వగతుడ వనుట. ఆద్యంతరూపుడవు నీవే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నీ వనఁగ | 38 | 232 | 1 | 155 |

అవ: కావు మని వేడకున్నను తన దాసుని భగవంతుడు తప్పక కాచు ననుచున్నాడు.

**సీ. ప్రాయమ్ము సంసారవశ మొనర్చితిఁ గాని**
**చేయార నీ సేవ చేయ నయితి;**
**తనువు భామినుల కప్పనము చేసితిఁ గాని**
**నీ యక్కఱలయందు నిలుప నయితి;**
**చిత్త మాసలపాలు చేసి మంటిని గాని**
**ని న్నొక్కసారి ధ్యానింప నయితి;**
**నానా రుచుల రసనను దేల్చితిం గాని**
**సరవి నీ స్తుతులకు మరప నయితి;**

**తే. పుట్టువు దొడంగి యజ్ఞానమున మునింగి**
**అదరి ననుఁగావు మంచు ని న్నడుగ నయితి;**
**నెట్టు మన్నించితివొ కొట్టి తిట్టకుండ**
**నిందుకే నాకు వెఱఁగయ్యె వృషగిరీశ! 101**

ఓ వృషభాద్రివాసా! వయసునంతా సంసారలంపటంతో గడపి వేశానే కాని చేతులారా నీ సేవ చేయలేకపోయాను. ఈ శరీరాన్ని అంగనల పాలు చేశానే కాని నీ పనులకు ఉపయోగపఅచలేక పోయాను. నా మనస్సును ఆశలపాలు చేశానే కానీ ఒకతడవైనా నీ నామం తలచలేకపోయాను. నా నాల్కను రకరకాల రుచులతో తృప్తి పొందించానే కాని నీ స్తుతికి అలవాటుపడేట్లు చేయలేకపోయాను. జన్మమెత్తినది మొదలు అజ్ఞానంలో మునిగిపోయి నన్ను కాపాడుమని నిన్ను ప్రార్థించనే లేదు. అయినా తిట్టకుండా, కొట్టకుండా నన్నెట్లు మన్నించావో ప్రభూ! ఇందుకు చాల ఆశ్చర్యం కలుగుతున్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏ నోరు వెట్టుక | 210 | 60 | 3 | 41 |

అవ: ఎలా పిలిచినా పలికే దైవము శ్రీనివాసుడే యనుచున్నాడు.

**సీ. నేరముల్ తొలఁగింప నెలవులు గల్పింప**
**గారవింపఁగ నీవు గలవు నాకు;**
**'మరామరా' యని పల్క మఱి రామ యనె నంచు**
**భావించి రక్షించు వాఁడ వీవు;**
**దురితమ్ము లణఁగింప దుఃఖముల్ తొలఁగింపఁ**
**గాంక్ష లీడేర్పంగఁ గలవు నాకు;**
**'నార నా:ర' యనంగ నారాయణా యంచు**
**వాకొనె నని బ్రోచువాఁడ వీవు;**

**తే. విన్నపమ్ములు చేకొని వేడ్కఁ గరుణ**
**గాచు తిరుమలదొర వీవు గలవు నాకు;**
**తలఁచినంతనె మాటలఁ బిలిచె నంచు**
**స్తంభమును జీల్చుకొనివచ్చు స్వామి వీవు.** **102**

తప్పులు మన్నించడానికి, స్థానములు కల్పించడానికి, గౌరవించడానికి నాకు నీవే దిక్కైయున్నావు. 'మరమరా' అని పలికితే 'రామరామ' అన్నాడని కాపాడే ఘనుడవు గదా నీవు ! పాపము పరిహరించడానికి, దుఃఖాలు తొలగించడానికి, కోరిక లీడేర్చడానికి నాకు నీవే అండగా ఉన్నావు. 'నారనార' అంటే 'నారాయణ' అన్నాడని కాపాడే మహానుభావుడవు గదా నీవు? విజ్ఞాపనములు వేడుకతో మన్నించి దయతో బ్రోచే తిరుమలదొరవు నీవు నా పాలనున్నావు. మనసులో స్మరించినంతమాత్రాన మాటలతో నోరార పిలిచినాడని ఉక్కుకంబాన్ని బ్రద్దలు చేసుకొని వెలుపలికివచ్చి రక్షించే భక్తవాత్సల్యం గల మహనీయుడవు గదా నీవు!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నీకుఁ దొత్లే యలవాటు | 278 | 451 | 3 | 303 |

అవ: సకలసృష్టికి కర్త గనుక జీవుల రక్షణభారము స్వామిదే యను చున్నాడు.

సీ. తెరువు దప్పి యడవిఁ దిరుగువారిని దెచ్చి
తెరువున నిడుదురు తెలియువారు;
నరుఁడనై నేరక నడచెడు న న్నీవు
మరగించి కావక మానఁదగునె?
దిక్కుమాలినవారిఁ దెచ్చి దయాళురు
దిక్కయి ప్రోతురు దిగ విడువరు;
తక్కక మాయలోఁ దవిలిన న న్నీవు
వేగ రక్షింపక విడువఁ దగునె?

తే. అంగడిఁ బడంగ భయభీతు నంతలోనె
యూఱడింతురు దొరలు తా మూరకోనరు;
ఏడుకొండలవాఁడ! యీ సృష్టికెల్ల
నేలికవు నా మొఱల్ విని యేలఁ దగవె! 103

దారితప్పి అడవిలో తంటాలుపడే వారిని దారితెలిసినవారు సరైన దారిలో పెట్టేవిధంగా ఓ దేవా! నన్ను మంచిమార్గములో ఉంచు. మానవుడనై అజ్ఞానముతో ప్రవర్తించే నన్ను కాపాడక మానుట తగునా? తగదని భావం. దయాస్వరూపులు దిక్కులేనివారిని దగ్గఱకుదీసి తాముదిక్కై కాపాడుతారు, కాని దిగవిడువరుకదా! ఆ విధంగానే నీవు నన్ను కాపాడవలెనని తాత్పర్యం. మానక మాయలో చిక్కుపడే నన్ను వేగమే రక్షించక విడిచిపెట్ట దగునా? తగదని తెలియవలెను. భయపడి కొలువుజొచ్చిన వానిని ప్రభువులు బుజ్జగింతురు గాని ఉపేక్షింతురా? ఉపేక్షింపరని గ్రహించవలె. ఓ ఏడుకొండలప్రభూ ! ఈ సకలసృష్టికి నీ వే పాలకుడవు గదా! నా మొఱాలకించి నన్నేల దగవా? తగుదు వని సారాంశం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పెంచిన తమ | 212 | 70 | 3 | 47 |

అవ: శ్రీనివాసముద్రాధారణం, తిరుపతి నివాసం, ప్రపత్త్యను సరణం –వీటి మహిమలు చాటుచున్నాడు.

సీ. శుభమతుల్ నీదు దాసులఁ జేరినప్పుడే
  యమకింకర భయమ్ము లణఁగిపోయె;
తగ శంఖచక్రముద్రలు మోచినప్పుడే
  కాలదండము లెల్ల నేలఁ గలిసె;
మును నీ నగరిత్రోవ మొగమైన యప్పుడే
  ఘన యామ్యమార్గమ్ము గట్టువడియె;
ఒకరాత్రి తిరుపతి నుండిన యప్పుడే
  కాలసూత్రాదిక ఘాత లుడిగె;

తే. మనసులో నల్పినపుడె నీ మంత్రజపము
చిత్రగుప్తుని లెక్కలు చెఱగిపోయె;
సప్తశైలవిహార! నీ శరణు సొరఁగ
శ్రీవికుంఠమ్ము మా యఱచేత నిలిచె. 104

ఓ ఏడుకొండలవాడా! మంచి బుద్ధిగల నీ దాసులతో సాంగత్యం చేసినపుడే యమభటులవలని భయాలు అణగిపోయాయి. శంఖచక్ర ముద్రలు భుజ మూలములందు ధరించినపుడే యమదండము నేలపాలై పోయింది. నీ కోవెలవైపు పయనించినపుడే యమలోక మార్గం మూతపడింది. ఒక్కరేయి తిరుపతిలో నుంటే కాలసూత్రాది నరకబాధలు మాయమౌతాయి. నీ మంత్రాన్ని (ఓం నమో వేంకటేశాయ) మనస్సులో జపించినప్పుడే చిత్రగుప్తుడు రాసే లెక్కలన్నీ మాసిపోతాయి. నిన్ను శరణుజొచ్చితే వైకుంఠం హస్తగత మవుతుంది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎక్కడి నరకములు | 202 | 12 | 3 | 9 |

అవ: భగవంతు డెవరి పాలనుండునో, వారు కొంచెమైనను గాసి చెంద రనుచున్నాడు.

సీ. ఎంత కర్కశమొ నా యీ డెంద మెన్నఁడు
 చిట్లని శిలతోడఁ జేసిరేమొ?
**అఖిల పురాణమ్ములందు నారకముల**
 **క్రమములు సదివియుఁ గలఁతఁ జెంద;**
**యమకింకరుల దారుణాకృతుల్ విని కూడ**
 **భ్రమసి యించుకయేని భయము నొంద;**
**పరమోగ్రకర్మాల బహుళఫలానుభ**
 **వమ్ముల నెఱిఁగియు సొమ్మసిల్ల;**

**తే. పరగ దినరాత్రముల్ సన జడియ నేను;**
**కలుషదుఃఖమ్ముల కొకింత కలఁగఁ బోను;**
**ఫణిధరాధరనాథ ! నా పాలఁ గలిగి**
**కాచితివి గాన సుంతయు గాసిపడను.** **105**

నా యీ హృదయం ఎంత కఠినమైనదో! ఇది పలుకులు కాని రాతితో చేయబడిన దేమో! కనుకనే సకల పురాణాలలో నరకపరంపరలను గూర్చి విని కూడ జడియకున్నాను. పురాణాలలో యమభటుల భయం కరాకారాల గూర్చి వినికూడ కొంచెమేని భయపడకున్నాను. దారుణమైన కర్మఫలాలు అనుభవించవలసి యుండునని తెలిసికూడ మూర్ఛిల్లకున్నాను. రాత్రింబవళ్ళు గడచిపోతున్నప్పటికీ జంకుగొంకులు లేకున్నాను. పాపములకు, శోకములకు కలవరపాటు చెంద కున్నాను. ఓ ఫణిగిరీశా ! నీవు నా పట్ల నుండి కాపాడినావు కాబట్టి రవంతేని గాసి చెందకున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎంత కఠినమో | 141 | 181 | 2 | 121 |

అవ: భాగవత పరిచర్యయే తనకు చాలు ననుచున్నాడు.

సీ. ని న్నెఱింగిన యట్టి నీ దాసుల నెఱుంగు
సదమలజ్ఞానమే చాలు నాకు;
నిన్నుఁ గొలుచు ధర్మనిష్ఠులు వైష్ణవ
స్వాముల సేవలే చాలు నాకు;
నిరతి నీకును మ్రొక్కు నీ డింగరీలకు
సరవితో మ్రొక్కుటే చాలు నాకు;
నిన్నుఁ బూజించు ప్రపన్నులఁ బూజించు
సరిలేని భాగ్యమే చాలు నాకు;

ఆ. నీకు భక్తులైన నిఖిల పుణ్యులయందు
స్వచ్ఛమైన భక్తి చాలు నాకు:
నిఖిల భువనపూర్ణ ! నీ లెంక లెంకకు
సతము లెంక నగుట చాలు నాకు. 106

అన్ని లోకాలలో నిండియున్న వేంకటాద్రివాసా! నిన్ను తెలుసుకున్న నీ దాసుల నెఱిగే పవిత్రజ్ఞానమే నాకు చాలు. అది చాల గొప్పదని భావం. నిన్ను సేవించే ధర్మనిష్ఠులగు విష్ణుభక్తులను సేవించుటే నాకు చాలు. మిక్కిలి ఆసక్తితో నీకు నమస్కారం చేసే నీ భటులకు (సేవకులకు) నమస్కరించుటే నాకు చాలు. నిన్ను పూజించునట్టి నీ శరణార్థులను పూజించే సాటిలేని భాగ్యమే నాకు చాలు. నీకు భక్తులైన పుణ్యాత్ములందరియందు నాకు అచ్ఛమైన భక్తి కలిగితే చాలు. నీ దాసదాసులకు దాసుడనై యుండుటే నాకు చాలు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అచ్యుత మిమ్ము | 204 | 23 | 3 | 16 |

అవ: జీవులు పరమాత్మునకు బిడ్డలు. శ్రీనివాసుడు తన సంతానము నేమిచేసినను అడుగువారు లే రనుచున్నాడు.

సీ. ఏ పుణ్యమైన నీ వే కట్టుకొనుమయ్య
శరణార్థి వజ్రపంజరమ వీవు
మన్నించితి నటన్న మాన్పువాఁ డెవ్వాఁడు?
కోపగించిన నడ్డుకొను నెవండు?
కాపాడెద నటన్నఁ గా దనువాఁ డెవ్వఁ?
డాజ్ఞ వెట్టిన నెదురాడు నెవఁడు?
పర మిత్తునన నడ్డుపడఁ జాలువాఁ డెవ్వఁ?
డిహ మీయ వలదన నెవని తరము?

తే. నీదు పెంపుడుఁ గుఱ్ఱలే; నీదు పెట్టుఁ
జెట్టులే జీవు లెల్ల; నీ చేతిలోని
వారలము; దాసులము; ప్రాఁతవార మింక
వలసినట్టులు సేయుము వనరుహాక్ష! 107

తామరపూలవంటి కన్నులుగల శ్రీ వేంకటేశ్వరా! శరణ మొందిన వారికి వజ్రపంజరంవలె రక్షణ కల్పించేవాడవు నీవే. నీవు మన్నించినపుడు త్రోసిపుచ్చేవాడూ, కోపిస్తే అడ్డుపడేవాడూ, కాపాడుతానంటే కాదనేవాడూ, ఆజ్ఞచేస్తే ఎదురు తిరిగి మాట్లాడేవాడూ, మోక్ష మిస్తానంటే వద్దనేవాడూ, ఇహలోకసుఖా లిస్తానంటే ఈయకూడదనేవాడూ ఎవడైన కలడా? లేదని భావము, ఈ జీవులందరూ నీ బిడ్డలే. నీవు నాటిన మొలకలే. మే మంతా నీ చేతిలోని కీలుబొమ్మలం; నీ దాసులం; ఎన్నో జన్మల నుండి నిన్ను అనుసరించేవాళ్ళం. ఇక నీ యిష్టప్రకారం మమ్ము నడిపించు. ఏ పుణ్యమైనా నీవే కట్టుకో.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కరుణానిధివి | 352 | 305 | 4 | 204 |

అవ: శ్రీనివాసునితో సమాన దైవతము "నభూతో న భవిష్యతి" అనుచున్నాడు.

సీ. భావించి నినుఁ బరబ్రహ్మ మంచని శ్రుతుల్
వేయిరీతుల మొఱవెట్టుచుండ
పాడైన యెఱుకతో బంధమోక్షము లొక్క
గాడిగట్టుట తెల్వి గనక కాదె?
ఉపనిషద్వచనమ్ము లొప్పుగా నినుఁ బరా
త్పరుఁ డంచు నెల్లెడఁ బలుకుచుండ
కేవలు నిన్నుఁ దక్కిన దైవముల గూర్చి
సేవించు టది తప్పుసేఁత గాదె?

తే. వేల్పులు పదుంద్రసంగడిఁ బెట్టి నిన్నుఁ
గొలుచు టది ద్రోహమౌఁ గాదె కొండలప్ప !
నినుఁ బురాణేతిహాసముల్ నిస్తులుఁ డన
నజ్ఞతయ గాదె నీ జాడ నరయకుంట. 108

శ్రీనివాసా! వేదాలు వేయివిధాలుగా నిన్ను పరబ్రహ్మ మని ఘోషిస్తుండగా పనికిమాలిన తెలివితో బంధమోక్షాలను ఒకేవిధంగా తలపోయడం వివేకం లేకనే కదా! ఉపనిషద్వాక్యాలు నిన్ను పరాత్పరుడనీ, కేవలుడనీ అంతటా వచించుచుండగా ఇతర దైవాలతో పాటు నిన్ను సాధారణ దైవంగానే భావించి సేవించడం తప్పైన పనే గదా! పురాణాలు, ఇతిహాసాలు నిన్ను సాటిలేనివానిగా పేర్కొనుచుండగా అఖిలదైవ తాలప్రక్క నిన్ను కూర్చుండబెట్టి పూజించడం నీ నిజ స్వరూపాన్ని గ్రహించలేని అజ్ఞానంవల్ల నే కదా!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పాడైనయెఱుకతో | 29 | 16 | 4 | 371 |

అవ: అన్నీ యిచ్చిన శ్రీనివాసుని అడుగవలసిన దేమీ లే దనుచున్నాడు.

**సీ. ఒసఁగితి విన్నియు నొక్కమాటే నాకు**
**విన్నప మ్మొనరింతు వేనికొఱకు?**
**నారాయణా ! నీదు నామమ్ము దలఁచిన**
**నీరాని వరముల నిచ్చినావు**
**చేరి ని న్నిట్టులే సేవించుచును నాకు**
**కోరి పొందఁగ వేఱు కోర్కు లేవి?**
**హరి ! యొక్కమరి నీవె శరణన్న మాత్రాన**
**గరిమతో నన్నిట్లు కాచినావు**

**తే. నిచ్చలు నుతించుచును భక్తి ని న్నిఁకేమి**
**యఱగొఱఁత యంచు నడుగుదు? కరము లెత్తి**
**మ్రొక్కినన్ ముందు నిలువఁగా మొనసి యవల**
**నిన్నుఁ గొనియాడెడిది యేమి? నిగమవేద్య! 109**

వేదములచే నెఱుగదగిన వేంకటాద్రినాథా ! నాకు ఒక్క సారిగా అన్నిటినీ నీవు అనుగ్రహించావు. నే నింకేమి కావలెనని విన్నవించుకోగలను? నారాయణా అని నీ నామం తలచినంతనే నీవు దుర్లభమైన వరాలన్నీ ప్రసాదించావు. నిన్ను ఇట్టే చేరి కొలుస్తూ నాకు ఇతరములైన పొంద దగిన కోర్కులు ఏమున్నవి? ఓ హరీ ! నీవే శరణు అని ఒక్కసారి అన్నంతనే న న్నెంతో గొప్పగా కాపాడినావు. భక్తితో నిన్నెప్పుడూ కొనియాడుతూ ఏమి కొఱతలని నిన్ను అడుగగలను? కొఱతలు లేవనుట. చేతులెత్తి మ్రొక్కగా నీవు నాముందు నిలిచినపుడు నిన్ను ఏమని కీర్తించుట! స్వామి ప్రత్యక్షమైనపుడు ఆనందంలో మునిగిన భక్తుడు మరల కీర్తింప లేడనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఒసఁగితి విన్నియు | 354 | 319 | 4 | 214 |

అవ: తనకు సర్వమూ శ్రీనివాసుడే యనుచున్నాడు.

**సీ. నా పాలి ఘననిధానమవు నీవే; నన్ను**
**నీ పాల నిడుకొంటి నీవె నీవె;**
**పొలసి న న్నేలు దేవుఁడవు నీవే; యెందుఁ**
**దొలఁగని యాత్మబంధుఁడవు నీవె;**
**బలుసుఖ మిచ్చు సంపదవు నీవే; నన్నుఁ**
**బొదివి పాయని మహాప్తుఁడవు నీవె;**
**అదనఁ దోడ్పడెడు దేహంబ వీవే; నాదు**
**మదము వాపెడు పుణ్యమతియు నీవె;**

**ఆ. అఖిల లోకములకు నాధారమవు నీవె;**
**పద్మజాది దేవపతివి నీవె;**
**సంకటములు వాపు సప్తాద్రి సమ్రాట్టు**
**వీవె; తల్లిదండ్రు లెల్ల నీవె. 110**

ఓ వేంకటేశ్వరా! నీవే నా పెన్నిధివి. నన్ను నీవే నీ వద్ద చేర్చుకొంటివి. నన్ను కాపాడునట్టి దేవుడవు నీవే. ఎట్టి సమయంలో కూడ నన్ను విడువనట్టి ఆత్మబంధుడవు నీవే. అన్ని సుఖాల నొసగే నా సంపద నీవే. నన్ను కాపాడుతూ వదలకుండే మంచి ఆప్తుడవు నీవే. శరీరంవలె సమయంలో సాయపడేవాడవు నీవే. నా మదాన్ని పోగొట్టే ధర్మాత్ముడవు నీవే. సకల లోకాలకూ ఆధారమైనవాడవు నీవే. బ్రహ్మ మొదలగు దేవతలకు అధీశ్వరుడవు నీవే. భక్తుల కష్టాలు తొలగించే ఏడుకొండలరాయడవు నీవే. నా తల్లియు తండ్రియు నీవే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నాపాలి ఘననిధానమవు | 18 | 108 | 1 | 74 |

అవ: జ్ఞాన మనుగ్రహించి సంరక్షింపు మని స్వామిని వేడుకొనుచున్నాడు.

సీ. **నీ గుణ మ్మెఱిఁగి నే నినుఁ గొల్వఁగా నేర**
**నెఱిఁగి నా గుణముల నేలు మయ్య!**
**సాగరమ్మును ద్రచ్చి సతిఁ దెచ్చుకొన్నట్టి**
**నాగేంద్రశయన! వందనము లయ్య!**
**నీ చోటెఱింగి నే నినుఁ దలంపఁగ నేర**
**నాచో టెఱింగి న న్గావుమయ్య!**
**నారఁ బేర్కొన్న యనామకుఁ బ్రోచిన**
**నారాయణా! నమస్కార మయ్య!**

ఆ. **మనసులోని నిన్ను మఱవకుండఁగ నాదు**
**మనసులోని నీవె మఱపు దెలిపి**
**మనుపు మయ్య! మౌనిమహిళఁ బ్రోచిన వేంక**
**టాద్రినాథ! యివె జొహారు లయ్య !** 111

సముద్రాన్ని మథించి లక్ష్మిని దెచ్చుకొన్న ఓ శేషశయనా! నీకు నమస్కారం. నీ గుణాలను గ్రహించి నిన్ను సేవించలేను. నా గుణాలను నీవే తెలుసుకొని న న్నేలుకో. 'నార' అని అరగొరగా ఉచ్చరించిన ఒక ఊరుపేరులేని వానిని కాపాడినట్టి ఓ నారాయణా! నీకు నా నమస్కారం. నీ స్థానమును గుర్తించి నిన్ను స్మరింపలేని నన్ను నా చోటెఱిగి కాపాడు. మనసులో నున్న నిన్ను మఱచిపోకుండు నట్లుగా నా మరపును మఱపించి రక్షించు. గౌతముని భార్య(అహల్య) శాపం తొలగించి బ్రోచిన ఓ వేంకటాద్రినాథా! ఇవే నీకు నా నమస్కారాలు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| విన్నప మిదే | 372 | 422 | 4 | 283 |

అవ: తనకు జప తపోధ్యానాదు లన్నియు శ్రీనివాసుడే యనుచున్నాడు.

**సీ. తప మొక్కటే నాకు తావక శరణంబు**
**జప మొక్కటే నీదు సంస్తవంబు;**
**ఉపమ యొక్కటె నీ మహోన్నతి మెచ్చుట**
**మర్మ మొక్కటె నిన్నుఁ మదిఁ దలఁచుట;**
**ధర్మ మొక్కటె నీదు దాసానుదాస్యంబు**
**కర్మమ్ము నీదు కైంకర్య మొకటె;**
**బలిమి యొక్కటె నాకు భక్తితో మెలఁగుట**
**కలవను నమ్మి కొక్కటియ కలిమి;**

**ఆ. ఇంతకంటె నవల నేమి యెఱుంగ నా**
**చార మెఱుఁగ మతి విచార మెఱుఁగ;**
**బలు తలంపులందుఁ బడి పొరలు టెఱుంగ**
**సప్తశైలధామ ! అప్తకామ ! 112**

సంపూర్ణకాముడవైన సప్తశైల నివాసా! నీ శరణమే నాకు తపస్సు. నిన్ను పొగడుటయే నాకు జపము. నీ ఔన్నత్యమును చూచి శ్లాఘించుటే నాకు మోక్షోపాయము. నిన్ను మనసున దలచుటే నాలోని రహస్యం. నీ దాసులకు దాస్యం చేయడమే నాకు ముఖ్యధర్మం, నీ కైంకర్యమే నా పుణ్యకర్మము. నీ యెడల భక్తితో మెలగడమే నాకు బలం. నీవున్నావనే అచంచల విశ్వాసమే నాకు కలిమి. ఇంతకంటే నాకు ఇతర మేమీ తెలియదు. ఆచారముగాని, విచారముగాని, నానావిధములైన ఆలోచనలందు చిక్కుకొనుటగాని నే నెఱుగను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఆచార విచారాలవి | 367 | 395 | 4 | 265 |

అవ: భాగవతులు భగవత్స్వరూపు లనుచున్నాడు.

**సీ. నీ దాస శిరములే నీ దివ్యశిరములు**
**నీ దాస పదములే నీ పదాలు;**
**నీ దాస నయనాలె నీ దివ్యనయనాలు**
**నీ దాసరూపమే నీదు రూపు;**
**నీ కింకరగుణాలె నీ భవ్యగుణములు**
**నీ కింకరులచోటె నీదు చోటు;**
**నీ కింకరుల సేవ నీవు మెచ్చెడి సేవ**
**నీ కింకరులగోష్ఠి నీదు గోష్ఠి;**

**తే. ఈవు నిఖిలాంతరాత్ముఁడవే యయినను**
**తల్లి ముట్టయినప్పుడు తాకఁ గలమె?**
**యెందు నజ్ఞానపున్ ముట్టు నెడసినట్టి**
**నీదు దాసుల భజియింతు నీవ యనుచ. 113**

నీ దాసుల శిరస్సులే నీ శిరస్సులు. వారి పాదాలే నీ పాదాలు, వారి కండ్లే నీ కండ్లు. వారి రూపాలే నీ రూపాలు. వారి గుణాలే నీ గుణాలు. నీ సేవకులైన వారుండేచోటే నీ చోటు. నీ దాసులకు చేసే సేవే నీవు మెచ్చుకొనే సేవ. వారితోటి గోష్ఠియే నీ గోష్ఠి. నీవు సకల జీవాంతరాత్ముడవే అయినప్పటికిన్నీ భాగవతులు కాని వారిని తాకుటకు నేను ఇష్టపడను. తల్లి అయినప్పటికిన్నీ మైలపడినప్పుడు ఆమెను తాకరు గదా! అజ్ఞానమనే మైలనువీడిన నీ దాసులను నీ వనే బుద్ధితో సేవిస్తాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నీవే నీ దాసులని | 317 | 98 | 4 | 66 |

అవ: తిరుపతిలో వేంచేసియుండే శ్రీ గోవిందరాజస్వామి వారిని అభివర్ణిస్తున్నాడు.

**సీ. పదఁతుక లిరువురు పాదపద్మము లొత్త**
**కొడు కబ్జగర్భుఁడు కూర్మి గొలువ;**
**కడుపులో లోకముల్ కడు జయ పెట్టంగ**
**ఫణిరాజు మెత్తని పఱపుగాఁగ;**
**దేవత లందఱు దృఢభక్తిఁ బూజింప**
**మధుకైటభులు స్రుక్కి మన్నుగఱవ;**
**పరఁగ సమ్ముఖమందుఁ బంచబేరము లొప్ప**
**గుదుసుకైదువు కాపుగడగ నుండ;**

**తే. నెమ్మి శ్రితులకు వరములు గ్రుమ్మరించు**
**కుంచము తలాడఁగా బవ్వళించి కనుల**
**విందుసేయు తిరుపతి గోవిందరాజ!**
**మాకు స్థిరసంపద లొసంగి మనుపవయ్య! 114**

శ్రీ భూదేవు లిద్దరూ ఇరువైపుల పాదము లొత్తుచుండగా, నీ నాభికమలం నుంచి పుట్టిన బ్రహ్మ ప్రీతితో నిన్ను సేవించుచుండగా, కుక్షిలోని లోకాలు జయజయధ్వానాలు సల్పుతుండగా, ఆదిశేషుడు నీకు మెత్తని పరుపు కాగా, అచంచలభక్తితో దేవతలు పూజలు చేయుచుండగా, మధుకైటభులు చచ్చి నేలబడియుండగా, ముందుభాగంలో పంచబేరములు (ధ్రువబేరము, ఉత్సవబేరము,కౌతుకబేరము, స్నపనబేరము, శయనబేరము-ఇవి పంచ బేరములు. బేరము అనగా ప్రతిమ) ఒప్పియుండగా, చక్రాయుధము రక్షకముగా ఉండగా, సంతోషముతో నాశ్రయించిన వారికి వరములు క్రుమ్మరించే కుంచమును తలగడగా నుంచుకొని కనులపండువుగా పరుండియుండే గోవిందరాజా! మాకు చెదరని సంపద లిచ్చి కాపాడవయ్యా!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కన్నుల పండుగ | 174 | 364 | 2 | 245 |

అవ: ఎంతకూ తృప్తి గలిగించని స్వామి అమృతస్వరూపమును అభివర్ణిస్తున్నాడు.

**సీ. ఎన్నిమారులు గన్నఁ గన్నులు దనియవు**
**చేతులు పూజచేసియుఁ దనియవు;**
**నీ కథామృతము లానియు చెవుల్ దనియవు**
**తనియదు నాలుక నిను నుతించి;**
**సింగారము దలంచి చిత్తమ్ము దనియదు**
**తనియదు నుదు రటు దండ మిడియు;**
**కొని నీ ప్రసాదమ్ము తనియదు కాయమ్ము**
**వలగొని తనియదు పదయుగమ్ము;**

**తే. ఆత్మ మోహింపఁ జేసితి వఖిలభువన**
**మోహనాకారుఁడవు; ఫుల్లపుండరీక**
**నయనుఁడవు వేంకటేశ్వరా ! నా వెలితియొ**
**నీ వెలితియో విచిత్రమ్ము నే నెఱుంగ.** **1 5**

ఓ వేంకటేశ్వరా! నిన్ను ఎన్ని మారులు దర్శించినా నా కన్నులూ, ఎన్నిపూజలు చేసినా నా చేతులూ, నీ చరితామృతం ఎంతగ్రోలినా నా చెవులూ, ఎంత కీర్తించినా నా నాలుకా, నీ అందాన్ని ఎంత తలపోసుకున్నా నా మనస్సూ, సాగిలపడి ఎన్ని దణ్ణములు పెట్టినా నా నుదురూ, నీప్రసాదాన్ని ఎంత ఆరగించినా నా శరీరం, నీ కెన్ని ప్రదక్షిణాలు చేసినా నా కాళ్ళూ తృప్తిచెందకుండా ఉన్నవి. నీవు సకల లోకాలను మోహింపజేసే ఆకారం కలవాడవు. కాబట్టి నన్ను మోహింపజేశావు. ఇది నా లోపమో లేక నీ లోపమో! ఈ విచిత్రం నేను తెలుసుకో లేకుండా ఉన్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| జగన్మోహనాకార | 176 | 375 | 2 | 252 |

అవ: కొద్ది తప్పులు చేసినవారినే గొప్పగా ఆదరించిన దేవుడు కుప్పతిప్పలుగా తప్పు లొనర్చిన తన్ను కాపాడడా అనుచున్నాడు.

**సీ. నరహరి! అచ్యుత! నారాయణా!నిన్ను**
**గురుఁడు కొండాడఁగాఁ గోరి వింటి;**
**ఒక దోసమునకె కాకికిఁ బర మిచ్చితి**
**వెన్ని నా దోసమ్ము లేమి యిత్తొ?**
**మందర గిరిధర! మాధవ! గోవింద!**
**అందఱు నినుఁ గొనియాడ వింటి;**
**ఒక బొంకునకె మఱందికిఁ గూర్చువాఁడైతి**
**వెంత కూర్తువొ? బొంకు లెల్ల నావె;**

**తే. ఒక్క శునకమ్ము మొఱ విని యోమితి వంట!**
**వేల జన్మాలమొఱల కే విలువ నిత్తొ?**
**తొల్లిఁటి సహోదరులకంటె దొడ్డవాఁడఁ**
**బాతకమ్మున నా కెట్టి పదవి దలఁతొ?** **116**

గోవిందా! ఒక తప్పుచేసిన కాకాసురునికి పరమపదాన్ని ప్రసాదించావని మా గురువులు (ఆచార్యులు) పొగడుతుండగా విన్నాను. మఱి నేనెన్నో తప్పులు చేసినవాణ్ణి. నా కంతకంటె ఎంత గొప్పస్థానాన్ని ఇస్తావో చూడవలె! నా తప్పులు క్షమించుమని భావం. మందరపర్వతాన్ని ఎత్తినవాడవనీ, లక్ష్మీపతివనీ ని న్నెందరో కీర్తించగా విన్నాను. నీ బావమరది ధర్మపుత్రుడు ఒక అబద్ధమాడగా నీ వతనికి ప్రియముగూర్చు వాడవైనావు. నే నెన్నో అసత్యము లాడినాను. మఱి నాకెంతప్రియము కూర్తువో చూడవలె. ఒక శునకం ఒక్కసారి మొఱపెట్టుకోగా దాని మొఱవిని కాపాడినావట గదా! నేనెన్నో జన్మలనుండి మొఱపెట్టుకొను

చున్నాను. నా మనవులకు నీ వెంత విలువ కడతావో చూడవలె! నా తోబుట్టువులైన మునుపటి వారికంటె పాపంలో నేనే గొప్పవాణ్ణి. మఱి నాకెట్టి గొప్పస్థానం అనుగ్రహించ దలచావో చూడవలె! నా తప్పులు సైచి నన్ను కాపాడుమని తాత్పర్యం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| **తొల్లింటి వారికంటె** | **285** | **489** | **3** | **329** |

అవ: భగవత్స్వరూపము తెలియుటకు అర్హు లెవరో తెలుపుచున్నాడు.

సీ. నారీజన కటాక్ష నారాచ దూరులౌ
శూరుల కెఱుక నిన్ జూచు చూపు
ఘోర సంసార సంకుల పరిచ్ఛేదులౌ
ధీరుల కెఱుక నీ దివ్యమూర్తి;
రాగభోగ విదూర రాజితాత్ములు మహా
భాగుల కెఱుక నీ ప్రణుతి విధము;
అగమోక్త ప్రకారాభిగమ్యులు మహా
యోగుల కెఱుక నీ యున్న యునికి;

తే. పరమభాగతాంఘ్రి సేవానిరతులు
పావనాత్ముల కెఱుక నీ పలుకు పలుకు;
సతత సత్యవ్రతులు మోహజాలముక్త
లెఱుఁగుదురు నిన్ను; తదితరు లెఱుఁగ లేరు. 117

స్త్రీల క్రీగంటిచూపులనే బాణాలకు గురికాని శూరులకే నిన్ను చూచే చూపు (ఎట్లా చూడవలెనో) తెలుస్తుంది. భయంకరమైన సంసార మనే చిక్కును త్రెంచిన ధీరులే నీ దివ్యమూర్తిని కనగలరు. అనురాగము, ఐహికసుఖాలు–వీనిని వీడి విరాజిల్లే పుణ్యాత్ములకు నిన్ను స్తోత్రం చేసే విధానం తెలుస్తుంది. ఆగమాలలో చెప్పబడిన స్వరూపముగల నిన్ను శరణుజొచ్చిన గొప్ప యోగులకే నీ వున్న చోటు తెలుస్తుంది. పరమ భాగవతుల పాదసేవలో మునిగిన పరమ పావనులకే నీ మాట పరి పాటి తెలుస్తుంది. ఎల్లప్పుడూ సత్యమే వ్రతముగా గలవారూ, అజ్ఞాన మనే వలనుండి విడివడినవారూ అయిన జ్ఞానులు నిన్ను తెలుసుకోగలరు. పై చెప్పినవారి కంటె భిన్నులు నిన్ను తెలుసుకోలేరు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇతరులకు | 41 | 252 | 1 | 169 |

అవ: జీవుల సకలప్రవృత్తులకు దైవమే మూల మనుచున్నాడు.

**సీ. నీవు నాలోనుండి నేర్పునఁ బలికింప**
**మాటకారి నటంచు చాటుకొందు;**
**నేటుగ లోకముల్ నీ వేలుచుండంగఁ**
**గడు గొప్పదొర నంచు గర్వపడుదు;**
**నెమ్మదిఁ బ్రజనెల్ల నీవ పుట్టింపఁగా**
**సంతుఁ గంటి నటంచు సంతసింతు;**
**సర్వ సంపదలను సమ్మతి నీ వీయ**
**నే గడించితి నంచు నిక్కుచుందు;**

**తే. ఇహపరమ్ములు రెండు నీవే యొసంగ**
**మానసించెద నా తపోమహిమ యంచు;**
**నిట్టి నా వెఱ్ఱితనముల నేమి చెప్ప?**
**నిందులకు నవ్వుకొని నన్ను నేలుమయ్య! 118**

ఓ దేవా ! నీవు నా లోపలనుండి నేర్పుతో పలికిస్తుంటే నేను గొప్పగా మాట్లాడేవాడనని చాటుకొంటాను. నిశ్చయంగా నీవు లోకాలను పాలిస్తుండగా నేను చాలా గొప్ప దొరనని గర్వపడతాను. నిండు మనసుతో నీవు ప్రజల పుట్టుకకు కారణంకాగా, నేను సంతానమును కన్నానని సంతోషపడుతుంటాను. అన్ని సంపదలు నీవు నా కీయగా నేనే గడించానని గర్వపడతాను. ఇహపర సుఖాలను నీ వీయగా అది నా తపఃప్రభావమని తలుస్తాను. నా వెఱ్ఱిఊహలను గూర్చి నే నేమని చెప్పగలను? ఈనా తెలివితక్కువతనానికి నీవు లో లోపల నవ్వుకొని నన్ను కాపాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇట్టి నా వెర్రి | 163 | 304 | 2 | 203 |

అవ: శరణాగతియే బ్రహ్మప్రాప్తికి పరమోపాయ మంటున్నాడు.

సీ. వేడ్క నీ గుణములు వినుతిసేయుద మన్న
తగ గుణాతీతుండ వగుదు వీవు;
కన్నులచే నిన్నుఁ గనుగొంద మనుకొన్న
సన్నిధి మా కగోచరుఁడ వీవు;
పొదివి చేతుల నిన్నుఁ బూజింత మనుకొన్న
నూహింప విశ్వదేహుండ వీవు;
అదన నీ కేమైన నర్పింత మనుకొన్న
నాప్త సకలకాముఁ డగుదు వీవు;

ఆ. చిత్తమందు నిన్నుఁ జింతింత మనుకొన్న
నీ వచింత్యమహిమ నెగడుచుందు;
వీశ నిన్నుఁ జేర నేది యుపాయంబు?
ఉత్తమంబు నీ ప్రపత్తి యొకఁడె. 119

వేడుకతో నీ గుణాలు స్తోత్రం చేద్దామనుకుంటే నీ వేమో గుణాలకు అతీతుఁడవు. కనులారా నిను గాంచి ఆనందిస్తామంటే అనలు నీ సాన్నిధ్యమే(దర్శనమే) మాకు అగుపించదాయె. చేతులారా నిన్ను పూజిద్దామనుకుంటే నీవు ప్రపంచమే దేహముగా కలవాడవు. కాబట్టి పూజించనలవి కాదని భావం. సమయంలో నీ కేమైనా అర్పించా లనుకుంటే నీవు పూర్ణకాముడవు. మనసులో నిన్ను మననం చేయదలచితే నీవు చింతించరాని మహిమతో నెగడుచుంటివి. సకలమునకు ప్రభువైన నిన్ను చేరడానికి ఉపాయ మేముంది? నిన్ను పొందడానికి శరణాగతిని మించిన వేఱొక ఉపాయం లేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏ దుపాయము | 131 | 122 | 2 | 82 |

అవ: భక్తియోగంవల్ల పొందరాని దేదీ లేదనుచున్నాడు.

సీ. నీ పాదముల చింత నిబిడమైనను జాలు
నే పాతకములైన నేమి సేయు?
నేపార నీ భక్తి యింత గల్గినఁ జాలు
పైపయి సిరులెల్లఁ బాదుకొనును;
సొరిది నీ శరణమ్ముఁ జొచ్చితి ననఁజాలు
కరుణతో నప్పుడె గాతు వీవు;
నీ ముద్రలు భుజాల నెగడినచోఁ జాలు
నఱచేత లోకమ్ము లన్నియుండు;

తే. విరి యొకటి నీ పదద్వయి వేయఁజాలు
కొనలు సాగును కోరిన కోర్కు లెల్లఁ;
బలు విచారములేల? ని న్గొలుచువాఁడు
ధరణి నే రీతి నుండిన ధన్యతముఁడె. 120

ఓ శేషాద్రినాథా! నీ పాదస్మరణము బాగుగా నున్నచో ఎట్టి పాపములైనా ఏమీ చేయలేవు. భగవన్నామ స్మరణం పాపహరణ మన్న మాట. నీ పై భక్తియున్నచో సకలసంపదలు నెలకొంటాయి. నీ శరణు జొచ్చినంతనే కరుణతో నీవు కాపాడుతావు. నీ శంఖచక్రముద్రలు భుజాలపై ధరిస్తే అన్ని లోకాలు అరచేతిలోనే ఉంటాయి. ఒక్కపువ్వు నీ పాదాలపై పెట్టితే కోరికలన్నీ ఫలిస్తాయి. పలువిధములైన ఆలోచనలతో పనేమి? ఈ భూమిలో నిన్ను సేవించేవాడు ఎట్టివాడై యుండినప్పటికినీ మిక్కిలి ధన్యుడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పలు విచారములేల | 218 | 100 | 3 | 67 |

అవ: సామాన్యంగా మానవులు ఏ సందర్భాలలో దేవుని స్మరిస్తూ ఉంటారో తెలుపుతున్నాడు. అలమేలుమంగాపతి ఆపదమ్రొక్కులవాడు గదా!

**సీ. ధనవాంఛ మదిలోనఁ దవిలినప్పటివేళఁ**
**దప్పక నీ మీఁదఁ దలఁపు గలుగు;**
**భయదుఃఖముల బారిఁబడిన యప్పటి వేళఁ**
**బరువడి నీ మీఁద భక్తి గలుగుఁ;**
**బాపముల్ చుట్టునుం బ్రబలినప్పటివేళఁ**
**దలఁప నీ నామ కీర్తనము గలుగు;**
**భవరోగములఁ జిక్కి బడలినప్పటివేళ**
**నలువుగా నీ ప్రార్థనములు గలుగు;**

**తే. ఇన్నిటఁ దొలంగి ప్రీతి ని న్నెతిఁగి కొలుచు**
**వేళ నీ మన్ననలు గల్గు; విమలబుద్ధి**
**కట్టెదుట నిన్నుఁ గనులారఁ గన్నవేళ**
**పరమసుఖములు గలుగును ఫణిగిరీశ !** **121**

ధనము సంపాదించుకోరిక మనసులో పుట్టినపుడు తప్పక నీ మీద చింత కలుగుతుంది. భయదుఃఖముల పాలైనప్పుడు నీ మీద భక్తి ఏర్పడుతుంది. పాపములు చుట్టుముట్టినపుడు నీ నామ సంకీర్తనం సాగించవలెననే బుద్ధి పుడుతుంది. జన్మములనే రోగములకు లోనై అలసట చెందినపుడు నిన్ను ప్రార్థించడం జరుగుతుంది. కాని ఏ కోరికలు లేక ప్రీతితో నిన్ను సేవించినపుడు భక్తుడు నీ ఆదరణకు పాత్రుడవుతాడు. ఓ శేషగిరినాథా! నిర్మలమైన బుద్ధితో ఎట్టయెదుట నిన్ను కనులార కాంచినపుడు మాకు అపరిమితానంద సౌఖ్యాలు సమకూడుతాయి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అవియు నాకు | 183 | 416 | 2 | 280 |

అవ: మాయా ప్రేరితు లయిన జీవుల సంసారప్రవృత్తి యొక్క వైచిత్రిని వర్ణించుచున్నాడు.

**సీ. నేలఁ బాతెడు చీమ నిలువ కిట్టటు పాఱి**
**తల మోచి ధాన్యముల్ దాచిపెట్టు;**
**బయటఁ బాతెడు నీఁగ పలుపువ్వుఁ దేనెలు**
**కూర్చి గొందుల నెల్ల గ్రుడ్లుపెట్టుఁ;**
**గోర్కితో గిజిగాండ్లు గూండ్లను నిర్మించి**
**మిణుఁగుఱు దీపమ్ము లొనర పెట్టుఁ;**
**దలపోయఁ దామెంత? తమ కాఁపురము లెంత?**
**నరుల లంపట చెప్పఁదరమె యింకఁ?**

**తే. దఱచి చూడంగ నిదియెల్ల దైవమాయ;**
**మాయ తొలఁగిన నీ దాసమండలమ్ము**
**జగము గని నవ్వుకొందురు జాలితోడ**
**పావన వృషాద్రివాస ! పద్మావతీశ! 122**

నేలపై పారాడే చీమ నిలువకుండా ఇటునటు తిరుగాడుతూ తన భవిష్యత్తునకై ధాన్యకణాలను తలతో మోసితెచ్చి దాచుకొంటున్నది. అంతరాళాన పరుగులుదీసే తేనెటీగ రకరకాలపూల తేనెలను సంగ్రహించి పట్టులో పెట్టి సందులలో గ్రుడ్లుపెట్టి సంతతి వృద్ధిచేసుకుంటున్నది. ఆశతో గిజిగాండ్లు గూళ్ళు కట్టి వాటిలో మిణుగురు పురుగులను దీపాలుగా పెట్టుకొంటున్నవి. పరికింపగా పైజెప్పిన ప్రాణు లేపాటివి? వాటి కాపురాలెంత? ఇట్లుండగా ఎన్నో హంగులు కావలసిన సంసారుల అగచాట్లు చెప్పనలవి కాదుకదా! ఈ మమకారమెల్ల ఆలోచించి చూడగా దైవమాయయే. మాయతొలగిన నీ భక్తులు ఈ లోకాన్ని చూచి జాలితో నవ్వుకొంటారు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తానెంత బ్రదుకెంత | 281 | 468 | 3 | 315 |

అవ: భగవత్ప్రాప్తికై ప్రయత్నించుట జీవుని కర్తవ్యమను చున్నాడు.

**సీ. జలధివంటిది నాదు చంచలహృదయమ్ము**
**కల వింద్రియములను జలచరాలు;**
**ఒలసి భక్తి యనెడు నోడ నెక్కితి నేను**
**జలశాయి! నీ వను సరకుఁ దేర;**
**కుటిలమౌ నా మది కొండవంటిది పొంచి**
**యుండు కామాది మృగోత్కరాలు;**
**శరణాగతియె గాఁగ కరయష్టి యెక్కితి**
**మలయప్ప! నీ వను ఫలము కొఱకు;**

**తే. వసుధవంటిది నాదు మానసము; నీవు**
**నిధివి; నీ వను వసిద్రవ్వి నీ వనియెడు**
**పూరుషార్థమ్ము గైకొనఁ గోరుచుందుఁ**
**గామితార్థము నీడేర్పుమా ముకుంద! 123**

చపలమైన నా హృదయము సముద్రము వంటిది. ఇందులో ఇంద్రియాలనే జలచరా లున్నవి. ఓ జలశాయీ! నీ వనే సరకు తెచ్చు కోవడానికి నేను భక్తి అనే పడవ నెక్కితిని. వక్రమైన నా మనస్సు కొండవంటిది. అందులో కామాదులనే మృగాలు పొంచి ఉన్నవి. శరణాగతి అనే ఊతకఱ్ఱతో ఓ మలయప్పా! నీ వనే ఫలాన్ని పొందడానికి ఎక్కితిని. నా మనసు భూమి వంటిది. నీవే అందులో నుండే నిధివి. నీ వనే గునపంతో త్రవ్వి నీ వనే పరమపురుషార్థాన్ని పొంద గోరుతున్నాను. ఓ ముకుందా ! నా కోరిక నెరవేర్చు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నాకుఁ గలపని | 334 | 200 | 4 | 134 |

అవ: ఇంద్రియపశుప్రైన జీవునకు భగవత్కృప లేకుంటే పరమగతి లేదనుచున్నాడు.

సీ. పాపముల్ సలుపంగ నోపు నీ చేతులు
పుణ్యమ్ము గావింపఁ బూనుకొనవు;
గగనంబు గలయఁజూడఁగ నోపు నీ కనుల్
నాసాగ్రముఁ గనంగ గాసిపడును;
ఓష్ఠామృతంబాన నోపు నీ పెదవులు
మంత్రమ్ము జపియింప మచ్చరించు;
మాపుదాక చరింప నోపు నీ కాళులు
గుడి కొకపరి వలగొనఁగ బడలు;

తే. విశ్వమంతయు విననోపు వీనుగవకు
నదరు బధిరత స్తోత్రమ్ము లాలకింపఁ;
బుడమి భోగింపఁ బుట్టిన బొందియేల
పరమగతి కోపు నీ కృప వఱలకున్న? 124

ఈ పాడుచేతులు పాపాలు చేయ గల్గుతాయే కాని పుణ్యం చేయడానికి పూనుకోవు. ఈ పాడుకండ్లు ఆకాశాన్నంతా కలయజూస్తాయే కాని నాసాగ్రమందు దృష్టి నిలపడానికి కష్టపడుతాయి. ఈ పాపిష్ఠి పెదవులు అతివల అధర సుధారసాలు జుఱ్ఱుతాయే గాని తిరుమంత్రాన్ని జపించడానికి మచ్చరిస్తాయి. చీకటిపడే వరకు ఈ కాళ్ళు వ్యర్థంగా ఊరంతా కలయ దిరుగుతాయేకాని ఒక తడవైనా నీ గుడికి ప్రదక్షిణం చేయడానికి ప్రాలుమాలుతాయి. ఈ చెవులు ప్రపంచ వార్తలు వినడానికి ఉత్సాహం వహిస్తాయే గాని నీ స్తోత్రాలు వినవలెనంటే వాటికి చెవు డేర్పడుతుంది. భోగా లనుభవించడానికి భూమిలో పుట్టిన ఈ బొందికి నీ కృప లేకుంటే ఎలా ఉత్తమగతి లభిస్తుంది?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| భోగించఁ బుట్టిన | 150 | 230 | 2 | 154 |

అవ: అందరికంటె తానే అధముడ ననీ, శరణు జొచ్చిన తన్ను కాపాడుమనీ విన్నవించుకొంటున్నాడు.

సీ. **బహుపాదపములేని పండు నా హృదయమ్ము**
**బహువిషయాసక్తిఁ బండ దెపుడు;**
**వననిధులేని వాహినులచే నిండు నా**
**గుండియ యాసల నిండ దెపుడు;**
**పసరమ్ములేనియుఁ గసవుమేసి తనియు**
**ధనకాంక్ష నా మది తనియ దెపుడు;**
**ఒనర కార్చిచ్చేని యొకవేళ శాంతించు**
**శాంతి చెందదు నాదు స్వాంత మెపుడు;**

తే. **కఠినమగు లోహ మేనియుఁ గరఁగుఁ గాని**
**కరఁగ దెప్పుడు నా యెద; కడకు నేనె**
**తీలు; నాకంటె నిఖిలమ్ము మేలు; నిన్ను**
**శరణు సొచ్చితిఁ గరుణింపు తిరుమలేశ !** 125

అన్నిచెట్లు ఫలిస్తాయి. కాని విషయములందలి ఆశతో నిండిన నా హృదయం మాత్రం పండ బాఱదు అనగా-తృప్తి చెందదని భావం. సముద్రాలుకూడా నదులతో నిండుతాయిగాని నా గుండె ఆశలతో పూర్తికాదు. మరిమరి ఆశలు మనసులో పుట్టుచుండు నని తాత్పర్యం. పశువులు కసవు తిని తృప్తి వహిస్తాయి కాని, నా మనస్సు ధనాశతో తృప్తిపడదు. ఇంకా ఎక్కువ ధనాన్ని కోరుతుందని సారాంశం. దావాగ్ని అయినా ఒక సమయంలో చల్లారిపోతుంది గాని నా మనసు ఒకప్పుడు కూడా శాంతించదు. కఠినమైనప్పటికీ ఇనుము కరుగుతుంది కాని కర్కశమైన నా గుండె ఎప్పుడూ కరగదు. అనగా దయలేని దని అభిప్రాయం. అన్నిటికంటె నేనే అల్పుడను. తక్కినవన్నీ నా కంటె ఎంతో మేలైనవి. తిరుమలనాథా? నిన్ను శరణు వేడినాను. నన్ను దయతో చూడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నిఖిల మింతయు మేలు | 377 | 447 | 4 | 301 |

అవ: కామక్రోధాదు లుడిపి దాసుని తన్నుకాపాడుమని స్వామిని వేడుచున్నాడు.

సీ. తెగని కోరిక తీవతీరున నల్లంగఁ
దగదని మరలింపఁ దరమె నాకు?
క్రోధమ్ము కోడెనాగువలె నాల్కలు సాఁచఁ
గడఁగి పట్టంగ శక్యమ్మె నాకు?
వయసు మేఘమ్ము కైవడి సోన గురియంగ
వలదని యడ్డగా వశమె నాకు?
లోభమ్ము చేరి జలూకకైవడిఁ బీల్వఁ
దటి మట్టు పెట్ట సాధ్యమ్మె నాకు?

తే. గర్వ మెసరేఁగ మదమత్త గజము కరణి
కట్టివేయంగ నేరుపు గలదె నాకు?
వానిఁ జాయకుఁ దెచ్చు సత్త్వంబు లేదు
మాయ కేలిక నీ దాసు మనుపు మయ్య! **126**

తీరని కోరికలు తీగ మాదిరి అల్లుకుంటే కాదని మళ్ళించడానికి నాకు సాధ్యమా? కాదని భావం. కోపం నాగుపామువలె నాల్కలు చాస్తుంటే అణచివేయడానికి నాకు శక్యమా? కాదని తాత్పర్యం. ప్రాయం మేఘంమాదిరి జల్లులు కురుస్తుంటే అడ్డగించడానికి నా వశమా? కాదని తెలియునది. లోభం జలగ విధంగా పట్టుకొని నెత్తురు పీలుస్తుంటే సమయంలో దానిని హింసించడం నా తరమా? కాదని గ్రహించునది. మదపు టేనుగు రీతిగా గర్వం విజృంభిస్తే దానిని బంధించి లోబఱచుకొనగల్గిన నేర్పు నా కున్నదా? లేదని అభిప్రాయం. పై చెప్పిన వాటిని దారికి తేగల శక్తి నాకు లేదు. మాయచేతనే కామాదులు ప్రబలుతున్నాయి. మాయకు నీవే ప్రభుడవు కాబట్టి మాయను తొలగించి నీ దాసుణ్ణి నన్ను రక్షించు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మాయామయము | 236 | 208 | 3 | 139 |

అవ: తన దుర్గుణములు తలచుకొని పరితాప పడుతున్నాడు.

**సీ. జలధుల యుప్పెల్లc జప్పరించితిc గాని**
**యిసుమంత సుజ్ఞాన మెఱుcగ నైతి;**
**నవని నెన్నెన్ని దేహములు దాల్చితిc గాని**
**అతిభోగకాంక్షc బాయంగ నైతి;**
**నే వేవొ బాసల నేమొ ప్రేలితిc గాని**
**తమి నీదు నామమ్ముc దడవ నైతి;**
**సృష్ట్యాది నాలిసంసృతిపా లయితిc గాని**
**మేల్మి మోక్షపుc ద్రోవ మెలcగ నైతి;**

**తే. యుగముల కొలంది దినము లిట్లూర కేను**
**పుచ్చితిం గాని సద్బుద్ధిc బొంద నైతి;**
**నకట! నా బ్రదు కాశ్చర్య మాయె నాకె**
**యన్నిటికి సెలవుగ శరణంటి నయ్య! 127**

సముద్రాల ఉప్పునంతా చప్పరించానే గాని కొంచెం కూడా జ్ఞానాన్ని చవిచూడలేక పోయాను. ఎన్నో జన్మలు గడవడంవల్ల లెక్క లేనన్ని శరీరాలు ధరించానే గాని సుఖాలు అనుభవించడంలోని కోరిక మాత్రం వీడలేకపోయాను. ఎన్నో భాషలు నేర్చి ఏమేమో పదటినానే గాని ఆసక్తితో నీ నామం ఉచ్చరించ లేకపోయాను. పుట్టినది మొదలు సంసారలంపటములో పడ్డానే గాని పరమమైన మోక్షమార్గంలో అడుగు పెట్టలేక పోయాను. యుగాలనుండి ఈ రీతి వ్యర్థంగా దినములు గడపి వేశానేగాని సద్బుద్ధిని పొందలేకపోయాను. అయ్యో! నా బ్రతుకు నాకే ఆశ్చర్యంగా ఉంది. ఇన్నిటికి సెలవుగ ఇప్పుడు నిన్ను శరణు జొచ్చుచున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| హరిహరి | 249 | 283 | 3 | 191 |

అవ: దాసుని దోషాలు మరచి రక్షించువాడు దేవు డొక్కడే యనుచున్నాడు.

సీ. కామినులం జూచి కన్నులచేఁ గొంత
చెడుమాట లాలించి చెవులఁ గొంత
కానిచోట్లకు నేగి కాళులచేఁ గొంత
మానని క్రోధంపుమతిని గొంత
నానానృతము లాడి నాలుకచేఁ గొంత
దానముల్ పట్టి హస్తములఁ గొంత
ఏడు జేనలమేన నీ రీతి దురితంబు
పూటపూటకుఁ బెద్దప్రోవు లాయె;

తే. పుట్టిన దినమ్ము మొదలు నే పుణ్య మేమి
కట్టుకొన నైతి నిన్నెట్లు కావు మనుచ
వేఁడుకొందును; నేరముల్ విస్మరించి
కొనకు దాసుల రక్షించు ఘనుఁడ వీవె ! 128

పరకాంతలను కామదృష్టితో చూడడంవల్ల కన్నులచే కొంత, నింద లాలించడంచేత చెవులవల్ల కొంత, చెడుచోట్లకు నడవడంవల్ల కాళ్ళచే కొంత, మానని క్రోధం గల మనసుచేత కొంత, అనేకములైన అబద్ధములాడి నాలుకచే కొంత, దానాలు పట్టడంవల్ల చేతులచే కొంత, ఈ విధంగా ఏడుజేనల పొడవుగల యీ శరీరంలో దినదినమునకూ పాపం పెరిగిపోయింది. జన్మమెత్తినది మొదలు నేను ఏ పుణ్యమూ చేసినవాణ్ణి కాను. ఇక నిన్ను కాపాడుమని ఎట్లా ప్రార్థించేది? తప్పు లన్నిటినీ మన్నించి చివరకు దాసుల్ని కాపాడే ఘనుడవు నీవే కదా స్వామీ !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పుట్టినది మొదలు | 257 | 327 | 3 | 221 |

అవ: భగవద్దాస్యము లభించేవరకూ ద్వంద్వాదులు నశింప వను చున్నాడు.

**సీ. తొలఁగవు శీతోష్ణములు మోదఖేదముల్**
**మరణభయమ్ములు మానుదనుక;**
**ఉడుగవు కాంక్ష లుద్యోగముల్ చింతలు**
**పొడవౌ విరక్తి తాఁ బొడము దనుక;**
**చిత్తవికారమ్ము, చెడుగుణమ్ములు, దోష**
**మణఁగవు భోగేచ్ఛ లణఁగు దనుక;**
**చేసిన దురితమ్ము చెడదు; వ్రాఁతఫలమ్ము**
**వీడ దజ్ఞానంబు వీడు దనుక;**

**తే. తెగవు భవబంధములు; నెడతెగని గర్వ**
**మింత పాయ; దాత్మజ్ఞాన మీ వొసంగు**
**దనుక గోవింద! యివియెల్లఁ దగులుచుండు**
**గట్టిగా నీదు దాస్యంబు గలుగు దనుక.** **129**

మరణభయం తొలగిపోయేవరకూ శీతోష్ణములు, సుఖదుఃఖాలు ఇత్యాది ద్వంద్వములు వదలిపెట్టవు. ప్రగాఢమైన వై రాగ్యం కలిగే వరకూ కోరికలు, ప్రయత్నాలు, ఆలోచనలు విడిచిపోవు. ఇహలోక సుఖాలు అనుభవించవలెననే ఆశ నశించేవరకూ మనోవికారము, చెడ్డ గుణాలు, దోషాలు అణగిపోవు. అజ్ఞానం వదలిపోయే వరకూ చేసినపాపం చెడదు. నొసటివ్రాత చెఱగదు. గోవిందా ! ఆత్మజ్ఞానాన్ని నీవు ప్రసాదించేవరకూ సంసారబంధాలు తెగవు. గర్వము వీడదు. దృఢమైన నీ కైంకర్యం అబ్బేవరకూ పైని పేర్కొన్న అవగుణాలు ఆవాహనమౌతూ ఉంటాయి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దేహము సమ్మంధము | 239 | 223 | 3 | 149 |

అవ: పరమార్థమునకై పాటుపడని జీవితం నిష్ఫలమంటున్నాడు.

**సీ. కోర్కితోఁ గొంత చన్గొండ లెక్కితిఁ గాని**
**యెలమి మోక్షపుమెట్టు నెక్కనైతి;**
**అడరు జవ్వన మను నడవిఁ జొచ్చితిఁ గాని**
**హరిభక్తి సంజీవి నరయ నైతి;**
**సంసారజలధిలో సంచరించితిఁ గాని**
**వైరాగ్యరత్నంబు వడయ నైతి;**
**బహుజన్మ రణరంగవిహృతి సల్పితిఁ గాని**
**కామాదిరిపులఁ జక్కఁడప నైతి;**

**ఆ. తను వనియెడి కల్పతరువున విజ్ఞాన**
**ఫలము కోయలేని బడుగు నైతిఁ;**
**గాని నీదు కరుణఁ గ్రమ్మబ కర్మాల**
**తట్టుపడక చాలఁ దనిసినాఁడ. 130**

ఆశతో అతివల స్తనాలనే పర్వతాల నెక్కితినే గాని ప్రీతితో మోక్షసౌధాన్ని అధిరోహించడానికై మొదటి మెట్టయినా ఎక్కలేదు. విజృంభించే యౌవన మనే వనంలో ప్రవేశించానే గాని అందులోని హరిభక్తి అనే సంజీవ నౌషధిని కనుగొనలేక పోయాను. సంసార మనే సాగరంలో బాగుగా ఈదులాడితినే గాని అందులోని వైరాగ్యమనే రత్నాన్ని పొంద లేక పోయాను. జన్మపరంపర లనే యుద్ధభూమిలో విహరించానే గాని నాలోనుండే కామాదులనే శత్రువులను జయించలేక పోయాను. శరీర మనే కల్పవృక్షంలో విజ్ఞానమనే ఫలాన్ని కోయలేని అశక్తుడ నయ్యాను. అయినప్పటికీ నీ దయ నా మీద చక్కగా ఉండడంవల్ల కర్మబంధాలకు జిక్కి బాధపడకుండా నిత్యతృప్తుడనై యున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సంతలఽ చొచ్చితి | 105 | 27 | 2 | 19 |

అవ: కామాతురుల పాట్లను వర్ణించుచున్నాడు.

సీ. దుండగంపురిపులు దోఁచంగ తమకాన
 కొండ లెక్కెడునట్లు, దండు వెడలు
 మదనుదాడికి జంకి మగువల పాలిండ్ల
 కొండ లెక్కుచు గోడు గుడుతు రయ్య!
 పొదిగొన్న యలపుతో పొదల క్రిందికి భీతిఁ
 దూఱిన యట్లు రంభోరుబాహు
 వల్లరీకుంజముల్ వడి దూఱి కెమ్మోవి
 చిగురు నాఁకటికి భుజింతు రయ్య !

తే. వలస గంపలరీతి లంపటము దాల్చి
 తలఁకుచుం బాఱఁజాలక దాఁగినట్టు
 లెఱుఁగకయ నిన్ను, దాఁగుదు రింద్రియముల
 తలవరుల యిండ్లనే తిరుమలనివాస ! 131

దుర్మార్గులైన శత్రువులు దోచడానికి ప్రారంభించగా వేగంతో కొండలపైకి ఎగబ్రాకినట్లుగా, దండెత్తివచ్చిన మన్మథునిధాటికి తట్టుకో లేక కొందరు స్త్రీల కుచములనే కొండల నాశ్రయించి కష్టమనుభవిస్తారు. విరోధులవల్ల భయంతో పరుగెత్తి అలసిపోయి పొదరిండ్లలో దాగిన విధంగా, మదనబాధితులు కొందఱు అంటి[illegible] తొడలుగల మగువల యొక్క తీగల వంటి భుజములలోనికి దూరుతారు. కాందిశీకులు ఆకటి బాధతో ఆకులు, అలములు తిన్నట్లు మరుబారిబడిన వారు స్త్రీల ఎఱ్ఱని పెదవు లనే చిగుళ్ళు చప్పరిస్తారు. వలసగంపలను మోసేవిధంగా జీవులు సంసారలంపటం భరిస్తూ పరుగెత్తలేక ఇంద్రియములు అనే కావలివాళ్ళ యిళ్ళలోనికి ప్రవేశించి నానాబాధలకు గురి అవుతారు. పరమాత్ముడ వైన నిన్ను ఎరుంగని ప్రాణుల పాట్లు ఇట్లున్నాయి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కూడులేక | 38 | 234 | 1 | 157 |

అవ: శరణన్న వారిని సంరక్షించే నీ బిరుద మెంచుకొనియైనా తన్ను రక్షింపు మనుచున్నాడు.

**సీ. ఘోరశరీరదుర్గుణ మేమి గలిగిన**
**నవలఁ బ్రకృతిఁ బోయి యడుగ వయ్య !**
**ఈ పుట్టువున నేర మేమి గల్గిన నన్నుఁ**
**బ్రభవింపఁ జేసిన బ్రహ్మ నడుగు;**
**పంచేంద్రియములఁ బాపం బేమి గలిగిన**
**నతనుని కడ కేగి యడుగుమయ్య !**
**నా కర్మముల వంచన మ్మేమి గలిగిన**
**మతి యట్లు సేయించు మాయ నడుగు;**

**తే. ఎల్లచేఁతల నపరాధ మేమియున్న**
**మించు కృప గురుఁ జూచి మన్నించవయ్య !**
**నన్ను నీ వేమి చూతువు ? నిన్నుఁ జూచు**
**కొని యయిన నేలుమా యేడుకొండలయ్య !** **132**

మాయచే ప్రేరితుడనై దుర్గుణాలకు లోనైతిని కనుక ఈ శరీరంలో దుర్గుణాలేమైనా ఉంటే అందుకు కారణమైన ప్రకృతి నడుగు. ఈ జన్మలో నాలో నేర మేమైనా నీకు కన్పిస్తే నన్ను పుట్టించిన ఆ బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి కనుక్కో. నా పంచేంద్రియా లేమైనా పాపం చేసియుంటే వాటిని ఆ విధంగా ప్రేరించిన మన్మథుని చెంతకేగి ప్రశ్నించు. నేను చేసే కర్మలందు ఏదేని మోసం ఉంటే అట్లా నాచేత చేయించే ఆ మాయనే అడుగు. నాచేయు పనులలో తప్పిదం ఏ మాత్రమున్నా అతిశయించిన దయతో నీవు మా గురువు (ఆచార్యులు) గారిని చూచియైనా నన్ను మన్నించు. స్వామీ ! నన్నేమి చూస్తావు? నాలోని తప్పు లేమి లెక్కిస్తావని భావం. శరణాగతత్రాణుడనే నీ బిరుదాన్ని గూర్చి ఆలోచించుకొనియైనా నన్నేలు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నాకు నందుకేమి | 105 | 28 | 2 | 19 |

అవ: నిజమైన భగవత్పూజ ఎట్టిదో వివరిస్తున్నాడు.

సీ. ఇందు శ్రీహరిగలం దండు లేఁ దనియెడు
నిందకుఁ బాయుటే నీదు పూజ;
కొందఱు చుట్టాలు కొందఱు పగఱను
భేదమ్ము వీడుటే నీదు పూజ;
దీవన లెట్టివో తిట్టు లట్టివె యంచు
నెమ్మది నెంచుటే నీదు పూజ;
ఇనుమును పెంకును హేమమ్ము సమముగా
నిచ్చలు చూచుటే నీదు పూజ;

తే. తా స్వతంత్రుఁడ ననియెడి దర్ప ముడిగి
నీవె సర్వస్వ మనుటయే నీదు పూజ;
దనుజమర్దన ! భవదీయ దాసకోటి
నాదరముతోడఁ గనుటయే నీదు పూజ. 133

భగవంతు డిచ్చట నున్నాడు, అచ్చట లేదు అనే వాదనచేసి నిందకు పాత్రుడు కాకుండటమే నీ యొక్కపూజ. తనవారూ, పగవారూ, అనే భేదదృష్టి వీడటం, నిందాస్తుతులను సమానముగా నెంచడం, ఇనుము, చిల్లపెంకు, బంగారం-వీటిని ఒకే విలువగల వానిగా భావించడం, తాను స్వతంత్రుడ ననే గర్వం వదలి నీవే సకల మని ఎఱుంగుట, నీ దాసవర్గాన్ని ఆదరణతో చూడడం ఓ దనుజారీ? నీ పూజలే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నిండు మనసే | 256 | 320 | 3 | 216 |

అవ: ఆత్యంతికమైన భగవద్భక్తియే పరమ సౌఖ్యప్రదమనీ, తక్కినవి బంధకాలనీ అనుచున్నాడు.

**సీ. కుల మెంత గలిగినఁ గూడించు గర్వమ్ము;**
**చల మేర్పడిన రేఁపు జగడములను;**
**తలఁ పెంత పెంచినఁ దగిలించు కోరికల్**
**ధన మబ్బ లోభంబు దట్ట మగును;**
**ఘనవిద్య యొదవినఁ గ్రమ్ముకొను మదంబు;**
**అందచందములు మోహమ్ము రేఁపు;**
**తరుణు లగ్గవయిన తాపముల్ సమకూడు;**
**సిరు లెన్నియున్నను చింత హెచ్చు;**

**తే. భక్తి నీ యందు పెరుఁగుటే పరమసౌఖ్య**
**మింతకన్నను నిజ మొక్కఁ డెందు లేదు;**
**నిన్నుఁ గొలువంగ బెళకులు నిలిచిపోవు**
**నంత కంతకు నానంద మతిశయిల్లు. 134**

గొప్పకులం గర్వానికి, ద్వేషం జగడాలకూ, ఆలోచనలు కోరికలకూ, ధనం లోభానికీ, చదువు మదానికీ, అందం మోహానికీ, స్త్రీల పొందు తాపానికీ, సంపత్తులు చింతలకూ, కారణా లవుతాయి. ఓ శ్రీనివాసా ! నీ యందలి భక్తి పెంపే పరమసౌఖ్యాన్నివ్వగలది. ఇంతకు మించి వేరే నిజం లేదు. నీ స్మరణవల్ల చాంచల్యం నశిస్తుంది. క్రమంగా ఆనందం అతిశయిల్లుతుంది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| భక్తి నీపైదొకటే | 256 | 322 | 3 | 217 |

అవ: జీవుని రక్షించవలసిన బాధ్యత పరమాత్మదే యనుచున్నాడు.

సీ. **నీ సొమ్ము చెడకుండ నీవె కాపాడుకో**
**దాసుండ నే నీవు దైవతమవు;**
**జగము లేలుదు వంట జగతిలోపల నున్న**
**వాఁడ నీ వేలినబంట నగుదు;**
**ఆవును గొన్నచో గోవుతో దూడయు**
**జోక విలువకాని సొమ్ము గాదె !**
**న న్నీవె పుట్టించినా వంట ! నేఁ జేయు**
**పాపపుణ్యములు నీ పాలి వగును;**

తే. **అరుగను విత్తినట్టివాఁ డందులోని**
**కందిపంటకుఁ గూడ స్వీకర్త గాఁడె?**
**కలువలకుఁ జంద్రునట్లు వేంకటనగేశ !**
**అప్తుఁడవు జీవులకు నంతరాత్మ వగుట.** 135

శ్రీ వేంకటేశ్వరా ! నీవు దేవుడవు. నేను నీ దాసుణ్ణి, నీ సొమ్మును కనుక నీవే నన్ను కాపాడుకో. నీవు లోకాలు పాలించే వాడివి. నేను లోకంలో నివసించేవాడిని. కనుక నేను నీ వేలే బంటును. ఆవును వెలకు తీసుకొన్నప్పుడు దానితోపాటు దూడ కూడ కొన్నవానిదే గదా ! అలాగే నన్ను నీవు పుట్టించినావు. అనగా నేను ఆవువంటివాడను కాగా దూడవంటి నా పాపపుణ్యాలు కూడా నాతోపాటు నీకే చెందుతాయి. అరుగపైరు వేసిన వాడు అందులో వేసిన కందిపంటకు కూడా సొంతదారు అవుతాడు. అదే విధంగా నా లోని పాపాలకు కూడా నీవే స్వామివి. కలువలకు చంద్రుని విధంగా జీవులకు అంతరాత్మవు కాబట్టి నీవే మాకు అప్తుడవు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నీ సొమ్ము చెడకుండ | 187 | 441 | 2 | 297 |

అవ: తన దుర్గుణములు మన్నించి దాసానుదాసుని తన్నుబ్రోవుమను చున్నాడు.

**సీ. కామాతురత గోపికలఁ బొందఁ బ్రియమేని**
**కలదు నాలోఁ గాముకత్వ మెంతొ;**
**కంసాదులందుఁ గిన్కయె నీకుఁ బ్రియమేని**
**కలదు నాలోఁ గిన్క వలసినంత;**
**లోకుల వలువల లోభమే ప్రియమేని**
**నాలోభ మింత యనంగరాదు;**
**మద్దిమ్రాకులఁ గూల్చు మదమే ప్రియమ్మేని**
**నా మద మ్మెందుఁ గానంగ రాదు;**

**తే. చలమె ప్రియమైనచో నీకుఁ జైద్యు నెడల**
**సవతు లేనిది నాలోని చలము; నీకు**
**దాసమోహంబె ప్రియమేని దాసదాస**
**దాసుఁడను బ్రోవుమయ్య ! పద్మావతీశ ! 136**

ఓ పద్మావతీవల్లభా! గోపికల సాంగత్యానికి కామాతురత్వమే నీకు కారణమైతే నాలో ఎంతో కాముకత్వ మున్నది. కాబట్టి నన్ను పొందుము. కంసాదులందుండే క్రోధమే నీ కిష్టమయితే కావలసినంత క్రోధం నాలో ఉన్నది. ఇతరుల వస్త్రాలపై లోభగుణం నీకు ఇష్టమైతే నేను పరమలోభిని. అందుచే నీవు నన్ను చేరవచ్చు, మద్దిమ్రాకులు కూలద్రోయడంలో మదం నీకు ఇష్టమైతే నాలోనుండే మదం మరెక్కడా లేదు. శిశుపాలుని యెడ మాత్సర్యగుణం నీ కిష్టమయితే సాటిలేని మాత్సర్యం నాలో ఉన్నది. పైనిచెప్పిన అవగుణాలను నీ విష్టపడుదువు కాబోలు ! అన్ని అవగుణాలు నాలోనున్నవి గనుక అన్ని విధాల నేను నీకు అనుగ్రాహ్యుణ్ణి. దాసులలో నుండే మోహం నీకు ఇష్టమయితే నేను నీ దాసానుదాసుణ్ణి. నన్ను కాపాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎందుకు విచ్చేయనేల | 188 | 448 | 2 | 302 |

అవ: భగవంతుడే భక్తుని భక్తి మార్గంలో నడిపించవలె ననుచున్నాడు.

**సీ. మహి రోగములు వాప మందులున్నవి; మాన్ప**
**సహజదుర్గుణము భేషజము గలదె?**
**బహుబంధములు నీవు పాపినc జను నేమొ**
**అవి యేల విడుతు నే నహరహమ్ము?**
**తనరూపు చూడవచ్చును దర్పణమ్ములో**
**మనసు నద్దములోనc గనcగ నగునె?**
**చంచలత్వము నీ వణంచ నణcగు నేమొ**
**సంశయ మ్మేల నే జాఱ విడుతు?**

**తే. నాల్కచే నంజి రుచులc గనంగవచ్చుc**
**గాక కన్నులచేc జవి గనcగ వశమె?**
**ఈశ్వరుcడ వీవు గరుణింప నేమొ గాని**
**కూళజీవుcడ నా విధ మ్మేల విడుతు?** **137**

భూమిలో రోగాలు పోగొట్టడానికి మందు లున్నవిగాని పుట్టుకతో వచ్చిన చెడుగుణాలను పోగొట్టడానికి మందున్నదా? లేదు. అందుకు నీ మీది భక్తి యొకటే మందని గూఢార్థం. నాకున్న బహువిధ బంధాలను నీవు త్రెంచితే పోతాయేమోగాని వాటిని నే నెప్పుడూ విడిపించుకోలేను. తన రూపాన్ని అద్దంలో చూడవచ్చుగాని తన మనస్సును అందులో చూచుటకు శక్యమా? కాదు. అటులే కనబడ్డవాటిని సరిదిద్దుకోవచ్చు. కాని అగుపించని మనస్సును చక్కబెట్టుకొనుట సాధ్యంకాదని అభిప్రాయం. నా చపలత్వాన్ని నీ వణచివేస్తే అణగుతుందేమో! నేను సందేహాన్ని విడువను గదా ! నాల్కచే రుచు లెఱుంగవచ్చు గాని ఆ పని కన్నులచే వీలు కాదుగదా ! అట్లే భక్తివినా నిన్నెఱుంగుటకు వేఱుమార్గంలేదని భావం. ప్రభుడవగు నీవు నన్ను కరుణించవలెగాని తెలివిమాలిన జీవుణ్ణి నేను నా రీతిని విడువలేను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| గుల్ల గుల్లే | 314 | 83 | 4 | 56 |

అవ: తన అజ్ఞానాన్ని మన్నింపుమని వేడుచున్నాడు.

సీ. తోలు నెమ్ముల మేనితోఁ బుట్టి మునిఁగెదఁ
దోలు నెమ్ముల ముట్టి దోస మంచుఁ;
జైతన్యభరితముల్ శాకముల్ మెసవుచుఁ
బ్రాణిహింసన మతిపాప మనెదఁ;
బూతుపుట్టువు నెంచి పుణ్యముల్ గావించి
బూతుల సంసారమును భుజింతు;
పాతకమ్ములఁ బాప బహుదానములు సల్పి
యవల నన్యులఁ బోయి యడుగుచుందు;

తే. కర్మములఁ ద్రోసి ఘనముక్తి గందునంచు
వేయికర్మమ్ము లొనరింతు; వెఱ్ఱి దెలిసి
వేఁదుఱుం ద్రవ్వుచుండుదు వేంకటేశ!
మమత మన్నింపు ముఱుఁ బాలమంకువాఁడ. 138

తోలుతో, ఎముకలతో నిండిన ఈ శరీరాన్ని కలిగియుండీ కూడా వెలుపలి తోలునూ, ఎముకలనూ, తాకి అశుచి నయ్యానని స్నానం చేస్తుంటాను. జీవహింస చాలా పాపమంటాను. కాని చైతన్యంతో నిండిన కాయగూరలు బాగా మెక్కుతుంటాను. దేహం అసభ్యపు పనులచే పుట్టిందని, పుణ్యకార్యాలూ చేస్తూనే, బూతుపనులతో గూడిన ఈ సంసారాన్నే అనుభవిస్తుంటాను. దుర్దానాలు స్వీకరించడం వల్ల కలిగిన పాపాలు పోగొట్టుకోవడానికని మిక్కిలిగా దానాలు చేస్తూనే, ఇతరులను యాచిస్తుంటాను. కర్మసన్న్యాసం చేసి ముక్తిని పొందుతానంటూ, ఎన్నో కర్మలు చేస్తూనే ఉంటాను. నాలోని లోపాలను తెలిసికూడా వెర్రివాడనై మళ్ళీ మళ్ళీ ఆ లోపాలనే చేస్తుంటాను. నాకు మంకుతనం ఉగ్గుపాలతో అలవాటైంది. శ్రీ వేంకటేశ్వరా! మమకారంతో నా తప్పులు మన్నించు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వెఱ్ఱి దెలిసి | 231 | 177 | 3 | 119 |

అవ: శరీరం నీచమని ఎంచక దానికేవో అందచందాలు కల్పించే అజ్ఞానాన్ని వదలించు మని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాడు.

**సీ. ముఱికి శరీరమ్ము మోచి సిగ్గుపడక**
**పునుఁగు కస్తురిపూఁతఁ బూయుచుందు;**
**పునుకశిరమ్ముఁ బావనము సేసెద నంచు**
**ముప్పూట నీటిలో ముంచుచుందు;**
**పంచేంద్రియపుఁ బుట్టుఁ బ్రాపించి ప్రజచేత**
**మ్రొక్కించుకొని చాల మురియుచుందు;**
**నజ్ఞాన తమముచే నంధచిత్తుఁడ నయ్యు**
**దిక్కుల నెదిరికిఁ దెలుపుచుందు;**

**తే. ఇట్టిదీము భోగమ్ముల కెలసి, సార**
**హీనసంసారమే భువనేశ్వరముగ**
**విశ్వసించి, మోక్షమునకై వెదకుచుందు;**
**కన్ను దెఱపించి కావు వేంకటగిరీశ! 139**

ఓ వేంకటాద్రీశ్వరా ! ఈ మలినపుశరీరాన్ని ధరించినందుకు సిగ్గుపడక పై పెచ్చు దానికి పునుగు కస్తూరి మొదలైన సుగంధ ద్రవ్యాలు పులుముతుంటాను. ఎముకల చిప్ప అయిన తలకాయను పవిత్రం చేయడానికని దినమునకు మూడుసార్లు మునుగు తుంటాను. ఐదు ఇంద్రియాలకు స్థానమైన బొందిని ధరించి అందరిచేత మ్రొక్కించుకుంటూ మురిసిపోతుంటాను. అజ్ఞానమనే చీకటిచేత గ్రుడ్డివాడనై ఇతరులకు దారులు చూపు తుంటాను. మచ్చువల్ల జింక, మోసగింపబడిన రీతిగా, ఎఱవంటి భోగాలు ఆశించి సారంలేని సంసారమే భువనేశ్వరంగా (మహాపుణ్యక్షేత్రం) నమ్మి మోక్షాన్ని వెదకుతుంటాను. నా కన్ను తెఱపించి (జ్ఞానం కల్గించి) కాపాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వెట్టి దెలిసె రోకలి | 231 | 174 | 3 | 117 |

అవ: జీవుల తప్పులు లెక్కించక దయతో కాపాడుమని మొఱ పెట్టుకొంటున్నాడు.

సీ. పసర మడవిఁబడ్డఁ బసరము గలవాఁడు
వెదకి యింటికిఁ దెచ్చు విధము దోఁప
చెలరేఁగు నాసలఁ జిక్కెడు మానస
మ్మెసఁగ మళ్ళించి మ మ్మేలు మయ్య!
కుప్ప నూర్చెడువాఁడు కొలుచులు పఱగళ్ళఁ
జిందనీయక గాదెఁ జేర్చునట్లు
కన్న తండ్రివి మమ్ము కన్నకొంపలఁ జేరి
కనిపెట్టుకొనకుండఁ గావుమయ్య!

ఆ. కడుపులోని శిశువు కాలఁ దన్నినఁ దల్లి
యోరిమి కని పెంచు నొఱపు దోఁప
నీదు కుక్షిలోన నెగడు జీవులము మా
తప్పు లెన్నక దయ దలఁపు మయ్య! 140

పశువు అడవిపాలైనప్పుడు యజమానుడు వెదకి దానిని తన యింటికి చేర్చుకొనువిధంగా, అవధిలేని ఆశలపాలై పోయే మా మనస్సులను వెనుకకు మళ్ళించి (స్థిరంగా మాలో నిలిపి) కాపాడు. వరికుప్ప నూర్చేవాడు తన ధాన్యం ఇతరుల కళ్ళాలలో పడకుండ చూచుకొని తన బొట్టలలో భద్రపఱచుకొనే విధంగా నీవు మా తండ్రివి గదా, ఎవరంటే వారి యిండ్లు కని పెట్టుకొనియుండే దుర్గతి మాకు కలుగనీయకుండా రక్షించు. గర్భంలో నుండే బిడ్డ కాలితో తన్నినప్పటికీ తల్లి ఓర్పుతో బిడ్డను కనిపెంచే మాదిరి నీ కడుపులో నుండే జీవులమైన మా తప్పులు లెక్కపెట్టక దయతో చూడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సొమ్ము గలవాఁడు | 276 | 437 | 3 | 294 |

అవ: దాతవూ, దైవమూ అయిన నీవే దాసదాసుడయిన నన్ను రక్షించుమని శ్రీనివాసుని ప్రార్థిస్తున్నాడు.

**సీ. జనని గోపించి మొత్తిన బిడ్డఁ డేడ్చుచు**
**కొంగు లాగుచును బెనంగినట్లు**
**వెల్లివిరిగ నీవు విషయాలఁ జిక్కింప**
**నిందించెదను నేను నిన్నుఁ దలఁచి;**
**జనకుండు బాలుని చంక దించినతోడ**
**గోఁజాడుచును ముద్దు గునిసినట్లు**
**నాలోన నీ వుండి నా పయి మాయను**
**బచరింప నేమేమొ పదరుచుందు;**

**తే. మరగితిని నేమి సేయుదు మగుడి యెందుఁ**
**బోదు? తల్లివి, దండ్రివి, బోధకుఁడవు,**
**దైవమవు, దాత వీవె; నీ దాసదాసు**
**నన్నుఁ జేకొని కావు మనాథనాథ!** 141

దిక్కులేనివారికి దిక్కైన శ్రీ వేంకటేశ్వరా ! తల్లి కోపించి కొట్టగా బాలుడు ఏడుస్తూ ఆమె కొంగు పట్టుకొని పెనుగులాడే విధంగా తామర తంపరలైన ఇంద్రియార్థాలలో నీవు నన్ను చిక్కుకొనునట్లు చేయగా నిన్నుద్దేశించి దూషిస్తున్నాను. తండ్రి పిల్లవానిని చంక దించినతోడనే వాడు ఎత్తుకొమ్మని పీడిస్తూ ముద్దులుగురిసే మాదిరి, నాలో నీ వుండి మాయతో నన్ను కప్పివేయగా నే నేదేదో వదరుతున్నాను. స్వామీ ! నేను నిన్ను మరగినాను. ఎక్కడికి వెళ్ళగలను? నాకు తల్లీ, తండ్రీ, గురువూ, దైవమూ, దాతా–అన్నీ నీవే. నీ దాసానుదాసుణ్ణి; నన్ను నీవే కాపాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మరగితి నేమి సేతు | 189 | 455 | 2 | 307 |

అవ: ఆశతో నిన్ను కొలుస్తున్న తన్ను కాపాడుమని దైవమును వేడుకొంటున్నాడు.

**సీ. సిరు లిత్తు వని దుఃఖభరముఁ బాపుదు వని**
**కైవల్యపద మిచ్చి కాతు వనియు**
**ఆశకు దాసుండ నయి నిన్ను భజియింతు**
**నెందు నావల్ల నీ కేమి లేదు;**
**జననముల్ మరణముల్ సారె సారెకుఁ జూచి**
**వెనుకటి నీ కథల్ విని విని విని**
**పెనఁగొను నాసతో నినుఁ గొల్తు; నాసయే**
**యుపకార మొనరించు నొజ్జ యయ్యెఁ;**

**తే. లోకులు నుతింప, నీవు నాలో వసింప,**
**గురుఁడు బోధింప, నిన్ను నా కొఱకు నెంతు;**
**నెపము లెన్నక యవ్యాజ నిరుపమాన**
**కరుణ రక్షింపు మాశ్రితకల్పభూజ!** 142

ఆశ్రయించినవారి కోరిక లీడేర్చుటలో కల్పవృక్షంవంటి వాడవైన వేంకటరమణా ! నీవు సంపద లీయ గలవనీ, శోకాన్నీ పోకారుస్తావనీ, మోక్ష మిచ్చి సంరక్షిస్తావనీ ఆశకు దాసుడనై నిన్ను సేవిస్తున్నాను. నా వల్ల నీ కేవిధమైన లాభం ఎప్పుడూ లేదు. జననమరణాలు పలుమారు సంభవించడాన్ని ఆలోచించి, నీ ఉదారములైన కథలు మాటిమాటికీ విని, పెనవేసుకొన్న ఆశతో నిన్ను కొలుస్తున్నాను. ఆ ఆశయే నాకు మేలుచేసే గురువైనది. ప్రజలు నిన్ను పొగడుతుండగా, నీవు నాలో నున్నావని గురువు బోధించగా, నిన్ను నా మేలునకై స్మరిస్తున్నాను. సాకులు చెప్పక నిష్కపటమైన సాటిలేని దయతో నన్ను కాపాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నిరుహేతుకాన | 192 | 468 | 2 | 315 |

అవ: ఇంద్రియములు విషయములందు ప్రవర్తించడం సహజం. ఆ దోషాన్ని సైచి కాపాడు మనుచున్నాడు.

**సీ. నీ వెఱుంగని దేది? నీ యాజ్ఞ మోసితి**
**నీ వాఁడ నింతె మన్నింపుమయ్య !**
**కన్నుల కేదేని కనుట స్వభావమ్ము**
**కలదె నాలో చోటు కలుషమునకు ?**
**వీనుల కేదేని వినుటయే నైజమ్ము**
**తప్పు నా యందు సుంతయును గలదె?**
**నాల్కకుఁ జవియైన నంజు టాచారమ్ము**
**నలి యభోజ్యపు నింద నాకుఁ గలదె?**

**తే. ముక్కుగుణము మూ చూచుట, మొనసి తనువు**
**తనువుపొంతఁ గరంగుట తద్గుణమ్ము;**
**అన్నిటను నన్నుఁ బెట్టి నాయందు నీవు**
**పాయ కుంటివి నా యెడఁ బాప మేమి?** **143**

ఓ స్వామీ! నీకు తెలియనిది లేదు. నీ యాజ్ఞ శిరసా వహిస్తున్నాను. నేను నీవాడనే సుమా ! దేనినైననూ చూచుట కన్నులకు నైజగుణం. కాన నాలో దోషమునకు తావులేదు కదా! దేనినైనను వినడం చెవులకు సహజగుణం. కాగా నాలో దోషమునకు స్థానం లేదు గదా ! రుచిగల పదార్థాలను తినడం నాలుకగుణం. కనుక తినగూడని వాటిని తిన్నాననే నింద నాకు లేదుగదా ! ముక్కుకు వాసనచూచుట, శరీరానికి భోగ్యమగు మరో శరీరం చెంత పరవశించడం సహజగుణం. నీవు వదలక నాలో ఉంటూ, అన్నిటిలో నన్ను పెట్టితివి. కనుక నా యందు పాపము లేదు గదా!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నీ వెరఁగనిది | 180 | 398 | 2 | 268 |

అవ: దుర్గుణముల బారినుండి తన్ను సంరక్షింపు మని స్వామిని వేడుకొను చున్నాడు.

**సీ. తనువుతో భోగముల్ తలఁపకున్నఁ బెనంగు**
**చెలరేఁగి గరడిలో జెట్లరీతి;**
**ఎటనున్న లంపటా లెదుటనే పొలసెదు**
**జోడువాయని తోడునీడ లట్లు;**
**సొంట్లు సోదింపఁగాఁ జొచ్చు దుర్గుణములు**
**వాడవాడల తలవరుల మాడ్కి;**
**ఉదుటునఁ గామాదు లొక్కొక మిష వచ్చు**
**సుడిసి నడుమఁ జేరు చుట్ట లట్లు;**

**తే. తడవకున్నను కర్మముల్ తామె దించు**
**పనుల బడిబడి తిరిగెదు బంట్లపోల్కి;**
**పిలుపులేని పేరఁట మాయె వేంకటేశ !**
**బలిమి నీ రూపు నిలుపవే భావమందు. 144**

గోదాములో జెట్లు ఉత్సాహంతో పెనగులాడే విధంగా నేను స్మరించ కున్నప్పటికినీ భోగములు ఈ శరీరంతో పెనగులాడుతున్నవి. అనగా భోగేచ్ఛ శరీరాన్ని వదలడం లేదనుట. ఈ దేహం గరిడీవంటిది. ఇందు జెట్లవలె కోరికలు పరస్పరం పెనగులాడుతున్నవనుట. జతవీడని నీడ వలె ఎక్క డెక్కడివో తగులాలు ఎదురువుతున్నవి. వీథులలో దోషుల్ని కనిపెట్టడానికి తిరిగే భటులవలె నా లోని దుర్గుణాలు ఎప్పుడూ దోషాలు కనుగొనడానికే ప్రయత్నిస్తుంటాయి. చుట్టపక్కాలు ఆకస్మికంగా వచ్చినట్లె హఠాత్తుగా ఏదో నెపంతో కామ క్రోధాదులు దాపురిస్తుంటాయి. పనులలో అనుసరించి చరించే సేవకులమాదిరి నేను తల పెట్టకున్నప్పటికీ, కర్మలు తామే నన్ను కర్మాచరణకు పురికొల్పుతున్నాయి. ఇవన్నీ పిలువని పేరంటంగా వచ్చిచేరుతున్నవి. ఓ తిరుమలేశా ! నీ రూపాన్ని బలవంతంగా నా మనసులో నిలుపు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నారాయణ | 168 | 331 | 2 | 222 |

అవ: అంజనాద్రిపతి సర్వాంతర్యామి అనుచున్నాడు.

**సీ. నా తప్పు లోఁగొని నన్ను మన్నింపవే**
**చేఁత లన్నియుఁ జేసి చేరినాఁడ;**
**అందఱలో నీవె యంతరాత్మగ నుండ**
**నిందఱఁ బనిగొంటి నిన్నినాళ్ళు;**
**సకలంబునందు నీ చైతన్య మెసలార**
**నిక్కుచు వాహనా లెక్కినాఁడ;**
**లోకపూర్ణుండవై లో వెలి నీ వుండఁ**
**జెలఁగి పువ్వులు పండ్లు చిదిమినాఁడ;**

**తే. ఎల్లరకు నీవె ప్రభుఁడవై యుల్లసిల్ల**
**నేచి తొత్తుల బంటుల నేలినాఁడ**
**నంజనాద్రీశ ! నేను సర్వాపరాధి**
**ముం దెఱుఁగనయ్య ! రక్షింపు మ్రొక్కినాఁడ. 145**

ఓ అంజనపర్వత ప్రభూ! అన్ని రకాలైన తప్పుడు పనులు చేసి ఇప్పుడు నీ వద్ద చేరినాను. .నా తప్పులు నీవు కడుపులో నుంచుకొని నన్ను మన్నించు. నీవు అందఱిలో అంతరాత్మగా నుండగా నేను ఆ అందఱిచేత సేవలు చేయించుకొన్నాను. అనగా నిన్నే పనిగొన్న దోషినయినాను. అన్ని జీవులలో నీ చైతన్య ముండగా నేను గర్వించి వాహనాలు (గుఱ్ఱాలు మొదలైనవి) ఎక్కి తిరిగాను. నిన్నే స్వారిచేసిన అపరాధి ననుట. లోకమునందు నిండినవాడవై లోపల వెలుపల నీ వున్నావు గదా ! పూలను పండ్లను ఎన్నింటినో నేను ఛేదించినాను. అనగా నిన్నేహింసించితి ననిభావం. అందఱికిని నీవు ప్రభుడవై ప్రకాశించు చుండగా, ఆ అందఱిని నేను బానిసలుగా, బంట్లగా ఏలుకొన్నాను. నిన్ను ధిక్కరించితి నన్నమాట ! పై నుడివిన తప్పిదము లన్నియు నాయందు కలవు. నమస్కరిస్తున్నాను, నన్ను కాపాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నా తప్పు లోఁగొనవే | 87 | 427 | 1 | 286 |

అవ: వేంకటాచలపతినే దిక్కుగా నమ్మి భారమాయనపై నుంచు వాడే ముక్తుడగు ననుచున్నాడు.

**సీ. పెరిఁగి పెద్దను గాను పిన్నవాఁడను గాను**
**నే నింక బుద్ధుల నెఱుఁగు టెపుడొ?**
**బహు నరకమ్ములఁ బలుమాఱుఁ జొచ్చితి**
**భావమ్ములోపల భయము నొంద;**
**సతతమ్ము నే వేవొ చదువులు సదివితి**
**మంకుఁదనమ్మును మానఁబోను;**
**నెయ్యాన హేయంబు నిచ్చలు గడిగెద**
**చీయని రోయను సిగ్గుపడను;**

**తే. కాయములు మోచి యలయను; చేయుచుందు**
**దాన ధర్మాలు; కర్మముల్ దాఁట నింక**
**నేవె దిక్కంటి; భారమ్ము నీదె యంటి;**
**వరదయాసాంద్ర ! వేంకటపర్వతేంద్ర ! 146**

జ్ఞానవంతుడైన పెద్దవాణ్ణి కాను. అమాయకుడైన పిల్లవాణ్ణీ కాను. ఇక నే నెప్పుడు మంచిబుద్ధులు నేర్వడం? నేర్వలేనని భావం. అనేక నరకాల ననుభవించాను. కాని నా మనసులో కొంచెమైనా భయం చెందకున్నాను. ఎప్పుడూ ఏవేవో చదువులు చదివినానుగాని మూర్ఖత్వాన్ని విడువలేకపోయాను. చదివిన చదువులన్నీ నిరర్థకములైనవని భావం. ప్రతిదినమూ ప్రీతితో మలినాన్ని కడుగుతుంటానే గాని ఏవగింపుగాని, సిగ్గుగాని చెందకున్నాను. ఎన్నో జన్మలెత్తికూడ అలసట చెందకున్నాను. దానాలు, ధర్మాలూ, చేస్తూనే ఉన్నాను, కాని కర్మబంధాలను అతిక్రమించలేకున్నాను. దయతో నిండిన వేంకటాద్రీశా ! ఇక నీవే దిక్కు. భారము నీదే అంటున్నాను. నన్ను కాపాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పెరిగి పెద్దగాను | 255 | 317 | 3 | 214 |

అవ: భక్తుని తప్పిదము లెల్ల శ్రీహరి మన్నించుటచే అతడు ఉత్తముఁ డై బ్రతుకుచున్నా డనుచున్నాడు.

**సీ. ఈ నాల్కయే గదా యెల్లర నిందించి**
**నినుఁబొగడుటఁ జేసి నేఁడు చెలఁగె;**
**ఈ వీనులే గదా యెంతొ పాపము విని**
**నీ కథల్ వినుటచే నేఁడు పొలిచె;**
**ఈ తనువే గదా హేయకాంతలఁ గూడి**
**నీ ముద్ర లందుట నేఁడు నెగడె;**
**ఈ మనసే గదా యెన్నిటనో పాతి**
**నిను స్మరించుట నిల్చి నేఁ డెసఁగె;**

**తే. ఈ జననమే గదా చూచి యెన్నొ మంచి**
**చెడుగులన్ నీదు దాస్యాన చెలువు మీఱె;**
**ఇన్ని నేరముల్ వాపఁగా నే బ్రదికితిఁ**
**గాకయున్న నా పాటుకుఁ గడమ గలదె? 147**

ఈ నాలుకయే అందరినీ నిందించి దుష్టమై ఇప్పుడు నిన్ను కీర్తించడం వల్ల పవిత్రమైనది. ఈ చెవులే ఎన్నో పాపపు మాటలు ఆలకించి చెడిపోయి ఇప్పుడు నీ పుణ్యకథా శ్రవణంచేత పూతమైనవి. ఈ శరీరమే నీచకాంతల సాంగత్యంచేత నింద్యమై శంఖ చక్ర ముద్రలు ధరించడం వల్ల పావనమైనది. ఈ మనసే ఎన్నిటిమీదికో పరుగులుదీసి నిన్ను దలచుటచేత నిశ్చలంగా ఇప్పుడు నాలో నిలిచింది. ఈ పుట్టువు ఎన్నో మంచిచెడ్డలు అనుభవించి నీకు దాస్యం సలపడంవల్ల ఒప్పిదమై యున్నది. నా నేరాలను నీవు పోగొట్టగా నేను హాయిగా బ్రతుకుతున్నాను. లేకుంటే నాబాధలకు అవధి ఉండేది కాదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కాకున్న మాపాటు | 310 | 56 | 4 | 38 |

అవ: భక్తుడు సర్వదా సుఖవంతుడే యనుచున్నాడు.

**సీ. తల్లిదండ్రుల మోము తమిఁ జూచుచు నిసుంగు**
**లే సుఖదుఃఖమ్ము లెఱుఁగనట్లు**
**అంభోజనేత్రు మి మ్మాత్మఁ దలంచుచు**
**నే పుణ్యపాపమ్ము లెఱుఁగ మయ్య!**
**ఏలినవా రీయ నెపు డుడిగపువార**
**లన్యులఁ జేసాఁచి యడుగనట్లు**
**మధుసూదనుఁడ వీవు మమ్ము రక్షింపంగ**
**నెవరి నేమియుఁ గోర నెఱుఁగ మయ్య!**

**తే. ఇంట ధననిధి గలుగువాఁ డెపుడు లేమి**
**నెఱుఁగన ట్లాత్మ నీ వుండ నెట్టి వెలుతు**
**లెఱుఁగ కాడుచుఁ బాడుచు నిట్టి ముద్దు**
**గునియుచుంటిమి ఫణిశైలకూట నిలయ ! 148**

శేషపర్వతశిఖరం నిలయముగాగల దేవా ! చంటిపిల్లలు ఆసక్తితో తలిదండ్రుల ముఖాలు చూస్తూ, ఎట్టి కష్టసుఖాలు ఎఱుగనట్లె తామరల వంటి కన్నులుగల నిన్ను ఆత్మలో ధ్యానిస్తున్న మేము ఏ పుణ్యపాపాలు తెలియం. ప్రభువు తన సేవకులకు చాలినంత ధన మీయగా వా రితరుల యావికి చెయిసాచని విధంగా మధువనే రక్కసుని చంపిన నీవు మమ్ము కాపాడుతుండగా ఇతరుల నెవ్వరినీ అడగడం అనే మాటనే మే మెఱుగం. తన యింటిలో పెన్నిధిగలవాడు ఎన్నడూ పేదరికాన్ని ఎఱుగ నట్లుగా మా ఆత్మలో నీ వున్నందున మేము ఏ విధమైన కొఱతలులేక ఆడుతూ, పాడుతూ, హాయిగా ముద్దుమురిపాలతో సుఖిస్తున్నాము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఆడుతా పాడుతా | 268 | 390 | 3 | 263 |

అవ: కర్మలు బంధకారణాలు; ప్రపత్తి ముక్తిహేతు వనుచున్నాడు.

సీ. చొచ్చితి స్వర్గమ్ము సుకృతమ్ము లొనరించి
యిచ్చమైఁ గొల్చితి నెల్లసురల;
పుణ్యమ్ము పోలివోవఁ బూర్వభూతలమునే
చేరితి పురుషార్థసిద్ధి లేదు;
గాలించితిని విశ్వకర్త యెవ్వం డంచు
సారెకుఁ బొత్తముల్ చదివినాఁడఁ;
గడుసంశయమున నీకలవెల్లఁ దెలు పెక్క
ముదిసితి నేమియు ముందుఁ గాన;

ఆ. కర్మములకుఁ జిక్కి గంతులు వేసితి
నిన్నినాళ్ళదాక నేది లేక;
చింతలెల్లఁ బాయ శ్రీ వేంకటేశ్వరా!
నిన్ను శరణుఁజొచ్చి నెగడినాఁడ. 149

యాగాది పుణ్యకర్మలు చేసి ఫలితంగా స్వర్గాన్ని పొందినాను. అనేక దేవతాంతరములను ఉపాసించాను. పుణ్యం క్షీణించగా మళ్ళీ ఈ భూలోకంలో పుట్టినాను. ధర్మార్థ కామ మోక్షాలు సిద్ధించ లేదు. ఎన్నో గ్రంథాలు పలుమారు చదివినాను. ఈ ప్రపంచానికి కర్త ఎవడని ఎంతో విచారించాను. వీడని సందేహాలతో నా తల వెంట్రుకలు తెల్లబారినవి. ముసలివాడ నైనాను. ముందేదో కనలే కున్నాను. కర్మబంధాలకు చిక్కి ఎంతగానో ఇంతవరకు ఎన్నో ఎగురులు ఎగిరినాను. ఏమీ ఫలం లేక పోయింది. ఓ వేంకటేశ్వరా ! నా చింతలు నశించగా నిన్ను శరణు పొంది ఇప్పుడు సుఖవంతుడ నైనాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| హరి నిను | 230 | 172 | 3 | 115 |

అవ: నిన్ను ఒక్కమారు స్మరించినా నీవు కాపాడవలసినదే అనుచున్నాడు.

సీ. పెక్కుమారులు నిన్నుఁ బేర్కొని జపియింప
మఱిమఱి యెక్కునే మహిమ కొంత?
ఒక్కమాఱు జపించి యూరకున్నంతలోఁ
దఱిగిపోవునె నీదు పరమ మహిమ?
తగిలి కాలమ్మెల్ల ధ్యానమ్ము సేయ నీ
జిగిమేని కెక్కునే చేవ కొంత?
తగ నట్టు లొకవేళ దలఁపక మానిన
నిగురయి వాడునే యింతలోనె?

తే. పరుస మంటుట యొకమాఱె; పట్టి మమ్ము
చూడనేల? నీ మహిమలు చూచుకొనుము;
ఇన్నియేల? నీ వారమై యింటిలోన
నున్నఁజాలు; సన్నము దొడ్డు నెన్న నేల? 150

ఏడుకొండలవాడా ! పలుమారు నీ నామం జపిస్తే నీకు మహిమ పెరుగుతుందా ? పెరుగదని తాత్పర్యం. ఒక్కసారి జపించిమానిన మాత్రాన నీ మహిమ తఱిగిపోతుందా ? పోదని భావం. కలకాలం ఆసక్తితో నిన్ను ధ్యానిస్తే నీ అందమైన శరీరానికి శక్తి ఏర్పడుతుందా? ఏర్పడదనుట. ఆ విధంగా ధ్యానించడం ఒకప్పుడు మానితే నీ దేహం ఇగురువలె వాడుతుందా? వాడిపోదనుట. పరుసవేది ఒక్కసారి తాకినంతనేగదా ఇనుము బంగార మగుట? అటులే ఒక పర్యాయం జపించినా, ధ్యానించినా మమ్ము నీవే కాపాడవలె. ఇంత ఎందుకు? నీ మహిమలు నీవే చూచుకొనుము అనగా ఒకసారి నీ వాద నన్న వానిని కాపాడుట నీ వ్రతం కదా! అది జ్ఞప్తికితెచ్చుకో, మమ్మేల పరీక్షిస్తావయ్యా! నీ భక్తులమై మేము ఇంటిలో ఉంటే చాలదా? మా హెచ్చుతక్కువలు లెక్కలోనికి తీసుకొనక మమ్ము కాపాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మమ్ముఁ జూడనేల | 340 | 232 | 4 | 155 |

అవ: భగవత్సేవయే సకలార్థసాధక మనుచున్నాడు.

**సీ. కలకాల మొక్కండు కడఁగి చదువుచుండు**
**గరిమ నీ కృప నిన్నుఁ గను నొకండు;**
**ధరఁ బ్రయాసముతోడఁ దపము సల్పు నొకండు**
**శరణుఁ జొచ్చి యొకండు చనవరి యగు;**
**ఒకఁడు మోపులు మోయు నొకఁడు కొలువు దీర్చు**
**పొగడు నొక్కం డీవి పొందు నొకఁడు**
**ఆచార మొకఁడూను అందు మోక్ష మొకండు**
**పాటెల్ల నొకచోట భాగ్య మొకట;**

**తే. నీదు మూలంబు ఫలమెల్ల; నీవు మెచ్చి**
**యిచ్చినం గద్దు; జీవి ని న్నెఱుఁగకుండ**
**చీఁకటిం ద్రవ్వనేల? నీ సేవచేయు**
**నదియ నేరుపు శ్రీవేంకటాద్రివాస ! 151**

ఓ వేంకటాద్రివాసా! శ్రీనివాసా! ఒకడు బ్రతికినంతకాలమూ అధ్యయనం సాగిస్తూనే ఉంటాడు. మరొకడు నీ దయచేత నిన్ను దర్శించగల్గుతాడు. ఒకడు చాలా ప్రయాసతో తపస్సు చేస్తూంటాడు. ఇంకొకడు శరణు జొచ్చి నీ చనవుకు పాత్ర మవుతాడు. ఒకడు బరువులు మోస్తూ కష్టపడుతూనే ఉంటాడు. మరొకడు రాజ్యాలేలు తుంటాడు. ఒకడు ఊరక కీర్తిస్తూనే ఉంటాడు. మరొకడు ఈవులు పొందుతుంటాడు. ఒకడు ఆచారవంతుడై ఉంటాడు. వేరొకడు మోక్షాన్ని పొందుతాడు. కష్టం (కృషి) ఒకచోట, కలిమి మరొకచోట ఉంటుంది. ఇట్టి ఫలములు కలగడానికి నీవే మూలం. భక్తులకు నీవు దయదలచి ఇస్తేనే గద్దు. ప్రాణి నిన్ను తెలుసుకోలేక అజ్ఞానం త్రవ్వి తలకెత్తు కుంటాడు. నీ సేవ చేసే నేరుపే అన్నిటికన్న మిన్న.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పాటెల్లా నొక్కచో | 141 | 182 | 2 | 122 |

అవ: కొండంతదేవుడు కొండలరాయని కోరి కొలిస్తే పొందరానివి లేవనుచున్నాడు.

సీ. పసరమ్ము సురగవి వాంఛలు నెఱవేర్చు;
కుజము మందారమ్ము కోర్కు లొసఁగు;
కామితార్థములు చింతామణి శిల యిచ్చు
నిందిరాపతివి మా కిచ్చు టరుదె?
గాలిమేసి యొసంగు కారుమేఘము నీరు;
విక్రమార్కుని బొంత విత్త మొసఁగు;
కాలిన పెంచిక కప్పెర దివ్యాన్న
మిచ్చు శ్రీపతివి నీ విచ్చు టరుదె?

తే. ఏలికవు నీవు; దాసుల మేము నీకు;
వేఁడఁదగునయ్య నితరుల వేంకటేశ!
అండనే నిల్చియున్న కొండంతవాని
నిచ్చ నినుఁ గొల్వ మముఁ బ్రోచు టేమి యరుదు? 152

తిర్యగ్జంతువు కామధేనువు కోరిక లిస్తున్నది. మందారమనే స్వర్గలోకపు మ్రాను కాంక్ష లీడేర్చుతున్నది. చింతామణి అనే జడమైనరాయి వాంఛితాలు ఫలింపజేస్తున్నది. ఇవే అభీష్టములు సిద్ధింప జేస్తుండగా ఇందిరకు భర్తవైన నీవు మా కోరికలు తీర్చుటలో ఆశ్చర్య మేమి? గాలి మేసి కారుమబ్బు వర్షిస్తున్నది. విక్రమార్కుని బొంత విదిలిస్తే డబ్బులు రాలుస్తున్నది. కాలిన మసిబొచ్చె (అరణ్యవాసంలో ద్రౌపది దగ్గరనున్న అక్షయపాత్ర) రుచికరమైన వంటకాలు సమకూరుస్తున్నది. మఱి శ్రీపతివి నీవు భక్తుల అభీష్టముల నిచ్చుటలో ఆశ్చర్య మేమున్నది? నీవు మాకు పాలకుడవు. మేము నీకు దాసులము. కాగా మేము అన్యుల అడుగ జెల్లునా? చెల్లదనుట. చెంతనే కొండంతవాడవు నీ వుండగా నిను గొల్చి నీచే మేము రక్షింపబడుటలో వింత ఏముంది? లేదని తెలియునది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నీ వేలికవు | 92 | 455 | 1 | 305 |

అవ: సర్వం విష్ణుమయ మనీ, భక్తుని ఉత్తమగతికి ఆ భగవంతుడే కారణమనీ చెపుతున్నాడు.

**సీ. అంతయు నీవెగా హరి! పుండరీకాక్ష!**
**చెంత నీవే నాకు శ్రీధరుండ !**
**కులము నీవే నాకు గోవిందుఁడా! నీవె**
**కరుణానిధీ! నాకుఁ గలిమి యెల్ల;**
**తలఁపు నెలవు నాకు ధరణీధరా! నీవె**
**దామోదరా! నీవె తనువు నాకు**
**మనికియు నీవెగా మధుసూదనా ! నాకు**
**వినికియు నా కీవె విట్ఠలుండ!**

**ఆ. పుట్టు వీవె నాకు పురుషోత్తమా ! కొన**
**నట్టనడుము నీవె నందపుత్ర !**
**వెనుక ముందు నీవె విష్ణుదేవుఁడ ! నాకు**
**నెట్టన గతి యింక నీవె నీవె.** 153

తెల్లదామరలవంటి కన్నులుగల శ్రీహరీ! సర్వము నీవే. లక్ష్మిని ధరించినవాడా! నా వద్దనే నీ వున్నావు. ఓ గోవిందా ! నీవే నా కులం. దయకునిధివైన ప్రభూ! నా సంపద అంతయు నీవే. భూమి నుద్ధరించిన దేవా! నా ఆలోచన, నివాసమూ నీవే. ఓ దామోదరా ! నా శరీరం కూడ నీవే. మధువను రక్కసుని చంపిన స్వామీ! నా జీవితం నీవే. ఓ విట్ఠలా ! నాకు వినిపించేవాడవు నీవే. అనగా అనవరతం శ్రీశుగాథలే వింటా ననుట. ఓ పురుష శ్రేష్ఠుడా! నా పుట్టువు అనునది కూడ నీవే. నందనందనా! నేను పెరుగుట నశించుట కూడ నీవే. ఓ సర్వవ్యాపీ! నా ముందు వెనుకల నీ వున్నావు. ఇక నీవే నాకు ముమ్మాటికినీ గతి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అంతయు నీవే హరి | 80 | 385 | 1 | 258 |

అవ: అంజనాద్రీశుడే అందరినీ కాపాడే అమాయికదైవ మనుచున్నాడు.

**సీ. చేరి ని న్నొల్లని జీవుల నుదరాన**
**వీరుఁడవై మోతు వెట్టి వేమి?**
**నార పేరు నుడువ నా పే రనుచు బంధు**
**విధమునఁ దగిలెదు వెట్టి వేమి?**
**బంటులౌ వారికిఁ బరతంత్రుఁడవు నయి**
**వెంటఁ జరింతువు వెట్టి వేమి?**
**అనరాదు గాని రెం డడుకుల కుబ్బెదు**
**విన మాకు నవ్వగు వెట్టి వేమి?**

**ఆ. పావనులయి ప్రజలు బ్రదుకంగ వేవేల**
**పేళ్ళు పెట్టుకొనెదు వెట్టి వేమి?**
**వేంకటేశుఁడ వయి వేగ నెవ్వరికేని**
**వేడ్క వరము లిత్తు వెట్టి వేమి? 154**

ఓ ప్రభూ! నిన్ను సమీపించి నీకు విముఖులై నవారిని కూడా కడుపులో దాచుకొని వీరుడవై భరిస్తుంటావు. నీవు వెట్టివాడవా? ఎవడైనా "నార" అంటే "నారాయణా" అని నన్నే పిలుస్తున్నా డనుకొని చుట్టం మాదిరిగా పరుగెత్తి వస్తావు. అబ్బా! ఎంత వెట్టి వయ్యానీవు? దాసులకు లోబడి వారివెంట తిరుగుతుంటావు, నీవు వెట్టివాడవా? అనగూడదుగాని ఆ కుచేలుడు మురికిబట్టకొనలో ముడిచి తెచ్చిన రెండటుకులు తిని తృప్తి పడ్డావే. వింటే మాకు నవ్వు వస్తుంది. నీ వెట్టితన మేమిటి? జనులందరు పవిత్రులు కావలె ననే వెట్టితో నీవు లెక్కలేనన్ని పేర్లు పెట్టుకున్నావు. అనగా మానవులవి భగవంతుని పేళ్ళైతే ఆ పేరు కలవాడెవడైనా పవిత్రుడౌతా డన్నమాట. ఈ వేంకటేశావతారంతో ఎవ్వరికైనా ఎట్టి వరాలైనా ఇస్తుంటావు. నీ వెంత వెట్టివాడవయ్యా?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వెన్నలు దొంగిలునాటి వెట్టివా | 106 | 52 | 2 | 22 |

అవ: నీ యనుగ్రహముంటే ఎంతటి పాపియైనా కడతేరగల డనుచున్నాడు.

సీ. అధికుని గాచుట యరుదేమి నీకు ? న

న్నధముని గాచుట యరుదు గాక

మధురమౌ టరుదటే మధురమ్ము; చేఁదును

మతి తీపిఁ జేయుట యరుదు గాక

అనఘునిఁ గరుణించు టరుదగునే నీకు?

నతిపాపి న న్గాచు టరుదు గాక

కనకమ్ముఁ గనకమ్ము గావించు టరుదె? ఐం

గరుగ నిమ్మును మార్చు టరుదు గాక

తే. తత భయమ్మున నిను స్మరించితిని గాక
ఏను సుఖినైన తలపంగ నేల నిన్ను?
పన్నగ నగేశ! నీవు నా పాలఁ గలిగి
కనికరించిన నెన్నిక గాంతు గాక. 155

తీపిపదార్థం తీపిగా ఉండటంలో ఆశ్చర్యమేముంది? మఱి చేదును తీపిగా మార్చడమే అరుదైన విషయం. అట్లే నీవు గొప్పవానిని కాపాడటంలో ఆశ్చర్యమేముంది? నీచుని నన్ను కాపాడటమే అరుదైనవిషయం. బంగారాన్ని బంగారంగా చేయడం ఆశ్చర్య మేమీ కాదు. ఇనుమును హేమంగా మార్చడమే ఆశ్చర్యకరమైన సంగతి. ఆ విధంగానే పుణ్యవంతుని నీవు కరుణించడంలో అచ్చెరు వేముంది? పరమపాపినైన నన్ను కాపాడటమే అరుదైన సంగతి. నేను సంసారంవల్ల మిక్కిలి భయపడ్డాను, గనుక నిన్ను స్మరించాను గాని సుఖవంతుణ్ణే అయివుంటే నిన్ను తలచడం ఎందుకు? తలచనని భావం. ఓ శేషగిరీశా ! నీవు నా పాల గల్గి దయజూపితే ప్రసిద్ధి కెక్కుతావు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నిన్ను దలచి నీపేరు దలచి | 4 | 27 | 1 | 18 |

అవ: దైనందిన కృత్యాలతో, బాల్యాద్యవస్థలతో భగవంతు డీ జంతుజాలాన్ని సృష్టించాడు. అతడే ఈ జీవకోటికి దిక్కను చున్నాడు.

సీ. **రేపట మూత్ర పురీష విసర్గంబు**
**నా పయి నాఁకటి యలమటలును**
**పైపుగ సంతట కామవికారముల్**
**మఱి నిద్రమంపులు మాపులందు**
**కొన్నాళ్ళు బాల్యమ్ము కొన్నాళ్ళు కౌమార**
**మా వెన్కఁ గొన్నాళ్ళు యౌవనమ్ము**
**పన్నిన ముదిమియుఁ బైపయి కొన్నినా**
**ళ్ళున్నది యంతయు నుడుగు టవల**

ఆ. **జంతుకోటి కిట్టి సరవులు గల్పించి**
**పొదిపినావు భుజగభూధరేంద్ర!**
**తెలియుటెన్న డింక దేహి తనంతటఁ**
**దెలిపి ప్రోవ నీవె దిక్కు మాకు.** **156**

తెల్లవారగనే కాలకృత్యాలు తీర్చుకోవడం, ఆ పిదప ఆకటికి అన్నాదుల నారగించడం, ఆ తరువాత ఆహార ప్రభావంవల్ల మన్మథోద్రేకం చెందడం, అటుపిమ్మట రాత్రులందు ఒడలు తెలియకుండ నిద్ర పోవడం-ఇలా కాలం గడచిపోతుంది. బాల్య యౌవన కౌమార వార్ధకాలతో ఏండ్లు జరుగగా చివరకు శరీరపాటవం, ఇంద్రియాల పటుత్వం సన్నగిలిపోతాయి. ఓశేషాద్రినాథా! ఇట్టి దశాపరిణామములతో ప్రాణిసమూహాన్ని సృష్టించి సంసార జంబాల పటలంలో పడద్రోశావు. ఈ స్థితిలో జీవి తనంతట తానుగా నిన్ను తెలుసుకొనే దెప్పుడు? కనుక నీవే కనువిప్పు కలిగించి కాపాడు. స్వామీ! మాకు నీవే దిక్కు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తెలియుట యెన్నడు | 132 | 70 | 4 | 47 |

అవ: శ్రీనివాసుని ఉత్కృష్టతను ఉగ్గడించుచున్నాడు.

**సీ. అందఱ కాధారమగు పూరుషుఁ డితండు**
**విందారగించెను విదురు నింట;**
**సనకాది వంద్యుండు వనజసంభవునకు**
**బ్రహ్మపట్ట మిడిన పరముఁ డితఁడు;**
**ఇనమండలమ్మున నెసఁగు దేవుఁ డితండు**
**మొగి వేల్పులకు మూలభూతి యితఁడు;**
**సిసువై యశోదకుఁ, బసులకాపరియయి,**
**గోపికాప్రియుఁ డౌచుఁ గొరలె నితఁడు;**

**ఆ. అల కుచేలు నడుకు లారగించె నితండు**
**ఆద్యులైన నారదాదిమునుల**
**సరసకీర్తనములు జట్టిగొనె నితండు;**
**ప్రభల వేంకటాద్రి వఱలు నితఁడు.** **157**

అందరికీ ఆధారమైన ఈ పురుషోత్తముడు శూద్రుడైన విదురుని యింటిలో విందారగించినాడు. సనక సనందనాది దేవర్షులచే నమస్కరింప దగినవాడూ, పద్మమునుండి ప్రభవించిన అజునకు బ్రహ్మపట్టం గట్టిన ఉత్తమోత్తముడూ, సూర్యమండల మధ్యవర్తియై వెలిగే సాక్షాన్నారాయణమూర్తీ ఇతడే. దేవతా బృందానికి మూల (కారణ) మైన సంపద యితడే. యశోదకు బిడ్డడై, పసులకాపరియై, గోపికలకు వల్లభుడైనవా డితడే. దరిద్రుడుగా ప్రసిద్ధికెక్కిన ఆ కుచేలుని పిడికె డటుకులు ప్రీతితో నారగించిన భక్తపరతంత్రు డితడే. తొల్లిటి దేవబ్రహ్మర్షుల సరసములైన సంకీర్తనములను గుత్తగా గొన్నవాడు ఇతడే. వేంకటాద్రిపై కాంతులతో నొప్పారుతున్న శ్రీనివాసపరబ్రహ్మ మితడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అందరి కాధారమైన | 67 | 351 | 1 | 235 |

అవ: రక్షకుడు శ్రీనివాసుడే కాని చుట్టపక్కములు కారనుచున్నాడు.

**సీ. అయ్యయో! పోయెఁ బ్రాయంబు కాలంబును**
**ముయ్యంచుమతిచేత మోహి నయితి;**
**తనకుఁ జుట్టము లఁటే దయితలు తనయులు**
**వట్టియాసలఁ బెట్టువారె కాక**
**తనకు బాంధవులఁటే తల్లులు దండ్రులు**
**వగలఁ బెట్టుచు తిర్గువారె గాక**
**తన కంతహితులఁటే తమ్ము లన్నలు చెలుల్**
**వంతు వాసికి వచ్చువారె గాక**

**తే. వీర లందఱు నిజమని వీరి పొందు**
**చాల మేలని వేంకటాచలవిహారు**
**నడుగుఁదమ్ములు గొలువక యనద నయితి;**
**సంతకూటాల యలజడి స్రగ్గుచుంటి. 158**

అయ్యో! వయసూ, కాలమూ వృథాగా గడచిపోయాయి. త్రిగుణాత్మకమూ, చంచలమూ అయిన మనస్సుచేత అజ్ఞాని నైనాను. ఆలుబిడ్డలు వ్యర్థపుటాసలు కలిగించేవారేగాని నిజానికి బంధువులా? తలిదండ్రులు చిక్కులు పెట్టేవారే కాని వాస్తవంగా చుట్టములా? అన్న దమ్ములూ, స్నేహితులూ భాగాలకు పోటీపడేవారే కాని సత్యంగా మేలు చేసేవారా? వీరందరూ శాశ్వతులనీ, వీరితో కలసిమెలసి ఉండటం చాలా మంచిదనీ తలచి ఇన్నాళ్ళు శ్రీ వేంకటాచలపతి పద్మములవంటి పాదాలు కొలువకుండా దిక్కుమాలినవాడి నయ్యాను. కొఱమాలిన రచ్చల లోబడి కలవరపాటుతో కుమిలిపోతున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అయ్యో పోయ | 29 | 179 | 1 | 120 |

అవ: భోగములకై ఎగబడి పాపపుణ్యము లొనర్చువారి మౌఢ్యమును వర్ణించుచున్నాడు.

**సీ. ముందుజన్మల సిరు లొంద నోమెదఁగాని**
**కలుగు రూపమ్మేదొ తెలియఁజాల;**
**బవళించుటకుఁ బ్రక్క పఱచుకొందును గాని**
**లేచెదనో లేదొ లేదు రూఢి;**
**వల్లఁజూచి చెలుల వలపించెదను గాని**
**కాయంబు ముదియుటఁ గాంచ నేరఁ;**
**బాపముల్ మఱచియే బ్రదుకుచుంటిని గాని**
**వడి చిత్రగుప్తుఁడు వ్రాయు టెఱుఁగ;**

**తే. వెనుక ముందఱ లరయని వెఱ్ఱి నేను**
**మనసు మరు లుడిగించెడు మంద దేదొ?**
**వేంకటాద్రీశు నెక్కడో వెదకుచుందు**
**నతఁడు నా దైవమయి ప్రోచు టాత్మఁ దలఁప.** **159**

రాబోవు పుట్టుకల్లో సంపదలు నాకు సమకూడవలెనని ఎన్నో వ్రతాలు చేస్తానే కాని ఆ కలుగబోయే జన్మల్లో నే నేజంతువుగా జన్మిస్తానో నాకు తెలియదు. సుఖంగా నిద్రించడానికై ప్రక్క వేసుకుంటానే గాని నిద్ర నుంచి మళ్ళీ హాయిగా లేస్తానో లేవనో నమ్మకం లేదు. వీలు గల్గినప్పుడు స్త్రీలు నన్ను ప్రేమించునట్లు చేస్తానే గాని నా శరీరం ముదియుట నే నెరుగను. పాపముల సంగతి మరచి జీవిస్తున్నానే గాని చిత్రగుప్తుడు నా చర్యలను గూర్చి వ్రాసే విషయాన్ని తెలియను. వెనుకముందులు తెలియని వెఱ్ఱివాణ్ణి. మనసులోని ఆశలను ఉపశమింపజేసే మందేదైనా ఉన్నదో లేదో తెలియదు నాకు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వెనుకేదో ముందరేదో | 103 | 16 | 2 | 11 |

అవ: హరిచరణ దాస్యము లభించుటయే భాగ్యముగాని తక్కిన వానితో అక్కర లేదనుచున్నాడు.

**సీ. ఇహపరమ్ముల రెంట నెదియైన నేమిలే**

**హరిభక్తి గలిగిన నదియ చాలు;**

**ఎట జనించిన నేమి యెటనున్న నేమిలే**

**హరిదాస్య మొదవిన నదియ చాలు;**

**నాకం బయిన నేమి నరకం బయిన నేమి**

**హరినామ మబ్బిన నదియ చాలు;**

**తుచ్ఛపుబంట్రైన దొరయైన నేమిలే**

**హరిసంస్మరణ మున్న నదియ చాలు;**

**తే. పరుల నిందాస్తుతులతోడఁ బని మతేమి?**
**హరిచరణసేవ దొరకుట యదియ చాలు;**
**చదువు వచ్చిన రాకున్న సప్తశైల**
**సదనుపయి నాకుఁ దలఁపున్న నదియ చాలు. 160**

హరిభక్తి ఉండవలె గాని దివియైననూ, భువియైననూ ఒక్కటే. హరిసేవ లభించవలె గాని తాను ఏ కులములో పుట్టిననూ, ఎక్కడ ఎట్లున్ననూ ఒక్కటే. హరినామ సంకీర్తన కలుగవలె గాని స్వర్గమైననూ, నరకమైననూ ఒక్కటే. హరిధ్యానము సమకూడవలెగాని తాను బంట్రైననూ, ప్రభువైననూ ఒక్కటే. తనకు హరిచరణ సేవాభాగ్యము దొరకవలె గాని పరుల దూషణాలతో, ప్రస్తుతులతో పనిలేదు. ఏడుకొండలవానిపై తనకు భక్తిభావన ఏర్పడవలె గాని చదువు వచ్చినా, రాకున్నా ఒక్కటే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇహమే కాని | 132 | 131 | 2 | 88 |

అవ: శ్రీనివాసుని దయ చెందకున్నచో మనుజజన్మ వ్యర్థమే యనుచున్నాడు.

**సీ. తడిపి యుదికినట్టి మడుగులు నా యొదల్**
**కట్టి విడిచినంత ముట్టఁ దగవు;**
**వనములో విరిసిన వన్నెలపూలు నే**
**ముడిచివేసినయంత ముట్టఁ దగవు;**
**గగననిర్గతములు గంగనీళ్ళేని నా**
**గోరంటినన్ ముట్టుకొనఁగఁ దగవు;**
**దేవార్హ చందనాది ద్రవ్యతతులు నా**
**ముక్కు సోఁకినయంత ముట్టఁ దగవు;**

**తే. నాదు నాలుక యంటిన నవ్యపు రుచు**
**లుట్టిపడెడు పదార్థముల్ ముట్టఁ దగవు;**
**నేనె తక్కువ జగతి నన్నింటికంటె**
**శ్రీనివాసుని దయ నన్నుఁ జెందుదనుక.** **161**

ఉదికి ఆరవేసిన మడిబట్టలు నేను కట్టి విడిచినంతనే మైలబడి పోతున్నాయి. వనాలలో పూచిన రంగురంగుల పూలు నేను ధరించి తీసివేసినచో అవి మరల ధరించరాని వవుతున్నాయి. ఆకాశం నుంచి ప్రవహించే గంగోదకమైనా సరే నేను గోటితో అంటితే అపవిత్ర మవుతుంది. దేవతలకు సమర్పించ దగిన చందనము మొదలైన పూజా ద్రవ్యాలు నేను మూచూచిన మాత్రాన అవి ముట్టరాని వవుతున్నాయి. కొంగ్రొత్త రుచులు ఉట్టిపడే మంచి మంచి పదార్థాలు నేను నాలుకతో రుచిచూస్తే అవి ఎంగిలి వవుతున్నాయి. శ్రీనివాసుని దయకు నేను పాత్రుడ నయ్యే వరకూ ఈ లోకంలో నేనే అన్నిటికంటె తక్కువ.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అయ్యో నేనే | 114 | 80 | 2 | 54 |

అవ: దీనుల బ్రోచుట దేవుని కర్తవ్య మనుచున్నాడు.

సీ. **అరయ నా పన్నున కభయ మీవలెఁ గాక**
**పూనిక సుఖిగావఁ దా నిఁకేల?**
**వఱుతఁ బోయెడి వాని వడిఁ దీయవలెఁ గాక**
**దరివానిఁ దివియంగఁ దా నిఁకేల?**
**ఆఁకొన్న వానికి నన్న మీ వలెఁ గాక**
**తనిసిన వానికిఁ దా నిఁకేల?**
**కర్మసమారంభు కట్లూడ్చ వలెఁగాక**
**తగ ముక్తు నేలంగఁ దా నిఁకేల?**

తే. **పాపకర్మునిఁ బ్రోవంగవలయుఁ గాక**
**హిత మెఱుఁగు పుణ్యవంతుల కేల తాను?**
**ధృతివిహీనుని ననుఁ గృపఁ దేర్చకున్నఁ**
**దండ్రి తిరువేంగళేశుండు తా నిఁకేల?** **162**

ఆలోచించగా ఆపదనొందినవానికే అభయ మొసగవలె గాని ప్రయత్నించి సుఖవంతుణ్ణి కాపాడవలసిన అక్కఱ లేదు. వెల్లువలో కొట్టు కొనిపోయే వ్యక్తిని వెంటనే బయటికి లాగవలెగాని ఒడ్డున నున్న వానిని లాగడ మెందుకు? ఆకలిగొన్న వానికి అన్నం పెట్టవలె గాని భుజించి తృప్తి చెందినవానికి అన్నం పెట్టవలసిన అవసరం లేదు. కర్మల జేయు వాని కర్మబంధాలను ఊడదీయవలెగాని ముక్తుడైనవానికి రక్షణ ఎందుకు? పాపపు పనులు చేయువానిని కాపాడవలెనే కాని ఆత్మహిత మెఱిగిన పుణ్యాత్మునకు తా (భగవంతుడు) నెందుకు? ధైర్యం కోల్పోయిన నన్ను నా తండ్రి తిరుమలేశుడు దయతో బ్రోవకుంటే మఱి తా నెందుకు? ఉండీ ప్రయోజనము లేదని భావం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తెలియఁ జీఁకటికి | 3 | 18 | 1 | 12 |

అవ: నిజమైన భక్తునికి సంధ్యావందన మెట్టిదో వివరిస్తున్నాడు.

**సీ. సరిలేని వైష్ణవాచారవర్తనులతో**
**సహవాస ముండుటే సంధ్య మాకు;**
**అతిశయంబైన శ్రీహరి నామకీర్తన**
**సతతంబు సలుపుటే సంధ్య మాకు;**
**మహిత రామానుజమత భాగవత పాద**
**సంసేవనంబులే సంధ్య మాకు;**
**సిరివరు మహిమలు చెవులార భక్తి వే**
**సరక యాలించుటే సంధ్య మాకు;**

**ఆ. మంతు గాంచిన తిరుమంత్రపఠన మద్ది**
**శ్రద్ధ నాచరించు సంధ్య మాకు;**
**మదనుతండ్రి శేషమహిధరవిభుని సం**
**తర్పణంబె మాకుఁ దగిన సంధ్య.** 163

నిరుపమానంగా వైష్ణవాచారాన్ని అవలంబించిన వారితో స్నేహం కలిగి ఉండడం, అతిశయమైన విష్ణునామసంకీర్తనాన్ని ఎల్లప్పుడు చేయడం, పూజనీయులైన రామానుజ మతస్థులగు భగవద్భక్తులయొక్క పాదములను సేవించడం, లక్ష్మీకాంతుని మహిమలను భక్తితో చెవులార విసుగుచెందక వినడం, ప్రసిద్ధి కెక్కిన 'ఓం నమో నారాయణాయ' అనే తిరుమంత్ర పఠనం శ్రద్ధతో గావించడం మా సంధ్యావందనం. మఱియు శేషాద్రినాథుని సంతృప్తి పఱచుటే మాకు అనువైన సంధ్యావందనం. శ్రీనివాస భక్తిలేక చేసే సంధ్యావందనం నిష్ఫలమని భావం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సహజ వైష్ణవాచార | 2 | 10 | 1 | 7 |

అవ: సద్గురూపదేశం లేకపోవడం వల్ల మానవుడు సద్గతిని పొందలేకున్నా డనుచున్నాడు.

**సీ. అడవిc బడినవాcడు వెడలు మార్గములేక**
**తొడరి కంపలక్రిందc దూఱినట్లు**
**దురితకాననములc దూఱి దారిం దప్పి**
**వెడలలే కిడుమలు గుడిచినాము;**
**తెవులు పడినవాcడు తినcబోయి తీపులు**
**చవిగాక పులుసులc దవిలినట్లు**
**భవరోగములc బడి పరమామృతము నోటc**
**జవిగాక భవములc దవిలినాము;**

**తే. స్వజనమును వీడి మఱి పెఱవారివెనుక**
**తిరుగు వెఱ్ఱివిధమ్మునc దిరుమలేశు**
**మనసులో వానిc గొలువక మఱపు నొంది**
**హితవు గఱపెడివారులే కిట్లయితిమి.** **164**

అడవిలో తిరిగేవాడు ఆ గహనంలో నుంచి సురక్షిత ప్రదేశం చేరుకోవడానికి దారీ తెన్నూ తెలియక ముళ్ళపొదల్లోనికి దూరినవిధంగా మేము(అజ్ఞానులం) పాపాలనే కానలలోనికి చొచ్చుకపోయి సద్గతిని తప్పగొట్టుకొని వెలికి రాలేక కష్టాల పా లౌతున్నాము. రోగాన పడిన వాడు తీపి పదార్థాలు తినదలచి అవి రుచించక పులుపువస్తువుల నాశించి నట్లు పుట్టుక లనే జబ్బులకు లోనై శ్రేష్ఠమైన భగవన్నామ మనే అమృతం రుచించక సంసారాలలో చిక్కుకున్నాము. వెఱ్ఱివాడు తన చుట్టాలను మఱచిపోయి, తన నుద్ధరించలేని ఇతరుల వెంబడి తిరిగే మాదిరి, అజ్ఞానంచేత మనసులో ఉండే తిరుమలేశుని సేవించలేక మంచిని (ఉత్తమగతి) నేర్పే మంచిగురువులు లేక ఇట్లు అగచాట్ల పాలైనాము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎవ్వరులేరూ హితవు చెప్పcగ | 3 | 15 | 1 | 10 |

అవ: హరిసేవవలన కర్మబంధములు వదలిపోవు ననుచున్నాడు.

**సీ. మేదరింటి పడుచు మేదినీశుఁ దగులఁ**
**గువిటు లందఱు లోనఁ గ్రుళ్ళినట్టు**
**లాదట నేఁ బోయి హరి భజింపంగ నా**
**కర్మమ్ము లేడకు గంతుగొనెనొ?**
**కాపుటూర్మంగలి గడిమీఁది దొరగాఁగఁ**
**గాఁపులు పనిమాసి కందినట్టు**
**లాఁగక నేఁ బోయి యచ్యుతుఁ గొలువ నా**
**పాప మే పంచలపాలఁ బడెనొ?**

**తే. ఒగ్గి మోపులు మోవలే కూరు విడిచి**
**వెట్టివాఁ డుదాయింపంగ వెదకినట్టు**
**లేను శ్రీపతి సేవింప నేగ నాదు**
**చుట్టపక్కమ్ము లెక్కడఁ జూడఁ జనిరొ?** 165

మేదరికులంలో పుట్టిన పడుచుపిల్ల మహారాజునకు ఉంపుడుకత్తె కాగా దాని విటులు కుళ్ళుకొను విధంగా నేను వెళ్ళి హరిని భజించగానే నాతో పూర్వం సంబంధపడిన పాపకర్మలన్నీ చింతతో ఎక్కడికో గంతు వేశాయి. కాపులు కాపురముండే ఊరిలోని మంగలివాడు ఆ సీమకు నాయకుడు కాగా కాపువారు పనిలేక కష్టపడే విధంగా నేను అచ్యుతుణ్ణి సేవించగా నా పాపం ఏ పంచలపాలైందో! పాపాలు తొలగినవని భావం. వెట్టివాడు నడ్డి వంగేటట్లు గడ్డిమోపులు మోయలేక ఊరు వదలి పరారు చిత్తగించినట్లు నేను సంసారబాధలు పడలేక శ్రీపతిని సేవించడానికి వెళ్ళగా నా చుట్టాలు నన్ను చూడటానికని ఎక్కడికి వెళ్ళినారో గదా!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తల్లిఁబాసి బిడ్డలెల్ల | 49 | 31 | 4 | 381 |

అవ: ఆచార్యుడగు భగవద్రామానుజులను ప్రశంసించుచున్నాడు.

**సీ. గతులన్ని ఖిలమైన కలియుగమ్మందు స**
**ద్గతిసూపు గురుదైవత మ్మితండె;**
**యీతని కృపనెకా యిల వైష్ణవుల మైతి;**
**మితనివల్లనె కంటి మీ తిరుమణి;**
**నితఁడెకా యుపదేశ మిచ్చె నష్టాక్షరి;**
**వేద రహస్యముల్ విప్పె నితఁడె;**
**యితఁడె చూపెఁ బ్రపత్తి; యితఁడె ముద్రాధార**
**ణాదిక నియమము లన్ని నిలిపెఁ;**

**తే. దలఁప నితఁడె మా కిహపర దైవతంబు;**
**మాటలాడెడు దేవుఁడు మా కితండె;**
**ఫణినగమ్మెక్కు వాకిటఁ బరమకరుణ**
**గనెడు రామానుజులె మమ్ముఁ గన్నవారు. 166**

అన్ని ధర్మాలు అడుగంటుతున్న పాపభూయిష్ఠమైన ఈ కలియుగంలో అవతరించి మాకు మంచిమార్గము చూపిన గురుదేవుడు రామానుజులవారే. వీరి దయచేత విష్ణుభక్తుల మైనాము. ఈ తిరుమణి, తిరుచూర్ణము మాకు ప్రసాదించినది కూడ వీరే. నారాయణుని అష్టాక్షరీ మహామంత్రమును ఉపదేశించినవారు వీరే. వేదరహస్యములను విప్పి చెప్పినవారు వీరే. వీరే శరణాగతి మార్గాన్ని చూపెట్టినారు. చక్రాంకణ, ద్వాదశోర్ధ్వపుండ్ర ధారణాదివైష్ణవ నియమాలను అన్నిటినీ వీరే నిలిపినారు. మాకు ఇహలోక పరలోకదైవ మితడే. ఇతడే మాతో మాట్లాడే దైవము. శేషగిరిపై శ్రీనివాసుని ప్రాంగణంలో కరుణతో దర్శన మిచ్చే శ్రీరామానుజస్వామి వీరే. మా తల్లియు తండ్రియు వీరే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| గతులన్ని ఖిలమైన | 175 | 372 | 2 | 250 |

అవ: తాను చేసిన తప్పులు ప్రకటించి పంచభూతాదులను తనకు దండన విధింపు డని కోరుచున్నాడు.

**సీ. ఈశుఁ దలంచెడు నిటువంటి యీ మేన**
**నే బూతుచేఁతలు నెఱపినాఁడ**
**పాతకు పాపముల్ పరిహరింపించరో**
**భూతమ్ములార! తోఁబుట్టులార!**
**దీపించు హరినెంచి ధృతిలేక మతి మనో**
**వ్యాపారములు కొన్ని వలచినాఁడ**
**పాపభాగికి భృగుపతనంబు చూపరో**
**తాపత్రయములార! తమ్ములార!**

**తే. పొలుపుగా వేంకటేశ్వరుఁ బొగడు నోటి**
**నాల్క నితరులఁ జేరిచినాఁడ నేను;**
**చంచలున కేది తగునొ విధించరయ్య!**
**పటిమఁ బంచేంద్రియములార! బంధులార!** **167**

ఈశ్వరుని స్మరించే ఈనా శరీరంతో ఎన్నో బూతుపనులు చేశాను. తోబుట్టువులైన ఓ పంచభూతములారా! ఈ పాపి పాపాలను పరిహరించండి. స్వప్రకాశస్వరూపుడైన శ్రీహరిస్మరణం చేస్తూకూడ మానసికంగా దుష్టపుపనులు కొన్ని తలపెట్టినాను. నాకు తమ్ములైన ఆధ్యాత్మిక, అధి భౌతిక, ఆధిదైవికములనే ఓ తాపత్రయములారా ! ఈ పాపకర్మునికి కొండచరియ నుండి క్రిందికి దొర్లించే దండన విధించండి. ఒప్పిదముగా శ్రీ వేంకటేశుని స్తుతించే ఈ నాలుకతో ఇతరులను పొగడసాగినాను. చుట్టములైన ఓ పంచేంద్రియములారా! ఈ చంచలాత్మునకు నేర్పుతో తగిన శిక్ష విధించండి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అధమునికి | 82 | 53 | 4 | 396 |

అవ: శరణాగతి యొక్కటే పరమగతి యని పలుకుచున్నాడు.

సీ. మోక్షకర్త యొకండె ముక్త్యుపాయ మొకటె
పూర్వులు హరి గొల్చి పొదలినారు
ఎన్నియో వ్రతము లవెన్ని యో లోకమ్ము
లెందఱో దేవత లెన్నఁ దరమె?
కామ్యకర్మముల విజ్ఞాని పొందెడిదేమి
యాగమోక్తమ్ములే యగును గాక
ఒక్కటే మడు; వందు నొకఁడు దప్పికిఁ ద్రావు;
నొకఁడు కడవ నించుఁ; నొక్కఁ డీఁదు;

తే. జ్ఞాని సారార్థమున్ శ్రుతి సంగ్రహించు
నెంతగల దంతయును దల కెత్తికొనఁడు;
భవ్యశరణాగతి యొకండె బ్రదుకుత్రోవ
ధన్యులార! వేంకటపతి దాసులార! 168

ఎన్నో వ్రతాలు, ఎన్నోలోకాలు, ఎందఱో దేవతలు-లెక్కించుటకు శక్యం కాదు. అయిననూ మోక్షమిచ్చేవాడు ఒక ముకుందుడే. ముక్తికి ఉపాయం శరణాగతి ఒక్కటే. కోరికలతో చేసే కర్మములు వేదములందు చెప్పబడినప్పటికిన్నీ వాటిచే విజ్ఞానవంతుడు పొందేలాభం ఏముంది? అనిత్యములైన స్వర్గాది సుఖాలను జ్ఞాని కోరడు కదా! సరస్సు ఒక్కటే. ఒకడు ఆ నీటితో దప్పికతీర్చు కుంటాడు.మరొకడు తన కడవను నింపుకుంటాడు. ఇంకొకడు అందులో ఈదులాడుతాడు. అట్లే వేదాలలో ఎన్నో విషయాలు పొందుపరచబడ్డాయి. అందులో ఏది సారార్థమో అది జ్ఞాని గ్రహిస్తాడు. అనగా ముక్తికి ఉపకరించే సాధనాన్ని చేపడుతాడని తాత్పర్యం. ఇతరమును వదలిపెడతాడు. అంతేగాని వేదచోదిత కర్మలన్నిటినీ అనుష్ఠించడని భావం. ధన్యులైన వేంకటేశ్వర దాసులారా! పరిపూతమైన శరణాగతి ఒక్కటే జీవనమార్గ మని గ్రహించండి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఒక్కఁడే మోక్షకర్త | 142 | 186 | 2 | 125 |

అవ: శ్రీ వేంకటేశ్వరుని శక్తులు, మహిమలు సహేతుకముగ శ్లాఘించుచున్నాడు:

**సీ.** **కంటిరా వింటిరా కమలనాభుని శక్తి**
**యితని శరణ మొక్కటే యుపాయ;**
**మితనినాభిఁ బొడమె చతురాననుఁడు బ్రహ్మ**
**యింద్రాది దివిజుల నితఁడు ప్రోచె;**
**యితఁడె యసురబాధ లెన్నెన్ని హరియించె**
**నితని మూఁడడుగులె యీ జగమ్ము;**
**లితఁడే మొఱ విని యేతెంచి కరిఁ గాచె**
**నితనికంటెను వేల్పు లెవ్వరింక?**

**తే.** **నితఁడె వైకుంఠవిభుఁ; డితఁడే రమేశుఁ;**
**డితఁడె వేదోక్త దైవత; మీతఁడే చ**
**రాచరముల కంతర్యామి; యాశ్రితాళి**
**కేడుగడ యీతఁడే వేంకటేశ్వరుండు.** **169**

ఓ జనులారా ! కమలము గర్భమందు గల ఈ శ్రీనివాసుని శక్తిని ఎప్పుడేని విన్నారా? లేక కన్నారా? మోక్షాన్ని పొందడానికి ఇతని శరణాగతి ఒక్కటే ఉపాయం. నాల్గుమోములు గల బ్రహ్మ ఇతని నాభిలో పుట్టినాడు. ఇంద్రుడు మొదలుగా గల దేవతలను ఇతడే కాపాడినాడు. రాక్షసులవల్ల లోకమున కేర్పడిన ఎన్నో బాధలను ఇతడు మాన్పినాడు. లోకములు ఈయన త్రిపాదాలు. కరిమొర విని కాచిన ఘనుడు ఇతడే. మరి ఇతనికంటె అధికులైన దేవత లెవరు? వైకుంఠమునకు ప్రభువు, లక్ష్మీదేవికి నాథుడు, వేదప్రతిపాదితదైవము, స్థావరజంగమాలలో అంతర్యామిగా ఉండేవాడు, ఆశ్రితుల కందరికీ ఆధారభూతుడు ఈ వేంకటేశ్వరుడే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కంటిరా | 192 | 470 | 2 | 317 |

అవ: దేవుని మంగళాంగములనూ, దేవేరినీ కీర్తించి తరించుడని జీవులను హెచ్చరించుచున్నాడు.

**సీ. హరి నామములఁ బాడి యతని పట్టపురాణి**
**కలశవార్ధి తనూజ కమలఁ బాడి**
**శ్రీవత్సలాంఛనాంచిత వక్షముం బాడి**
**భువనముల్ నిండిన బొజ్జఁ బాడి**
**కనుఁ దమ్ములం బాడి కంబుకంఠముఁ బాడి**
**నాభిపద్మముఁ బాడి నడుముఁ బాడి**
**విలసిత మకరకుండల కర్ణములఁ బాడి**
**సురభిళమ్మగు శిరస్తులసిఁ బాడి**

**తే. శంఖచక్రమ్ములం బాడి చరణయుగ్మ**
**కటి వరదహస్తములఁ బాడి కన్న తల్లి**
**భూమిసతిఁ బాడి వేంకటభూధరేంద్రు**
**కరుణ నిహపరసౌఖ్యముల్ కనఁగదోయి ! 170**

శ్రీవిష్ణు సహస్రనామములను, అతని పట్టమహిషి క్షీరసాగరపుత్రియైన శ్రీ మహాలక్ష్మిని, శ్రీవత్సమనే మచ్చచేత ఒప్పిదమైన నారాయణుని పక్షఃస్థలాన్ని, సకల లోకాలకు నిలయమైన బొజ్జను, పద్మములవంటి కన్నులను, శంఖమువంటి కంఠమును, నాభిలోని పద్మాన్ని, నడుమును, మకర కుండలాలతో ప్రకాశించే చెవులను, నెత్తిపై గుబాళించే తులసిని, శంఖచక్రాలను, పాదములజంటను, నడుముపై చేర్చిన చేతిని, వరము లొసగే హస్తమును, జగములకు కన్నతల్లియైన భూదేవిని కీర్తించి ఓ భక్తుడా ! శ్రీ వేంకటేశ్వరుని దయచే ఇహపరసుఖాలను పొందుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పావనము | 373 | 359 | 2 | 242 |

అవ: బ్రతికియుండగనే శ్రీనివాసుని దర్శించి అతని మహిమలు విని తరించండని చెప్పుచున్నాడు.

**సీ. మి మ్మెలయించి భ్రమింపఁ జేసెడి కాల;**
**మలర నుతింపరో యాదిదేవుఁ;**
**జేయరో మనసులో శ్రీహరి చింతన;**
**రోయరో అన్నాదిరుచుల నెల్లఁ;**
**గోయరో కొనసాగు కోర్కులు మొదలంటఁ;**
**ద్రోయరో పెనఁగొను దురితములను;**
**పుచ్చరో ప్రొద్దులు బుధపుంగవుల గోష్ఠి;**
**మెచ్చరో మధువైరిమీఁది కథలు;**

**ఆ. కాయ మస్థిరమ్ము; కలిమి యధ్రువ; మెంతొ**
**కాల మరిగె; శాంతి గాంచు కొఱకుఁ**
**గనరొ వేంకటేశుఁ గన్నులు దనియఁగా;**
**వినరొ యతని మహిమ వీను లలర. 171**

జనులారా! కాలము మిమ్ము భ్రమింపజేస్తుంది. ఆదిదేవుని ప్రీతితో పొగడండి. మనసులో శ్రీహరి స్మరణచేయండి. ఆహారాదులందలి చవులను ఏవగించండి. పెరిగిపోతున్న కాంక్షలను సమూలంగా ఖండించండి. పెనవేసుకొన్న పాపాలను తొలగించుకొనండి. శ్రేష్ఠులగు జ్ఞానులయొక్క గోష్ఠిలో కాలం గడపండి. మధురిపుని పుణ్యకథలను శ్లాఘించండి. దేహము స్థిరమైనది కాదు. సంపద శాశ్వతమైనది కాదు. ఇప్పటికే ఎంతో కాలం జరిగిపోయినది. శాంతిని పొందేటందుకు నేత్రానందంగా శ్రీ వేంకటేశ్వరుని దర్శించండి. శ్రవణానందంగా ఆయన మహిమలు విని తరించండి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అలర నుతించరో | 65 | 338 | 1 | 226 |

అవ:కర్మములు, పాపపుణ్యములు అజ్ఞానులకే గాని సుజ్ఞానులకు లే వనుచున్నాడు.

సీ. దైవమ్ము నమ్మిన దాసవర్గమునకు
మఱి చేయఁదగిన కర్మములు లేవు;
కల్లోలజలనిధిఁ గడచన్న వారికిఁ
బదపడి యోడతోఁ బనియుఁ గలదె?
గురుకృప గలిగిన గుణనిధానములకు
నరయంగఁ బాపపుణ్యములు లేవు;
చిమ్మచీఁకటి గడచిన యట్టి వారికిఁ
గరదివ్వెతోడ నక్కఱయుఁగలదె?

ఆ. జగము మెచ్చు విష్ణుచరణసేవకులకు
దగిలెడి యపరాధతతులు లేవు;
అసమభక్తి వేంకటాధిపుఁ గొలిచిన
ఎగువ దిగువ మనకు నెదురు లేదు. **172**

అలలతో అల్లలాడే సముద్రాన్ని దాటిన పిదప పడవతో పనిలేదు గదా! అట్లె దైవాన్ని నమ్మిన దాసజనానికి ఇక చేయదగిన కర్మలంటూ ఉండవు. కారుచీకటి దాటిన వారికి చేదీపంతో పనేముంది? ఆ విధంగానే గురుకటాక్షానికి పాత్రులైన గుణవంతులకు ఆలోచింపగా పుణ్యం గాని, పాపం గాని లేవు. లోకం మెప్పుపొందిన విష్ణుదాసులను అపరాధాలు అంటలేవు. సాటిలేని భక్తితో శ్రీ వేంకటేశ్వరుని ఆరాధించే మనకు ఇహలోకంలో గాని, పరలోకంలో గాని ఎదురుండదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అజ్ఞానుల కివి | 344 | 260 | 4 | 174 |

అవ: దశావతారచర్యలతో సాధుజీవితమును వర్ణించుచున్నాడు.

**సీ. వినయంపు మాటల విద్యలు గొన మేలు;**
**మొనసి యప్పుల మున్గకునికి మేలు;**
**తెగి భూమి తనుమోచి దించకుండుట మేలు;**
**వెనుకొను కోపమ్ము విడుట మేలు;**
**పరుల నడిగి కొంచెపడ కుండుటది మేలు;**
**గెంటి జీవులఁ జంపకుంట మేలు;**
**కడఁగి తిట్టుల కొడిగట్ట కుండుట మేలు;**
**ఇడుమలు పడకుండు టెంతొ మేలు;**

**తే. పరసతుల భంగపఱుపక ప్రబల మేలు;**
**కెళవులం ద్రొక్కక వినీతి మెలఁగ మేలు;**
**సకలజనులకు మేలు సంసార; మాత్మఁ**
**గంసరిపుమీఁద సద్భక్తి గలుగ మేలు.** **173**

వినయంగా మాటలాడుతూ చదువులు సే[illegible] మంచిది. ప్రయత్నించి ఋణాలలో మున్గిపోకుండడం మంచిది. భూదేవి తన్ను భరించిదించకుండడం ఉత్తమం. అనగా ఉత్తమ పదస్థునిగా మన్నించి పిదప ఆ పదవినుండిచ్యుతిని గావించకుండడం మేలని భావం. తన్ను వెన్నాడే కోపాన్ని వదలడం మంచిది. ఇతరులను యాచించి చులకన గాకుండడమే ఉత్తమం. తరిమి తరిమి ప్రాణులను హింసించకుండుట మంచిదారి. ఇతరుల దూషణలకు గురికాకుండడం ఎంతో మంచిది. కష్టాలపాలు గాకపోవడం మరీ మంచిది. పరస్త్రీసాంగత్యాన్ని వదలి పెట్టడం సాధుమార్గం. అడ్డదారులు ద్రొక్కక ఋజుమార్గంలో మెలగడం మంచిది. ఇతరులకు ఉపకరించే గృహస్థాశ్రమం ఎంతో మంచిది. స్వామిపై గాఢభక్తి గల్గియుండడం చాలమేలు.

| సంకీర్తన | రేకు | [illegible] | సం[illegible] | పుట |
|---|---|---|---|---|
| సంసారమే మేలు | 278 | 44[illegible] | 3 | 301 |

అవ: కామినీకాంచనాదుల వ్యామోహానికి లోనైన పిదప విచారపడి లాభము లే దనుచున్నాడు.

**సీ. అందనున్న మిడుత లనలమ్ము పొడగన్నఁ**
**బనిపాటులే కందుఁ బడక యున్నె?**
**పొలఁతులఁ గనుఁగొన్న పురుషుల చూడ్కులు**
**పయిపయి వడి నంటఁబాఱ కున్నె?**
**గాలంపుటెఱ్ఱలఁ గన్న మచ్చెమ్ములు**
**చాల నా పసఁ జిక్కి చావ కున్నె?**
**అపరంజి నీక్షింప నందఱ మనసులు**
**పొంగి యాసలలోనఁ బ్రుంగ కున్నె?**

**తే. చినుకు లురలుచు ముత్తెపుఁ జిప్పలందు**
**మేలిముత్తెమ్ములై వన్నె మీఱకున్నె?**
**గరుడగిరివాస దాససాంగత్యమున్న**
**నెట్టి జీవులు ధన్యులౌ టేమి వింత?** **174**

చెంతనున్న మిడుతలు అగ్నిని చూచినంతనే పనిపాటు లేకున్నప్పటికి అందులోబడి మరణించకుండునా? మరణించునని భావము. అట్లే మగువలను చూచిన మగవారిచూపులు వారి అవయవాలపై హత్తుకొనకుండునా? చేపలు గాలానికి గ్రుచ్చబడిన ఎఱ్ఱలను ఆశించి చావకుండునా? చచ్చునని భావము. ఎట్టివారికైనను బంగారమును చూడగనే మనసు పొంగి పొరలకుండునా? ముత్తెపుచిప్పలందు బడిన వాన చినుకులు వన్నెగల మేలి ముత్యా లగునుగదా! అట్లే ఎట్టి పాపులైనను శ్రీ వేంకటేశ్వరుని దాసులతోడి సాంగత్యంచేత పుణ్యాత్ములు కావడంలో ఆశ్చర్య మేమీ లేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ముందే తొలఁగవలె | 311 | 66 | 4 | 45 |

అవ: పాపములు తొలగి జన్మబంధాలు వీడుటకు శ్రీహరికైంకర్య మే ముఖ్యమనుచున్నాడు.

**సీ. మంచి మందునుగొన్న మనుజుఁ డుగ్రవ్యాధు**
**లంచెలఁ బాసి సుఖించు నంట!**
**అంచిత హరినామ మను మందుఁ గొనువాఁడు**
**పాపరోగమ్ములఁ బాయ లేఁడొ?**
**కవచమ్ము దొడిగి సంగ్రామమం దలుగుల**
**కోడక జోదు గెల్పొందు నంట!**
**హరిదాస్య మనెడు వజ్రాంగిజోడు ధరించు**
**వాఁడు జన్మశరాలు వీడ లేఁడొ?**

**తే. పసిఁడి గలవాఁడు దారిద్ర్యబాధ గనక**
**వివిధ సుఖములతోడ జీవించునంట!**
**శ్రీనివాసపదాబ్జ సంసేవ యనెడు**
**కాణయాచి గలాఁడు తా ఘనుఁడు గాఁడొ?** **175**

తగిన మందును సేవించే మానవుడు భయంకర వ్యాధుల నుండి తప్పుకొని ఆరోగ్యవంతు డవుతాడు కదా! పూజనీయమైన హరినామ మనే ఔషధాన్ని సేవించేవాడు (నామజపం చేసేవాడు) పాపాలనే రోగాలను పటాపంచలు చేయలేడా? చేయగలడని భావం. కవచంధరించి యుద్ధంలోనికి దిగిన భటుడు బాణాలకు జంకక జయం పొందుతాడుగదా! మరి స్వామి సేవ అనే వజ్రమయకవచం ధరించిన దాసుడు పుట్టుకలనే బాణాలనుండి తప్పుకోలేడా? తప్పుకోగలడని తాత్పర్యం. బంగారం కలవాడు పేదరికం వల్ల బాధపడకుండా పలువిధాలైన సుఖాలతో బ్రదుకుతుండగా శ్రీనివాసుని పాదసేవ అనే లిబ్బి గలవాడు తానెంతో గొప్పవాడుకాడా? అగునని భావం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇది నమ్మలేఁడు | 265 | 375 | 3 | 253 |

అవ: మోక్షము హరిభక్తుల అంతరంగమందే కలదనుచున్నాడు.

**సీ. వెదకిన మోక్షంబు వినువీథిలో లేదు**
**పాతాళమున లేదు వసుధ లేదు;**
**వేనవేల్ వికటంపు వేల్పులఁ గొలిచిన**
**దాని మొదల్ కొన కానరాదు;**
**స్వర్గాదిలోకాల సకలశాస్త్రమ్ముల**
**నెంత గాలించిన నెఱుకపడదు;**
**కోటిజన్మము లెత్తి గాటంపుసంస్కృతి**
**కర్మాబ్ధి నీఁదినఁ గదియరాదు;**

**ఆ. అంజనాచలేంద్రుఁ డంతరంగమునందుఁ**
**గలఁ డటన్న తెలివి గలిగి యతని**
**పరమగతిగ నమ్మి పావనకైంకర్య**
**పరుఁ డెవండొ వాఁడు పదయఁ గలఁడు. 176**

మోక్షము భూమి, ఆకాశం, పాతాళంలో ఎక్కడ వెదకినా కనుపించదు. వేనవేలు ఇతరదైవాలను కొలిచినా ఆ మోక్షము యొక్క మొదలు కొన తెలియదు. స్వర్గం మొదలైన లోకాలలోగాని, అన్ని శాస్త్రములలో గాని ఎంత శోధించినప్పటికీ ఎక్కడా కన్పించదు. కోటి జన్మలెత్తి, గాఢమైన సంసారంలో చిక్కుకొని కర్మలనే సముద్రంలో ఈతలు కొట్టినా (ఎన్ని కర్మ లాచరించినను) మోక్షమును దగ్గరించ లేము. అంజనాద్రీశుడు అంతరంగంలో ఉన్నాడన్న జ్ఞప్తితో, అతడే గతియని గట్టిగ నమ్మి పవిత్రములైన భగవత్కైంకర్యములు చేసే వాడెవడో అట్టివాడే మోక్షమును పొందుటకు అర్హుడు. మోక్షానికి జ్ఞాన ధ్యాన కర్మ భక్తులు అనే మార్గాలున్నా కలిలో భక్తి మార్గంతో మోక్షం పొందడం సుకర మని భావం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కలదందే పో | 277 | 446 | 3 | 300 |

అవ: బాలకృష్ణుని మహిమకు తల్లి యశోద వెరగొందుట వర్ణిస్తున్నాడు.

సీ. ఉన్నాఁడు మందలో నొక దొంగ వెంటరాఁ
జనదని వెఱపింప జనని, కృష్ణుఁ
'డెటదొంగ' యనుచు నో రటు దెఱవ యశోద
బ్రహ్మాండములు గాంచి పల్లటిల్లెఁ;
'జందమామా రావె జాబిల్లి' యనఁ దల్లి
చందురుఁ గని శౌరి సన్నసేసె;
చంద్రుఁడు వచ్చి యంజలి ఘటింపఁగ నేల
పాడితి నని చేడె భయము సెందె;

తే. నిదుర వోయెనొ మఱి లేదొ నిసు వటంచు
తొయ్యలి పసిండితొట్టిల తొంగి చూచి
శంఖచక్రాలతో రమాసాధ్వితోడ
వెలుఁగు వేంకటవిభుఁ దుండ వెఱఁగు పడియె. 177

చిన్ని కృష్ణా ! మందలో ఒక దొంగ ఉన్నాడు. నీవు నాతో రావద్దు అని తల్లి యశోద భయపెట్టినది. అప్పుడు కృష్ణుడు ఆ దొంగ ఎక్కడ? అని నోరు తెరిచాడు. అందులో బ్రహ్మాండాలను చూచి ఆమె చలించిపోయింది. యశోద శ్రీకృష్ణు నెత్తుకొని గోరుముద్దలు తినిపిస్తూ చందమామా రావే జాబిల్లి రావే అని పాటపాడింది. బాలకృష్ణుడు చంద్రునికి రమ్మని సైగచేశాడు. వెంటనే చంద్రుడు నింగినుండి దిగివచ్చి చేతులు గట్టుకొని ఎదుట నిలిచాడు. అయ్యో! నే నెందుకు ఆ పాటపాడితినని ఆమె బెదరిపోయింది. నిద్రపోతున్నాడో లేడో అని బంగారు తొట్టెలోనికి యశోదమ్మ తొంగిచూచింది. అందులో శంఖచక్రాలతో, లక్ష్మీదేవితో వెలిగిపోతున్న శ్రీ వేంకటేశ్వరుని చూచి ఆమె ఎంతో ఆశ్చర్యపడింది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వెఱపించఁబోయి | 344 | 258 | 4 | 173 |

అవ: మంచిశీలము కల్గియుండుట, కామక్రోధాదులు లేకుండుట, మనుజ లక్షణ మనుచున్నాడు.

సీ. పరుల వేడఁగఁ బోవు పరుల నిందింపవు
పరహిత మ్మొనరించు పండ్లచెట్లు
నరులమై విజ్ఞానపరులమై ఘనులమై
శీలాన వీనికిఁ బోలలేము;
కామ మ్మెఱుంగవు కాసంత క్రోధమ్ము
గన వెందుఁ గాంచిన గండశిలలు
దీమసంబు గలిగి తెలివి గల్గియు మన
బ్రతుకు వీనికి సాటి రాకపోయె;

తే. పక్షు లొరుఁ గొల్వఁబో; వొక పంట సేయఁ
బోవు; నొక గ్రామనిగూటనే ప్రొద్దు గడపు;
నొక్క వృషగిరిపతి నమ్మియుండలేని
పాలసులము వీనికి సరిపోల లేము. 178

ఫలవృక్షాలు ఇతరులను యాచించవు. ఇతరులను నిందించవు. నీడను, పండ్లను ప్రసాదించి ఇతరులకు మేలుచేస్తాయి. విజ్ఞానంకలవారమై గొప్పవాళ్ల మనుకుంటున్న మానవులమైన మనం పై గుణాలలో ఆ చెట్లకు సరిపోలలేకుండా ఉన్నాము. గండశిలలు కామక్రోధాలు ఎరుగవు. ధైర్యం, తెలివితేటలు కలిగియున్న మన బ్రతుకు వీటికి సరిరాక పోయె గదా! అనగా మనం కామ క్రోధాదులను జయించ లేకున్నా మన్నమాట ! ఇక పక్షులవిషయం ఆలోచిద్దాం. అవి మనవలె సేవచేస్తూ పరులపంచల్లో పడిగాపు లుండవు. మనవలె ధనధాన్యాదులను కూడబెట్టుకోవు. ఎక్కడో ఒక చెట్టులో గూడుకట్టుకొని హాయిగా కాలం గడుపుతాయి. ఒక్క వృషగిరీశుని గట్టిగా నమ్ముకొని కాలం గడపలేని మూర్ఖుఁ మైనాము. కడకు పోలికలో ఆ పిట్టలకు సరిరాక పోతున్నాము. గుణహీనులైన మనుజులకంటె చెట్టు చేమలూ, రాయిరప్పలూ, పశుపక్ష్యాదులు ఎంతో మేలని తాత్పర్యం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వీనిఁ జూచియైన నేము | 61 | 368 | 1 | 260 |

అవ: దాసకోటివల్ల సంసారతరణోపాయం తెలుసుకొనక ఉపేక్షిస్తే ఉత్తమగతి లభించ దనుచున్నాడు.

**సీ. జడునకు సహజమే సంసారయాతన**
**పర మిందె పడయఁగా వలయుఁగాక**
**అదరి వాయువు వీచునపుడె తూర్పెత్తక**
**విడిచి తా నవ్వల వెదుకఁ గలదె?**
**భవబద్ధునకు విధి పాపపుణ్యపు లంకె**
**తెలివి నిందే గనవలయుఁ గాక**
**అచ్చపువెన్నెల నల్లోనేరే ళ్ళింతె**
**నిన్నటి యునికియు నేఁడు గలదె?**

**తే. తెగని యింద్రియబాధ లీ దేహి కెపుడు**
**గలవియే, భక్తి సాధింప వలయుఁ గాక;**
**కోరి వేంకటపతిదాసకోటి వలన**
**గతి గనక యొదిగిన సుంత గతియుఁ గలదె? 179**

మూర్ఖునికి ఈ సంసారసంబంధమైన లంపట సహజంగా ఉండేది. అయినా ఉత్తమగతిని పొందడానికి ఇందులో ఉంటూనే ప్రయత్నం చేసి సాధించవలె. గాలి వీస్తున్నప్పుడే ధాన్యం తూరుపార పట్టవలె. గాలి ఆగిపోతే అది సాధ్యమా? అట్లే శరీరం ఉండగానే సంసారబాధ లనుభవిస్తూనే పరమపదప్రాప్తికి ప్రయత్నించవలె నన్నమాట. సంసారంలో చిక్కుకున్నవానికి పాపపుణ్యాల సంబంధం తప్పదు. కనుక తెలివినిందే పొందవలసి ఉన్నది. వెన్నెల బాగా కాస్తున్నప్పుడే అల్లోనేరేళ్ళ ఆట సాగేది. కడచిపోయిన నిన్నటిరోజు ఈనాడు రాదు గదా! వీడని ఇంద్రియాల రాయిడి ఈ ప్రాణికి ఎప్పుడూ ఉండేదే. ప్రాయం పోయిన తర్వాత భక్తిచేయలేదు కనుక ముక్తికి మూలమైన భక్తిని సాధించుకోవలె. రమాపతిభక్తులవల్ల మార్గం తెలుసుకొనక వారికి వైదొలగి ఉంటే ఉత్తమగతి అబ్బుతుందా? అబ్బదని తాత్పర్యం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పటువులోనే హరిని | 91 | 449 | 1 | 301 |

అవ: ఏడుకొండలవాని సేవవల్ల లభించే మేలు వద్దన్నా వదలి పోదు అనుచున్నాడు.

**సీ. సుఖదుఃఖములు రెండు జోడుకోడెలు తత్త్వ**
**మరసినవా రడ్డమాడ రెపుడు;**
**ఎందాక సంసార మెనసి తా నొనరించు**
**పరcగ నందాక లంపటము పోదు;**
**ధరమీcద జీవుండు తనువు మోసెదుదాక**
**తనలోని యాసలు తరలి చనవు**
**తన కెంత యాcకలి దప్పి కంతయె; వడ్డి**
**వాఱకపో దప్పు దీఱుదాక**

**తే. తనకు దైవమ్ముపై భక్తి తనరకున్నc**
**బొలయు కర్మపుc బాటెల్లc దొలcగిపోదు;**
**ఏడుకొండల దొరసేవ యెప్పు డబ్బె**
**నపుడె యందలి మే లొల్ల నని నc బోదు. 180**

సుఖము, దుఃఖము– ఈ రెండు జంటగా ఒకదాని నొకటి వదలకుండా ఉంటాయి. యథార్థం తెలిసినవారు ఈ విషయం కాదనలేరు. మానవుడు సంసారిగా ఉన్నంతకాలం లంపటాలు వదలిపెట్టవు. నేలపై ఈ జీవుడు శరీరాన్ని ధరించి ఉండేవరకు ఆశలు అతణ్ణి వదలిపెట్టవు. ఆకలి ఎంతో దప్పిక కూడా అంతే. అప్పు తీరేదాకా వడ్డీ వదలిపోదు గదా! తనకు శ్రీనివాసునిపై భక్తి అతిశయించకుంటే కర్మఫలాలు వదలిపెట్టవు. ఏడుకొండలవాని సేవ అబ్బినపుడు ఆ సేవవల్ల కలిగే మేలు వద్దన్నా వదలిపోదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సుఖమును దుఃఖమును | 10l | 505 | 1 | 338 |

అవ: శ్రీనివాస ముద్రాధారులు ముల్లోకాలలో పూజ్యులే యనుచున్నాడు.

సీ. కోరిక నొక నరుఁ గొలిచెడి వారలు
ధీరులై సలిగెలఁ దిరుగుచుండ
బ్రహ్మాండకోటులఁ బాలించువాని ప
దాశ్రితుల్ చనవరు లగుట యరుదె?
చింతింపఁ దుమ్మెద చేపడ్డ కీటమ్ము
లాకడ తుమ్మెద లవుచునుండ
శ్రీకాంతు పదపద్మసేవనాతత్పరు
లెవరేని యెక్కుడౌ టేమి యరిది?

తే. ముద్రితమ్ములు నాణెముల్ భూపునాజ్ఞ
దేశమునఁ జెల్ల వేంకటాద్రీశు దివ్య
ముద్రలు ధరించువారలు ముజ్జగములఁ
జెల్లు టరుదె? శ్రేయమ్ములు చెందు టరుదె? 181

మానవమాత్రుని ప్రీతితో సేవించువారు దిట్టలై అతని అండజేరి తిరుగుతుంటారు గదా! ఇక కోటి బ్రహ్మాండాలు ఏలే శ్రీశుని పదదాసులు చనవుగా స్వామివద్ద మెలగడంలో ఆశ్చర్యమేముంది? లే దన్నమాట. ఆలోచింపగా భ్రమరంచేత పట్టుబడ్డ అకుపురుగు తదేకధ్యానంతో నుండి అదీ భ్రమర మవుతుంది. ఇది అనుభవసిద్ధం. మరెవరైనా సరే పరమాత్ముని పదపద్మసేవలో నిమగ్నులై యుంటే వారు గొప్పవారుకావడం ఆశ్చర్యమా? కాదన్న మాట. ప్రభువుగారి అజ్ఞచే ముద్రింపబడ్డ నాణెములు రాష్ట్రంలో చెలామణి అవుతుండగా శ్రీ వేంకటాచలపతి ముద్రలు–తిరునామం, శంఖచక్రాలు ధరించిన భక్తులు మూడులోకాలలో చెలామణి కావడంలో (శ్రేయస్సులు పొందడంలో) అచ్చెరు వేముంది?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పరుల సేవలు చేసి | 81 | 390 | 1 | 261 |

అవ: సకల శాస్త్రములు తరచి తెలుసుకొన్న సారభూతమైన అర్థమిదే యనుచున్నాడు.

సీ. కంటి నీ యర్థమ్ము ఘనశాస్త్రములు ద్రవ్వి
యింతకంటెను నాణె మెందు లేదు;
మేటివైరాగ్యమ్ము మీఱు లాభము లేదు;
జ్ఞానమ్ముకంటె సుకమ్ము లేదు;
గురునికంటెను రక్షకుఁడు మఱొక్కఁడు లేఁడు;
భవమునకంటె శాత్రవుఁడు లేఁడు;
పరపీడకంటె పాపమ్ము, పరోపకా
రమ్మునకంటె ధర్మమ్ము లేదు;

తే. కర్మసంగమ్ము మానుటకంటె లేదు
తేజ; మాశ వీడుటకంటె తెలివిలేదు;
శాంతమునకంటెఁ బుణ్యము, స్వామి శరణుఁ
జొరుటకంటె నిశ్చయము మచ్చునకు లేదు. 182

అచంచల వైరాగ్యానికంటె మించిన లాభం, జ్ఞానానికంటె మించిన సుఖం మరేదీ లేదు. గురువును మించిన రక్షకుడు, సంసారాని కంటె మించిన శత్రువు లేనే లేదు. పరులను పీడించుటకంటె పాపం, పరోపకారాన్ని మించిన పుణ్యం వేతే లేదు. కర్మల నాచరించుటలో ఆసక్తి లేకుండుటకంటె తేజస్సు, ఆశ వీడుటకంటె సుకృతం, స్వామిని శరణుజొచ్చుటకంటె నిశ్చితమైన అర్థం మరొక్కటీ మచ్చునకైన లేదు. పై విషయాలను గొప్పశాస్త్రాలు తఱచి తెలుసుకొన్నాను. ఇంతకన్న మెఱుగైనది మ రెక్కడా లేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కంటి నిదే యర్థము | 90 | 443 | 1 | 297 |

అవ: బ్రాహ్మణు లెట్టివారో తెలుపుచున్నాడు.

సీ. **అణురేణు పరిపూర్ణుఁడైన శ్రీవల్లభుఁ**
**బ్రణుతించువారెపో బ్రహ్మకులులు;**
**హరినామములనె సంధ్యాదివిధు లొనర్చు**
**పావనమతులెపో బ్రహ్మకులులు;**
**అదినారాయణు ననయమ్ము తమ యాత్మ**
**పాదుకొల్పినవారె బ్రహ్మకులులు;**
**దేవకీపుత్త్రుండె దేవుం డనుచు బుద్ధి**
**భావించువారెపో బ్రహ్మకులులు;**

తే. **పరఁగ హరిభక్తి పరులెపో బ్రహ్మకులులు;**
**వేదసంరక్షకుఁడు, సర్వవేదమయుఁడు;**
**సర్వసాక్షి వేంకటగిరీశ్వరుని పాద**
**పద్మములు గొల్చువారెపో బ్రహ్మకులులు.** **183**

అణవణువున నిండియున్న రమారమణుని కీర్తించువారును, కేశవాది శ్రీహరి నామములతో సంధ్యావందనం మొదలైన వైదిక కర్మలాచరించు వారును, పరిశుద్ధాత్ములును, భగవంతుణ్ణి సర్వదా తను ఆత్మలో స్థిరంగా నిల్పుకున్నవారును, దేవకీపుత్త్రుడైన శ్రీకృష్ణుడే దేవుడని బుద్ధిలో తలచేవారును, హరిభక్తిపరులును, వేదరక్షకుడు, వేదస్వరూపుడు, సర్వసాక్షి అయిన శ్రీవేంకటేశ్వరుని పాదపద్మాలు కొలిచేవారు బ్రాహ్మణులని తెలియవలెను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అణురేణు పరిపూర్ణుఁడైన | 70 | 365 | 1 | 244 |

అవ: నిజమైన వైష్ణవ మేమిటో తెలుపుచున్నాడు.

**సీ. కోరిక లుడుగుచు గుతినెల్ల వానిపై**
**వైరాగ్యమే సుమ్ము వైష్ణవమ్ము;**
**సారెకుఁ గోపమ్ము చలమును దనలోన**
**వారించుటయ సుమ్ము వైష్ణవమ్ము;**
**సుడిగొను దేహంపు సుఖదుఃఖములయందు**
**వడిఁ జొరనిదె సుమ్ము వైష్ణవమ్ము;**
**ముడివడి యింద్రియమ్ముల కింకరుండౌచు**
**వడఁబడనిదె సుమ్ము వైష్ణవమ్ము;**

**తే. వలనుగ సమస్తమైన యుపాయములను**
**వదలుటయ సుమ్ము నిజమైన వైష్ణవమ్ము;**
**వేంకటేశ్వరు నామమ్ము విడువ కెపుడు**
**వదనముం జేర్చుటయ సుమ్ము వైష్ణవమ్ము. 184**

కోరికలు వదలి తన లక్ష్యాన్ని శ్రీమహావిష్ణువుపై నుంచి వైరాగ్యం కలిగియుండుట, చీటికి మాటికి కోపపడకుండుట, మనసులో ఈర్ష్యలేకుండుట, చుట్టుకొనే శరీరసంబంధములైన సుఖదుఃఖము లందు నిమగ్నుడు కాకుండుట, పెనగొను ఇంద్రియాలకు దాసుడై తాపానికి గురికాకుండుట, భగవత్ప్రాప్తికి శరణాగతికంటె మించినది లేదని విశ్వసించి ఇతరములైన సకలోపాయములను విసర్జించుట, శ్రీ వేంకటేశ్వరుని పవిత్రనామం ఎల్లప్పుడు వదలకుండ నోట ఉచ్చరిస్తూ ఉండుట(శ్రీనివాసుని ఊర్ధ్వపుండ్రం ముఖమున ధరించుట) నిజమైన వైష్ణవం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పలె ననువారిదె వైష్ణవము | 84 | 405 | 1 | 271 |

అవ: శ్రీనివాసుడు ఎంత అనుగ్రహిస్తాడో అంతే ననుచున్నాడు.

సీ. ఇహమున జీవికి నెంతసేసిన నేమి
యజుఁ డెంత వ్రాసెనో యంతెగాక
వలనుగ ముంటికి వాఁడి పెట్టితి మంటే
నినిచితిమా చెఱకునను తీపి;
ఘనముగ బుద్ధులు గఱపిన దేహికి
మును నోచినట్టి నోముల ఫలంబె;
కోరి తెంకాయలో నీరు పోసితిమంటే
యొనర వేమునఁ జేఁదు నునిచినామె?

తే. పరిమళము గూర్చినారమె మరువమునకు?
పెరుగు నడవులఁ బూనికఁ బెంచినామె?
వేయునేటికిఁ? బ్రాణికి వేంకటేశుఁ
డెంత భాగ్య మొసంగునో యంతె గాక. 185

ఎవరెంత సాయపడినప్పటికీ ఇహలోకంలో ప్రతిప్రాణికీ బ్రహ్మలిఖిత ప్రకారమే ఫల మబ్బుతుంది. ముల్లునకు మనం పదను పెట్టామా? చెఱకు గడలో తీపిని నింపినామా ? లేదు గదా ! అట్లే జీవి పూర్వజన్మకృత కర్మఫలం ఈ జన్మలో అనుభవిస్తాడు. ఘనంగా ప్రాణికి సుద్దులు గఱపడం వల్ల ఏమి ప్రయోజనం? టెంకాయలో నీరు నింపామా? వేపలో చేదు చేర్చినామా? మరువమునకు వాసన కూర్చామా? వాటంతట అవే పెరుగుతున్నాయి గాని ప్రయత్నంతో మనం అరణ్యాలు పెంచుతున్నామా? లేదు గదా? పలుమాట లెందుకు? ఏ జీవికిగాని వేంకటేశ్వరుడు ఎంత అనుగ్రహిస్తే అంతే ప్రాప్తిస్తుంది గాని అందులో హెచ్చుతక్కువ లుండవు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కలది గలట్టే | 91 | 450 | 1 | 320 |

అవ: విడువక ఎల్లప్పుడు రక్షించే విభుడు శ్రీ వేంకటేశ్వరుడే యనుచున్నాడు.

సీ. దురిత విధ్వంసుఁడు దుఃఖవిదారణుం
దరిజనభీకరుం డచ్యుతుండు
సిరివరుఁ డీతనిఁ జేకొని కొలిచినఁ
బరమసుఖమ్మెపో భయము లేదు;
దానవహరణుండు దైవశిఖామణి
మానరక్షకుఁడు క్షమాధవుండు
నానాముఖమ్ముల నా పాలిటను గలం
డే నెపమ్ముల నాకు నెదురు లేదు;

తే. బలువుఁడైనట్టి హరిని చేపట్టినాఁడ
తలఁచినది దక్కెనాకు; నిర్మలుఁడు వేంక
టేశ్వరుం డవ్యయానందుఁ డిట్టు లనయ
మెడయకయ ప్రోచు నేలిక యితఁడె మాకు. 186

పాపములు పాఱదోలేవాడు, దుఃఖాలను చీల్చి చెండాడేవాడు, శత్రుజనమునకు భయంకరుడు, అచ్యుతుడైన ఈ లక్ష్మీవల్లభుని పూనికతో సేవిస్తే ఉత్తమసుఖమే లభిస్తుంది కాని భయం ఉండదు. రాక్షస సంహారకుడు, దేవతలకు మకుటంవంటి వాడు. అభిమానాన్ని కాపాడే వాడు, భూదేవికి భర్తయైన ఈ వేంకటేశ్వరుడు నఖముఖాల నా పాలనుండగా నాకు ఎదురే లేదు. ప్రబలుడైన హరిని ఆశ్రయించాను. నేను తలచినది అదే. అదే నాకు దక్కినది. ఆయన స్వచ్ఛమైనవాడు. అతడు నిరతిశయానంద స్వరూపుడు. అతడే ఆ విధంగా ఎల్లప్పుడు మమ్ము కాపాడే ప్రభువు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| బలువుఁడు హరి | 113 | 77 | 2 | 52 |

అవ: అంజనగిరీశ్వరుని కొలువును యజ్ఞంగా రూపణం చేస్తున్నాడు.

**సీ. అమలమౌ విజ్ఞానమను నధ్వరమునకు**
**బరఁగు సంకల్పమే పశువు గాఁగ**
**నరయ నిర్మమతయే యాచార్యుఁడై యొప్ప**
**రహి ధర్మదేవత బ్రహ్మ గాఁగ**
**దొరకొన్న శమదమాదులు దానధైర్య భా**
**స్వరగుణాదులు విప్రసమితి గాఁగ**
**ప్రమదయూపంపుఁ గంబమున నాలంభించి**
**విమలేంద్రియాహుతుల్ వేల్చ వలదె?**

**తే. అంజనాద్రీశు పదయుగ ధ్యానధార**
**నరులకును సోమపానమై వఱల వలదె?**
**వనజదళనేత్రు కారుణ్యవనధియందు**
**నర్హులై యంద అవభృథం బాడ వలదె? 187**

శుద్ధసాత్త్వికమైన విజ్ఞాన మనేదే యాగము. ఈ యాగానికి బంధకారణమై విస్తరిల్లే సంకల్పమే పశువు. మమకారం లేకుండటమే ఆచార్యుడు. ధర్మదేవతయే బ్రహ్మ. శమదమాది సంపత్తి, దానము, ధైర్యము మొదలైన మంచి గుణాలే బ్రాహ్మణ గోష్ఠి. సంతోష మనే యూపస్తంభమందు సంకల్పరూప పశువును బంధించి విశసనం చేసి పరిశుద్ధాలైన ఇంద్రియ వ్యాపారములను హోమం చేయవలెను. అంజనపర్వత ప్రభుని పాదముల జంటయందలి అవిచ్ఛిన్నమగు ధ్యానధార మానవులకు సోమ పానమై యొప్పవలెను. తామరరేకుల వంటి కన్నులుగల వేంకటవిభుని దయ అనే సముద్రమందు సకల భక్తులు యోగ్యులై అవభృధస్నానం చేయవలెను. అనగా విజ్ఞానం గలిగి, సంకల్పాలను విడిచి, మమతలేక, ధర్మాన్ని ఆచరిస్తూ, శమదమాది సద్గుణసంపత్తి గలిగి, ఇంద్రియాలను విషయాలమీదికి పోనివ్వక, దేవుని పాదాలను అనవరతం స్మరిస్తూ యోగ్యతను సంపాదించుకొని ఆ దేవుని దయకు పాత్రులు కావలె ననుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అదిగాక నిజమతం | 6 | 40 | 1 | 26 |

అవ: పరదూషణాది దుర్గుణములు పాసినపుడే జయము సిద్ధించు ననుచున్నాడు.

సీ. ఇతర దూషణముల నెడసినప్పుడు గాక
అతికాముకుఁడు గాని యపుడు గాక
మతిచంచలత్వము మానినప్పుడు గాక
గతి యేల గల్గు; దుర్గతులు వీడు?
పరధనముల యాస పాసినప్పుడు గాక
అరిదినిందలు లేనియపుడు గాక
విరస వర్తనమును విడిచినప్పుడు గాక
పర మేల గల్గు? నాపదలు వాయు?

తే. ఫణిగిరిప్రభు నెద వెదకినను గాక
కింక మానసమునఁ దొలంగినను గాక
యనృత వచనమ్ములను విడిచినను గాక
యేల శంక చనున్? జయ మేల గలుగు? 188

ఇతరులను దూషించడం మానవలె. కాముకుడు కారాదు. బుద్ధిచాపల్యం విడిచిపెట్టవలె. అప్పుడే ఉత్తమగతి కలుగుతుంది. దుర్గతులు తొలగిపోతాయి. ఇతరుల సంపదపై ఆశ వీడవలె. తాను పరులనిందకు పాత్రం కాకూడదు. దుష్టవర్తనాన్ని త్యజించవలె. అప్పుడే పరము లభిస్తుంది. ఆపదలు తొలగుతాయి. శ్రీనివాసుని తన హృదయంలోనే వెదకి చూడవలె. కోపం విసర్జించవలె. సత్యం పలుకవలె. అప్పుడే మనస్సులోని సందేహాలు తీరుతాయి; జయం సమకూరుతుంది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎంత చదివిన | 10 | 62 | 1 | 41 |

అవ: అస్థిరమైన ఈ శరీరాన్ని శ్రీనివాసుని సన్నిధానంలోనికి చేర్చండి. ఎప్పు డేమవుతుందో అనుచున్నాడు.

**సీ. పిన్ననాటం గోలెఁ బెంచిన దేహమ్ము**
**మున్నిటివలెఁ గాదు ముదిసె నిప్పు;**
**దెన్నఁగ నియ్యది యెప్పు డేడఁ బడునొ**
**వడివడిఁ గన్నట్టివారి కిందు;**
**తోలునెమ్ములచేత దొడ్డదౌ దేహమ్ము**
**గాలిచేతను గ్రాఁగు దాలిమీఁదఁ**
**గీలుకీ లెప్పుడు ప్రీలి క్రిందఁ బడునొ**
**మేలుగీడులు లేని నేల నిడుఁడు;**

**ఆ. కింక కిసరుచేత కీడైన దేహమ్ము**
**వంక వాఁగులందు వ్రాలు నెపుడొ**
**దీనితోడి జాలిమాని వే వేగమే**
**వేంకటేశుఁ జేర వేయఁగదరె!** **189**

చిన్నతనంనుంచి పెంచిన ఈ దేహం మునుపటివలెగాక ముదిమిని పొందినది. చూడగా ఇది ఏ సమయంలో ఎక్కడ పడిపోతుందో తెలియదు కాబట్టి తొందరగా దీనిని అనుగ్రహించినట్టి (కన్నట్టి) స్వామివారికే అప్పగించండి. చర్మంతో ఎముకలతో పొడవుగ నుండే ఈ శరీరం కాష్ఠం మీద గాలివీచగా కాలిపోతుంది గదా! ఈ తనువులోని కీళ్లు ఊడిపోయి ఎప్పుడు క్రిందపడతాయో ఎఱుగము. కనుక మేలుగీళ్లు (సుఖదుఃఖాలు) లేని సురక్షిత ప్రదేశం (స్వామి సన్నిధి) లో దీనిని ఉంచండి. కోపతాపాలచే చెడ్డదగు ఈ కాయం ఏ వంకలోనో, ఏ వాగులోనో వ్రాలిపోతుంది. అందుచే ఈ బొందినిగూర్చి విచారపడక వెంటనే దీనిని శ్రీ వేంకటేశ్వరుని సన్నిధికి చేర్చండి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కాలము గాలము గాదు | 50 | 305 | 1 | 204 |

అవ: వేంకటవిభుడు హృదయంలో గోచరించగనే వైరాగ్యం జనించి మోక్షసంపత్తి చేకూరు ననుచున్నాడు.

సీ. పంచేంద్రియములను పాతకుల్ తనుఁ దెచ్చి
కొంచెపు సుఖముల గూర్చినంత
మించి కామంబను మేటి సూనుఁడు జని
యించి గడించె దుష్కృతధనంబు;
ప్రాయం బనెడి మహాపాపుఁడు తనుఁ దెచ్చి
మాయభోగమునకు మఱపినంత
మోహంబను సుతుండు పుట్టి సద్గుణములఁ
జెఱిచి సంపాదించె నరకపురము;

ఆ. అతిమహిముఁడు వేంకటాద్రీశుఁ డను మహా
హితుఁడు హృదయమందు నెనసినంత
ఆత్మజాత యగుచు నవతరించి విరక్తి
సంతరించె మోక్షసంపదలను. 190

అయిదు జ్ఞానేంద్రియాలనే పాపులు స్వల్పసుఖాలను సమకూర్చగా కామమనే గడుసరి కొడుకు పుట్టి పాపమనే ధనాన్ని ఆర్జించాడు. యౌవన మనే మహాపాపి మాయలమారి భోగాలకు మరపిన మీదట మోహ మనే కుమారుడు జన్మించి మంచిగుణాలు పాడుచేసి నరక మనే పట్టణాన్ని సంపాదించాడు. భక్తులకు మేలుకూర్చే మహామహిమాన్వితుడు శ్రీ వేంకటాచలపతి మనసులో పొడకట్టగనే విరక్తి అనే కొమార్తె ఉదయించి మోక్షసంపదను గడించింది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇదివో సంసారమెంత | 50 | 308 | 1 | 206 |

అవ: చిన్నారి శ్రీకృష్ణుని (శ్రీనివాసుని) ఇంద్రాది దేవతలు, నారదాది మహర్షులు స్తోత్రం చేస్తా రనుచున్నాడు.

**సీ. పాలదొంగకడను పాడెద రింద్రాది**
**దేవతల్ తమపాలి దేవుఁ డనుచు;**
**రోలఁ గట్టించుక గోలుగోలున నేడ్చు**
**బాలుని ముందఱఁ బాడుచుంద్రు;**
**లాల నోటం గాఱ ధూళి మేనం గ్రమ్మ**
**పాఱు బిడ్డనిచెంత పాడుచుంద్రు;**
**ముద్దులమూటయై మూలమూలలఁ దాఁగు**
**పసివాని చెంగటఁ బాడుచుంద్రు;**

**తే. ఇద్దివో వేంకటాద్రీశుఁ డీతఁ డంచు**
**చద్దికిని వేఁడికిని వచ్చి సనకముఖ్యు**
**లాలకింపుమ యని నారదాది మునులు**
**పరఁగ శేషాదులును జేరి పాడు చుంద్రు.** 191

పాలను దొంగిలించినవాడు, రోలగట్టుపడి గోలుగోలున నేడ్చేవాడు, నోట జొల్లుకార్చుకుంటూ మేనికి ధూళి అంటగా పాఱాడేవాడూ, ముద్దులు మూటగట్టుచు మూలలలో దాగేవాడూ అయిన చిన్ని కన్నయ్యను చేరి ఇదుగో! శ్రీ వేంకటేశ్వరుడని ఇంద్రాది దేవతలు స్తుతిస్తుంటారు. మఱియు ప్రాతఃకాలాన, మధ్యాహ్న సమయాన సనకాదులు, నారదాది పరమఋషులు, శేషుడు మొదలైన నాగరాజులు–ఓ ప్రభూ ! ఆలకింపు మని సమీపించి కీర్తిస్తుంటారు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పాలదొంగవద్ద | 62 | 311 | 1 | 208 |

అవ: జీవుల కర్మానుసారంగా ఉచ్చనీచస్థితుల పొందుచున్నారని వెల్లడిస్తూ ఉచితమార్గం అనుసరించుమని హెచ్చరిస్తున్నాడు.

**సీ. మనవంటి జీవులే శునక సూకరములై**
**తా మొందు పరమదుర్దశలు చూడు !**
**మనవంటి జీవులే సనకాదిముని లయి**
**యచ్యుతు సేవించు టదియుఁ జూడు!**
**మనవంటి జీవులే మఱి బంట్లు తొత్తులై**
**పదరాని యిడుమలఁ బడుటఁజూడు!**
**మనవంటి జీవులే ముని నారదాదులై**
**హరిదాస్యమున మించు టదియుఁ జూడు!**

**తే. వెనుకఁబొందిన నరకయాతనలు చూడు!**
**ముందటిది మోక్షసౌఖ్యమ్ము మొనసి చూడు!**
**ఏది వలసె నీ వది సేయు మీశ్వరేచ్ఛ**
**నొకటి హేయంబు శ్రేయ మింకొకటి జగతి. 192**

జీవసామాన్యంలో భేదం లేదు; అయినా తాము చేసుకున్న పాపాలకు అనుగుణంగా కొన్ని జీవులు కుక్కలుగా పందులుగా పుట్టి పరమ కష్టాలపాలు గావడం చూచి బాగా ఆలోచించు. మనవంటి జీవులే మరికొన్ని సనక సనందనాది మహర్షులై భగవంతుణ్ణి ఆరాధించడం గమనించు. మఱి కొన్ని జీవులు తమ కర్మలకు అనుగుణంగా సేవకులై, బానిసలై పలుపాట్లు పడుతూండడం పరికించు. మనవంటి మరికొన్ని ప్రాణులు తుంబురు నారదాది పరమభాగవతులై దైవసేవ చేయడం గుర్తించు. గతంలో నీవు అనుభవించిన నరకబాధలు జ్ఞప్తికి తెచ్చుకో. భవిష్యత్తులో రానున్న ముక్తిసుఖాన్ని చక్కగా ఊహించుకో. ఈశ్వరేచ్ఛచేత నీ కేది యిష్టమో దానినే ఆచరించు. సత్కర్మ దుష్కర్మలలో మొదటిది గ్రహింప దగ్గది. రెండవది త్యజింప తగ్గది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏది వలసె | 132 | 128 | 2 | 36 |

అవ: దుర్గుణములు విడిచి భగవంతుని సేవలో జీవితం గడపండని ప్రబోధిస్తున్నాడు.

సీ. **చలము కోపము తన్నుఁ జంపు వైరు లటంచుఁ**
**దెలిసినట్టిదె గదా తెలివి యనఁగ;**
**మెఱసెడి విషయముల్ మెడ కురిత్రాళ్ళంచు**
**నెఱిఁగినట్టిదె గదా యెఱుక యనఁగఁ;**
**బరదూషణము తనపాలి మృత్యు వటంచుఁ**
**దలఁచినట్టిదె గదా ఫల మనంగఁ;**
**బేరాస తనుఁ బట్టు పెద్ద భూత మటంచు**
**జంకు నట్టిదె గదా జ్ఞాన మనఁగ;**

తే. **వేంకటాద్రి విహారుఁడే వేలు పనుచు**
**వినఁగలిగి నట్టిదే గదా వినికి యనఁగ;**
**ననయ మాతని సేవలో హర్ష మొదవ**
**మనఁగలిగి నట్టిదే గదా మనికి యనఁగ.** **193**

మాత్సర్యము, కోపము– ఈ రెండు తన్ను చంపు శత్రువులని తెలుసు కోవడమే తెలివి. మెఱిసే విషయాలు (విషయసుఖాలు) తన మెడకు ఉరిత్రాళ్ళనే ఎరుకగల్గి ఉండడమే నిజమైన ఎఱుక. పరులను దూషించడం తనకు మృత్యువని తలచుటే నిజమైన ఫలం. పేరాస తన్ను బట్టి బాధించే పెను భూత మనుకొని జంకుటే జ్ఞానం. వేంకటేశ్వరు డొక్కడే దైవమని వినగల్గినట్టిదే యథార్థమైన వినికిడి. ఎల్లప్పుడు అతనిని సేవించి హర్షంతో జీవించగలుగుటే సార్థకమైన జీవితం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎంతవిభవము | 29 | 181 | 1 | 121 |

అవ: దుష్ప్రవర్తన తగదని హెచ్చరిస్తున్నాడు.

సీ. పరుల కెల్లప్పు డాపదలు గల్గఁగఁజేయు
పరితాపకరమైన బ్రదు కదేల?
సొరిది నన్యులమేలు చూచి సైపఁగ లేక
తిరుగుచుండెడి కష్టదేహ మేల?
ఎదిరికి సలిపెడు హితమెల్లఁ దన దంచుఁ
జదివి చెప్పని యట్టి చదు వదేల?
పొదిగొన్న యాసలో బ్రుంగుడు పడుచును
సదమదమై పొందు చవు లవేల?

తే. పరమపురుషు పదాబ్జసేవలకుఁ గాక
జీవనభ్రాంతిఁ బొరలెడు సిరు లవేల?
తిరుమలాధిపు నాత్మలోఁ దెలియలేక
పెక్కుత్రోవలఁ జను దేహి బింక మేల? 194

ఇతరులకు ఎల్లప్పుడూ ఆపదలు కల్గించి పరితపింపజేసే బ్రతుకెందుకు? నిరర్థక మని భావము. పరుల మేలుచూచి ఓర్వలేక వ్యర్థంగా తిరిగే పాపిష్ఠిదేహ మెందుకు? నిష్ఫల మనుట. ఇతరులకు చేసే మేలు తనమేలుకే అని నీతిగ్రంథాలు చదివి చెప్పనట్టి చదు వెందుకు? వ్యర్థమని తాత్పర్యం. ఆవరించిన ఆసలలో ఎడతెగక కొట్టుమిట్టాడుచు పొందే అభిరుచు లెందుకు? నిరర్థకము లనుట. పురుషోత్తముని పాదపద్మాల కైంకర్యానికి వినియోగపడని జీవయాత్రకొరకై భ్రమతో ప్రవర్తించే సంపద లెందుకు? నిరుపయోగము లనుట. శ్రీ వేంకటాద్రీశ్వరుని తన ఆత్మలో చూడలేక పలుపోకల బోవునట్టి మానవుని గర్వ మెందుకు? నింద్యమని భావం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కదుపెంత | 49 | 302 | 1 | 202 |

అవ: తన మంచి చెడ్డలకు తన ప్రవర్తనమో, దైవమో కారణము గాని ఇతరులు కారనుచున్నాడు.

**సీ. తన మేలుగీళ్ళకుఁ దగు కర్త లెవ్వారు?**
**పరికింప నొక్క దైవతమె కాక;**
**తన వెంటవెంటను దగులువా రెవ్వార?**
**లార్జిత పాపపుణ్యములె గాక;**
**తన బంధమోక్షాలకును ముఖ్యు లెవ్వార?**
**లజ్ఞానమును జ్ఞాన మగును గాక;**
**తన కీర్తి కపకీర్తికిని మూల మెవ్వారు?**
**నడచెడి నిజవర్తనమ్మె గాక;**

**తే. ఇతరులను దూఱ నేటికి? మతి దలంప**
**వారు సైతము తమవంటివారె గాక;**
**తనకు శ్రీవేంకటేశుపైఁ దలఁపు గూర్చు**
**వార లెవ్వార? లాచార్యవరులె గాక.** **195**

తన మంచి చెడ్డలకు దైవమే కర్త గాని ఇతరు లెవ్వరూ కర్తలు గారు. తను సంపాదించిన పాపపుణ్యములు దప్ప తనవెంట మరెవ్వరూ రారు. బంధానికి మోక్షానికి వరుసగా తన అజ్ఞానమూ, జ్ఞానమూ- ఇవియే కారణములు గాని మరేదీ కారణము గాదు. తన కీర్తికినీ, అపకీర్తికినీ తన నడవడియే మూలంగాని ఇతర మేదీకాదు. ఆలోచింపగా ఇతరులను నిందించి యేమి ప్రయోజనం?' ఆత్మవత్సర్వ భూతాని' అన్నట్లు పరులుగూడా తమవంటి వారేగదా! గురువులు గాక మరెవ్వరు శ్రీనివాసునిపై భక్తిని గఱపగలరు? గురుని మూలంగానే దేవు నెఱుంగవలెనని తాత్పర్యం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇతరుల దూఱనేల | 140 | 174 | 2 | 117 |

అవ: సకల ప్రాణుల జీవన ప్రయత్నాది ప్రవృత్తులకు మూలకారణం భగవంతు డనుచున్నాడు.

**సీ. చీమల కెవ్వారు చెప్పిరి బుద్ధులు**
**కొలుచు పుట్టల నించుకొనుఁ డటంచు**
**సర్వజీవులకును సంసారవిభ్రాంతి**
**తలకెత్తు పరదైవతమ్మ కాక;**
**చెట్లుల కెవ్వారు చెప్పిరి బుద్ధులు**
**పూచి కాచి ఫలించి పొదలుఁ డంచు**
**సకల చరాచర చైతన్యమై గుణ**
**సంధాతయగు రమాజాని గాక;**

**తే. బుద్ధు లెవ్వారు చెప్పిరి పుట్టినట్టి**
**మెకములకుఁ జన్నుద్రావి పుల్మేయుఁ డంచుఁ**
**బ్రొద్దు ప్రొద్దును లోనుండి భోగములను**
**మఱపెడు వృషాచలేంద్ర మందిరుఁడు గాక! 196**

పుట్టలలో ధాన్యపుగింజలను దాచుకొండని చీమల కెవరు బుద్ధులు చెప్పినారు? సకలప్రాణులకు తన మాయచే సంసారభ్రాంతిని తలకెక్కించే ఆ పరదైవతమే కదా ! పుష్పించి కాచి ఫలించి వర్ధిల్లుడని చెట్ల కెవరు బుద్ధులు గఱపినారు? స్థావర జంగమా లన్నింటిలో నిగూఢమైన చైతన్యంగా ఉండి గుణములు ప్రసాదించే ఆ రమాపతిగాక మరెవరు? అప్పుడే పుట్టిన మృగాలకు చన్ను గుడిచి పచ్చిక మేయండని బుద్ధు లెవ్వరు బోధించారు? శరీరంలో అన్ని వేళలా ఉంటూ భోగములు రుచిచూపే ఆ వృషభాచలేశ్వరుడు గాక మరెవరు?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నే ననఁగా | 108 | 45 | 2 | 31 |

అవ: తత్త్వవేత్తకు సుఖదుఃఖములు, పాపపుణ్యములు లేవనీ, బంధ మోక్షాలకు జ్ఞానాజ్ఞానములే కారణమనీ చాటుతున్నాడు.

**సీ. అనయమ్ము సుఖమేడ? అవల దుఃఖమ్మేడ?**
**తనువుపై స్పృహలేని తాత్త్వికునకుఁ;**
**గలుగు పుణ్యమ్మేది? కలుష మెయ్యది? కర్మ**
**ఫలము నొల్లని యోగితిలకునకును;**
**అమృత రసమ్మేది? హాలాహల మ్మేది?**
**మతి నిరాహారియౌ మహితునకును;**
**పగవార లెవ్వారు? బాంధవు లెవ్వారు?**
**వెగటు విశ్వము వీడు విమలమతికి;**

**తే. దైవతము విశ్వసించిన ధన్యునకును**
**వేల విధులందు మఱ పేది? వెఱ పదేది?**
**తెలియ మోక్షమ్ము; బంధమ్ము తెలియకున్న;**
**బ్రతుకు కలవంటిది వివేకవంతునకును.** **197**

శరీరాభిమానం వదలిన జ్ఞానికి సుఖదుఃఖము లెక్కడివి? ఉండవని భావం. కర్మఫలం అపేక్షించని వానికి కృష్ణార్పణబుద్ధితో కర్మల నాచరించువానికి పాపపుణ్యము లంటునా? అంట వనుట. ఆహారాన్ని వర్జించిన మహాయోగికి అమృతమూ, విషమూ రెండునూ ఒకటే. వెగటు గొల్పు ప్రపంచమునే పరిత్యజించు జ్ఞానికి శత్రువు లెవరు? మిత్రులెవరు? అందరూ సమాను లనుట. దేవుణ్ణి నమ్మిన ధన్యాత్మునికి వేలసంఖ్యలో కార్యము లున్నను మరపు వెరపు లెక్కడివి? ఉండవన్నమాట. జ్ఞాని అయితే మోక్షం పొందవచ్చు. అజ్ఞాని అయితే బంధాలలో చిక్కుపడవలసి ఉంటుంది. వేదాంతవివేకం కలవానికి జీవితమంతా కలవంటిదే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తెలిసితే | 104 | 19 | 2 | 13 |

అవ: అన్ని కష్టములలో హరినామమే దిక్కనుచున్నాడు.

**సీ. అంకటివేళల నలపైన వేళల**

**నప్పు లిచ్చినవార లాంగువేళఁ**

**గొఱమాలి చెఱవడి కుందెడు వేళల**

**నొఱపైన హరినామ మొకఁడె దిక్కు;**

**ఆపదవేళల నాఱడిఁబడు వేళ**

**భయపడు వేళల పాపవేళ**

**సంకెల లిడువేళఁ జంపఁ బిల్చినవేళ**

**మఱచి తప్పిన మతి తెఱఁగులేదు;**

**ఆ. కులము చెడినవేళఁ గూరిమి రక్షింపఁ**
**గొండలప్ప నామ మొందుగాక**
**మంకుబుద్ధి రేపుమాపులు పొరలిన**
**వేఱు తెరువు మాఱు వెరవు లేదు.** **198**

ఆకలిబాధ కల్గినప్పుడు, అలసట చెందినప్పుడు, అప్పిచ్చినవారు నిలదీసినపుడు, చెఱసాల పాలయినపుడు, రక్షణకు ఉపాయమైనది ఒక్కహరినామమే. అదే దిక్కు. ఆపదలు వచ్చినప్పుడు, నిందల పాలయినప్పుడు, భయపడినప్పుడు, పాపం చుట్టుకొన్నప్పుడు సంకెళ్ళతో బంధమేర్పడినప్పుడు, చంపుటకై పిల్చినప్పుడు, హరినామాన్ని మరచితే బాగుపడుటకు మరో మార్గంలేదు. కులంనుంచి వెలివేయబడినప్పుడు ఏడుకొండలవాని నామ మొక్కటే రక్షకము. అట్లుగాక మొరకుబుద్ధితో రే పవలు ఎంత ప్రాకులాడినా సుఖపడుటకు వేరే మార్గంగాని, ఉపాయం గాని లేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అంకటి వేళల | 26 | 158 | 1 | 107 |

అవ: మోక్షం, పుణ్యం, సుఖం ప్రసాదించే తిరుమలేశుడు ప్రత్యక్షమగు టెప్పుడో అనుచున్నాడు.

**సీ. ఎన్నియో భవవార్ధు లీదుచు నలసిన**
**వారికి తేఁపయౌ వాఁ డెవండొ?**
**దురితకాననములఁ ద్రోవ దప్పినవారి**
**కిది దారి యని చూపు నీశుఁ డెవఁడొ?**
**కష్టచయమ్మను కార్చిచ్చు ముట్టిన**
**వడినార్పి కాపాడువాఁ డెవండొ?**
**అజ్ఞానతామిస్ర మలమినఁ జేరువ**
**దివ్వెయై తోఁచెడు దేవుఁ డెవఁడొ?**

**తే. సొగసి తలఁచిన వారికి సురకుజమ్ము,**
**సకల జీవాంతరాత్ముండు, సప్తశైల**
**విభుఁడె గాక మ ఱెవ్వండు? వేల్పురాయఁ**
**డతఁడు తలఁపుల ముంగిట నబ్బు టెపుడొ? 199**

ఎన్నో జన్మము లనెడు సముద్రాలను ఈది అలసిపోయిన వారికి ఎవడు పడవగా నున్నాడో, పాపములనే అరణ్యాలలో దారి గానని వారికి ఈ దారిని పొందని చెప్పి చూపే ప్రభు వెవడో, కష్టాలగుంపనే దావానలం చుట్టు ముట్టినప్పుడు దానిని వెంటనే చల్లార్చి రక్షించేవా డెవడో, అజ్ఞానమనే అంధకారం అలమినప్పుడు సమీపంలో దీపంవలె కనిపించే వాడెవడో, పారవశ్యంతో స్మరించే వారికి హాయి గూర్చే పారిజాతవృక్షమెవడో, జీవులందరిలో ఉండేవా డెవడో అతడు ఏడుకొండల రాయడు గాక మ రెవ్వడు? దేవదేవు డాతడు నా హృదయసన్నిధిలో కనిపించు టెప్పుడో గదా!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఆతఁడే సకల | 68 | 353 | 1 | 236 |

అవ: నారాయణసేవ ముక్తిప్రదమని నిందాపూర్వక స్తుతిచే నిరూపిస్తున్నాడు.

**సీ. పాలచవి యెఱుంగుఁ బాలవెళ్లిఁ బరుండు**
**గోపాలుఁ డితఁ డంచుఁ గూర్మి గొలువ**
**తల్లి చన్బాలకు ద వ్వొనర్చెను మమ్ము**
**భావింప నెక్కడిదైవ మితఁడు?**
**పుట్టింపఁ గర్త; మేల్పుట్టు విచ్చు నితండు**
**పురుషోత్తముఁ డటంచుఁబూజసల్ప**
**మము పట్టుకొని వచ్చి మా పుట్టువులు గట్టి**
**పెట్టించె నెక్కడి వేలు పితఁడు?**

**తే. కర్మలకుఁగర్త యని పుణ్యకర్మఫలముఁ**
**గైకొలుప మా యుభయ కర్మగతులు చెఱిచె;**
**నసమ విశ్వాసమున వేంకటాద్రిపతికి**
**సేవ లొనరింతురా? యేమి దేవుఁ డితఁడు? 200**

పాలరుచి మరగి పాలసంద్రాన పవళించిన గోపాలుడుగదా అని ప్రీతితో కొలిచితే తల్లిపాలకే మమ్ము దూరంచేశాడు. ఆహా! ఇతడెక్కడి దేవుడు? అనగా జన్మరాహిత్యం కలిగించాడని స్తుతి. ఇతడు జన్మలిచ్చే వాడనీ, ఇంతకన్న మంచి జన్మలు ప్రసాదించే పురుషోత్తముడనీ పూజిస్తే అసలు పుట్టుకే లేకుండా చేసిన ఇత దెక్కడి దేవుడు? ముక్తి ననుగ్రహించాడని స్తుతి. ఇతడు కర్మలకు కర్త అని పుణ్యకర్మలయొక్క ఫలాన్ని సమర్పించగా పుణ్యపాపములనే మా ఉభయ కర్మలను నశింపజేశాడు. సాటిలేని విశ్వాసంతో ఇట్టి వేంకటపతికి సేవచేస్తారా? ఇతడేమి దేవుడు? పరమ విశ్వాసంతో ఆ స్వామి సేవచేసి తరించండనీ, అతడు వాచామ గోచరుడైన గొప్పదేవుడనీ స్తుతి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సేవెంతురా | 46 | 293 | 1 | 195 |

అవ: మాయకు వశులై సంసారము విడువలేని జీవుల హీనస్థితిని ఉగ్గడించుచున్నాడు.

**సీ. మాయకు వశులౌట మతిచెడి ప్రాణులు**
**రోఁత సంసారంబు రోయ లేరు;**
**మిసమిస మెఱసెడి ముసిఁడి మ్రానిఫలాలు**
**విసివి చేఁదని కూడ వీడ లేరు;**
**బలువిస మొలికెడి పాముతో చెలగాట**
**హానియం చెఱిఁగియు మానలేరు;**
**తేనెపూసిన కత్తి తెగునని తెలిసియు**
**నాల్కతో నాకుట కుల్కఁ బోరు;**

**తే. మాయ దరియింప నిజపదతోయజముల**
**శరణముగఁ జూపి దీనతల్ చక్కుచేయు**
**గరుడశైలేంద్రుఁ డనెడు బంగారుచేని**
**పంటలకుఁ జేయిసాచంగఁ బాలుపడరు. 201**

మానవులు మాయకులోనై మతిపోగా రోతయైన సంసారాన్ని చూచి ఏవగింపరు. మిసమిసలాడే ముసిడి మ్రానిపండ్లు తింటూ చేదనరు. విసుగు చెందరు. విషం గ్రక్కే పాముతో చెలగాటం హానికరమని తెలిసీ వదలరు. అనగా సంసారం విషంగ్రక్కే పామువంటిదని తెలిసికూడ వీడరని తాత్పర్యం. తేనెపూసిన కత్తి అని ఎరిగియు నాలుకతో నాకుటకు జంకరు. అనగా పైపై సుఖాలతో భాసిస్తున్నప్పటికీ, సంసారం ప్రాణహానికరమని తెలియవలె. మానవులు ఉపద్రవకరములైన వాటినే వాంఛిస్తారుగాని మాయను దాటుటకు తన పాదాలను శరణంగా చూపుతూ దీనతలు పోకార్చు గరుడశైలాధిపతి అనే బంగారు చేనిపంటకు చేయి సాచడానికి పాల్పడరు గదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మాయల కగపడి | 16 | 4 | 4 | 362 |

అవ: మోక్షసుఖము ఊరకే లభించ దనుచున్నాడు.

**సీ. తలఁపులోపలి చింత దాఁటినప్పుడు గదా**
**యలరి దైవతము ప్రత్యక్ష మగుట;**
**కలుష దుర్మదమును గడచినప్పుడు గదా**
**తనకు మోక్షమ్ము సంధాన మగుట;**
**కర్మంబు కసటువోఁ గడిగినప్పుడు గదా**
**నిర్మలజ్ఞానంబు నెలవుకొనుట;**
**తనకు శాంత మ్మాత్మఁ దగిలినప్పుడు గదా**
**చదివిన చదువులు సఫల మగుట;**

**ఆ. మాధవాంఘ్రియుగళి మఱుఁగుఁ జేరినఁ గదా**
**తనదు జన్మమెంతొ ధన్య మగుట;**
**తనకు వేంకటేశు దాస్య మబ్బినఁ గదా**
**యున్నతోన్నతసుఖ మొంది మనుట !** **202**

హృదయంలోని చింతలు మానినప్పుడే దైవం సంతోషించి ప్రత్యక్షమవుతాడు. పాపభూయిష్ఠమైన మదమును వీడినప్పుడే గదా తనకు మోక్షం చేకూరేది? కర్మముల మాలిన్యం కడుగుకొన్నప్పుడే అచ్ఛమైన తెలివి ఏర్పడుతుంది. తనలో శాంతాన్ని పెంపొందించు కొన్నప్పుడే తాను చదివిన చదువులు సఫల మవుతాయి. శ్రీనివాసుని పాదాలమఱుగున జేరినపుడే తన జన్మ ధన్య మవుతుంది. తనకు (భక్తునికి) శ్రీవేంకటేశ్వరునిసేవ చేకూరినప్పుడే తాను అధికాధికమైన మోక్షసుఖాన్ని పొంది సుఖిస్తాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఊరకే దొరకునా | 118 | 104 | 2 | 70 |

అవ: శ్రీమహాలక్ష్మీ విలాసమును అభివర్ణిస్తున్నాడు.

**సీ. రూకలై మాడలై రువ్వలై తిరుగాడు**
**నొక్కచోటఁ బసిండి యుండఁబోదు;**
**ఒకని రాజుగఁజేయు, నొకని బంటుగఁ జేయు;**
**నొరుకన్య నమ్మించు నొండొరునికి;**
**ఒకచోటి ధాన్యమ్ము నొకచోట వేయించు,**
**నొకనిఁ బుణ్యునిఁ, బాపి నొకనిఁ జేయుఁ;**
**గొందఱ లోపలఁ గొట్లాటఁ గల్పించుఁ**
**గొందఱ జాలెలఁ గొలువు దీఱు;**

**తే. పందెమాడిన యటువలెఁ బరుగువాఱు**
**జగము భ్రమియింపఁ జేయు; పన్నగగిరీశు**
**తరుణియై మహామాయయై తగిలియుండు**
**నగుచు మా యింటి ముంగిళ్ళ నాట్యమాడు. 203**

బంగారం ఒకటే రూకలుగా మాడలుగా రువ్వలుగా అవతారాలెత్తి అంతటా సంచరిస్తుంది. ఒకచోట స్థిరంగా ఉండదు. ఈ ధనమే వారి వారి అదృష్టానికి అనుగుణంగా ఒకణ్ణి రాజునూ, వేరొకణ్ణి బంటునూ చేస్తుంది. ఒకనికి శుల్కాన్ని ఇప్పించి వాని కొమార్తెను మరొకని కిప్పిస్తుంది. ఒకణ్ణి ధాన్యం అమ్మేవానిగా, మరొకణ్ణి కొనేవానిగా చేస్తుంది. ఒకణ్ణి మంచికార్యాలకు వెచ్చించేటట్లుచేసి పుణ్యవంతునిగాను, పాపకార్యాలకు వినియోగించేటట్లు చేసి పాపిగానూ చేస్తుంది. ఈ ధనమే కొందరిలో కొట్లాటలు పుట్టిస్తుంది. కొంతమంది భాగ్యవంతుల సంచుల్లో కొలువుదీరి కూర్చుంటుంది. పందెం వేసుకున్నట్లు పరుగులు దీస్తుంది. లోకానికే భ్రాంతి కలిగిస్తుంది. ఈ సంపదయే మహామాయగా శ్రీవేంకటేశ్వరుని భార్యగా అతణ్ణి చేరి ఉంటుంది. ఆ తల్లి మా యింటివాకిట ఆనందంతో నాట్యం చేస్తుంది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| రూకలు మాడలై | 92 | 458 | 1 | 307 |

అవ: మానవుడు మాయచే కప్పబడి భగవంతుని తలంచక, పూజించక, ఆశలతో ఇతరులను స్మరిస్తూ కొలుస్తూ ఉంటాడనుచున్నాడు.

**సీ. విసువ కెవ్వరినైన వేఁడ నేర్చిన నోరు**
**దెసలకుఁ బలుమాఱు దెఱచు నోరు**
**వసుదేవసుతుఁ దడవదు గాక, తడవిన**
**నెల్లకోర్కులు తన కిపుడ రావె;**
**మొనసి యెవ్వరికైన మ్రొక్కనేర్చిన చేయి**
**యధముల నడుగంగ నదరు చేయి**
**యచ్యుతుఁ బూజసేయదు గాక, చేసిన**
**నెదు రెదురై వాంఛలెల్ల రావె;**

**తే. తడయ కేమిటి కైనను తమక మొందు**
**మనసు కొలువదుగాక రమాకళత్రుఁ,**
**గొలువఁ గడలేని సంపద కుదురుకొనదె?**
**గాఢమాయావృతుఁడు దేహి కనఁడు గాక ! 204**

ఈ నోరు ఫలాశతో విసుగులేకుండా ఎంతటి నీచునైనా వేడగలుగుతుంది. తెరచుకొని దిక్కులవైపు చూస్తుంటుంది. అంతేకాని శ్రీనివాసుని నామం పలుకదు. పలికితే ఆ క్షణంలోనే అన్ని కోర్కులీడేరవా? చేతులు హీనులకు కూడా నమస్కారం చేస్తాయి. అంతేకాక నీచులను యాచించడానికి ముందుకు వస్తాయి. మరి భగవంతుని పూజింపవు. పూజిస్తే కోర్కు లన్నియు ఫలింపవా? ఆలసింపక ఎంత పనికిమాలిన పనికైనా మనస్సు ఆత్రపడుతుంది. పద్మావతీపతిని సేవించదు. సేవిస్తే అంతులేని సంపద తనకు స్థిరపడదా? ఈ సత్యాన్ని దట్టమైన మాయచే కప్పబడిన ప్రాణి ఎఱుగకున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కనుఁగొనఁగ | 62 | 319 | 1 | 213 |

అవ: కామినీ కాంచనాదులమీది వ్యామోహం వదలి ఆచార్యుల పాదపద్మాలు సేవించుటే నేటి మానవ జన్మమునకు ఫలమనుచున్నాడు.

**సీ. పాపచింతన మదిఁ బారాద కుండిన**
**దానముల్ చేసినంతటి ఫలమ్ము;**
**జ్ఞానాగ్నియందు వాంఛలనెల్ల వేల్చిన**
**యజ్ఞమ్ము లొనరించినంత ఫలము;**
**కనకమ్ముపై నాస కాసంత విడిచిన**
**తపములు సల్పినంతటి ఫలమ్ము;**
**వనితా విమోహంపు వలఁ బడకుండిన**
**నమల తీర్థస్నానమంత ఫలము;**

**తే. కొండయెకిమీని భక్తితోఁ గొలుచు టొకటె**
**సవతులేనట్టి మానవజన్మ ఫలము**
**శ్రీమదాచార్య పదపద్మ సేవనంబు**
**సమధిగత సర్వశాస్త్రార్థ సత్ఫలంబు.** 205

మనసులో పాపపు టాలోచనలు పుట్టకుంటే దానాలు చేసినంత ఫలం. జ్ఞాన మనే అగ్నిలో కోరికలను వేల్చినట్టయితే యజ్ఞాలు చేసినంత ఫలం. బంగారంమీద ఆశ వదలితే తపస్సు చేసినంత ఫలం. స్త్రీ వ్యామోహమనే వలలో తగుల్కొనకుంటే పుణ్యతీర్థాలలో స్నానం చేసినంత ఫలం. శ్రీవేంకటేశ్వరుని భక్తితో కొలవడం ఒకటే మానవజన్మానికి సాటిలేని ఫలం. ఆచార్యుల పాదపద్మాలను సేవించడమే అన్ని శాస్త్రాలు చదివినందుకు మంచిఫలం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమియుఁ జేయఁగ | 88 | 430 | 1 | 288 |

అవ: భర్తలుగల భార్యాదులకు వలె శ్రీనివాసపద సేవకులకు ఎందును లోటు లేదనుచున్నాడు.

సీ. **పాలించు మగఁడున్నఁ బడఁతి కేమి విచార?**
**మేలికగల లెంక కేమి చింత?**
**పొలమున్న వానికి పొట్టకు లోటేమి?**
**యాచారవంతున కఘ మదేమి?**
**జనకుండు గల కుమారునకు నంగద యేమి?**
**బలమున్న తేనికి భయ మింకేమి?**
**గురుఁడున్న శిష్యునకుం గొదవ యదేమి?**
**సిరిగల వానికి గొఱంత యేమి?**

తే. **పరముగల వానికిని మఱి భ్రాంతు లేమి?**
**అరయ పున్నెమ్ము గలవాని కలమ టేమి?**
**అంతట వెలుంగు శ్రీవేంకటాద్రినిలయు**
**నంఘ్రి సేవకులకు నడ్డ మాఁక యేమి?** **206**

పోషించే భర్త ఉండగా భార్యకు విచారమేమి? మంచి ప్రభువు గల బంటుకు చింత ఏమున్నది? పొలమున్న రైతుకు పొట్టకూటికి కొరత ఏముంది? ఆచారవంతునికి పాప మెక్కడిది? తండ్రిగల కుమారుడికి కష్ట మేమున్నది? సేనాబలం కలిగిన రాజుకు భయ మేముంది? మంచి గురువు కల్గిన శిష్యునికి లోటేముంది? పరలోకం తెలుసుకొన్న వానికి భ్రాంతి పుదుతుందా? పుణ్యవంతునికి చింత లుండునా? సకల మందు ప్రకాశించే వేంకటాద్రివాసుని పాదసేవకులకు అడ్డు అపు లేవుకదా?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దేవుఁడు గలవారికి | 154 | 254 | 2 | 170 |

అవ: పరమ సుఖము పరమాత్మునిలోనే కల దనుచున్నాడు.

**సీ. వెతలఁ బొరలు భూరివిభవమ్ముకంటెను**
**కటిక పేదతికమ్మె కడు సుఖమ్ము;**
**పలుబాములం బడు పగలింటికంటెను**
**తెలిసి నిద్రించు రాతిరియె సుఖము;**
**అలమట గడియించు నమృతమ్ముకంటెను**
**కలపాటి తనకు నంబలియె సుఖము;**
**పరులను పీడించు భవమునకంటెను**
**నిటు భువిఁ బుట్టకుండుటయె సుఖము;**

**తే. ఎఱిఁగి యెఱుఁగదు మానస; మేమి సేతు?**
**నన్నితెఱఁగుల హరిదాస్య మదియ సుఖము;**
**నామముల సామి వేంకటనాయకునకు**
**శరణ మనియెడు జన్మమే చాల సుఖము. 207**

కష్టాలవల్ల లభించే గొప్ప వైభవాలకంటె శుష్కదారిద్ర్యమే చాలా సుఖం. పలుదుఃఖములకు ఆలవాలమైన పగలిటి కంటె గాఢనిద్రను గలిగించే రాత్రియే మంచిది. ప్రయాసపడి గడించే అమృతం కంటె ఉన్నంతలో తనకు అంబలియే సుఖకరం. ఇతరులను బాధించే పుట్టుక కంటె ఇలలో అసలు పుట్టకుండటమే సుఖము. నా మనస్సు జ్ఞానమును పొందికూడా మాయలో బడిపోతున్నది. నేనేమిచేతును? అన్ని విధముల హరిసేవే సుఖం. సహస్రనాముడైన శ్రీ వేంకటేశునకు శరణమనే జన్మమే చాలా సుఖం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎరిగీ నెరుగదు | 378 | 455 | 4 | 306 |

అవ: సమబుద్ధియే సకలవేదసార మనుచున్నాడు.

**సీ. చీమకుఁ దన పుట్టు శ్రేయమై కాన్పించు**
**దోమకుఁ దన పుట్టు దొడ్డ దగును;**
**ఈఁగకుఁ దన జన్మమే జన్మమని తోఁచు**
**నెక్కువసౌఖ్య మిందెవరి కేది?**
**జంతురాసులకెల్ల జననమ్ము లొక్కటే**
**అంతట మరణమ్ము లవియు నొకటె;**
**ఆహార నిద్రా భయాదులు నొక్కటే**
**యెవరి కింతకుమించి యేమి గలదు?**

**ఆ. సర్వవేదశాస్త్రసారము సమబుద్ధి**
**సర్వభూతసముఁడు శార్ఙ్గధన్వి;**
**ఎచ్చులొచ్చు లేక యెల్లరలో నున్న**
**హరి భజించు టొకటె యాత్మసుఖము. 208**

చీమకు తన జన్మం క్షేమమని తోస్తుంది. అదే విధంగా దోమకు కూడా తన జన్మే గొప్ప దనిపిస్తుంది. అట్లాగే తన జన్మమే జన్మమనీ, ఇతరుల జన్మం జన్మ కాదనీ ఈగ అనుకుంటుంది. ఇందులో ఏది ఎవరికి ఎక్కువ సుఖం? ఏదీ కాదని భావం, జీవరాసు లన్నిటికీ జనన మరణములు, నిద్ర, భయము మొదలైనవి సమానములే. ఇంతకు మించి ఎవరికీ ఏమియు లేదు. సర్వప్రాణులందు సమానుడు శార్ఙ్గమనే విల్లుగల శ్రీమన్నారాయణుడే. హెచ్చుతగ్గులులేక అందరిలో నుండే ఆ శ్రీహరిని భజించడం ఒకటే ఆత్మకు సుఖం కలిగించే విషయం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సమబుద్ధే యిందరికి | 182 | 409 | 2 | 276 |

అవ: పురుషయత్నంతో సర్వం సాధించవచ్చు ననుచున్నాడు.

సీ. శ్రద్ధతోఁ జదివిన శాస్త్రసంపన్నుఁడౌ
చదువ కూరకయున్న జడుఁడె యగును;
పూనిక నడచిన భువిఁ జుట్టి రావచ్చు
నిదురింప యుగమొక్క నిముస మగును;
ఒగి తాపసుండైన నున్నతోన్నతుఁడౌను
అలసుఁడైన యెడల నధముఁ డగును;
మురహరుఁ గొలిచిన మోక్ష మందఁగవచ్చు
వెర వెఱుంగకయున్న వీతిడి యగు;

తే. మనుజుఁ డుద్యోగి గావలె మాంద్య ముడిగి
సహజముగ నుండి సాధింపఁ జాలఁ డెదియు;
శరణు సొచ్చిన వేంకటేశ్వరుఁడు బ్రోచు
సంశయించినఁ జెడును పాషండుఁ డగుచు. 209

శ్రద్ధతో చదివితే శాస్త్రజ్ఞానం కలవా డవుతాడు. చదువక ఊరకుంటే అజ్ఞాని కాగలడు. ప్రయత్నంతో పయనిస్తే ప్రపంచమంతా చుట్టిరా గలుగుతాడు. అట్లుకాక నిద్రపోతుంటే ఒకయుగం ఒకక్షణం వలె వ్యర్థంగా గడచిపోతుంది. గొప్పతపస్వి అయితే మిక్కిలి ఉన్నతుడవుతాడు. సోమరియై తపస్సు చేయకపోతే అధము డవుతాడు. మురుడనే రాక్షసుని సంహరించిన నారాయణుని సేవిస్తే మోక్షం పొందవచ్చు. దేవుని కొలిచే ఉపాయం తెలియకపోతే అవివేకి అవుతాడు. కనుక మానవుడు సోమరితనాన్ని వదలి ప్రయత్నపరుడు కావాలి. పుట్టినవాడు పుట్టినట్లుంటే దేనిని కూడా సాధించలేడు. శరణాగతిని పొందితే వేంకటేశ్వరుడు తప్పక కాపాడగలడు. భగవంతుని గూర్చి సందేహించేవాడు నాస్తికుడై చెడిపోతాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మహి నుద్యోగి | 147 | 212 | 2 | 142 |

అవ: మగువల మీద సక్తమయ్యే మనస్సు మాధవుని మీదికి పోదనుచున్నాడు.

సీ. **తొలుకారు మెఱుపులు తోఁచి పోవునుగాక**
**నిలుచునే నెలకొని నింగిలోన?**
**పొలఁతుల వలపులు పొలసిపోవును గాక**
**కలకాల మవి సుఖకరము లగునె?**
**ఎండమావులు చూడ నేఱులై పాఱుగా**
**కణఁగునే దప్పిక యండ కరుగ?**
**మెండుగ మోహమ్ము మెలఁతుల మదులలో**
**నుండినట్లుండుగా కూఁత యగునె?**

ఆ. **కలలలోని సిరులు కనుగూరుకులఁ గాక**
**కనులు దెఱచినంతఁ గానఁబడునె?**
**యతివల యనురాగ మాసపాటే గాక**
**తలఁపు విష్ణుమీఁదఁ దగులు వడునె?** 210

మబ్బులలోని మెఱుపుతీగలు కనిపించి మాయ మవుతాయే గాని స్థిరంగా ఆకాశంలో నిలుస్తాయా? నిలువ వని తాత్పర్యం. అట్లే స్త్రీల ప్రేమలు సమీపించి వెళ్ళుతాయే గాని అవి ఎల్లకాలం సుఖము నిచ్చునట్టివా? కావని భావం. చూచుటకు ఎండమావులు ఏళ్ళుగా పారుచుండుగాక, దగ్గరకు వెళ్ళినపుడు దప్పిక తీరుతుందా? తీరదనుట. అట్లే మగువల హృదయాలలో మోహము ఉండినట్లే ఉంటుంది గాని అది ముక్తికి ఆధార మౌతుందా? కానేర దని అర్థం. కలలో కనిపించే సంపదలు నిద్రావస్థలో సత్యములే కాని మెలకువ వచ్చినపుడు అవి అగపడునా? అగపడవని భావము. అట్లే అతివల ప్రీతి ఆశలకు కారణమవుతుంది కాని భగవంతుని మీది ఆసక్తికి కారణం కానేరదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏడ ఎలపేడ | 36 | 220 | 1 | 147 |

అవ: నిరంతరము భజనీయుడు భగవంతుడే యనుచున్నాడు.

సీ. దైవతం బొకఁడె సంతత భజనీయుండు
భావాన సమబుద్ధిఁ బాయఁ దగదు;
అచ్యుతుం డఖిలాంతరాత్మకుం డటుగాన
తెగువమై నొకరి నిందింపఁ దగదు;
అరయ లోకము లనిత్యమ్ములౌ నటుగాన
మరగి కొందఱిమీఁద మమత దగదు;
బహుకల్పితములెల్లఁ బ్రకృతిమూలమె గాన
గహన నిజోద్యోగ గరిమ దగదు;

తే. దాస్యమూలముల్ జపములు తపము లగుట
సంశయము మాని వేంకటేశ్వరు భజింపు;
చపలచిత్తుల సంగమ్ము సతము వలదు;
సహజ సంప్రాప్తములఁ ద్రోసి చనఁగఁ దగదు. 211

ఎల్లప్పుడూ భజింపదగినవాడు భగవంతు డొక్కడే. మనస్సున సమత్వబుద్ధిని విడువరాదు. భగవంతుడు అందరిలో అంతరాత్మగా ఉన్నాడు. కాబట్టి సాహసంతో ఎవరినీ నిందించరాదు. లోకాలన్నీ అనిత్యాలు కాబట్టి కొందరిపట్ల మమకారం చూపరాదు. కనుపించే చిత్రవిచిత్రములన్నీ మాయామూలములు కాబట్టి కష్టపడి తాము సాధించే దేమిన్నీ లేదు, గనుక అట్టి ప్రయత్నాధిక్యము పనికిరాదు. జపతపాలు దేవుని దాస్యానికి కారణాలు. కాబట్టి సంశయాన్ని వదలి ఓ మనసా! శ్రీ వేంకటేశ్వరుణ్ణి సేవించు . దైవమును భజించని చపలచిత్తులను చేరబోకు, యాదృచ్ఛికంగా వచ్చిన దానిని కాదనబోకు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దైవ మొక్కడే | 353 | 311 | 4 | 209 |

అవ: ఈ జీవులు చేసిన పాప మేమోగాని ఉల్లములోని హరి ఊరకే దూర మాయె ననుచున్నాడు.

**సీ. కలఁడన్న వారికిఁ గన్న చోటనె హరి**
**విన్నచోటనె శౌరి విజ్ఞులకును;**
**చెంగటనుండ భజింపఁ జాలక కొంద**
**అయ్య లాతని మింట నరయుచుందు;**
**రున్నాఁడు యోగుల కూపిరిలో, నిజ**
**దాసుల కున్నాఁడు దాపునందె;**
**ముందట నతఁ డుండ మ్రొక్కఁ జాలక బహు**
**కర్మవిధుల నెందొ కనఁగ నెం(త్రు;**

**తే. చెల్లఁబో జీవు లఘమెంత చేసినారొ**
**ఉరక దవ్వాయె నుల్లమందున్న విష్ణుఁ;**
**డంజనగిరీశ శరణమ్ము నందలేక**
**వెదకెదరు చాపలమ్మున వివిధసురల. 212**

ఉన్నాడనుకొనే వారికి చూచే చోటనే దేవుడున్నాడు. పండితులకు శౌరి విన్నచోటనే ఉంటాడు. చెంతనున్న దేవుణ్ణి సేవించలేక కొందరు ఆ దేవుణ్ణి ఆకాశాన వెదకుతుంటారు. యోగులకు ఊపిరిలోనే దేవుడున్నాడు. తన దాసులకు దాపుననే భగవంతు డుంటాడు. తమ ముందట దేవు డుండగా నమస్కరించలేక కర్మవిధానాలతో ఎక్కడో చూడ గోరుదురు. ఔరా! ఈ జీవులు ఎంతపాపం చేసినారో కదా! తేరకు మనసులో నున్న దేవుడు దూరస్థుడైనాడు కదా! అంజనాద్రిపై అలరారే దేవుడి శరణు పొందలేక చంచల బుద్ధితో నానాదేవతారాధనలకు మానవులు పూనుకొంటారు కదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చెల్లబో యీ జీవులు | 104 | 23 | 2 | 16 |

అవ: శరీరం తుచ్ఛమనీ, అట్టిది శ్రీనివాసుని దయచే ప్రాణాలు కలిగి బొమ్మలా నడయాడుతుందనీ పలుకుతున్నాడు.

**సీ. మలమూత్రహేయమౌ మాంసపుముద్దకు**
**కులగోత్రములతోడి గుర్తు గలిగె;**
**తొలులు తొమ్మిదిగల తోలుతిత్తికి పేరు**
**పెట్టి పిల్వఁగ నింత పెంపు గలిగె;**
**నెత్తురెమ్ములు గల నీటిబుగ్గకుఁ గూడ**
**హత్తిన కర్మమ్ము లన్ని గలిగె;**
**గొనబైన వెంద్రుక గుబురుల కంతికి**
**సంసారభోగసంసక్తి గలిగె;**

**తే. ప్రేవులు నరమ్ము లమరిన పిడుచ కవుర**
**నిక్కుటెక్కులు సిగ్గులు నీటు గలిగె;**
**నేమి చెప్పంగ శ్రీవేంకటేశు కరుణఁ**
**బ్రాణములు వచ్చి ప్రతిమ పొరాడఁ గలిగె.** **213**

మలమూత్రాలచేత నింద్యమైన ఈ మాంసపు ముద్దకు (శరీరానికి) కులాలతో, గోత్రాలతో గుర్తింపు కలిగింది. తొమ్మిది రంధ్రాలు కల ఈ తోలుతిత్తి (దేహము) కి ఏదో పేరు పెట్టి పిలిచే గొప్పతనం ఏర్పడింది. నెత్తురు,ఎముకలు నిండిన ఈ నీటిబుడగకు (తనువునకు) కర్మలన్నియు హత్తుకున్నవి. అందమైన వెంద్రుక గుబురులు గల ఈ కణితికి (శరీరము ) సాంసారిక భోగాల మీద వాంఛలు కలిగాయి. ప్రేగులతో, నరాలతో నిండిన ఈ ముద్దకు (కాయము) నిక్కు, నీటు, సిగ్గు-ఇవన్నీ వచ్చాయి. ఔరా! శ్రీ వేంకటేశ్వరుని దయచేత ఈ తోలుబొమ్మ ప్రాణాలు వచ్చి నడయాడుతున్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమి చెప్పేదిది | 153 | 251 | 2 | 168 |

అవ: పంచేంద్రియములు భగవత్పరములు కావలెననుచున్నాడు.

**సీ. మరుతండ్రిఁ జూచిన మంచికన్నుల మఱి**
**యితరులఁ జూడంగ నిష్ట మగునె?**
**సిరివరు నామముల్ చెప్పు తీయనినోటఁ**
**జిక్కిన పేళ్ళు వచింప మేలె?**
**కరుణాకరుని పుణ్యకథలు విన్న చెవులఁ**
**గడమ సుద్దులు వినఁగలదె హాయి?**
**కొండలప్పని పైఁడిగుడి కేగు నడుగుల**
**నధముల యిండ్లకు నరుగఁ దగునె?**

**తే. నృహరిఁ బూజించు చేతుల హీననరులఁ**
**గొలుచు టర్హంబె? గోవిందుఁ దలఁచు మదిని**
**పరులఁ దలఁచుట యుచితంబె? హరికి మ్రొక్కు**
**శిరముతో మూఢులకు మ్రొక్క సిద్ధి గలదె?** **214**

మిక్కిలి రూపవంతుడగు మన్మథుని తండ్రి శ్రీ వేంకటేశ్వరుని దర్శించిన కన్నులతో ఇతరులను చూడ ఇచ్ఛ గలుగునా? కలుగదని తాత్పర్యం. లక్ష్మీవల్లభుని నామము జపించు తియ్యని నోటితో అనామకుల పేర్లు ఉచ్చరిస్తే మేలు చేకూరుతుందా? చేకూరదని గ్రహించవలె. దయామయుని పుణ్యకథలు ఆలకించిన చెవులతో కొరమాలిన కతలను వింటే సుఖం కలుగునా? కలుగదని భావం. ఏడుకొండలవాని బంగారు గుడికివెళ్ళే కాళ్ళతో నీచుల ఇండ్లకు పోదగునా? తగదని చెప్పుట. నరసింహమూర్తిని అర్చించే చేతులతో హీనమానవుల కొలవడం ఒప్పునా? ఒప్పదని తాత్పర్యం. గోవిందుని స్మరించే మనస్సుతో ఇతరులను తలచుట తగునా? తగదు గదా! శ్రీహరికి నమస్కరించే శిరస్సుతో మూర్ఖులకు మ్రొక్కితే ఫల ముండునా ? ఉండదని అర్థం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అతఁడు లోకోన్నతుఁడు | 165 | 313 | 2 | 209 |

అవ: పుట్టించిన దేవుడు పూరిమేపడు. జీవుల నంతా పోషిస్తాడను చున్నాడు.

**సీ. వనము వేసినవాఁడు వాడకుండఁగ నీరు**
**నించి వృక్షములఁ బెంచునట్లు;**
**పచ్చిక పట్లఁ బసుల గొల్లఁడు నిల్పి**
**మిక్కిలి తనియంగ మేపునట్లు;**
**వెన్నపాల్మీగడ లన్నమ్ము లిడి తల్లి**
**కన్నబిడ్డలఁ గూర్మి గాచునట్లు;**
**లేలిక జీతమ్ము లిచ్చి యెల్లప్పుడు**
**మన్నించి తన బంట్ల మనుపునట్లు;**

**తే. జనమునకు మందుమాఁకు లొసంగి వెజ్జు**
**పొసఁగ పోషించునట్టు జీవులను దేవుఁ**
**డాదరించు; విశ్వకుటుంబి నతని వేంక**
**టేశ్వరుని మే లెఱిఁగి భజియింప వలయు.** **215**

వనం వేసినవాడు చెట్లు వాడిపోకుండా నీరుపోసి పెంచే విధంగా, గొల్లవాడు పచ్చిక బాగా బలసిన చోట్ల పశువులను నిలిపి తృప్తిగా మేపిన మాదిరిగా, కన్నతల్లి వాత్సల్యంతో కడుపున బుట్టిన బిడ్డలకు వెన్న పాలు మీగడలతో అన్నం పెట్టి పోషించేటట్లుగా, ప్రభువు తన సేవకుల అపరాధాలను క్షమించి జీతాలిచ్చి కాపాడే విధంగా, వైద్యుడు మందు మాకులిచ్చి ప్రజలకు ఆరోగ్యం కలిగించే రీతిగా, జీవులను కాపాడేవాడు, ప్రపంచమే కుటుంబముగా కలవాడు శ్రీ వేంకటేశ్వరుడే. యోగక్షేమాలను కోరువారు ఆయనను సేవించాలి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అందరి రక్షించే | 170 | 343 | 2 | 230 |

అవ: భగవంతుని దయను పొందడానికి భక్తిమార్గమే ప్రధానమని, సులభమనీ, తెలుపుతున్నాడు.

**సీ. ముంటిపై సుఖముంట ముకుపుటమ్ములు మూసి**
**దంటగాలుల గెల్వఁ దలఁచుటెల్ల;**
**వెంద్రుక పట్టుక వెసఁ గొండఁ బ్రాఁకుట**
**కర్మమార్గమున శ్రీకాంతుఁ గనుట;**
**యిల నిరాహారియై యేన్గుతోఁ బెనఁగుట**
**పంచేంద్రియమ్ములఁ బట్టఁ జనుట;**
**యినుపగుగ్గిళ్ళ నీటను నాన్చి నమలుట;**
**దేవు ధ్యానించి సాధింతు ననుట;**

**తే. తవిలి మృగతృష్ణలో నీటి తలఁపు గొనుట**
**తప్పుఁ జదువులలోనఁ దత్త్వం బెఱుఁగుట:**
**వరదు కారుణ్యసుధ జుఱ్ఱవలయునన్న**
**నమలభక్తి యుపాయ మన్యములు గావు. 216**

ముక్కుమూసి ఉచ్ఛ్వాస నిశ్వాసాలను బంధించడానికి ప్రయత్నించడం ముండ్లపై కూర్చొని సుఖంగా ఉన్నా ననుకోవడం వంటిది. చాలా కష్టమనిభావం. కర్మమార్గంతో భగవంతునిసన్నిధి చేరుకోవడమనేది వెంద్రుకను బట్టుకొని కొండ కెగబ్రాకడం వంటిది. దుర్ఘట మనుట. ఇంద్రియాల జయింప ప్రయత్నించడం పస్తులుండి ఏనుగుతో పెనగులాడటం వంటిది. సాధ్యముకాదని తాత్పర్యం. ధ్యానంచేత దేవుణ్ణి తెలుసుకుంటా ననడం నీటిలో నానబెట్టి ఇనుపగుగ్గిళ్ళు నమలడంవంటిది. అనగా వీలుపడదని భావం. భగవద్విషయమును తెలుపని గ్రంథాలవల్ల తత్త్వాన్ని తెలియడం అనేది ఎండమావులలోని నీటియాసవలె నిరుపయోగమని భావం. వరాలిచ్చే స్వామి శ్రీనివాసుని దయఅనే అమృతాన్ని జుఱ్ఱవలెనంటే నిర్మలమైన పరమభక్తి ఒక్కటే ఉపాయం కాని ఇతరం కాజాలదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏవీ నుపాయాలు | 109 | 49 | 2 | 53 |

అవ: జీవపరమాత్మల యథార్థస్థితి తెలుపుచున్నాడు.

**సీ. దేహ మనిత్యంబు; దేహి నిత్యుఁడు; జీర్ణ**
**వసనముల్ విడిచి నవ్యమ్ము లయిన**
**పుట్టముల్ గొన్నట్టు ముదిమేను వీడి కొం**
**గ్రొత్తకాయములు గైకొను నతండు;**
**నతఁ డాయుధమ్ముల మృతుఁడుగాఁ; డాతని**
**జలమారుతాగ్నులు చంపలేవు;**
**గాలి కాఱం: దగ్నిఁ గాలండు; నీట నా**
**నండు; శస్త్రమ్ముల నఱకఁ బడఁడు;**

**తే. స్థాణుఁ; డచలుండు; నిత్యుండు; సర్వగతుఁడు**
**పూని కానంగఁ జింతింపరాని వాఁడు;**
**జీవుఁ డవికార్యుఁడు ననాది శ్రీనివాస**
**పతికి వశుఁడని యెఱుఁగుట పరమబుద్ధి. 217**

శరీరంలో ఉండే జీవుడు చినిగినవస్త్రాలను వదలిపెట్టి క్రొత్తవాటిని గైకొన్నట్లుగా కర్మఫలానుభవం పూర్తికాగానే ముదిసిన దేహాన్ని వదలి నూతన శరీరాలను గ్రహిస్తుంటాడు. ఆ జీవుడు ఆయుధాలచే చంపబడడు. నీరు, గాలి, అగ్ని ఈ జీవుణ్ణి ఏమీ చేయలేవు. జీవుణ్ణి గాలి ఆర్పలేదు. అగ్నికాల్చలేదు. నీరు తడుపలేదు. ఆయుధాలు నఱకలేవు. అతడు స్థిరుడు; చలనం లేనివాడు; అంతటానున్నవాడు. ఎంత యత్నించినా చూడడానికీ, ఆలోచించడానికీ సాధ్యం కానివాడు. షడ్భావవికారములు లేనివాడు.. ఆదిలేనివాడు. అతడు శ్రీపతికి అధీనుడని తెలియుటయే నిజమైన తెలివి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దేహి నిత్యుఁడు | 182 | 419 | 2 | 282 |

అవ: భగవత్సేవకు విముఖమై తన బ్రతుకు చెడుచున్నదని వగచు చున్నాడు.

**సీ. ఎనుపోతుతో నెద్దు నేరుగట్టిన యట్టు**
**లెనసి ముందుకు సాగ దేటి బ్రతుకు?**
**కడలేని యాసచేఁ గరఁగి కరఁగి చిత్త**
**మెడమవంకకు వచ్చె నేటి బ్రతుకు?**
**పొడవైన మమతతోఁ బొదలి పొదలి మాన**
**మిడుమపాటులఁ బడె నేటి బ్రదుకు?**
**తెగదెంపులేని భ్రాంతికిఁ జిక్కి యాచార**
**మెగసి గొందులఁ దూఱె నేటి బ్రతుకు?**

**తే. మోహతాపమ్ముచే జ్ఞానభూమిజాత**
**మిగురు పెట్టక మానిన దేటి బ్రతుకు?**
**పొరిఁ బొరిన్ రోఁతలోఁ బడి పొరలు సౌఖ్య**
**మేవగింపఁడు జీవుఁ డిదేటి బ్రతుకు? 218**

ఎనుబోతును, ఎద్దును నాగటగట్టితే నడిచేట్టు ఎగుడు దిగుడుగా నడిచే యీ నా బ్రతుకు ఏమిబ్రతుకు? అంతుపొంతులేని ఆశలతో మనసు నీరై కరగి తావు తప్పినది. ఇదేమి బ్రతుకు? దీర్ఘమైన మమకారంతో చెలరేగి చెలరేగి కడకు అభిమానం కష్టాల పాలైంది. అంతులేని భ్రాంతికి వశమై ఆచారం సందు గొందుల్లో దాగింది. అజ్ఞానంవల్ల ఏర్పడిన పరితాపం వల్ల జ్ఞానమనే వృక్షం చిగిరించక వాడిపోతున్నది. అంత కంతకూ రోతలోపడి పొరలే సౌఖ్యాన్ని ఈ జీవుడు ఏవగించడం లేదు. ఇదేమి బ్రతుకు? అనగా నీచమైన దని భావం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎను పోతుతొ | 26 | 156 | 1 | 106 |

అవ: సజ్జనుల అసజ్జనుల లక్షణాలు పేర్కొనుచున్నాడు.

**సీ. ఇందఱు జీవులే యెంచి చూచినఁ గాని**
**అందఱ భావమ్ము లవియ వేఱు;**
**సకల జంతువులకు స్వాభావికమ్ములౌ**
**యాహారనిద్రాభయాదు లివ్వి;**
**శాంతచిత్తులకు నిసర్గగుణంబులు**
**సత్త్వసంశుద్ధియు సంతసంబు;**
**జననశీలురకు సాజములు కామక్రోధ**
**మదలోభములు మోహమత్సరములు;**

**తే. వినయవిజ్ఞానములు సాధుజనుల సహజ**
**లక్షణంబులు; జడులకు లక్షణములు**
**చింతలు దురాశలును; సిరిచెలువు కొలువు**
**జడు పెఱుంగని దాసుల సహజగుణము. 219**

జీవు లందరూ ఒకటే అయినా భావాలు మాత్రం వేర్వేరుగా ఉంటాయి. ఆహారము, నిద్ర, భయం మొదలైనవి సర్వజంతువులకూ సమానములే. భావసంశుద్ధి, సంతోషము ఇవి ప్రశాంతాత్ములకు సహజ గుణాలు. మంద బుద్ధులకు కామక్రోధాలు, మదమాత్సర్యాలు సహజ దుర్గుణాలు. వినయ విజ్ఞానాలు సాధుజనులకు సహజలక్షణాలు. చింతలు, దురాశలు మూర్ఖుల లక్షణాలు. నిర్భయులైన దాసులగుణం శ్రీవేంకటేశ్వరునికి కైంకర్యం కావించడమే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇందఱు జీవులే | 145 | 205 | 2 | 137 |

అవ:జీవులంతా చూపులకు ఒకటిగా కనిపించినా శ్రీనివాసభక్తుల ఆత్మశోభ వేఱుగా ఉంటుందనుచున్నాడు.

**సీ. వాయు వొక్కటె తూరుపాఱఁబట్టెడువేళ**
**పొల్లు దవ్వగు, గట్టి వెల్ల నిలుచు;**
**హరి యొక్కఁడే సుర లాతని వలచిరి**
**యున్మత్తులై దైత్యు లొల్లరైరి;**
**జల్లి యొక్కటె సనసన్నముల్ సందులఁ**
**జాఱు, దొడ్డవి మీఁదఁ జిక్క నిలుచు;**
**శౌరి యొక్కఁడె యల్పులైరి కొల్వక కొంద,**
**అతనిం గొలిచి కొంద అధికులైరి;**

**తే. కాకులును కోకిలలు నొక్కగతినె యుండు**
**నేవి యెవ్వియొ యామని నేరుపడును;**
**వేంకటేశ్వరు సేవకుల్ వేఱువారు**
**చూపులకు నొక్కరే యాత్మశోభ వేఱు. 220**

గాలి ఒకే మోస్తరుగా వీస్తున్నప్పటికి తూరుపాఱబట్టే టప్పుడు పొల్లు గింజలు దూరంగా పడతాయి. గట్టిగింజలు అక్కడే నిలుస్తాయి. శ్రీనివాసుడొక్కడే. దేవత లతణ్ణి ప్రేమించారు; రాక్షసులు వెఱ్ఱివారై ఆయన్ను ప్రేమించలేకపోయారు. ఒకే జల్లెడలో పట్టినపుడు సన్నవిజారి క్రింద పడిపోతాయి. పెద్దవి జల్లెడలోనే నిలిచిపోతాయి. దేవుడొక్కడే. ఆయనను కొలువనివారు అల్పులైనారు. కొల్చినవారు గొప్పవారైనారు. కాకులు, కోకిలలు ఒకే నలుపురంగు కల్గి ఉంటాయి. అయితే వాటిలో కాకులేవో, కోకిల లేవో వసంతకాలం వచ్చినపుడు కూతనుబట్టి తెలుసుకోవచ్చు. అట్లే జీవు లందరూ చూపులకు ఒకే మాదిరిగా ఉన్నా వేంకటేశ్వర భక్తులు ఆత్మపరిశుద్ధి కల్గి ఉంటారు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దైవము దూఱఁగనేల | 345 | 267 | 4 | 179 |

అవ: పామరసుఖాలవల్ల ప్రయోజనం శూన్యమనీ, వేంకటాచలపతికి చేసే సేవయే శాశ్వత సుఖప్రదమనీ చెప్పుచున్నాడు.

**సీ. కొండవంటిది యాస, గోడవంటిది తగుల్**
**బెండువంటిది లోన పెద్దతికము;**
**పుండువంటిది మేను, పోలికలో మేడి**
**పండువంటిది రసభావ మెల్ల;**
**మంచువంటిది కల్మి, మించువంటిది రూపు,**
**పెంచువంటిది మేలు, కంచు మనసు,**
**అఁకవంటిది జన్మ, మడవివంటిది చింత,**
**పాగువంటిది కర్మబంధ మెల్ల;**

**తే. ఎంతకాలమ్ము గడచిన నేమి గలదు?**
**పామరసుఖమ్మునందు విభ్రాంతి గాక;**
**వేంకటాచలపతికిఁ గావించు కొలువు**
**పరమసౌఖ్యములకు గనివంటి దరయ.** **221**

ఆశ కొండవలె బహు దొడ్డది. అది స్థిరమూ, అచంచలమూ కూడ. భార్యాపుత్రాదుల తోడి తగులాటం గోడ వంటిది. అనగా తమవారనీ, ఇతరులనీ హద్దు లేర్పరుస్తుంది. తన్నుతాను గొప్పవాడనుకోవడం బెండువలె చులుకన కావడానికే కారణం. శరీరం పుండువలె బాధాకరం. తనలోని సరస భావమంతా పైకి మేడిపండువలె మెఱుగుగా కన్పిస్తుంది. సంపద మంచు మాదిరి ఒకప్పుడుండి, మరొకప్పుడు కరగి మాయమవుతుంది. రూపం కూడ మెఱుపుతీగవలెనే క్షణికం. మే లనేది కుండ పెంచిక తీరున ముక్కచెక్కలయ్యేదే. మనస్సు కంచువలె కఠినమైనది. పుట్టుక చెఱసాలవలె బంధానికీ, నిర్బంధానికీ హేతు వవుతుంది. చింతలు అరణ్యం మాదిరి ప్రబలిపోయేవే. కర్మబంధాలు పాగుమాదిరి జీవుడికి అంటుకొనేవే. వట్టి భ్రాంతితప్ప ఈ పామరసుఖాలలో ఎంతకాలం మునిగినా ఏముంది? శ్రీనివాసుని సేవ ఉత్తమ సుఖాలకు, మోక్షమునకు గని లాంటిది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమి గలదిందు | 18 | 112 | 1 | 77 |

అవ: విధి ఎంతబలీయ మైనను, దేవాధిదేవుడై న శ్రీనివాసుని దయకు నోచిన వారి నేమియు చేయలే దనుచున్నాడు.

**సీ. ఎంతసేయఁగ నేర దీ విధి? పరమేశు**
**నంతవానిని బిచ్చ మడుగఁజేసె;**
**కోరి చంద్రునిబట్టి గురుతల్పగునిఁజేసె;**
**గొనకొని దేవేంద్రుఁ గోడిఁజేసె;**
**శంక లేకుండఁ ద్రిశంకు నంత్యజుఁ జేసె;**
**భూపాలు నలుని విరూపుఁ జేసె;**
**చెలినొడ్డి ద్యూతమ్ము సలుప ధర్మజుఁ జేసె;**
**సతి నమ్ముకొన హరిశ్చంద్రుఁ జేసె;**

**తే. మడుగుఁ జొరఁజేసె కురురాజు; తొడరి బ్రహ్మ**
**తల దొలఁగఁజేసె; కాలుపాదమ్ము తునియఁ**
**జేసె; విధికిని విధి శ్రీనివాసు కరుణ**
**గలుగ కెవ్వారు భంగముల్ గనక పోరు. 222**

విధి ఎంతపనినైనా చేస్తుంది. ఈశ్వరు నంతవాణ్ణి బిచ్చగాణ్ణి చేసింది. చంద్రుని గురుభార్యాసంగమానికి పాల్పరచింది. దేవేంద్రుని కోడిగాచేసింది. త్రిశంకుణ్ణి చండాలునిగా మార్చింది. నలచక్రవర్తిని రూపహీనుణ్ణి గావించింది. ధర్మరాజును తన భార్యను పణంగాపెట్టే జూదరిని గావించింది. హరిశ్చంద్రు నంతవాణ్ణి ఆలిని అమ్ముకొనేటట్లు చేసింది. రారాజు దుర్యోధనుణ్ణి మడుగున దాగేటట్లు చేసింది. బ్రహ్మదేవునికి తల తెగునట్లుగా, యమధర్మరాజు పాదం తునిగేటట్లుగా చేసింది. అట్టి విధికి కూడ విధి శ్రీవేంకటేశ్వరుడు. ఆయన కరుణను పొందగలిగితే ఎవరికినీ ఎట్టి భంగపాటు రానేరదు. ఆయన దయ లేకుంటే ఎంతటివారైనా అవమానముల పాలు కాకుండా తప్పించుకోలేరు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎంత సేయఁగ లేదు | 22 | 134 | 1 | 92 |

అవ: విష్ణుభక్తి అన్నిటికంటె గొప్పదనుచున్నాడు.

సీ. **వేదముల్ చదివియు విముఖుఁడై హరిభక్తి**
**నాదరింపని సోమయాజికంటె**
**నెదిలేక కులగోత్రహీనుఁడైనను విష్ణుఁ**
**గోరి భజించు భక్తుండె ఘనుఁడు;**
**పరమమౌ వేదాంతపఠనమ్ముఁ జేసియు**
**హరిభక్తి లేని సన్న్యాసికంటె**
**మరగి గొడ్డును దిను మాలఁడైనను విష్ణు**
**నహరహమ్ము వెదకు నతఁడె ఘనుఁడు;**

తే. **వినియుఁ జదివియు హరిదాస్యమునకుఁ జొరక**
**తనువు వేఁపుచునుండెడు తపసికంటె**
**సప్తగిరి సార్వభౌము ప్రసాద మెప్పు**
**దనుభవించెడు నాతండె యతిఘనుండు.** **223**

వేదాలు వల్లెవేసిన వాడైనా హరిభక్తిలేని సోమయాజికంటె కులగోత్రాలులేని హీనుడై నప్పటికీ విష్ణుభక్తి గలవాడే గొప్పవాడు. ఉపనిషత్తులు చక్కగా అధ్యయనం చేసిన హరిభక్తిలేని సన్న్యాసికంటె గొడ్డుమాంసం రుచి మరగినప్పటికీ మాధవభక్తుడైన మాలవాడే ఎంతో శ్రేష్ఠుడు. శాస్త్రాలు విని, చదివి శ్రీహరికైంకర్యానికి పూనుకోక శరీరాన్ని శ్రమపెట్టే తపస్వికంటె ఏడుకొండలవాని అనుగ్రహమును ఎల్లప్పుడు అనుభవించేవాడే గొప్పవాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎక్కువ కులజు | 62 | 318 | 1 | 212 |

అవ: ఉన్నతపదవు లొసగడానికి శ్రీనివాసుని అనుగ్రహదృష్టిచాలు ననుచున్నాడు.

సీ. దివ్యమౌ హరినామ దీపంబు చాలదా?
  పాపాంధకారంబు పాఱఁదోల;
ఘనమైన హరినామ కనకాద్రి చాలదా?
  దారిద్ర్యదోషంబు తఱిమి వేయ;
మానుగ హరినామ మంత్రమ్ము చాలదా?
  నరకకూపోద్ధరణమ్ము సలుప;
చొక్కమౌ హరినామసుధ చుక్క చాలదా?
  హితకరములు చవు లెల్ల నొసఁగ;

తే. అర్తిహరు వేంకటేశ్వరు కీర్తనంబు
చాలదా? కల్పవృక్షమై శ్రీ లిడంగ;
నతని దాసుల పరమదయార్ద్రదృష్టి
చాలదా? యున్నతోన్నతస్థానమీయ. 224

పాప మనే చీకట్లను పటాపంచలు చేయడానికి ప్రకాశమానమైన హరినామమనే దీపం చాలదా? చాలు నని తాత్పర్యం. బీదతనమనే దోషాన్ని పారదోలడానికి గొప్పదైన హరినామ మనే మేరుపర్వతం చాలదా? చాలుననుట. నరకమనే బావినుండి వెలికితీయడానికి హరినామ మనే మంత్రం చాలదా? చాలు. వేదవిహిత కర్మల నాచరించడం వల్ల ఏర్పడే ఫలా లివ్వడానికి పవిత్రమైన హరినామ మనే అమృతపు బొట్టు చాలదా? చాలును. సమస్త సంపదలివ్వడానికి కల్పవృక్షమై బాధా నివర్తకుడైన శ్రీ వేంకటేశ్వరుని నామసంకీర్తనం సరిపోదా? సరిపోవునని భావం. మిక్కిలి గొప్పస్థితి నొసంగుటకు శ్రీనివాసుని దాసులయొక్క దయాసిక్తమైన కటాక్షం చాలదా? చాలునని భావం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చాలదా హరినామ | 8 | 52 | 1 | 34 |

అవ: భగవన్నామ మహిమను ప్రశంసించు చున్నాడు.

సీ. పరమఘోరములు పాపము లెన్నియో ప్రాణి
జంకుగొంకులు లేక సలుపుఁగాక
"కుమ్మరి కొకయేఁడు గుదె కొక్కనాఁ" డౌను
విష్ణునామము మది వెలయునేని;
కొదలేని దురితముల్ కోటానఁ గోటులు
చెదర కెప్పుడు ప్రాణి చేయుఁ గాక!
పొరి గొఱియలలోనఁ బులి చొచ్చి నట్లౌను
గుండియ హరిమీఁద నుండునేని;

తే. ప్రబల దుష్కర్మసంతతుల్ ప్రాణి యెపుడు
పెంచుఁగాక; కొండలమీఁదఁ బిడుగుపడిన
యట్టులౌ వేంకటేశ్వరు నాత్మ దలఁప
నమ్ముదురు దీని పావనుల్; నమ్మ రొరులు. 225

ఎవడు ఎన్ని దారుణ పాపాలు జంకకుండా చేసినప్పటికీ భగవంతుని నామం మనసులో స్మరిస్తే ఆ పాపాలన్నీ "కుమ్మరికి ఒకయేడు గుదె కొక్కరోజు" అన్న సామెతగా తుత్తునియలై పోతాయి. ఎవడు కొదవలేకుండా కోటానుకోట్ల పాపాలు చేసినా, హృదయం హరి మీద ఉంటే " పెద్దపులి గొఱ్ఱెల మందలోనికి చొచ్చినట్లు" గా అన్ని పాపాలు హరణమై పోతాయి. చెడ్డపనులు ఎన్నిచేసినా శ్రీ వేంకటేశ్వరుని మనస్సులో తలిస్తే కొండలమీద పిడుగు పడిన చందంగా పాపములన్నీ బ్రద్దలవుతాయి. ఆస్తికులు ఈ విషయం నమ్ముతారు. నాస్తికులు నమ్మరు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఈ విశ్వాసంబు | 10 | 64 | 1 | 43 |

అవ: సుఖసంతోషాలతో ఉన్నప్పుడే స్వామిని స్మరింపవలె ననుచున్నాడు.

**సీ. పటువైభవమ్ములఁ బరిఢవిల్లెడునాఁడె**
**తటుకున శ్రీహరిఁ దలఁపఁ డంట**
**కుటిలశరీరియై కుత్తుకఁ బ్రాణంబు**
**తటతట నదరంగ దలఁపఁ గలఁడె?**
**ఆలుబిడ్డలతోడ హర్షమందెడునాఁడె**
**తాలిమి నచ్యుతుఁ దలఁపఁ డంట**
**వాలిన కాలుని వసమైన యప్పుడు**
**తాలువు లెండంగఁ దలఁపఁ గలఁడె?**

**ఆ. ఎఱుక గలిగి కొఱఁత యెందులేనపు డేడు**
**మలలతేని పేరు దలఁపఁ డంట**
**మేను మఱచి యుసుఱు మినుకు మినుక్కనఁ**
**దఱచు టూర్పులందుఁ దలఁపఁ గలఁడె? 226**

అన్ని వైభవాలతో అలరారే టప్పుడు భగవన్నామాన్ని తలంచని వాడు, కుటిలశరీరం కలవాడై కంఠగతప్రాణు డైనప్పుడు అసలే తలంచలేడు. భార్యాపుత్రాదులతో సంతోషంగా ఉండేటప్పుడు శ్రీహరిని తలంచనివాడు, చివరకు యముని పాశాలలో జిక్కి దవడలు ఎండబారినప్పుడు భగవంతుని తలంచ గలడా? తలచలేడని భావం. తెలివి బాగా ఉన్నప్పుడు, ఏ విషయంలోనూ, కొరత లేకున్నప్పుడు ఏడు కొండల వానిని తలంచని వాడు, ప్రజ్ఞ గోల్పోయి, ప్రాణాలు ప్రయాణంకట్టి ఎగఊపిరి, దిగఊపిరిగా ఉన్నప్పుడు తలంచగలడా? తలచలేడని తాత్పర్యం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎఱుక గలుగు | 50 | 304 | 1 | 203 |

అవ: అప్పుడు నరరూపంలో, ఇప్పు దర్చావతారంలో ఉన్న భగవంతుని కొలువక ప్రజలు వంచితు లగుచున్నారని వాపోవుచున్నాడు.

**సీ. ఎటు మోసపోయిరో యెంచ నప్పటివారు**
**యదుకులు బంటులై బ్రదుక వలదె?**
**పసులఁ గాచెడివాని బ్రహ్మ నుతింపంగ**
**దేవదేవుం డని తెలియ వలదె?**
**భూమీధరము నొక్క బొట్టెఁ డెత్తగ వాని**
**భగవంతుఁడని కాళ్ళ వ్రాలవలదె?**
**బాణుని బాహువుల్ పఱపఱ నఱకంగ**
**విష్ణుఁ డంచు శరణు వేఁడ వలదె?**

**తే. పార్థునకు విశ్వరూపమ్ము పగటి నపుడె**
**నరహరి యితం డటంచును నమ్మవలదె?**
**తాను తిరుమలఁ బ్రత్యక్షదైవ మగుచు**
**వెలయఁగఁ దదన్యసేవలు విడువవలదె?** 227

భగవంతుడే కృష్ణుడని తెలియక ప్రజలు ఎట్లు మోసపోయారో గాని ఆయనకు బంటులై సేవలు చేసియుండవలె గదా! పసులకాపరిని బ్రహ్మదేవు నంతటివాడు స్తోత్రం చేసినప్పుడు అతడు మహావిష్ణువని గుర్తింపవలె గదా! గుర్తింపలేకపోయారు. కుఱ్ఱవాడుగా నుండి గోవర్ధనగిరి నెత్తినప్పుడు అతడు భగవంతుడని కాళ్ళమీద పడవలె గదా? పడలేకపోయారు. బలిష్ఠుడు, క్రూరుడు అయిన బాణుడనే రాక్షసుని చేతులు ఊచకోత కోసిన వానిని నారాయణుడని గుర్తించి శరణు వేడవలె గదా! వేడలేక పోయారు. అర్జునునికి విశ్వరూపం చూపినపుడే ఇతడు శ్రీహరియని నమ్మవలెగదా! నమ్మలేకపోయారు. అట్టి మహావిష్ణువే ప్రత్యక్షంగా తిరుమలపై వెలసియుండగా అన్యదేవతల సేవలు మానవలెగదా! మాని శ్రీనివాసునే సేవించవలెనని తాత్పర్యం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎటు మోసపోయిరొకో | 100 | 503 | 1 | 337 |

అవ: ఆశకుదాసుడైన నన్ను శ్రీవేంకటేశ్వరుడు దప్ప మరొకడు రక్షింప లేడనుచున్నాడు.

**సీ. ఆసకుఁ జోటున్న దంతరంగమునందు**
**నరతికి నొకవీస మంతలేదు;**
**భోగింపఁగాఁ జాల ప్రొద్దుగద్దు ముకుందు**
**సంస్మరింపఁగ నొక్క క్షణము లేదు;**
**ఓగు లంపటమున కోపి కెంతయు గద్దు**
**ఏ యోగమునకు నొక్కింత లేదు;**
**ఎదుటి ప్రపంచపు టెఱుక మిక్కిలి గద్దు**
**ఆత్మవిజ్ఞత యిసుమంత లేదు;**

**తే. సిగ్గుమాలిన బ్రతు కిది చెడిన బ్రతుకు;**
**వాచవికి దాసియై యొడఁబడిన బ్రతుకు;**
**సదయహృదయుండు వేంకటేశ్వరుఁడు గాక**
**పదరి నా నేరములు వాపఁ బరులు గలరె? 228**

మనసులో ఆశకు కావలసినంత చోటున్నది కాని వైరాగ్యమునకు కొంచెం కూడా చోటులేదు. ఇహలోకసుఖాలు అనుభవించడానికి కావలసినంత సమయం ఉంటుంది, గాని వేంకటేశ్వరుని స్మరించడానికి ఒక క్షణం కూడా తీరిక ఉండదు. కొరగాని పనులు చేయడానికి ఎంతైనా ఓపిక ఉంటుందిగాని, కర్మ జ్ఞాన ధ్యాన భక్తియోగాలలో, దేని నవలంబించ డానికైనా ఓపిక ఉండదు. కనిపించే ప్రపంచానికి చెందిన విజ్ఞానం ఎంతో ఉంది కాని ఆత్మకు సంబంధించిన జ్ఞానం కొంచెం కూడా లేదు. ఇది సిగ్గుమాలిన బ్రతుకు; చెడిపోయిన బ్రతుకు; తిండి రుచి మరగిన బ్రతుకు, కసరి, నా తప్పులు క్షమించడానికి దయామయుడు శ్రీవేంకటేశ్వరుడు గాక మరెవ్వరున్నారు? ఎవ్వరూ లేరని అభిప్రాయం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఛీ ఛీ వో బ్రదుకా | 94 | 467 | 1 | 313 |

అవ: చింతలు మాని, కుదురుగ పడియుండు మని మనస్సును హెచ్చరించుచున్నాడు.

సీ. జనని మహాలక్ష్మి; జనకుండు వాసుదే
వుండు; మా కిల్లు బ్రహ్మాండ మెల్ల;
పదిలమౌ హరిభక్తి పాడిపంటలు మాకుఁ;
బరమప్రపన్నులు బంధుజనులు;
జ్ఞానమే మాకు ధనమ్ము; వేదము సొమ్ము;
వైరాగ్య ముంబళియూరు మాకు;
అనుపమ గురుసేవ లాలుబిడ్డలు మాకు;
నిలువేల్పు శ్రీవేంకటేశ్వరుండు;

తే. కర్మఫల మొల్ల మేము; మోక్షమ్ము వడయ
కీలు మాకు ముకుంద సంకీర్తనమ్ము;
చిత్తమా! రేఁపకుము బహుచింత లింక;
నీవు మముఁ గూడి బ్రదుకుమా ! నిశ్చలముగ. 229

మా అమ్మ శ్రీ మహాలక్ష్మి. మా తండ్రి వాసుదేవుడు. బ్రహ్మాండమే మాయిల్లు. తరుగని విష్ణుభక్తియే మా పాడిపంటలు. శరణాగతి పొందిన వారే మా చుట్టపక్కాలు. అధ్యాత్మజ్ఞానమే మా ధనం. వేదాలే మాకు నగలు. వైరాగ్యమే మాకు ఇనాం గ్రామం. సాటిలేని గురువుల సేవే మా ఆడుపడుచులు. శ్రీవేంకటేశ్వరుడే మా కులదైవం. కర్మఫలాలను మేము వాంఛించము. గోవిందనామ సంకీర్తనమే మేము ముక్తిని పొందడానికి ఉపాయం. ఓ మనసా! నాలో నిక నానావిధములైన చింతలు రేపవద్దు. మాలో స్థిరంగా నిలిచి జీవించు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చింతలు రేఁచకు | 211 | 63 | 3 | 43 |

అవ: మూఢుడై ఐహికసుఖా లనుభవిస్తూన్న జీవిని కరుణించేదేవు డెక్కడున్నాడో అని వాపోవుచున్నాడు.

సీ. **తనకు సంతసమైనఁ దన భాగ్యమును మెచ్చు;**

**బాధ గల్గిన భగవంతు దూఱు;**

**మనుజుని గుణమెల్ల మాపుదాఁక నిటాయె;**

**దైవ మెందున్నాఁడొ! దయ గనండు;**

**ఆదాయముల నెంచు నఘ మొనర్చెడు తఱి;**

**నరకమంది సుఖ మానాఁడు వెదకు;**

**తిరమైన జీవుని తెలివెల్ల నిట్టాయె;**

**దైవ మెందున్నాఁడొ ! దయ గనండు;**

తే. **కనఁబడు విరక్తువలె నిద్ర గాంచువేళ**
**మేలుకొన్నప్పు డన్నియు మెడనుబూను;**
**నిట్టి దేహిస్వభావమ్ము నెంచి, యేలు**
**దైవతం బెందునున్నాఁడొ ! దయ గనండు.** 230

మూఢుడు తనకు సంతోషం కల్గినపుడు తన భాగ్యాన్ని మెచ్చుకుంటాడు. కష్టాలు కల్గినపుడు దేవుణ్ణి దూషిస్తాడు. ఉదయం నుంచి రాత్రిదాకా మానవుని గుణా లిట్లాగే ఉంటాయి. పాపాలు చేస్తూ లాభాలు లెక్కిస్తుంటాడు. నరకాన పడ్డప్పుడు సుఖ మెక్కడుందా అని వెదకుతాడు. ప్రాణి తెలివంతా ఇట్లాగే తెల్లవారుతుంది . నిద్రించే సమయంలో నేమో విరాగిమాదిరి కనిపిస్తాడే కాని మేల్కొన్నప్పుడు, అన్ని వ్యవహారాలను తన మెడకే తగిలించుకుంటాడు. జీవుని స్వభావం ఇటువంటిది. ఇలాంటి అజ్ఞానిని తరింపజేసే దైవ మెక్కడున్నాడో కదా! దయతో చూడడో !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కలకాల మిట్లాయ | 215 | 77 | 3 | 52 |

అవ: మనస్సుయొక్క స్వభావమును వివరిస్తూ, అట్టి మనస్సును నిగ్రహించుమని ఉద్బోధిస్తున్నాడు.

**సీ. బట్టబయటఁ దోల పశువు బందెలఁ జిక్కు;**
**పట్టి మేపిన తన పనులు సేయు;**
**నిట్టులే వదలిన నెటకొ పాఱు మనస్సు;**
**నియమస్థుఁ డైనచో నిలిచియుండు;**
**బడి దప్పినన్ బంట్లు పరదేశు లయ్యెద;**
**రెడయక కూడిన హితు లవుదురు;**
**విడిచిన నిటువలె కడకుఁ బాఱు మనస్సు;**
**ఒద్దికయైయుండు నొడల నణఁప;**

**తే. చేయి వదలినఁ బెంపుడుఁ జిలుక యేని**
**కోట లెక్కు; రామాయను గూఁట నిడిన;**
**వీథులం బాఱు మనసు భావించకున్న;**
**శ్రీవిభుని గొల్చినన్ చేతఁ జిక్కియుండు. 231**

పశువులను విచ్చలవిడిగా విడిచిపెడితే అవి పైరు పచ్చల్లో బడి బందెలదొడ్లపా లవుతాయి. కట్టిమేపితే వాటివల్ల పనులు నెఱవేర్చుకోవచ్చు. ఈ విధంగానే మనస్సును వదలిపెడితే ఎక్కడెక్కడికో పారిపోతూ ఉంటుంది. ప్రాణాయామాది నియమాలు ఆచరిస్తే లోబడి ఉంటుంది. క్రమం తప్పిన సిపాయీలు ఇతరదేశాల పాలవుతారు. క్రమం తప్పకుంటే మేలు కలిగిస్తారు. ఈ మాదిరి మనస్సును స్వేచ్ఛగా విడిస్తే వేగంగా దిగ్దిగంతాలకు పరుగెత్తిపోతుంది. మనలో దానిని బద్ధంచేస్తే ఎంతో అనుకూలంగా ఉంటుంది. చేతినుండి జారుకున్నప్పుడు, పెంపుడుచిలుకయినా కోటలెక్కి కూర్చుంటుంది. దాన్ని గూటిలో ఉంచితే రామ రామా అంటూ ఆనందం కలిగిస్తుంది. బంధించకుంటే వీథులవెంట మనస్సు పరుగెత్తుతుంది. చిక్కబట్టి శ్రీనివాసుని కొలిస్తే అది నిశ్చలంగా ఉంటుంది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అందుకే సుమ్మీ | 170 | 341 | 2 | 229 |

అవ: స్వామిని దివ్యౌషధంగా పేర్కొని దాని నెవ రెవరు సేవించి శ్రేయస్సు పొందినారో చెప్పుచున్నాడు.

**సీ. ఉనికి మనికి కెల్ల నొక్కటే తగుమందు**
**కొనరయ్య కొనరయ్య కూర్మిమందు;**
**ధ్రువుఁడు ప్రహ్లాదుండు తొలిఁ గైకొనిన మందు;**
**జనక నారదులు చేకొనిన మందు;**
**భవరోగములు వీడి పాఱ పెద్దలు మున్ను**
**ఉవకట్టికొనిన నిచ్చలపు మందు;**
**నాలుగు యుగముల నరనాథులును కల**
**కాలమ్ము గొని కడగన్న మందు;**

**తే. అజునకున్ బరమాయువై యలరు మందు;**
**నన్నిలోకాల నసదైన యసలుమందు;**
**మేటి తిరువేంకటాద్రి కోనేటిదరిని**
**విజయ కేతన మెత్తుచు వెలుఁగుమందు. 232**

మంచిస్థితికి, మంచిజీవితానికి ఇదొక్కటే మంచిమందు. ప్రీతితో ఈ మందును సేవించండి. ధ్రువుడు, ప్రహ్లాదుడు, జనకుడు, నారదుడు మునుపు దీనిని సేవించి ఉత్తమస్థాన మలంకరించారు. పుట్టుకలనే రోగాలు పోగొట్టు కొనడానికి పెద్దలంతా అంచుకట్టినట్లుగా స్వామి సన్నిధిలో నిలిచి సేవించిన నిర్దోషమైన మందిది. జీవితపర్యంతము నాల్గుయుగాలలోని రాజులు ఈ మందును సేవించి సంసారముయొక్క పారం చేరినారు. ఇది బ్రహ్మకు దీర్ఘాయుష్య మిచ్చేమందు. ఇది ఏ లోకంలో గాని దొరకని స్వచ్ఛమైన మందు, వేంకటాచలం మీద స్వామి పుష్కరిణి ఒడ్డున విజయపతాక మెగురవేస్తూ ప్రకాశిస్తున్నది ఈ మందు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కొనరో కొనరో | 39 | 237 | 1 | 159 |

అవ: విష్ణుమాయా ప్రభావంచేత తాము అనుభవించని వస్తువులను కూడ అనుభవించునట్లు వెఱ్ఱిగా జనులు ఆనందిస్తా రనుచున్నాడు.

**సీ. పురుషుల గుంపులో బోటి యొక్కతె యున్న**
**నాటు నందఱచూపు నాతియందె;**
**అందఱ కౌఁగిళ్ళ కలివ దక్కుటలేదు**
**ఆసల కరఁగి నీ రగుటె కాని;**
**కనులఁ జూచిన చింతకాయ కజ్జాయమ్ము**
**నప్పుడే నోరూరు నందఱకును;**
**తలఁప నాలుకలకు పులు సంటుటయ లేదు**
**పులు పెంచి మ్రింగు గ్రుక్కిళులె కాని;**

**తే. తిరుమలప్ప పువ్వులతేరు దీయువారు**
**తీసితిమి తా మటందురు; దేవుఁ డంత**
**రాత్ముఁడై తీయు టెఱుఁగ రౌరౌర ! విష్ణు**
**మాయ బయ లీదఁ జేసెడి మనుజకోటి. 233**

పదిమంది పడుచువారి మధ్యలో ఒక యువతి వచ్చి నిలిస్తే అనురాగంతో అందరి చూపులు ఆమె మీదనే వ్రాలుతాయి. కాని ఆ కామిని కామించి వారి కౌగిళ్ళలోనికి చేరడం లేదు. వారి ఆశలన్ని వ్యర్థంగా నీరై కారిపోతాయి. తినకుండానే చింతకాయపచ్చడి చూడగానే అందరికి నోటిలో నీ రూరుతుంది. దాని పులుసును భావించుకొని గుటకలు మ్రింగు తుంటారు. తిరుమలేశుని పూలతేరు లాగేవారు తామే ఆ పని చేస్తున్నామని భ్రమపడతారు. వారిలో అంతరాత్మగా ఉండి ఆయనే ఆ పనిచేస్తున్నాడనుకోరు. అజ్ఞానంచేత జనులు అన్నిటికి తామే కర్తల మనుకుంటా రని భావం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| బయ లీదించీ | 251 | 293 | 3 | 198 |

అవ: భక్తి, నామజపంవల్ల సులువుగా ముక్తి నందవచ్చునని పలుకుతున్నాడు.

**సీ. శ్రీహరి భక్తికిఁ జేరువ మోక్షంబు**
**ధరణి కర్మమునకె దవ్వు గాని;**
**యిట్టె యింద్రియముల నించుకదాఁట దూ**
**ర మ్మేమికాదు జ్ఞానమ్ముత్రోవ;**
**అఱచేతిది వికుంఠ మతని దాస్యమునకుఁ**
**బరధర్మముల కగపడదు గాని;**
**అరుదైన యాసల యాయమ్ము వొడిచిన**
**నా క్రంతసుండియే యరయవచ్చు;**

**తే. బహుళపుణ్యమ్ములకు నలవడదు గాని**
**తగు ప్రపత్తికిఁ దలఁపులో దక్కు ముక్తి;**
**తెలిసి తిరుమంత్రము జపింప దివ్యపదము**
**చిక్కు; నీ కీ తెఱుంగక స్రుక్కినాము. 234**

మోక్షము హరిభక్తికి చాలా దగ్గరగా ఉంటుంది. అది కర్మలకు చాల దూరం. ఇంద్రియాలను జయిస్తే జ్ఞానమార్గం దూరం కాదు. ఇంద్రియ నిగ్రహం జ్ఞానానికి కారణం. జ్ఞానం మోక్షానికే హేతువు. భగవద్దాస్యం చేసేవారికి వైకుంఠం అఱచేతనే ఉంటుంది. అనగా సులభప్రాప్యం అని భావం. కోరికలయొక్క ఆయువు పట్టులను తొలచివేస్తే ఆ సందులనుండియే మోక్షాన్ని చూడవచ్చు. ఆశానిర్మూలనమే మోక్షానికి దారి అని తాత్పర్యం. అర్హమైన ప్రపత్తికి ముక్తి దక్కుతుంది. అంతేగాని అనేక పుణ్యాలు ఆచరించడంవల్ల కానేకాదు. అనగా పుణ్యకర్మాచరణలన్నిటి కంటె ప్రపత్తి గొప్పదనుట. అర్థం తెలుసుకొని తిరుమంత్రం జపిస్తే (ఓం నమో నారాయణాయ) పరమపదం ప్రాప్తిస్తుంది. ఈ రహస్యం తెలియక ఇన్నాళ్ళు కష్టపడినాము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అల్లనాఁడే యిదెరఁగ | 269 | 399 | 3 | 269 |

అవ: ఏ కొంచెం భక్తి ఉన్నా భగవంతు డనుగ్రహిస్తాడను చున్నాడు.

సీ. **వంతువాసికి వానివాడ నన్నంజాలు**
**నాపత్సఖుం డీశుఁ డరసి ప్రోచు;**
**బంతిగట్టి నుఱుపఁ బసరమ్ము లొక్కొక్క**
**పిడికిలి నోళ్ళఁ జొప్పించునట్లు**
**సంసారమగ్నుఁడౌ జను దందులోనె తాఁ**
**గొంతకొంత ముకుందుఁ గొల్వఁజాలు:**
**చేఁదును దినువాఁడు స్వాదుపదార్థముల్**
**గొంత నోటను జవిగొన్న యట్లు**

ఆ. **దురితవిధు లొనర్చి దుఃఖించు మనుజుండు**
**హరిని సంస్మరించు టదియ చాలు;**
**పేద పుణ్యపరతఁ బెన్నిధి గన్నట్లు**
**గురుకృపాప్తి భక్తి గుదురఁ జాలు.** 235

మాటవరుసకైన నేను నీవాడనంటే చాలు భగవంతుడు ఆపదల్లో మిత్రుడై ఆదుకుంటాడు. పశువులను బంతిగట్టి ధాన్యం నుఱిపించేటప్పుడు ఆ పశువులు కొద్ది కొద్దిగా ధాన్యపు కసవును నోట వేసుకుంటూ బంతి తిరుగుతూ ఉంటాయి. ఆ విధంగా సంసారంలో చిక్కుకొని సతమతమయ్యే వాడు ఒక్కసారి ముకుందుణ్ణి తలిస్తే చాలు. ఆయనే కాపాడుతాడు. చేదు పదార్థాలనే తిని వాచవి చెడినవాడు ఒక్కమారు కొంచెం తీపిపదార్థం తినేవిధంగా పాపకర్మలు చేసి దుఃఖపడే మానవుడు ఒకసారి హరిస్మరణం చేసిన మాత్రాన ఆయన దయకు పాత్రమవుతాడు. హరినామం తీపిపదార్థం వంటిది. తక్కినవి చేదువస్తువుల వంటివని తెలియవలెను. నిరుపేదకు పుణ్యవశాత్తూ పెన్నిధి దొరికినట్లు గురుకృపవల్ల భక్తి కుదిరితే అంతేచాలు. అనగా గురూపదేశం వల్ల నిశ్చలభక్తి గల్గితే అది మోక్షకారణ మవుతుంది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అంతటనె వచ్చి | 333 | 201 | 4 | 135 |

అవ: సంసారప్రవృత్తి జీవి నెంత తప్పుదారి పట్టించినప్పటికీ శేషగిరీశుడు దయతో కాపాడునేగాని జారవిడువడనుచున్నాడు.

**సీ. గోనెలె క్రొత్తలు కోడె లెప్పటి వెంత**
**నానిన లోహమ్ము నయము గనునె?**
**మున్నిటి భువనమే మున్నిటి లోకమే**
**యెన్నఁగఁ బుట్టువు లివియ వేఱు;**
**నన్ను నెవ్వార లున్నతబుద్ధి గఱపిన**
**నే నెఱింగెడి దున్నె నిన్న నేఁడు?**
**చిత్తము నాటిదే చింతలు నాటివే**
**యిచ్చలు భోగంబు లివియ వేఱు;**

**తే. శాస్త్రములు చాయఁ జూపిన సరగ నేను**
**గుణిని కాఁగల్గుదునె? శేషకుధరవిభుఁడు**
**కరుణ గావక విడుచునే? కష్టకర్మ**
**మెంతగాఁ దప్పఁదీసిన హేయగుణుల? 236**

కోడెలు పాతవేగాని వాటిమీద వేసే గోతాలే క్రొత్తవిగా ఉన్నవి. జీవుడు పలుశరీరాలు ధరించి వదలుతుంటాడని భావం. ఇనుమును ఎంతగా నానబెట్టినా అది మెత్తబడదు. జీవుడు ఎన్ని జన్మలు ధరించినా అజ్ఞానము వీడకున్నాడని భావం. లోకాలు ఎప్పటివే. లోకులు కూడ ఎప్పటివారే, కాని జన్మలు మాత్రం వేఱు వేఱుగా ఉంటాయి. తామెంతటి వారైనా ఎన్ని బుద్ధులు నేర్పినా ఒకటి రెండు రోజుల్లో నేను క్రొత్తగా గ్రహించేది ఏమున్నది? బుద్ధి, ఆలోచనలు ఎప్పటివే. కాని ఇష్టాలు, భోగాలు ఇవే వేఱువేఱుగా ఉన్నాయి. శాస్త్రాలు మార్గం చూపినంత మాత్రాన నేను అజ్ఞానం విడిచి సుజ్ఞానిని కాగలనా? కాలేనని భావం. నీచగుణాలు గల వారిని చెడు ప్రవృత్తులు ఎంత పెడదారి పట్టించినా శ్రీవేంకటేశ్వరుడు వారిని దయతో కాపాడక చేయి విడుచునా? విడువడని భావం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| గోనెలె క్రొత్తలు | 310 | 60 | 4 | 41 |

అవ: మనశ్చాంచల్యం, ఆశ, దేవదూషణం, ఇంద్రియచపలత్వం సంసారమనే బావిలో జీవిని కూలద్రోయడానికి కారణము లనుచున్నాడు.

**సీ. తనకేడ చదువులు తనకేడ శాస్త్రాలు**
**మనసు చాంచల్యమ్ము మానుకొనునె?**
**జడ్డుమనుష్యుండు చదువఁ జదువ నాస**
**వడ్డివాఱును గాక వదలి చనునె?**
**గ్రుడ్డికుక్కకు సంతకుంబోయి తిరిగిన**
**దుడ్డు పెట్టులె గాక దొరకఁ బోనె?**
**దేవదూషకుఁ డౌచుఁ దిరిగెడు నాతండు**
**దేవతాంతరమును దెలిసికొనునె?**

**ఆ. చవు లటంచు నోట సకలమ్ముఁ దిని తిని**
**భవతమోంధువందుఁ బడెడువాఁడు**
**శ్రీనివాసచరణ సేవాపరుఁడు గాక**
**పావనాత్ముఁ డగునె? పరము గనునె?** **237**

తానెన్ని చదువులు చదివినా, ఎన్ని శాస్త్రాలు నేర్చినా మనస్సు చపలతను మానునా? మానదని భావం. మంద బుద్ధిగలవాడు ఎంత చదివినా ఆశ మరీ మరీ పెరుగుతూనే ఉంటుంది. గ్రుడ్డికుక్క సంతకు వెళితే దానికి దుడ్డుకర్ర దెబ్బలే గాని ఏ మయినా ఆహారం దొరకుతుందా? దొరకదని భావం. అట్లే భక్తిలేని చదువులూ, శాస్త్రాలు నిరుపయోగములని భావం. శ్రీనివాసుని దూషించేవాడు మరి యే యితర దైవము నయినా తెలుసుకోగలడా? తెలియలేదని భావం. రుచి బాగున్నదని కంటికి కనిపించినదెల్లా మెక్కుతూ కాలం గడిపేవాడు సంసారకూపంలో పడేవాడే. శ్రీనివాసమూర్తి పాదాలు సేవించేవాడు తప్ప, మూర్ఖుడు పవిత్రమైన ఆత్మకలవాడు కాలేడు. మోక్షాన్ని పొందలేడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తసకేడ చదువులు | 32 | 198 | 1 | 132 |

అవ: మాయకు లోనుగాక వేంకటాధీశ్వరుని ఆత్మలో స్మరిస్తే ముక్తి కరతలామలక మనుచున్నాడు.

**సీ. పెంచఁగఁ బెంచఁగఁ బెరిఁగెడు నాసలు**
**త్రుంచఁగఁ ద్రుంచఁగఁ దొలఁగిపోవు;**
**కంచంబు కూడును కట్టంగఁ గోకయు**
**వంచించు మేనికి వలయు నింతె;**
**తడవంగఁ దడవంగఁ దగిలెడు బంధంబు**
**విడువంగ విడువంగ వీడు నదియె;**
**గుడిసె యొక్కటి, యొక్క కుక్కిమంచంబులో**
**సగపాలు బొందికిఁ జాలు నింతె;**

**ఆ. వెగ్గలంపుపాటు వృథ వృథ వేంకట**
**విభుని నాత్మలోన వెలుఁగువాని**
**మాయఁ జిక్కి, మదిని మఱవక తలఁచినఁ**
**గరతలంపు నెల్లికాయ ముక్తి. 238**

ఆశలు తీర్చుకోడానికి పాటుపడేకొలదీ అవి అంతకంతకూ పెరుగుతూనే ఉంటాయి. మొలకలోనే త్రుంచివేస్తే మరల పొటమరించవు. కంచం నిండుగా కూడు, కట్టుకోడానికి బట్టా ఈ మోసకారి శరీరానికి ఉంటే చాలు. విచారించే కొద్దీ బంధకం ఎక్కువవుతూనే ఉంటుంది. విడువగా విడువగా అదే తొలగి పోతుంది. ఈ బొందికి ఒక గుడిసె, ఒక కుక్కి మంచంలో సగం చాలు. అధికంగా శ్రమపడడం ఎంతయినా దండుగ, మాయకు లోనుగాక వేంకటాచలపతిని-మనస్సులో ప్రకాశించే వానిని మరచిపోక తలుస్తూంటే మోక్షం అరచేతిలోని ఉసిరిక కాయవలె సులభ ప్రాప్య మవుతుంది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వెగ్గల మింతా | 341 | 242 | 4 | 162 |

అవ: భగవన్నామస్మరణం, దర్శనం వల్ల భోగము, సంపద, ముక్తి కరతలామలక మనుచున్నాడు.

**సీ. తలఁపున విష్ణుచింతన యొక్క త్రుటిమాత్ర**
**కలుగుటయే కల్గవలయుఁగాక**
**వలనైన భోగముల్ వైభవమ్ములు మఱి**
**కలవన్నియును తమకడకు రావె?**
**పదిలమౌ హరినామ భవ్యమంత్రము నిజ**
**వదనమ్ముఁ జేరంగ వలయుఁ గాక**
**తుదలేని సంపదల్ తొలఁగని మోదముల్**
**కదల కెప్పుడు తమ్ముఁ గదియరావె?**

**తే. వెన్నపట్టుక నేతికై వెదకనేల?**
**యెలమి శేషాద్రిశిఖర మొక్కించుకేని**
**కాంచుటే కల్గవలెఁ గాక కఱవుదీర**
**సచ్చిదానంద పదవులు సరగ రావె?** **239**

ఒక క్షణకాలం భగవన్నామ సంకీర్తనం చేస్తే భోగాలు, వైభవాలు తమంతట తామే వచ్చి చేరుతాయి. హరినామమనే పూజనీయమైన మంత్రాన్ని నోరార ఉచ్చరించవలెనే గాని అవిచ్ఛిన్నములైన సంపత్తులు, సంతోషాలు తన్ను వదలక కదలక ఎప్పుడూచేరి ఉండవా? ఉండునని భావం. చేత వెన్నపట్టుకొని నేతినేల వెదకవలె? శేషాద్రిశిఖరం ఇంచుక దర్శించవలెనే గాని వెంటనే కఱవు తీరునట్టు బ్రహ్మానంద ప్రాప్తిస్థానాలు తమకు వచ్చి చేరవా? చేరునని తాత్పర్యం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వెన్న పట్టుక నేయి | 33 | 202 | 1 | 134 |

అవ: భక్తి వినా ఇతరములైనట్టి ఏ యుపాయములచేతనూ భగవంతుడు వశ్యుడు కాదనుచున్నాడు.

**సీ. తలఁచినంతటిలోనె దైవ మ్మెదుట నిల్చుఁ**
**గొలువనేరని యట్టి కొఱఁతగాని;**
**యిల మానవులఁ గొల్చు టెందొ కోకలు వేసి**
**బలుకొక్కెరల వెంటఁ బరుగు లిడుటె;**
**శరణన్న మాత్రాన సకల వరాలిచ్చుఁ**
**దన్ను మఱచినట్టి తప్పుగాని;**
**అన్యమ్ములగు నుపాయమ్ములఁ బొరలుట**
**గాజుపూస మణిగఁ గట్టుకొనుటె;**

**తే. కాతరమ్మున మ్రొక్కని కడమగాని**
**చేతమ్రొక్కినఁ గాచు శ్రీశిఖరినాథుఁ;**
**డడవిఁ గాసిన వెన్నెలయగును నిత్య**
**మెన్ని పుణ్యాలు చేసిన నివ్వి మాని.** 240

భగవంతుని ప్రార్థించక పోవడమే లోపంకాని, తలచినంతమాత్రాన ఆయన ప్రత్యక్ష మవుతాడు. దైవసేవ వదలి మానవులను సేవించడం వస్త్రాలను ఎక్కడనో పారవేసుకొని కొంగల గుంపును చూచి అవే తమ వస్త్రాలని భ్రాంతితో పరుగెత్తడం వలె నిరర్థకం. శ్రీ విభుని మరచి పోవడం అనే తప్పు మనదే గాని ఒక్కమాటు శరణంటే ఆయన అన్ని వరాలు మనకిస్తాడు. భక్తిమార్గాన్ని కాదని ఇతరమార్గాలలో ప్రవర్తించడం గాజుపూసను మణి అని భ్రమపడి ధరించడం వలె దండుగ అని తెలియవలె. దీనుడై మ్రొక్కకుండడమే లోపం కాని, చేతులు జోడించి జోత లిడితే ఆయన కాపాడుతాడు. పై చెప్పిన మార్గాలు వదలి వేఠే ఎన్ని పుణ్యాలు చేసినా అవన్నీ అడవిలో కాచిన వెన్నెలవలె వ్యర్థములే అవుతాయి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| శ్రీపతి యీతఁ డుండఁగా | 230 | 169 | 3 | 113 |

అవ: పరమయోగుల మార్గ మెట్టిదో ప్రస్తుతిస్తున్నాడు.

**సీ. మొదల నాత్మజ్ఞానముం గొంత వడయుట**
**యవల డెందములోని హరి నెఱుఁగుట**
**అతిబలీయము లింద్రియముల నిర్జించుట**
**గుదిగొన్న యట్టి కోర్కుల నుడుగుట**
**తన పుణ్యఫలము లీశునకు నర్పించుట**
**ఘనభక్తి యతనిపైఁ గలిగియుంట**
**బాగు మీఱఁగ ధ్యానయోగపరుం డౌట**
**ప్రకృతి సంబంధమ్ము వదలుకొనుట**

**తే. నడుమ విజ్ఞానకథలు కర్ణముల వినుట**
**సతత మాచార్యసేవలు సలుపుచుంట**
**వైష్ణవకటాక్షవీక్షలఁ బడయఁ గనుట**
**పరమయోగిజనంబుల సరణి యగును. 241**

తొలుత కొంత ఆత్మజ్ఞానాన్ని సముపార్జించుకొని పిదప హృదయ పుండరీకంలో నెలకొన్న శ్రీ మహావిష్ణువును చూడడం, మిక్కిలి బలముగల ఇంద్రియాలను జయించడం, దట్టముగా అలముకొన్న కోరికలను వదలి పెట్టడం, తను చేసే పుణ్యకర్మల ఫలాన్ని ఈశ్వరార్పణం చెయ్యడం, ఆ దేవుని పై దృఢమైనభక్తి కల్గి ఉండడం, చక్కగా ధ్యానయోగపరుడు కావడం, మాయతోటి తగులం మానడం, అప్పు డప్పుడు జ్ఞానబోధకములైన కథలు వినడం, నిరంతరం గురుదేవులసేవ చేయడం, విష్ణుభక్తుల కటాక్షమునకు పాత్రుడు కావడం–ఇది గొప్పయోగుల మార్గం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పరమ యోగీశ్వరుల | 237 | 212 | 3 | 142 |

అవ: పరమాత్ముని వదలి పరులను సేవించబూనడం నిరుపయోగ మనుచున్నాడు.

**సీ. గద్దరిజీవుఁడు కామధేనువు మాని**
**యెద్దుఁ బిదుకఁ జొచ్చె నేది తెఱఁగు?**
**మఱుమాయములఁ దన మనమె చంచలమయి**
**యిటునటు దిరిగెడు నేది తెఱఁగు?**
**కటకట! ఊరేలుకర్త దొంగలఁ గూడి**
**యిటువలెఁ జేసిన నేది తెఱఁగు?**
**కల్లలాడఁగఁ జొచ్చెఁ గలుషపుమతి సత్య**
**మిల్లు వెడలఁగొట్టె నేది తెఱఁగు?**

**తే. అందగాఁడైన పెనిమిటి నాలు విడిచి**
**యిందు నందుఁ జరించిన నేది తెఱఁగు?**
**వరదు తిరుమలవిభుఁ బాసి పరులసేవ**
**కియ్యకొనుఁ జిత్తమయ్యో! యింకేది తెఱఁగు? 242**

దిట్టతనంగల జీవుడు కామధేను వుండగా దానిని వదలి పెట్టి ఎద్దును పిదకడానికి పూనుకుంటే మఱి చెప్పవలసిందేమి? మనసు మాయలపాలై చంచలంగా పలుపోకలు పోతుంటే మఱి దిక్కేమిటి? అట్లా పోనివ్వకుండా దేవునిపై నిలుపవలెనని తాత్పర్యం. గ్రామాధికారియే దొంగలలో చేరుకుంటే ఇక దిక్కేమి? అనగా మనసనే ప్రభువు ఇంద్రియాలనే దొంగలతో కూడక శ్రీవిభుని స్మరించాలని భావం. నిశ్చయాత్మకమైనబుద్ధి కలుషితమై అసత్యాలాడ మొదలిడి సత్యాన్ని వెడలగొడితే ఇంక దిక్కేమిటి? అందగాడైన పెనిమిటిని కాదని భార్య వ్యభిచరిస్తే మఱి దిక్కేమిటి? అనగా పెనిమిటివంటి వేంకటేశ్వరుడుండగా ఆయనను వదలి అన్యులను సేవించడం యుక్తం కాదని అభిప్రాయం. వరాలిచ్చే తిరుమలేశుడు విభుడై యుండగా ఆయనను విడిచి మనస్సు ఇతరులను కొలువబూనడం న్యాయం కాదని భావం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| గద్దరి జీవుఁడు | 108 | 65 | 4 | 404 |

అవ: అనేక జన్మలలో బాధ లనుభవించిన జీవుడు చివరకు షడ్గుణైశ్వర్య సంపన్నుడైన భగవంతుని ప్రాపు పొందగోరుతాడనుచున్నాడు.

**సీ. బహుదేహ కవచాలఁ బాఱవేసినవాఁడు**
**స్వేచ్ఛావిహారియై చెడినవాఁడు**
**బహుకాలముల ద్రిమ్మి పరవశించినవాఁడు**
**బహుయోనులన్ బయల్పడినవాఁడు**
**పెక్కుబాసలు నేర్చి పెంపుమీఱినవాఁడు**
**పలునామములఁ బిల్వఁబడినవాఁడు**
**బహు కామినులతోడ బహుపూరుషులతోడఁ**
**గడు మెలంగుచు బెండువడినవాఁడు**

**ఆ. ఉండఁ దావులేక యెండనీడల కెడ**
**తాఁకినట్టివాఁడు తనకు జాతి**
**యెదియు లేని యాతఁడీ జీవుఁ డప్పన్న**
**యండఁ జేర నాస నందినాఁడు.** 243

పలుమేను లనే కవచాలు ధరించి పాఱవేసినవాడును, ఇష్టం వచ్చినట్లు తిరిగి చెడినవాడును, అనేకకాలాలను గడపి హాయిని పొందినట్లు భావించేవాడును, అనేక గర్భముల నుండి పలుమార్లు పుట్టినవాడును, ఎత్తిన జన్మల్లో ఎన్నో భాషలునేర్చి అధికుడైనవాడును, ఎన్నోపేర్లతో పిలువబడినవాడును, పలువురు స్త్రీలతో, పురుషులతో సంసారము చేసి చచ్చుపడినవాడును, నివసించడానికి తావులేక ఎండనీడలపాలైన వాడును, జాతిలేనివాడైన ఈ జీవుడు ఈ నాటికి సంస్కారవిశేషంచేత శ్రీనివాసుని సన్నిధికి చేరవలెననే ఆశ కలవాడై నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఈ జీవునకు | 84 | 56 | 4 | 398 |

అవ: శ్రీనివాసుడే పరదైవం. ఆయనను కొలిచి తరించండని ప్రబోధిస్తున్నాడు.

**సీ. ఒఱపైన జవరాలు పరులెల్ల మగలంచు**
**వలపు నిల్పిన యటువలెనె మేము**
**ఎఱుకమాలిన బుద్ధి నెవ్వరైనఁ బతులని**
**తెఱఁ గెఱుంగక తెగఁ దిరిగినాము;**
**మందశేముషి యెండమావులె చెఱువులం**
**చందందుఁ జరియించునట్లు మేము**
**ఇందఱు హితులంచు నెందైన సుఖమంచుఁ**
**బొందరాని వ్యథలఁ బొరలినాము;**

**తే. దూరపుంగొండ నునుపన్న తోయముగను**
**మేటి వేంకటవిభుఁ బాసి మీఁద మీఁదఁ**
**జవు లనుచు నేపు లేనట్టి స్వాంతమునను**
**తాపలేక మేడల నెక్కఁదలఁచినాము. 244**

అందగత్తె అయిన యువతి అందరూ తనమగలే అని వలచిన విధంగా మేము జ్ఞానహీనులమై ఎవరైనను సరే ప్రభువులని న్యాయం తెలియక తెగదిరిగినాము. బుద్ధిలేనివాడు ఎండమావులను చూచి చెరువులని భ్రమించి పయనించినట్లు, ఈ అందరూ మేలుగోరేవారనీ, ఎక్కడైనా సుఖపడవచ్చుననీ భావించి పడరాని బాధలపాలైనాము. దూరపు కొండలు నునుపన్న సామెతగా మేటిదేవుడు వేంకటవిభు డుండగా ఆయనను కాదని పై కొన్న ఆశలతో, నిలుకడలేని మనస్సుతో నిచ్చెన లేకుండా మేడ లెక్క దలచినాము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తాపలేక | 15 | 94 | 1 | 65 |

అవ: భుక్తి ముక్తిప్రదాయకుడైన శ్రీనివాసుని ఆశ్రయించక దేహధారణకై పలుపాట్లు పడవలదని మూర్ఖుని హెచ్చరించుచున్నాడు.

సీ. **మనుజుఁడై జన్మించి మనుజుని సేవించి**
**యనుదినమ్మును దుఃఖ మందనేల?**
**జేనెడుపొట్టకై చెడుచోటులం జొచ్చి**
**పట్టెడుకూటికై పరుల వేఁడి,**
**పుట్టినచోటికే పొరలి మనసువెట్టి**
**వట్టిలంపటమును వదలఁడేల?**
**అందఱిలోఁ బుట్టి యందఱిలోఁ జేరి**
**యందఱ [illegible]మ్ము లన్నియుఁబచు**

తే. నందమగు వేంకటాద్రిపై నందరాని
పదము నొసఁగంగఁ బదిలుఁడై, పరమదాత,
పరమదైవతమై యున్న పరమపురుష
పదసరోజాతయుగళమ్ముఁ బట్టఁ దేల? **245**

తాను మానవుడై పుట్టి జేనెడుపొట్ట నింపుకోడానికి పట్టెడుకూటికై పోరానిచోట్లకు పోయి, తోడి మానవుని సేవిస్తూ, తీరనిదుఃఖాన్ని ఏల పొందవలె? తన జన్మకు స్థానమైనదేదో దానికై ఆశపడి, వ్యర్థమైన ఆయాసాన్ని ఏల పొందవలె? శ్రీమన్నారాయణుడు అందరిలో అంతర్యామిగా మెలగుతూ, అందరి రూపులూ తన రూపుగా కలిగి, ప్రకృతిసుందరమైన వేంకటాచలముపై దాతగా నిలిచి, మోక్ష మివ్వడానికి సిద్ధంగా ఉన్నాడు కదా! ఆ పరదైవతముయొక్క, ఆ పరమపురుషునియొక్క పాదపద్మాలను మానవుడేల పూజించడు? అనగా పూజించి పరమసుఖాన్ని పొందవలెనని తాత్పర్యం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మనుజుఁడై పుట్టి | 32 | 196 | 1 | 131 |

అవ: మదము, కామము, అజ్ఞానము అనేవి మానవుని పతనానికి కారణాలు; అతడు జ్ఞానంచేత అధికు డవుతాడను చున్నాడు.

సీ. ధనమదమ్మే నన్ను దైవ మ్మెఱుఁగనీదు
తపము సల్పఁగనీదు తను మదమ్ము
సంసారమదము దోసము పాయఁగానీదు
మదము పాలయ్యె నా మను విదెల్లఁ;
గామాంధకారమ్ము కననీదు పుణ్యమ్ము
కంచపుఁబుట్టు సద్గతిని జూప
దజ్ఞానతమము బుధాళి నెఱుఁగనీదు
చీకఁటిపాలయ్యెఁ జిత్త మెల్ల;

తే. ఎన్నఁడొకొ తెల్విగల్గి నే నెక్కు డగుట?
తిరుమలేశు మాయ మనమ్ముఁ దేఱనీదు;
ఏ యుపాయమ్ము లేకయే యితని మఱుఁగు
సొచ్చి పడియుండు టొక్కటే శోభనమ్ము. 246

ధనమదం దైవాన్ని తెలుసుకో నీయదు. శరీరమదం తపస్సు చేయనీయదు. సంసారంవల్ల కలిగే మదం దోషాలను వదలనీయదు. నా మానవజీవితమంతా మదంతో కూడినదే. కామంవలన కలిగిన అంధకారం పుణ్యంవైపు చూడనీయదు. తిండికే ఏర్పడిన పుట్టువు ఉత్తమగతిని చూపదు. అవివేక మనే చీకటి జ్ఞానులయొక్క సమాజాన్ని తెలుసుకోనీయదు. మన సంతయూ చీకటితో ఆవరింపబడింది. నేను తెలివిగల వాడనగుట ఎప్పుడు? మాయ మనస్సును తేటపరచదు. కనుక ఏ విధమయిన సాధన లేకుండానే శ్రీహరి మరుగుజొచ్చి ఉండటమే శుభం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎన్నఁడొకో | 205 | 30 | 3 | 21 |

అవ: భక్తి కొలదియే భగవదనుగ్రహ మనుచున్నాడు.

**సీ. తనకర్మ మెంతొ ప్రాప్తము కూడ నంతయే**
**గొనకొన్న పని యెంతొ కూలి యంతె;**
**తలఁపులో గోవిందు తలపోఁత యెంతయో**
**కలిగెడు సౌఖ్యమ్ము కలిమి యంతె;**
**తులఁ బైఁడి యెంతయో తూకమ్ము నంతయే**
**నెలకొన్న పిండెంతొ నిప్ప టంతె;**
**పొరి నీవి యెంతయో పొగడిక యంతయే**
**నరపతి చన వెంతొ నగవు నంతె;**

**తే. వామనుని పూజ యెంతయో ప్రాపు నంతె;**
**ఎసఁగు విజయం బదెంతయో యిరవు నంతె;**
**శేషగిరి సార్వభౌముని సేవ యెంతొ**
**పారవశ్యంబు నంతయే; పలుకు నంతె.** **247**

పనికి తగినంత కూలియే ముడుతుంది. కాని అందులో హెచ్చు తక్కువ లుండవు. గతంలో చేసుకొన్న కర్మల కనుగుణంగా ఈ జన్మలో ఫలం ప్రాప్తిస్తుంది. మనస్సులో గోవిందుని ఎంత స్మరిస్తాడో అంత సౌఖ్యం లభిస్తుంది. ఉన్న బంగారానికి తగినంతే తూకం ఉన్నట్టు, పిండి కొద్దీ రొట్టె అన్నట్లు; ఈవికి తగినంతే పొగడ్త లభించేట్టు, ప్రభువుతో తనకున్న పరిచయానికి తగినంతే సంతోషం కలిగేట్టు, పూజకొలదే తనకు దైవముప్రాపు కలుగుతుంది. జయానికి అనుగుణంగానే స్థానముంటుంది. శ్రీవేంకటేశ్వరుని సేవకు తగినంతగానే ఆనందం, మాట ఉంటుంది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తన కర్మమెంత | 34 | 213 | 1 | 142 |

అవ: నిజమైన జ్ఞానమంటే ఏమిటో తెలుపుతున్నాడు.

సీ. **వలచిన సతి తన్ను వడిఁ గాలఁ దన్నిన**
**నలరి తా నెట్లుబ్బు నట్టిరీతి**
**తలఁక కెవ్వరు కాలఁదన్నిన మనములో**
**నలుగక ముదమందు నదియ తెలివి;**
**అరిది మోహపుఁగాంత యాలిని దిట్టిన**
**యరవిరియై చొక్కు నట్టిరీతిఁ**
**బరులు త న్నిట్లు వెల్పలఁ బల్కినం గాని**
**యరలేక రతిఁ జొక్కు నదియ తెలివి;**

తే. **అతివ తములపు రస మాన ననయమెట్లు**
**కోరు నటువలె వేంకటగోత్రనాథు**
**దాసుల ప్రసాదమున్ గొనఁదలఁచు నదియ**
**తెలివి; తన్ను నెఱిఁగెడు తెలివి తెలివి.** 248

ప్రేమించిన ప్రేయసి తనను కాల దన్నితే తాను ఎంతగా సంతసించునో ఆ రీతిగా జంకకుండా ఎవరైనా తన్ను కాలితో తన్నితే మనసులోనైన కోపించక సంతోషపడుట, ఉంపుడుకత్తె తనభార్యను దూషించగా ఆనందించేట్టుగా ఇతరులు తన్ను పదిమందిలో తిట్టినపుడు అరమరికలులేక ప్రీతితో నుండుట తెలివి. ప్రియురాలి తాంబూల రసమును ఆస్వాదించుటకు ఆసపడే రీతిగా వేంకటాధిపతి యొక్క దాసుల ప్రసాదాన్ని స్వీకరించడమే తెలివి. విశేషించి తన్ను దాను తెలుసుకొనడమే మేలైన తెలివి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తెలిసియు నత్యంతదీనుఁడై | 64 | 330 | 1 | 220 |

అవ: నిజమైన జ్ఞాన మేమిటో వివరిస్తున్నాడు.

**సీ. ముంచెడు బంధాల ముచ్చ ముడుంగక**
**అంచల విడఁదన్ను టదియ యెఱుక;**
**చంచల విషయాల సగ్గుముగ్గుడు గాక**
**హరి దలపోయుట యదియ యెఱుక;**
**ప్రాయంపుఁ జెలులతోఁ బరఁగఁజేసెడి పొందు**
**హేయమం చెంచుట యిదియ యెఱుక;**
**ధరమీఁదఁగల ప్రాణితతుల నొప్పింపక**
**యటు సమబుద్ధియౌ టదియ యెఱుక**

**తే. పాయని దురర్థముల బంటుబంట యగుచు**
**నాయతిని మోసపోకుండు టదియ యెఱుక;**
**వేంకటేశ్వరు దాసుఁడై విమలుఁ డగుచు**
**నాత్మ సంతోష పెట్టుట యదియ యెఱుక. 249**

సంసారంలో ముంచే బంధాలలో చిక్కుపడక క్రమ క్రమంగా విడదీయుట, చపలములైన విషయాలకు లోనుగాక హరినామ స్మరణచేయుట. జవరాండ్ర పొందు నింద్యమని తెలియుట, సకల ప్రాణులకు బాధ కల్గించక సమబుద్ధితో వానిని చూచుట. వదలనట్టి చెడుపనులకు దాసానుదాసుడు గాక భవిష్యత్తులో మోసపోకుండుట, వేంకటాచలపతికి దాసుడై పవిత్రు డగుచు తన ఆత్మను సంతోషపఱచుటయే ఎఱుక (జ్ఞానము).

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఆతుమ సంతసపెట్టుటది | 79 | 378 | 1 | 253 |

అవ: జీవులు లోహంవంటివారైతే భగవంతుడు పరుసవేది యని పలుకుతున్నాడు.

**సీ. వనజనాభుని భక్తి వదలకుండినఁ జాలుఁ**
**దిరిపెపు మన సెందుఁ దిరుగ నేమి?**
**మొనసి ముద్రలు భుజమ్ముల నుండినం జాలుఁ**
**దను వెంతొ హేయమౌ దాని కేమి?**
**శ్రీకాంతు నామమ్ము జిహ్వనుండినఁ జాలు**
**నధమవంశజుఁడైన హైన్యమేమి?**
**సాకారుఁడౌ హరి శరణం బనినఁ జాలుఁ**
**జెలఁగి పాపము లెన్ని చేయనేమి?**

**తే. జీవి యెట్లున్న నేమి? యా జీవిలోని**
**శేషగిరి చక్రవర్తి కా చింతయేమి?**
**పైఁడి గావించునట్టి దా పరుసమె గద?**
**అరయ లోహం బదెట్లున్న నందు కేమి? 250**

చంచలమైన మనస్సు ఎట్లా సంచరించినా పద్మనాభునిపై భక్తి వదలకుంటే చాలు. శరీరమెంత ఏవగింపదగినదై నప్పటికినీ భుజములపైన శంఖ చక్రముద్ర లుంటే చాలు. తక్కువజాతివాడైనా ఏమీ తక్కువ లేదు. శ్రీహరి నామం తన నాలుకపై మెదలాడుతుంటే చాలు. అదే పవిత్రతను సమ కూరుస్తుంది. సగుణపరబ్రహ్మమైన నారాయణుని శరణుపొందితే చాలు, పాపాలు పోతాయి. ప్రాణి ఎట్లున్నప్పటికీ ఆ ప్రాణిలోపల అంతర్యామిగా ఉండే శేషగిరీశ్వరునకు ఆ చింతలేదు. లోహం ఎటువంటిదైనా దానిని బంగారం చేసేది పరుసమే గదా! హరినామం పరుసం వంటిది, జీవి లోహంవంటివాడు అని తాత్పర్యం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పరుస మొక్కటే కాదా | 78 | 373 | 1 | 249 |

అవ: హరినామ మాహాత్మ్యం ఉగ్గడిస్తున్నాడు.

సీ. **దురితకోటులు దీఱు దుఃఖజాల మణంగు**
**హరి యని యొక్కమా అన్నఁ జాలు;**
**సురలు పూజింతురు సిరులు చెంతకుఁ జేరు .**
**వెన్నుని పేరు పేర్కొన్నఁ జాలు;**
**భవము లన్నియుఁ బాయు పరము నిహము గల్గు**
**'నాదినారాయణా' యన్నఁ జాలుఁ;**
**భువియెల్లఁ దా నేలు పున్నెమంతయుఁ గూరు**
**శ్రీధరు మది దలంచినను జాలుఁ;**

తే. **దొలఁగు నజ్ఞాన; మానంద మొలయు నెపుదు**
**వేంకటేశ్వర యని నుడివినను జాలుఁ;**
**గామితమ్ముల నీడేర్పఁ గలుగు పద్మ**
**జా మనోహరు తిరుమంత్ర జపమె చాలు.** 251

హరి యని ఒక్కమారంటే కోట్ల కొలది పాపాలు, దుఃఖసమూహాలు నశిస్తాయి. విష్ణునామ సంకీర్తనం చేసేవారిని దేవతలు పూజిస్తారు. సంపదలు సమీపిస్తాయి. ఆదినారాయణా అని అన్నంతలోనే జన్మరాహిత్యం, ఇహపరసుఖాలు కల్గుతాయి. శ్రీధరుని మనసులో తలచినంత మాత్రాన చక్రవర్తి అవుతాడు, పుణ్యవంతు డవుతాడు. వేంకటేశ్వరా అని పలికితే అజ్ఞానం తొలగిపోయి బ్రహ్మానందం సిద్ధిస్తుంది. లక్ష్మీభర్త యొక్క తిరుమంత్రం జపిస్తే (ఓం నమో నారాయణాయ) కోరికలన్నీ నెరవేరగలవు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమరక తలఁచరో | 379 | 463 | 4 | 312 |

అవ: తన కేవీ వద్దనీ, శ్రియఃపతి శరణమే చాలనీ పలుకు తున్నాడు.

సీ. మోపు మోవఁగ నొల్ల ములుగంగ నే నొల్లఁ
దీపులు చేఁదులు తినఁగ నొల్లఁ;
బాపపుణ్యము లొల్ల భవముల నే నొల్లఁ
వెడఁగుఁ జీఁకటి నొల్ల వెలుఁగు నొల్ల;
నిడుమలు పడనొల్ల నిడుభోగముల నొల్లఁ;
గడుఁ బరు గొల్ల వగర్ప నొల్ల;
నట్టె పథ్యము లొల్ల నౌషధమ్ముల నొల్ల
మడుఁగుల నే నొల్ల మైల నొల్ల;

తే. నాకుఁ జాలు ముకుంద చింతనమె చాలుఁ;
జాలు నాకు మురారి దాస్యమ్మె చాలుఁ;
జాలు చాలు శ్రియఃపతి శరణుఁ జొరఁగఁ
జుట్టుకొను నట్టి యానందసుఖమె చాలు. 252

బరువులు మోయుటకు, శ్రమచే మూల్గుటకు, తీపి చేదు పదార్థాలు తినుటకు, పాపపుణ్యాలు చేయుటకు, పుట్టువులకు, చీకటి వెలుగులకు (జ్ఞానాజ్ఞానములకు), కష్టములకు, భోగాలకు పరుగులెత్తుటకు, అలసటచే రొప్పుటకు, పథ్యము లుండుటకు, మందులు సేవించుటకు, మడిమైలలకు నేను ఇష్టపడను. నాకు ముకుందుని చింతనమే. మురారి కైంకర్యమే చాలు. శ్రియఃపతి శరణ మొందుటచే కలిగెడు ఆనందమే నాకు చాలు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తక్కిన చదువు | 311 | 65 | 4 | 44 |

అవ: హరికృప పొందినవాడే అధికు డనుచున్నాడు.

**సీ. ధరణిలో నెవ రెన్ని తపములు చేసిన**
**హరికృప గలవాఁడె యధికతరుఁడు;**
**విత్తులు మితిలేక వెదపెట్టినన్ భూమి**
**తతి విత్తినట్టివే తగ ఫలించు;**
**నితరకాంతలు మఱి యెందఱున్నను పతి**
**మన్నించునదె పట్టమహిషి యగును;**
ఎన్నిపాటులు పడి యెంత గొల్చిన దొర
మెప్పు నందినవాఁడె గొప్పబంటు;

తే. దానధర్మాల కొసఁగెఁడు ధన మొకండె
తనకు దాఁపురమై నిల్చుఁ; దనయులందు
ధర్మపరుఁ డొక్కఁడీడేఱుఁ; దన చదువులఁ
దిరుమలయ్య మంత్రంబె యక్కఱకు వచ్చు. **253**

నేల జల్లిన విత్తనములన్నీ మొలకెత్తి ఫలించవు. అదనులో చల్లినవి మాత్రమే ఫలవంతము లవుతాయి. పలువురు భార్యలున్ననూ భర్తమన్నించి ఆదరించినదే పట్టపురాణి అవుతుంది. ఎంద రెన్ని విధాల ప్రభు సేవలు చేసినా, ప్రభువుమెప్పు పొందినవాడే గొప్పబంటు. ఆ విధంగానే ఎవ రెన్నివిధాల తపస్సులు చేసినా, హరికృపను పొందగల్గినవాడే మిక్కిలి గొప్పవాడు. దానధర్మాలకై వెచ్చించే ధనమే తనకు అండగా నిలుస్తుంది. తన కొమాళ్ళలో ధర్మపరుడే ధన్యుడు. తన చదువులన్నింటిలో తిరుమలేశుని మంత్ర మొక్కటే తనకు అక్కరకు వచ్చేది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ధరణి నెందరెన్ని | 155 | 260 | 2 | 174 |

అవ: శ్రీనివాసుని శరణుగోరని జన్మాదులు వ్యర్థములనుచున్నాడు.

**సీ. హరి నెఱుంగని జన్మ మదియేల? పరమాత్మ**
**సంస్తుతి సలుపని చదువు లేల?**
**దయ దొలంగిన యట్టి తప మేల? జప మేల?**
**భయము లేనటువంటి భక్తి యేల?**
**ప్రియము మానినయట్టి పెనఁకువ లేల? స**
**త్ఫలము నొసంగని పను లవేల?**
**తన కమరని దొరతన మేల? మతి యెందుఁ**
**జనవులే నటువంటి సలిగ యేల?**

**తే. కలిమిలేని గర్వం బేల? బలిమిలేని**
**పంతమేల? శౌరికిఁ గాని స్వాంత మేల?**
**సప్తనగనాయక పదాబ్జశరణ మొంది**
**జీవన మొనర్చునప్పుడు చింతయేల? 254**

శ్రీహరి నెఱుంగని పుట్టుక, పరమాత్మని పొగడని విద్య, దయలేని తపస్సు, జపము, భయంలేని భక్తి, ప్రియంలేని పడతుల పొందు, మంచిఫలితా లివ్వని పనులు, తనకు ఉపకరించని ప్రభుత్వము, చనవులేని ప్రాపు, సంపదలేని గర్వము, బలంలేని ప్రతిజ్ఞ, భగవంతుని కర్పణగాని మనస్సు, ఏడుకొండలవాని శరణమొంది బ్రతుకునప్పుడు ఇతరమైన చింతలు వ్యర్థములు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
| --- | --- | --- | --- | --- |
| హరి నెఱుఁగని | 182 | 414 | 2 | 279 |

అవ: జీవుడే దేవుడను మాటను ఖండించుచున్నాడు.

**సీ. తానె దేవుండైన తప మేల? జప మేల?**
**సారెకుఁ బూజలు సలుప నేల?**
**గూను వంగఁగ నిండ్లకుం బోయి చే సాఁచ**
**నేల? లోకములెల్ల నేలరాదె?**
**తా స్వతంత్రుండైన దారిద్ర్యమది యేల?**
**నొగిలి వ్యాధులచేత నొవ్వనేల?**
**నగుఁబాటులైన పుట్టుగులు, చావులు నేల?**
**ముగురు వేల్పులదండ నెగడ రాదె?**

**తే. ఇంత యెఱుఁగరె నాఁటి యోగీంద్రులైన**
**వ్యాస శుక శౌనక వసిష్ఠ వామదేవ**
**నారదాదులు? పాపబంధములఁ బాసి**
**శ్రీశు శరణంది చెంతకుఁ జేర రాదె? 255**

జీవుడే దేవుడైతే తప మెందుకు? జప మెందుకు? మాటిమాటికీ పూజలు చేయడ మెందుకు? 'అహం బ్రహ్మాస్మి' అనుచునే ఈ కార్యకలాపము సాగించుచున్నారు గదా !

తానే దైవమైతే వినమ్రుడై కొంపకొంపకు బోయి యాచించవలసిన అక్కర లేదుగదా ! ఆ భగవంతునివలె తానూ లోకములన్నీ ఏలవచ్చును గదా! కానందువల్లనే భిక్షలు గొనుచున్నారని భావం.

తానే స్వతంత్రుడైతే దారిద్ర్యబాధ అనుభవించడ మెందుకు? రోగబాధలకు గురికావడ మెందుకు? కానందువల్లనే దారిద్ర్యవశుడై రోగపీడితు డగుచున్నాడని తాత్పర్యం.

తానే దైవమైతే జనన మరణములకు తా నేల గురి కావలె? త్రిమూర్తుల చెంతజేరి నిక్కవచ్చును గదా! తాను దేవుడుకాడు గనుకనే జననమరణ పరిభ్రమణము సల్పుచున్నాడనుట.

జీవుడు వేఱు, దేవుడు వేఱని గ్రహించుటచేతనే ఆనాటి వ్యాసుడు, శుకుడు, శౌనకుడు, వసిష్ఠుడు, వామదేవుడు, నారదుడు మున్నగు మహాయోగులు శ్రీహరిని గొల్చి కడతేరినారు. తనవలె మేమే దేవుళ్ళ మని వారు విర్రవీగలేదు. కనుక పాపపుకట్ల నుండి బయటపడుటకు శ్రీహరి శరణుపొంది ఆయన చెంతకు చేరవలెను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| దోమటి నింతెరఁగరా | 183 | 415 | 2 | 280 |

అవ: భాగ్యహీనులు ఇహలోక సుఖాలకై ప్రాకులాడుతారే గాని పరమాత్ముని భజించ రనుచున్నాడు.

**సీ. అయ్యయో ! వారి భాగ్యం బింతయే కాక**
**వెన్నయుండఁగ నేయి వెదకనేల?**
**అఖిలదిక్కుల మురహరి నిండియుండంగ**
**నాస్తికునకు శూన్య మగుచుఁదోఁచు;**
**నివల వానగురిసి యే ఱెంత పాఱినఁ**
**గట్టడి జీవికి గతుకు గతుకె;**
**పరఁగ రక్షించు ప్రపత్త్యుపాయం బుండఁ**
**గష్టనకున్ గర్మ మిష్ట మగును;**

**తే. పట్టపగలె రాతిరి కొన్ని ప్రాణులకును**
**శౌరి కట్టెదుటను వెల్గ సంశయించు**
**జడుఁడు-సరసపదార్థమ్ము విడిచి కోఁడి**
**తిప్పపెంటలు గెలఁకుట తెల్లమె గద! 256**

వెన్న అఱచేత నుండగా నెయ్యికి ప్రాకులాడినట్లు కొందఱు ఇహలోక భోగభాగ్యాలకై వ్యర్థముగా ప్రాకులాడుదురు. శ్రీహరి చింతన వల్ల అన్నీ సమకూడుతాయి గదా ! అన్ని దిక్కులలో భగవంతుడు నిండియుండగా నాస్తికునకు అంతా శూన్యంగానే తోస్తుంది. అతడు ఎక్కడా దేవుని కనలేడు. వాన గుఱిసి ఏఱు గట్టులొరసి పారుతుంటే కుక్కకు గతుకునీళ్ళే గదా గతి ! తన్ను సంరక్షించడానికి ప్రపత్తి సిద్ధంగా ఉండగా కష్టపడేవానికి కర్మమార్గమే ఇష్టంగా ఉంటుంది. పులి, గ్రుడ్లగూబ వంటి కొన్ని జీవులకు పట్టపగలే రాత్రి. వాటికి ఏమీ కనిపించదు. అరీతిగా మూర్ఖుడు ఎట్టయెదుట శ్రీహరి వెలుగుతుండగా చూడలేక సందేహిస్తాడు. ఈ దుఃస్థితి రసవంతములైన పదార్థాలు దగ్గరే ఉండగా వదలిపెట్టి కోడి పెంటదిబ్బలను ఆహారంకోసం గెలికే విధంగా ఉంటుంది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అయ్యో వారి భాగ్య | 106 | 33 | 2 | 23 |

అవ: శ్రీనివాసుని కారుణ్యమే ఎఱుకకు మూల మనుచున్నాడు.

**సీ. తను భోగరతులను దలపోయునే గాని**
**తన నారకవ్యథల్ తలఁపఁబోఁడు;**
**కనకభూషణములు గని విస్మయంపడు**
**కర్మబంధములకుఁ గలఁత పడఁడు;**
**ఇందందుఁ దాఁ జేయు నెమ్మె లెంచును గాని**
**కూడు పాపములకుఁ గొంకఁ బోఁడు;**
**లోకదృశ్యముల నాలోకించునే గాని**
**భీకరజన్మముల్ వీఁకఁ గనఁడు**

**తే. అప్పటి సుఖమ్మె గను, మీఁది దరయఁ బోఁడు**
**వింతమాటల వేడ్కతో వినునె గాని**
**యవల తాఁబడు పాటుల నాలకింపఁ;**
**డిపుడె హరి యేలఁగా జీవుఁ డెఱిఁగినాఁడు. 257**

మూర్ఖుడైన జీవి శరీరమునకు చెందిన భోగములందలి కోరికలను ఆలోచిస్తాడే గాని మున్ముందు కలుగబోయే నరక బాధలను గూర్చి ఆలోచించడు. బంగారునగలు చూచి ఆశ్చర్యపడతాడే గాని కలుగబోయే కర్మబంధాలకు కలతపడడు. అక్కడక్కడ తాను చేసే విలాసాలను లెక్కిస్తాడే గాని ప్రోగవుతున్న తన పాపాలకు జంకడు. లౌకికములైన దృశ్యాలను చూస్తాడే గాని రాబోయే భయంకర జన్మలను కనలేదు. తాత్కాలికంగా తనకు కలిగే సుఖాని కానందిస్తాడే కాని భవిష్యత్తును గూర్చి తలపోయడు. వేడుక మాటలను ఉత్సాహంతో వింటాడే గాని రానున్నకాలంలో తన కేర్పడే పాటునుగూర్చి వినడు. కానీ, పై తప్పిదా లన్నింటినీ ఇప్పుడే శ్రీనివాసుని కృపచే తెలుసుకొన గల్గినాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అప్పటి సుఖమే | 348 | 284 | 4 | 190 |

అవ: అతీతములు, అనాగతములు అగు జన్మలను స్మరించి వీటికి హరి మాయయే కారణ మనుచున్నాడు.

సీ. ఎవ్వ రెవ్వరివాఁడొ యీ జీవుఁ దరయంగ
నెవ్వరికిని నీతఁ డేమి యవునొ?
సుతుఁడుగాఁ డెందఱ కితఁడు? చుట్టము గాఁడు?
తోఁబుట్టుగాఁడు హితుండు గాఁడు?
ఎందఱ భ్రమ పెట్టఁ డీతండు? దరిలేని
దుఃఖాబ్ధి నెందఱఁ ద్రోయఁ డితఁడు?
ఎక్కడెక్కడఁ జరియింపఁ డీతం? డెప్పు
డెక్కడి కరుగునో యితఁడు తాను?

తే. ఎన్నఁడును చేటు లేనివాఁ డీతఁ డెన్ని
తనువులు ధరింపఁ? డిఁక నెన్ని తాల్పఁ డితఁడు?
అజుని ముంచిన హరిమాయలందుఁ దగిలి
యెన్ని పదవుల నితఁ డందఁ డిందు నందు. 258

ఆలోచించగా ఈ జీవుడు గడచిన జన్మలలో ఎందరి కెన్నివిధాల సంబంధ పడినవాడో ! ఎందరికి పుత్రుడైనాడో! బంధు వైనాడో! తోడ బుట్టినవాడైనాడో! మిత్రుడైనాడో ! ఎందరిని మోహింపజేశాడో ! ఎడబాటుచే ఎందరిని అపార దుఃఖసముద్రంలో ముంచినాడో ! ఈ జీవుడు ఎక్కడెక్కడ తిరిగినాడో! మునుముందు ఎక్కడికి పోనున్నాడో ! ఎన్నటికి నశింపని ఈ జీవుడు ఎన్ని శరీరాలు ధరించాడో ! ఇక నెన్ని ధరించగలడో ! బ్రహ్మదేవుని గూడ ముగ్ధుణ్ణి చేసిన హరి మాయలో తగుల్కొని ఈ జీవుడు ఇహపర లోకాలలో ఎన్ని పదవులు పొందినాడో గదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎవ్వ రెవ్వరి వాఁడొ | 16 | 97 | 1 | 67 |

అవ: కొలమాలిన పనులకు ప్రొద్దున్నది గాని హరినామ స్మరణకు లేదనుచున్నాడు.

**సీ. అడుసుఁ జొరంగఁ గాళ్ళటునిటు గడుగంగఁ**
**గలకాల మిట్టులే గడచిపోయె;**
**నొడలిలో జీవున కొడయఁడైన యుపేంద్రుఁ**
**దడవంగ బ్రొద్దొక గడియ లేదు;**
**కలుషంపుఁ గడవను గడుగంగ, నించంగఁ**
**గలకాల మిట్టులే గడచిపోయె;**
**తనపాలి దైవమ్ము ఫణిరాజశయనునిఁ**
**దడవంగ బ్రొద్దొక గడియ లేదు;**

**ఆ. శిరసు ముడుచుటకును చిక్కు దీయుటకును**
**ఉరక గాలికేగె నున్న కాల;**
**మంజనాద్రినిలయు నా పదుద్ధారకుఁ**
**దడవఁ దనకుఁ బ్రొద్దు గడియలేదు.** **259**

అడుసులో దిగి కాళ్ళు శుభ్రం చేసుకొనడంలోనే కాలమంతా గడచి పోయింది. అనగా అకృత్యాలు చేసి వాటిని సరిదిద్దు కోవడంలోనే సమయం పోతున్నది గాని తన శరీరంలోని జీవునికి ప్రభువైన శ్రీశుని స్మరించడానికి ఒక క్షణకాలమైనా తీరిక ఉండదు. మురికిభాండాన్ని శుభ్రపరచడం, జలంతో నింపడంతోనే కాలం సరిపోతున్నది. అనగా పాడుదేహాన్ని శుభ్రపరచుకోవడం, ఆహారంతో దానిని నింపుకోవడం వీటితోనే కాలం గడచిపోతున్నదే గాని తనపాలిటి దేవుడు, ఆది శేషుడు శయనముగాగల వేంకటస్వామిని తలచుకొనడానికి ఒక గడియకూడ సమయముండదు. తలవెంద్రుకలను చిక్కుదీసి అలంకరించుటలో సమయమంతా వ్యర్థంగా గాలిపా లవుతున్నదే గాని అంజనగిరి స్థానముగా గల దేవుని, ఆపదలనుండి కాపాడువానిని స్మరించడానికి తనకు బొత్తిగా సమయం చాలదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| గాలినే పోయ | 3 | 14 | 1 | 9 |

అవ: భగవత్పరములు కాని పనులు వ్యర్థములనుచున్నాడు.

సీ. గోవిందు గొలువని కొలువులు కానలోఁ
గాసిన వెన్నెలల్; వాసుదేవు
నాలకింపని గాథ లవి గజస్నానముల్;
దైత్యారికిం గాని తపములెల్లఁ
బాతాళ నిధులు; శ్రీపతిపైనిఁ జేయని
భక్తి చెంబులమీఁది పైడిపూఁత;
వైకుంఠు వినుతి సల్పని పల్కులన్నియు
సంభోధి గురిసిన కుంభవృష్టి;
జలజాక్షుఁ దెలియని తెలువులు పెన్నేటి
నడిమి పైరులు; జగన్నాయకునకు
మ్రొక్కని మ్రొక్కులు నిక్కమ్ము పరికింప
భిత్తికయే లేని చిత్తరువులు;

తే. మగఁడు లేని సింగారముల్ మాధవునకుఁ
గాని పువ్వుల పూజలు; కైటభారిఁ
గోరనట్టి కోరుకు లందుకొనఁగరాని
మ్రానిపండులు; గరుడాద్రి మందిరుండు
రక్షకుండు, సాకారమౌ బ్రహ్మ; మతని
శరణ మొక్కఁడె యిష్టార్థ సాధనమ్ము. 260

గోవిందుని గొలువక ఇతరులను గొల్చుట అడవిగాచిన వెన్నెలవలె వ్యర్థము. భగవత్సంబంధములు గాని కథలను ఆలకించుట ఏనుగు స్నానమువలె నిరర్థకం. ముకుందుని గూర్చి చేయని తపస్సులు పాతాళ లోకంలోఉండే నిధులవలె నిరుపయోగములు.

శ్రీపతికి గాని భక్తి చెంబులమీది బంగారుపూతవలె విలువ లేనిది. వైకుంఠుని పొగడని వచనములు సముద్రంలో కురిసిన వానవలె నిష్ఫలం.

తామరపూలవంటి కన్నులుగల శ్రీహరిని తెలుసుకొనలేని జ్ఞానము పెద్ద యేటినడుమ వేసిన పైరు చందంగా వ్యర్థప్రయాసతో కూడినది. జగత్తులకు నాయకుడైన నారాయణుని వదలి ఇతరులకు మ్రొక్కిన మ్రొక్కులు ఆలోచించగా ఆధారకుడ్యములేని బొమ్మలు. మాధవుని వదలి ఇతరులకు చేసిన పూలపూజలు విధవ చేసుకున్న అలంకారములవలె నింద్యములు.

కైటభుని సంహరించిన శౌరిని కోరక అన్యులను కోరుట అందని మ్రానిపండ్లకు అఱ్ఱులు సాచుటవలె దండుగ. గరుడాచలము మందిరముగా గల శ్రీనివాసుడే రక్షకుడు. ఆకారముతో కూడిన పరబ్రహ్మ మతడే. ఆయనను శరణు జొచ్చుటయే అభీష్టదాయకము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎంచి చూడరో | 51 | 235 | 2 | 157 |

అవ: మనఃపరిపాకాన్ని అనుసరించే మోక్షసుఖం కలుగుతుందను చున్నాడు.

సీ. ఎడలేని పరితాప మెట్టుండఁ జెలరేఁగు
నడియాస కోరిక లట్టులుండు;
కడలేని దుఃఖసంగతి యెట్టు తా నుండు
నదరు సంసారంబు నట్టులుండు;
చింతాపరంపరం జిత్త మ్మదెట్టుండు
నిట్టలమగు మోహ మట్టులుండు;
మంతనంపుఁ బనుల మానస మ్మెట్టుండు
నసమాస్త్రుశరగతి యట్టులుండు;

తే. ఈశుఁ డొక్కఁడె యను తెల్వి యెట్టులుండు
హరి కరుణతోడి చేఁతలు నట్టులుండు;
హృదయగోచర పరిణతి యెట్టులుండు
నసమ కైవల్యసౌఖ్యమ్ము లట్టులుండు. 261

పరితాపం దట్టంగా చెలరేగే విధంగానే పేరాసలు కూడా చెలరేగుతాయి. అతిశయిల్లే సంసారం, అంతంలేని దుఃఖాల సంబంధంవలె ఉంటుంది. పెచ్చు పెరిగిన అజ్ఞానం చింతలలో చిక్కిన చిత్తంవలె ఉంటుంది. మన్మథుని బాణవేగం ఎట్టులో, ఏకాంతపు పనులలో మనసుకూడ అట్లే ఉంటుంది. ఈశ్వరు డొక్కడే అనే జ్ఞానం ఎంతగా ఉంటుందో ఆ దేవుని దయతో గూడిన పనులు కూడా అంతగానే ఉంటాయి. మనః పరిపాకానుగుణంగా మోక్షసుఖం కూడ కలుగుతుంది

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏణ .నయనల | 16 | 99 | 1 | 68 |

అవ: వేంకటేశ్వరుని మఱచుట పెనుచీకటిలో పడటమే అనుచున్నాడు.

**సీ. కొలఁది మీఱిన దేవకోటులు తనలోనఁ**

**గలవాని నొక్కని గొలువకుండఁ**

**దల ఱాయిగాఁగ నెందఱకు మ్రొక్కిననేమి**

**తెలివిమాలిన యట్టి దేహి తుదకు?**

**మెండుగ జగములు మేనిలోఁ గలవాని**

**పొలింటివాఁడౌచుఁ బ్రణుతి గొనక**

**కా లీఁచపడఁగ నెక్కడికి నేగిన నేమి**

**ప్రొలుమాలిన యట్టి ప్రాణి కడకు?**

**తే. వేంకటేశు నుతింపక వేయి యేడు**
**లెవ్వరిని మెచ్చనేమి? తా నీడ నాడ**
**నెవరివెంటఁ జరించిననేమి? కొనకుఁ**
**గోరి పెనుఁజీఁకటిం ద్రవ్వుకొనుట గాక! 262**

లెక్కకు మిక్కిలిగా దేవతలు తనలో గల ఒక్క శ్రీవేంకటేశ్వరుని గొలువక తల బొప్పికట్టునట్లు తెలివిమాలి ఎందరు దేవతలకు మ్రొక్కినా ఏమి ఫలం? లోకములన్నీ తనలో నున్న స్వామిని జేరి స్తోత్రం చేయుటకు ప్రొలుమాలి, కాళ్ళు మెలికలు తిరుగునట్లు ఎక్కడెక్కడి క్షేత్రాలకో, తీర్థాలకో పర్యటించికూడా ప్రాణికి తుద కేమియూఫలంలేదు. శ్రీనివాసుని స్తుతించక ఇతర దైవములను వెయ్యి సంవత్సరాలు వేడుకొన్నా లాభం లేదు. ప్రాణి ఇటునటూ దేవతాంతరముల వెంటబడి తిరిగితే ఏమి ప్రయోజనం? అట్లు తిరగడం తానై కోరి కోరి చివరకు అజ్ఞానమనే గోతిని త్రవ్వుకోవడమే అవుతుంది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎందరి వెంట | 32 | 201 | 1 | 134 |

అవ: హరిభక్తి వినా మరి సద్గతి లే దనుచున్నాడు.

**సీ. హరికథలన్ ప్రియమబ్బెనా? తొల్లింటి**
**పరిపక్వ తపముల ఫలమె సుమ్ము;**
**గరిమతో నిదిలేక కలకాల మొనరించు**
**పలు తపమ్ములు నీటివ్రాఁత పొమ్ము;**
**నారాయణుని భక్తి ననిచెనా ధనమెల్ల**
**బాఱఁజల్లిన పుణ్యఫలమె సుమ్ము;**
**గొప్పగా నిదిలేని కోటిదానములైన**
**వఱుతఁ గల్పిన చింతపండె పొమ్ము;**

**తే. వదలక వృషాద్రిపతియె దైవత మటంచు**
**చదువఁ గల్గిన నది మంచిచదువె సుమ్ము;**
**పదిలముగ నీ విధమ్మును పగటనట్టి**
**చదువు దైత్యులు చదివెడి చదువె పొమ్ము.** **263**

భగవంతునికి సంబంధించిన కథలు వినడంలో ప్రీతి కలిగితే అది గడచిన పుట్టుకలలోని పండిన తపస్సుల ఫలమే సుమా! అనగా గతజన్మలందు తపస్సులు చేసినవారికి మాత్రమే ఈ జన్మలో హరికథాశ్రవణ కుతూహలం కల్గుతుందని భావం. ఈ హరికథాశ్రవణంలేక ఎంతో గొప్పగా బహుకాలం చేసే తపస్సు కూడా నీళ్ళలో వ్రాసిన వ్రాతవలె రూపుమాసిపోతుంది. నారాయణునిమీద భక్తి కలిగితే అది తన సర్వస్వాన్నీ అర్థికోటికి పూర్తిగా దానం చేయడంవల్ల సంప్రాప్తించే పుణ్యఫలమే అని తెలియవలె. ఈ భగవత్కథాశ్రవణం లేకపోయినప్పుడు కోటిదానాలు చేసినా అవి ఏటిలో గలిపిన చింతపండువలె నిరుపయోగ మవుతాయి. వృషగిరీశుడే దేవుడని చాటు విద్యయే విద్య. ఇతర విద్యలు గోవిందుని తెలుపునవి కావు గనుక అవి మంచివిద్యలు కావని తాత్పర్యం. పైని పేర్కొన్న వాటిని ప్రకటించని చదువులు రాక్షసుల చదువులే అగును. అనగా అధర్మప్రతిపాదకములు, దైవ విముఖములు అని తాత్పర్యం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏ పనులు సేసినా | 70 | 364 | 1 | 243 |

అవ: ఏడుకొండలవాడే సేవింపదగిన దేవుడని నిదర్శనములతో నిరూపిస్తున్నాడు.

**సీ. ఇలువేలు పొక్కందు జలజాక్షుఁ డుండంగఁ**

**బలు వేలుపులమీఁద భ్రాంతి యేల?**

**మింట మార్తాండుండు మిక్కిలి వెలుఁగంగ**

**వెలలేని దీపముల్ వేయనేల?**

**హరిభక్తి యొక్కటి యాత్మలో నిండంగఁ**

**బరయుక్తు లెంచెడి పను లిఁకేల?**

**చింతామణీ యొకండు చేతిలో వెలయంగ**

**గాజుపూసలమీఁదఁ గాంక్ష యేల?**

**తే. నాలుకను దేవవంద్యుని నామముండ**
**గాలిఁబోయెడి యూరూరి గాథలేల?**
**యేదుకొండలరాయఁడే యెదుట నుండ**
**మూలలకుఁ జేతులను జాచి మ్రొక్కనేల? 264.**

ఆకాశంలో సూర్యుడు చక్కగా ప్రకాశిస్తుండగా విలువలేని వెయ్యిదీపాలతో ఏమి ప్రయోజనం? ఇంటిదైవం శ్రీ వేంకటేశ్వరు డుండగా ఇతరదైవతములందు భ్రమ యెందుకు? అక్కరలేదని భావం. ఒక్క హరిభక్తి మనసులో నిండియుండగా పరదైవములతోడి సంబంధం కోరే పను లెందుకు? అక్కరలేదని భావం. కోరికలిచ్చే చింతామణి మనచేత నుండగా కొరమాలిన గాజుపూసలపై కోరిక ఎందుకు? అక్కరలేదని భావం. వేంకటాద్రీశుడు చింతామణివంటివాడనీ, కడమ దేవతలు గాజుపూసలవంటివారనీ చెప్పుట. దేవతలకు నమస్కరింప దగిన గోవింద నామము జిహ్వపై నుండగా గాలికిపోయే ఊరూరివార్త లెందుకు? అక్కరలేదని భావం. ఏడుకొండలరాయడే కలియుగప్రత్యక్షదైవమై నిలిచి ఉండగా మారు మూలల నుండే ప్రత్యక్షంగాని దైవములకు చేతులెత్తి నమస్కరించడం ఎందుకు? అక్కరలేదని భావం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కలిమి గలిగియు | 233 | 187 | 3 | 125 |

అవ: వేంకటేశ్వరుని వేయినామాలలో ఒక్కనామమే త న్నుద్ధరించుటకు చాలు ననుచున్నాడు.

**సీ. హరినామ మొకటనే యణఁగెఁ బాపమ్ములు**
**మిగిలిన నామముల్ మిన్నకుండె;**
**శ్రీపతి నామమ్మె సిరులెల్ల సమకూర్చెఁ**
**బెఱనామములు చేరి పెట్టినుండె;**
**గోవిందనామమే కూర్చెఁ బుణ్యమ్ములు**
**వేఱునామము లెల్ల నూరకుండె;**
**శ్రీవిష్ణునామమే చెందించె వైకుంఠ**
**మవ్వలి నామమ్ము లట్టులుండె;**

**తే. కామితమ్ములు కేశవనామ మిచ్చెఁ**
**గడమ నామముల్ చెంతనే కాచియుండె;**
**నన్నినామాలు తన నామమైనయట్టి**
**వేంకటేశ్వరు నామమ్మె వెలుఁగుఁ జూపె. 265**

ఒక్క హరి అనే పేరు నుడివిన మాత్రాన అన్ని పాపాలు అణగిపోయాయి. శ్రీపతి అనే నామం పలుకగానే సంపదలన్నీ సంప్రాప్తించాయి. గోవిందా అని అన్నంతనే సకల పుణ్యాలూ సమకూడినాయి. విష్ణునామం ఉచ్చరించగానే వైకుంఠ నివాసం లభించింది. కేశవనామమే కోరికల నన్నింటిని ప్రసాదించింది. అన్ని పేళ్ళూ తనపేరైన శ్రీ వేంకటేశ్వర నామమే మాకు జ్ఞానం కలిగించింది. కడమ నామములు నుడువవలసిన అక్కరయే మాకు లేకుండా పోయింది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఎందుకుఁ బని గొందము | 252 | 297 | 3 | 201 |

అవ: శ్రీనివాస భక్తులు అన్యులను సేవించ రనుచున్నాడు.

సీ. **అచ్యుత గోవింద యనియెడి నాల్కతో**
**ధర నితరుల పేళ్ళు దడవుటెట్టు?**
**సరవి వేదమ్ములు చదివెడు నోటితోఁ**
**బరులమీఁదఁ బదాలు పాడుటెట్టు?**
**మురఘస్మరునకును మ్రొక్కెడి చేతుల**
**నపశదులకు దండ మనుట యెట్టు?**
**మునుకొని పువ్వులు ముడిచిన శిరమున**
**కనలు కట్టెలుమోచి కందుటెట్టు?**

తే. **కోరి శ్రీవేంకటేశ్వరుఁ గొలుచువారు**
**తెలియ కల్పుల సేవించి తిరుగుటెట్టు?**
**గుందు బెందు లెఱుంగరు కుమతు లవుర**
**తీయనవు నోటితో చేఁదు మేయుటెట్టు?** **266**

అచ్యుత, గోవింద అనే శ్రీహరి నామములను పలికే నాలుకతో ఎల్లయ్య, పుల్లయ్య అనే ఇతరుల పేళ్ళను ఉచ్చరించడం యోగ్యమా? వేదాలు వల్లించే నోటితో సామాన్యులమీద సంకీర్తనలు రచించి పాడటం సముచితమూ? మురుడనే రాక్షసుని సంహరించిన శ్రీమహావిష్ణువునకు నమస్కరించే చేతులతో నీచులకు నమస్కరించడం యుక్తమా? పూలు పెట్టుకొన్న నెత్తిమీద మండేకట్టెలను పెట్టుకొనడం తగునా? భక్తితో శ్రీ వేంకటేశ్వరుని సేవించేవారు తెలివిమాలి నీచులను సేవిస్తూ మెలగడం మంచిదా? కుత్సితబుద్ధి గలవారు సత్తువ గలదేదో, సత్తువ లేనిదేదో తెలుసుకోలేరు. తీయనినోటితో చేదుపదార్థం తినుట సాధ్యము కానట్లే శ్రీనివాసభక్తులు ఇతరములను కోరరని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| గరిమల నెరఁగరు | 279 | 456 | 3 | 307 |

అవ: తమోగుణప్రధానులైన వ్యక్తుల ప్రవృత్తి వర్ణిస్తున్నాడు.

**సీ. కటకటా ! యీ మాయ గడచుట యెట్టులో**
**కరివరదుని కృపాఘటనఁ గాక**
**ఇరవుగ జీవుల కెన్నెన్నియో యుండఁ**
**బరధనకాంతలే బలుప్రియములు;**
**సలుపంగఁ దగినట్టి సత్కర్మములు గల్గ**
**పాపకృత్యమ్ములే బహుసులభము;**
**తిన రుచ్యవస్తువుల్ తెందెప్ప లుండంగఁ**
**గాని పదార్థమే కడుమధురము;**

**తే. చదివి కడతేఱఁ దగినట్టి చదువులుండఁ**
**బాడుమాటలు వినుటయే పరమహితము;**
**వేంకటేశ్వరు డెదలోన వెలసియుండ**
**యక్ష రక్షస్సులే చవు లయిరి కడకు. 267**

అయ్యో! ఈ మాయను దాటు టెట్లు? గజరాజుకు వరాలిచ్చిన ఆ విష్ణువుయొక్క దయావిశేషం లేకపోతే అది సాధ్యం కాదు. తమకు స్థిరసుఖము లిచ్చునవి ఎన్నో ఉండగా పరుల ధనముమీద, పరకాంతలమీద ఎంతో వ్యామోహం కల్గి ఉంటారు. చెయ్యడానికి ఎన్నో మంచి కార్యాలుండగా పాపపుపనులే సులువుగా చేస్తారు. తినడానికి కమ్మని వంటకాలు కుప్పతిప్పలుగా ఉంటే చెరుపుచేసే పదార్థాలే వారికి ఇంపవుతాయి. జన్మసాఫల్యాన్ని కూర్చే చదువులెన్నో ఉండగా వాటిని వదలి బూతుమాటలు వినడమే మిక్కిలి మే లనిపిస్తుంది. శ్రీ వేంకటేశ్వరుడు తమహృదయంలో నుండగా వారికి కడకు యక్షరాక్షసులే ఉపాస్యదేవత లయినారు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కటకట యీ మాయ | 317 | 96 | 4 | 35 |

అవ: మాయామహిమను ఉగ్గడిస్తూ, శ్రీహరికి దాసానుదాసుడగుటే అధిక్యమునకు కారణ మనుచున్నాడు.

సీ. పురుషజంతువు లెల్లఁ బొరి నాఁడుజంతులఁ
దరవాయి గని వెంటఁ దవులుగాని
ధర నాఁడుజంతువుల్ పురుషజంతుల నెప్పు
డదియేమి మాయయో వెదకఁబోవు;
సారె కర్థములకు జనులెల్ల దాసులై
వెదకు చెప్పుడు తిరుగుదురు గాని
యా రీతి జనులకు నర్థముల్ దాసులై
యది యేమి మాయయో వెదకఁబోవు;

తే. ఇద్ది లోకమ్ము నడవడి; యిందుకెల్ల
లోనుగాకుంట యెక్కు డలోలబుద్ధి;
నధమపురుషుండు శ్రీశు దాసానుదాసుఁ
డైన నదియేమి మాయయో యధికుఁ డతఁడె. 268

మగ జంతువులు సమయంలో ఆడజంతువుల వెంట పడతాయి. అదేమి మాయయో కాని ఎప్పుడూ ఆడజంతువులు మగజంతువుల వెంటబడవు. మానవులు ధనానికి దాసులై మాటిమాటికి వెదకులాడుతూ తిరుగుతుంటారు. ఆ విధంగా ధన మెప్పుడూ జనానికి లొంగి వెదకబోదు. మాయామహిమ చెప్ప సాధ్యంకానిది గదా! లోకపుతీరు ఇటువంటిది. ఈ కాంతా కనకాదులకు లోనుగాకుండా ఉండే నిశ్చలమైన బుద్ధి గలవాడే గొప్పవాడు. అతడు నీచాతినీచుడై నప్పటికీ శ్రీనివాస దాసులకు దాసుడైతే అదేమి మాయయో గాని, గొప్పవాడవుతాడు. అనగా స్వామిదాస్యమే ఆధిక్యమునకు హేతువని తాత్పర్యం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పురుషుఁడే యధముఁడు | 323 | 134 | 4 | 90 |

అవ: విష్ణుమాయ దురతిక్రమ మని ఎరిగి ఆయనను భజిస్తూప్రాణులు కడతేరవలె ననుచున్నాడు.

**సీ. ఏల మాను శరీర మెప్పటి తన గుణం?**
**బెలయు నాసల మనసేల మాను?**
**ఱాలను దినుచ నేఱంగనేల మలిగండ్లఁ**
**బ్రజ విష్ణు భజియించి బ్రదుకవలదె?**
**పొమ్మన్నఁ బోవునే పూర్వకర్మమ్ములు?**
**పోవునే యింద్రియాల్ పొమ్మనంగ?**
**అవమ్ములో చెంబుకై వెదకఁగ నేల?**
**ప్రజ శౌరి సేవించి బ్రదుకవలదె?**

**తే. జన్మఫలము భోగింపక చనునె? తినుచుఁ**
**బిండికూరలో నలు పెంచు పిచ్చియేల?**
**వేగిరపడంగ నేల? శ్రీవేంకటేశు**
**మాయలివి ప్రజ హరిగొల్చి మనఁగ వలదె? 269**

ఈ శరీరం తన సహజగుణం ఎందుకు మానుకుంటుంది? పెరిగే ఆశలను మనసు వీడుతుందా? శరీర సహజగుణాన్నీ, ఆశలనూ త్రుంపనెంచడం రాళ్ళను తింటూ, మలిచి తీయదగిన రాళ్ళను ఏరడానికి పూనుకోవడం అవుతుంది. జనులు విష్ణుభజనంతో బ్రతుకవలెగదా? కడచిన జన్మల్లో చేసిన కర్మలనూ, ఇంద్రియాలనూ పొమ్మంటే అవి పోతాయా? వీటిలో తగులుపడినవాడు భగవద్భక్తుడు కావడం అనేది కుమ్మరిఆవంలో ఇత్తడిచెంబుకై వెదకడం వలె ప్రయోజనశూన్యం. కాబట్టి జనం విష్ణుసేవనంతో మనుగడ సాగించవలె. జన్మమెత్తిన పిదప కర్మఫలాలు అనుభవించక తీరదు. కర్మఫలానుభవంలో దోషా లెంచడం తెలికపిండి కూరలో నలుపున్న దన్నట్లు నిరర్థకం గదా ! తొందరపాటు మాని శ్రీనివాసుని మాయలివి అని ఎఱిగి ఆయన్నే సేవించి బాగుపడవలెను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మఱి విచారించ | 323 | 135 | 4 | 91 |

అవ: ఉక్తివైచిత్రితో శ్రీనివాసుని సంసారిగా, భోగిగా వర్ణిస్తున్నాడు.

సీ. **అతివల నిరువుర నాలింగనము సేయ**
**లోలుఁదౌటఁ గరాలు నాలుగాయె;**
**వేల పడంతుల వేడ్క రమింపఁ బా**
**ల్పడెఁగాన రూపముల్ బహుళమాయె;**
**పొలయల్క కూటమి భోగిగాన నొకొక్క**
**సమయమ్మునందు మాఱుమొగమాయె;**
**లలిత లావణ్య లీలావిగ్రహము గాన**
**కొలఁది వెట్టఁగరాని గోరులాయె;**

తే. **చిరతర సుఖానుభవి గాన శేషశిఖరి**
**పాలకుం డాయె; సంసారబద్ధచిత్తుఁ**
**దగుట సకలాంతరాత్మకుం డాయె స్వామి;**
**కామ మోహితు లెవ్వార లేమిగారు?** **270**

శ్రీదేవినీ భూదేవినీ కౌగిలించు కొనడంలో ఆశకలవాడు కనుకనే స్వామికి నాలుగుచేతు లయినాయి. పదారువేలమంది పత్నులకు భర్తయై ఏకకాలంలో అందరితో రమించడానికి పాల్పడినాడు కాబట్టి అతనికి పెక్కురూపము లయినాయి. ప్రణయ కోపంతో కూడిన సురతసుఖం అనుభవించేవాడు కనుక ఆయా సమయాలలో ఎడమొగం పెడమొగం కలవాడైనాడు. సుకుమారమైన సుందరమైన లీలామానుషరూపం కలవాడు కాబట్టి లెక్కలేనన్ని గోళ్ళుకలవాడైనాడు. ఎడతెగని సౌఖ్యాలు అనుభవించేవాడు కావడంచేత శేషాద్రిని పాలించే ప్రభువైనాడు. సంసారంలో సక్తమైన మనస్సు కలవా డగుటవల్ల సర్వప్రాణులకు అంతరాత్మయైనాడు. కామంచేత మోహం చెందినవారు ఎట్టివారైనాసరే ఏమయినా అవుతారు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తలఁపు కామాతురత్వము | 17 | 105 | 1 | 72 |

అవ: జీవుడు ఆశాపాశాలకు జిక్కి అలమటించి చివరకు శ్రీవేంకటేశుని దర్శించి శాంతి వహిస్తా డనుచున్నాడు.

సీ. మధుసూదనుని పెనుమాయఁ జిక్కినయట్టు
ఉవిదకౌఁగిటఁ జిక్కి యుంటిమయ్య !
తిరముగ కాలముల్ దిగమ్రింగినట్టుగ
నుప్పుప్పులు మ్రింగుచుంటిమయ్య!
జనని గర్భములోనఁ జిక్క మున్గినయట్టు
లొడ లెఱుంగని నిద్ర నుంటిమయ్య!
కడలేని కర్మసాగరములో నున్నట్టు
లొగి ధనమధ్యమం దుంటిమయ్య!

తే. పేదవాఁడు నిధిఁగని ప్రీతిమీఱ
బ్రదికినట్టులు ఫణిశైలపతిని గాంచి
తనిసినామయ్య ! మ్రొక్కెడు దైవతంబ
యతఁడె మా కంతరాత్మ తా నాయెనయ్య ! 271

మధువనే రక్కసుని మట్టు పెట్టిన విష్ణునియొక్క మాయకు వశులమైన విధంగా అంగనల కౌగిళ్ళలో చిక్కుకొని కాలం గడపినాము. అనగా కామదాసుల మైనా మనుట. కాలం అన్నిటినీ గ్రసించినట్లుగా తిండిపోతులమై రుచు లుట్టిపడే పదార్థాల నెంతగానో తిన్నాము. శిశువు తల్లిగర్భంలో ఇమిడియున్న మాదిరి ఒడలు తెలియని నిద్రలో మునిగినాము. తమోగుణప్రధానులమై యుంటి మనుట. అంతం లేని కర్మలనే సముద్రంలో నున్నట్లు ఇప్పుడు ధనరాశి మధ్యంలో మునిగితేలుతున్నాము; నిరుపేద పెన్నిధిని గాంచి మించిన ప్రేమతో మనినట్లు ఇప్పుడు శేషశైలేంద్రుని దర్శించి ఎంతో సంతృప్తి వహించాము? మా మ్రొక్కులు అందుకొనే దేవు డతడే. అతడే మా అంతరాత్మ.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏటి పరిణామము | 267 | 385 | 3 | 259 |

అవ: తనలోని శ్రీ వేంకటేశ్వరుని చూడ నెంచక మూఢు డెక్కడో విష్ణుని వెదకుతుంటా డనుచున్నాడు.

సీ. అక్కట ! హరిమాయ కగపడె జీవాత్మ

యెక్కువ తక్కువ లెంచలేఁడు;

ఎక్కడిదో దివినెంచి పుణ్యము సేయుఁ,

దన వ్రాఁతఫలమెందొ కనుఁగొనందు;

చక్కగ మఱునాటి చవులకై కూర్చు, మ్రిం

గిన కళ్ళ పులసరమ్మును దలపఁడు;

కప్పుకొనంగఁ గోకలకుఁ జేతులుసాఁచుఁ

దొలిఁ జించినవి యెన్నొ తెలియలేఁడు;

తే. మమత నిప్పటియాలిపై మనసు పెట్టుఁ
దలఁగిపోయిన వారలఁ దగులఁ జాల;
దల వికుంఠమ్ములో విష్ణు నరయఁ గోరు
నెదఁద వేంకటవిభుఁ జూడ నొదఁబడందు. 272

అయ్యో ! విష్ణుమాయకు లోనై జీవుడు హెచ్చుతగ్గులను తెలుసు కోలేడు. ఎక్కడో ఉండే స్వర్గాన్ని అపేక్షించి పుణ్యకార్యాలు చేస్తాడేకాని తన నొసటివ్రాతఫల మెక్కడో గ్రహించలేడు. రేపటికై రుచిగల పదార్థాలను సమకూర్చుకుంటాడే గాని తాను మ్రింగిన వంటకముల పులసరపు వాసనను గూర్చి ఆలోచించడు. వస్త్రాలకై చేతులు సాచుతాడే గాని గతంలో ఎన్ని కట్టిచించాడో గమనించడు. ఈ జన్మలోని ఆలిపై మనసుంచుతాడే గాని కడచిన జన్మల్లో కాపురంచేసి కడచన్నవారిని కలుసుకోలేడు. ఎక్కడో వైకుంఠంలో ఉండే విష్ణుదేవుని చూడగోరుతాడే గాని తన హృదయంలో వెలిగే వేంకటపతిని చూడగోరడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అక్కటా నీ మాయ | 236 | 206 | 3 | 138 |

అవ: గురుకటాక్షముచేత సత్త్వగుణం కలవారు సాధనచే స్వామి సాక్షాత్కారం పొందుతా రనుచున్నాడు.

**సీ. పొదలు పాపమ్మను పోడు నఱకి వేసి**
**మనసను చేను చదునుగ దున్ని**
**శాంత మ్మనెడి మంచిజడివాన పదనులో**
**హరిభక్తి విత్తుదు రమలగుణులు;**
**కామాదు లనియెడి కలుపు పెఱికివేసి**
**పెలుచ వైరాగ్యంపు వెలుగువెట్టి**
**వేమారు నాచారవిధి యెరువులు వేసి**
**జ్ఞానపుఁ బైరు పోషణ మొనర్తు;**

**తే. రేడఁ జూచిన శ్రీశుఁ డున్నాఁ డనియెడు**
**నందిన పొలమ్ము పంటల ననుభవించి**
**తాము తమవంటి శరణార్థితతులు గొంది**
**నిముడుకొందురు గురుకృప యెసక మెసఁగ. 273**

సత్త్వగుణం కలవారు మనసనే పొలంలో పాపాలనే పొదలను పెల్లగించి దూరంగా పారవేసి చదును చేసుకుంటారు. శాంతమనే వాన పదనులో హరిభక్తి అనే విత్తనాలను వెదజల్లుతారు. మనసులో పుట్టే కామక్రోధాదులు అనే కలుపును తీసి దూరంగా పారవేస్తారు. వైరాగ్యమనేకంచెను వేసుకొని పైరును కాపాడుతారు. వైరాగ్యయుక్తమైన మనసులో కామక్రోధాదులు జన్మించవన్నమాట. ధర్మమునకు జన్మస్థానమైన ఆచారము అనే ఎరువును పైరు ఎదుగుటకు వేస్తారు. ఈ విధంగా జ్ఞానమనే పైరును పెంపొందించుకుంటారు. గురుకృపాకటాక్షము వల్ల, సర్వం 'విష్ణుమయం జగత్' అను తలంపే ధాన్యముగా బడసి తామూ, తమవంటి శరణార్థులూ ఒకచోట కూడిమాడి అనుభవిస్తూ ఆనందిస్తారు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పంటల భాగ్యులు | 262 | 359 | 3 | 242 |

అవ: భగవత్కృపా పాత్రునకు కైవల్యము కరగత మనుచున్నాడు.

సీ. **అణురేణు పరిపూర్ణుఁ దవ్వలి మొగమైన**
**నణువౌను కమలభవాండ మేని;**
**ఫణిశయానుని కృప పరిపూర్ణముగ నున్నఁ**
**దృణమేని మేరుగిరీంద్ర మగును;**
**పురుషోత్తముని భక్తి పొరపొచ్చె మైనచో**
**నెరవులౌ తనసిరు లెన్నియేని;**
**హరిమీఁది చింత పాయక దృఢంబైనచోఁ**
**బట్టినదంతయుఁ బైఁడి యగును;**

ఆ. **మదన జనకుసేవ మదికిని వెగటైన**
**బహుళ పుణ్యములును బాపములగు;**
**వినుత వేంకటాద్రివిభు శరణాగతి**
**తుదిపదమున కెల్లఁ దొడవె యగును.** **274**

పిపీలికాది బ్రహ్మపర్యంతమూ చరాచరములందు నిండియుండే వృషభాద్రినాథుడు పెడమొగం పెడితే బ్రహ్మాండము కూడ అణువై ఎందుకూ కొఱగాని దవుతుంది. పాముపై పవ్వళించే ఆ పరమపురుషుని దయ పరిపూర్ణంగా ఉంటే గడ్డిపోచకూడ మేరుపర్వత మవుతుంది. కొఱమాలినది కూడ గొప్పదవుతుందని భావం. పురుషులలో శ్రేష్ఠుడగు విష్ణునందలి భక్తి కపటంతో కూడినదైతే తన సంపదలన్నీ ఎరువుతెచ్చుకొన్నవవుతాయి. తొలగిపోతా యనుట. హరిభక్తి నిశ్చలంగా వుంటే తాను పట్టినదెల్లా బంగార మవుతుంది. మన్మథునికి తండ్రియైన నారాయణుని సేవ మనసుకు వెగటయితే పుణ్యరాశి పాపరాశిగా మారిపోతుంది. ప్రసిద్ధి గల వేంకటాద్రినాథుని శరణాగతి పరమపదానికే అలంకార మవుతుంది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అన్నియును నతని | 3 | 20 | 1 | 13 |

అవ: యోగాభ్యాసరీతిలో తనలోని భగవంతుని దర్శించుటెట్లో వివరించు చున్నాడు.

**సీ. ఎల్ల చింతలుమాని యింద్రియాలు గుదించి**
**నిజశుద్ధ హృదయ నీరజమునందు**
**నంగుష్ఠమాత్రుఁడౌ హరి యడుగులక్రిందఁ**
**ద న్నణుమాత్రుగాఁ దలఁపవలయుఁ;**
**బలుదేహపుం గాళ్ళఁ బరుగులు వాఱక**
**లలి దేహగృహము లోపలికిఁ జొచ్చి**
**చలి వేఁడిఁ బొరలక శౌరిపాదమ్ముల**
**క్రిందటఁ దన్ను స్మరింపవలయు;**

**తే. నిచ్చలపు బత్తి శేషాద్రినిలయు చరణ**
**నళినముల క్రింద విన్నపమ్ముల నొనర్చి**
**కొనుచు తనుఁదానె భావించుకొనఁగ వలయు;**
**నాత్మ వెలుపల వెదకిన నరయుటెట్లు?** **275**

చీకు చింతలు వదలిపెట్టి. ఇంద్రియాలను నిగ్రహించి పరిశుద్ధమైన తన మనస్సనే పద్మంలో బొటనవ్రేలి పరిమాణంలో నుండే పరమాత్మ యొక్క పాదాలక్రింద తన్ను అణుస్వరూపునిగా భావించుకోవలెను. పలుశరీరాలకు చెందిన కాళ్ళీడ్చుకొంటూ ఎక్కడెక్కడికో పరుగులు దీయక తన దేహమనే ఇంటిలోనికి ప్రవేశించి శీతోష్ణాది ద్వంద్వబాధలకు గురికాక, ఆ దేవుని పాదాలక్రింద తా నున్నట్లుగా తలచుకోవలయును. నిశ్చలమైన భక్తితో ఆ శేషాద్రివాసుని తనయందున్న వానిగా భావించి ఆయన పాదపద్మాల క్రింద అణగిమణగి యుండి విన్నపాలు చేసుకుంటూ ఆత్మలో తన్ను దానే భావించుకోవలెను. బయట వెదకుటచే ఆత్మను దెలియ శక్యము గాదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వెలుపల వెదకితే | 144 | 198 | 2 | 133 |

అవ: నీచసేవలు నింద్యములనీ, భగవత్సేవయే కడతేర్చు నట్టి దనీ పలుకుచున్నాడు.

**సీ. కానలో మృగమేని కావచ్చునే గాని**
**గుణహీనులం జేరి కొలువc దగునె?**
**పక్షియై గూcటిలోc బడియుండc దగుcగాని**
**విడువ కెవ్వరినేని వేcడc దగునె?**
**పసరమై వెదలేని పాటొందc దగుcగాని**
**పురుషాధములనెల్లc బొగడcదగునె?**
**చెట్టుచేమగc బుట్టి గిట్టవచ్చును గాని**
**వీరి వారిని విసివించc దగునె?**

**తే. పుణ్యములు సల్పి యిల నేలcబోలుcగాని**
**శౌరికిని సేవకుండౌట శక్యమగునె?**
**తిరుమలేశుcడు కరుణతోc దేర్పకున్న**
**దుస్సహ దురంతకర్మముల్ ద్రోయనగునె? 276**

అడవిలో మృగంగా నైనా పుట్టవచ్చును గాని గుణం లేనివారిని సేవించవచ్చునా? సేవించ రాదనుట. పక్షిగా పుట్టి గూటిలో పడియుండ వచ్చునే గాని ఎంత గొప్పవారినైనా యాచించవచ్చునా? యాచించరాదనుట. పశువై జన్మించి మాచకమ్మ బ్రతుకు బ్రతకవచ్చు గాని నీచ మానవులను పొగడవచ్చునా? పొగడరాదనుట. చెట్టుగానో, చేమగానో పుట్టి నశించవచ్చు గాని అగపడినవారి నందరినీ అడుగుకొని విసిగించతగునా? తగదనుట. పుణ్యకర్మలు చేసి వాటి ఫలితంగా ఈ భూమికి ప్రభువు కావచ్చుగాని శ్రీ వేంకటేశ్వరునికి దాసు డగుట. సాధ్యమా? కాదనుట. కర్మయోగంవల్ల కాక భక్తియోగం వల్లనే స్వామిదాసత్వం సిద్ధించు ననుట. తిరుమలయ్య దయదలచి కాపాడకుంటే సహించరాని, కడలేని కర్మబంధాలు త్రెంచ శక్యమా? శక్యము కాదనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఛీ ఛీ నరుల | 32 | 397 | 1 | 266 |

అవ: గరుడాద్రినాథుని దర్శించక కర్మబంధాలు వదల వనుచున్నాడు.

**సీ. మనుజుండై ఫలమేమి మతి జ్ఞాన మదిలేక**
**తనువెత్తి ఫలమేమి దయ గలుగక**
**ధనికుండై ఫలమేమి ధర్మమ్ము చేయక**
**చదివియు ఫలమేమి శాంతిలేక**
**పెదవెత్తి ఫలమేమి ప్రియము వచింపక**
**జీవించి ఫలమేమి చింతపోక**
**మదిగల్గి ఫలమేమి మాధవుఁ దలఁపక**
**పరిశుద్ధి ఫలమేమి భక్తి లేక**

**తే. అంతరంగమ్ము హరికి సమర్పణమ్ము**
**గాక ముదిసి ఫలమ్మేమి శ్రీకళత్రు**
**గరుడశైలేంద్రుఁ గన్నులఁ గనక బహుళ**
**కర్మ నాగపాశమ్ముల కట్లువిడునె? 277**

జ్ఞానం లేకపోతే మానవుడై పుట్టి ఏమిఫలం? ఫలం లేదనుట. దయ లేకపోతే దేహం కల్గినందుకు ఫలమేమి? ధనవంతుడై ఉండికూడ ధర్మం చెయ్యకపోతే ప్రయోజనమేమి? శాంతగుణం లేకపోతే చదువులవల్ల ఉపయోగ మేమి? ప్రియంగా మాటాడకుండ పెదవి విప్పి ఏవేవో వదరడం వల్ల ప్రయోజన మేమిటి? భగవచ్చింతన లేకపోతే బ్రతికి ఏమి ఫలం? మాధవుని స్మరించనపుడు మనసున్నందుకు లాభ మేమి? తానెంత శుచి యయినా భక్తి లేనిచో ఏమి ఫలం? హృదయాన్ని హరికి సమర్పించక ఎంత ముసలితనం వచ్చినా ఏమి ఫలం? గరుడాద్రి నాథుని కన్నులార సేవించక పోతే నానా విధములైన కర్మబంధాలనే నాగపాశాల కట్లు ఊడుతాయా? ఊడవని భావం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అంతరంగ మెల్లా | 89 | 437 | 1 | 293 |

అవ:జగన్నాటక సూత్రధారి వేంకటవిభుడు జీవులను పలు విధముల నాడించి చివరకు కడతేర్చు ననుచున్నాడు.

**సీ. తనియ కొరుల చక్కఁదనమె చూచును గాని,**
**తన భావముఁ దలంపఁ దలఁపుగొనఁడు;**
**పలుకునే గాని యౌవనపు సుద్దులు, తన**
**వయసుపోవుట రవంతయుఁ దెలియఁడు;**
**దైవమ్ముపైఁ బెట్టు దారుశిలాబుద్ధి,**
**లీ రీతిఁ దన దేహ మెంచుకొనఁడు**
**ఊరివార్తల నెల్ల నుగ్గడించును గాని,**
**తన జన్మగాథలఁ దడవఁ డెపుడు;**

**తే. వేడ్క నిక్షేపముల నెల్ల వెదకఁగోరు**
**నాత్మనిక్షేప మరయంగ నభిలషింపఁ;**
**డిట్టు లాడించి జీవుని, కట్టకడకు**
**గట్టు సేర్చు దేవుండు వేంకటవిభుండె.** **278**

మానవుడు తృప్తి పొందక పరుల అందాన్ని చూస్తాడే గాని తన స్వభావాన్ని గూర్చి ఆలోచించవలెననే ఆలోచనయే లేకుంటాడు. తన యౌవనానికి సంబంధించిన కథలు ముచ్చటిస్తాడేగాని వయసు గడచి పోవడం గమనించడు. కనబడే ఈ దేవు ళ్ళందరూ కర్రతో, రాతితో చేయబడ్డ వారనే బుద్ధితో ఉంటాడే కాని తన దేహం దేనితో నిర్మితమైనదో ఆలోచించడు. ఊరిలోని కొరమాలిన సంగతుల గూర్చి ప్రసంగిస్తాడే కాని తన పుట్టుకకు కారణములైన విషయాలను స్మరించడు. అక్కడక్కడ నిధులనూ, నిక్షేపాలనూ, వెదకుతాడేగాని తనలోనున్న నిధిని (దేవుని) వెదకడానికి ప్రయత్నించడు. వేంకటేశ్వరుడే జీవుని ఈ విధంగా ఆడించి చిట్టచివరకు గట్టు(ఉత్తమగతి) చేరుస్తాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| సకలమైన హరికి | 144 | 196 | 2 | 131 |

అవ: శ్రీనివాసుని వినుతించి బ్రతుకుట ఎంతో మే లనుచున్నాడు.

**సీ. కలఁడు సర్వేశుఁడొక్కం డందఱకు దిక్కు**

**సులభుండు శరణమ్ముఁ జొరఁగఁ గాచుఁ**

**పలుతపమ్ములు సేసి పలుపాట్లు పడనోప**

**మతని నమ్మి బ్రదుకు టదియ మేలు;**

**ఉన్నాఁడు మనసులో నొకచో వెదకవద్దు**

**భావింప నిహమును బరము నిచ్చుఁ;**

**గన్నచోట్ల వెదకి కదు నలయఁగ నోప**

**మతని గొల్చి బ్రదుకు టదియ మేలు;**

**తే. చేరి నిలుచున్నవాఁడు శ్రీశేషశిఖరి**
**నెలమి సేవింపఁ జేకొని యేలు నితఁడు;**
**దేవతలఁ బ్రార్థనలు చేసి తెలియనేర**
**మితని వినుతించి బ్రదుకుట యెంతొ మేలు. 279**

అందరికి దిక్కైన సర్వేశ్వరు డొక్కడే. అతడు సర్వసులభుడు. శరణంటే కాపాడేవాడు. అనేక విధాలైన తపస్సులు చేసి మనం కష్టపడలేము. ఆ శ్రీశుని నమ్మి జీవించడమే మంచిది. దేవుని ఇక్కడక్కడ వెదకనక్కరలేదు. అతడు మన మనస్సులలోనే ఉన్నాడు. అతడే ఇహపరముల నిస్తాడు. పలుతావులలో ఆయనకొరకు దేవులాడుతూ శ్రమపడలేము. అతనిని సేవించి మనుటయే మంచిది. ఆ దేవుడే శ్రీవేంకటేశ్వరుడుగా శేషాచలంమీద నిలిచియున్నాడు. ప్రీతితో కొలిస్తే స్వీకరించి కాపాడగలడు. కలియుగ ప్రత్యక్ష దైవమైన ఈ వేంకటేశ్వరుణ్ణి వదలి ఇతరదేవతలను ప్రార్థించలేము. ఈ దేవుని స్తుతించి బ్రతుకుట చాల మంచిది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తొల్లిటి వారు | 324 | 138 | 4 | 93 |

అవ: లాభ నష్టములు ఎవని మాయలో అట్టి పరమేశ్వరుని ధ్యానమే కర్తవ్యమనుచున్నాఁడు.

**సీ. నారికేళమునకు నీరువచ్చిన యట్టు**
**తనకు రాఁగల మేలు తానెవచ్చు;**
**లలి నేన్గుదిన్న వెలఁగపండ్ల యట్టులు**
**తనకుఁ బోఁగల వెల్లఁ దామె పోవు;**
**నిలువుటద్దమ్ములో నీడ లేర్పడినట్టు**
**దండిగా పుట్టువుల్ తామెవచ్చు;**
**పండ్లు తొడిమవీడి పడ్డట్టు మరణముల్**
**తప్ప కందఱకును తామె వచ్చు;**

**ఆ. కుండ బండ నిడఁగఁ గుదు రేర్పడిన యట్టు**
**తన్నుఁ దానె తలఁపఁ దలఁపు నిలుచుఁ;**
**దిరుమలేశుఁ జూచి శరణన్న పాపాలు**
**మంచు విరిసినట్టు మాయమవును. 280**

టెంకాయలోనికి నీరువచ్చినట్లే రాగల మేలు తనంతటతానే వచ్చి తీరుతుంది. కరిమ్రింగిన వెలగపండులాగా పోగలకాలం దాపురించినప్పుడు సంపద తనంతటతానే పోతుంది. నిలువుటద్దంలో నీడలేర్పడ్డట్లుగా జన్మలు తమంతట తామే వస్తాయి. తొడిమనుండి ఊడి పండ్లు రాలిన విధంగా ప్రతివారికి మృత్యువు సహజంగా వస్తుంది. బండమీద కుండ నుంచగా ఉంచగా కుదురు ఏర్పడ్డట్లు తన్ను గూర్చి ఆలోచించగా ఆలోచించగా తలంపు ఆగిపోతుంది. తిరుమలేశుని దర్శించి శరణంటే పాపాలన్నీ సూర్యోదయ మయినంతనే మంచు మాదిరిగా మాయమై పోతాయి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఇందుకుఁ జింతించ | 134 | 140 | 2 | 94 |

అవ: శ్రీనివాస దాసులకు దప్ప మరెవ్వరికీ ఎక్కడా శాశ్వతసుఖం లేదని ఉద్బోధిస్తున్నాడు.

**సీ. సురల కసురులకు సూదు బాదే కాని**
**ప్రీతిమై సుఖియించు వ్రాంత లేదు;**
**ధరలోన ఋషులకు తపము సేయనె కాని**
**భోగింప నిసుమంత ప్రొద్దు లేదు;**
**ఘనసిద్ధులకు నైన గంత బొంతయె కాని**
**చేతఁ బరుస ముండి సెలవు లేదు;**
**రెక్కలపక్షికి రేసు త్రిమ్మటె కాని**
**వైకుంఠమున కేగు వలను లేదు;**

**తే. శాశ్వతానంద సంప్రాప్తి జంతుకోటి**
**కే భువనమందు నున్న నొక్కింత లేదు;**
**శ్రీనివాసుని దాసులే స్థిరసుఖమ్ము**
**లందుదురు, పునర్భవదుఃఖ మందఁబోరు.** **281**

దేవతలకూ రాక్షసులకూ ఎప్పుడూ ఎడతెగని విరోధమేగాని వారికి సంతోషంతో సుఖించే గీతలేదు. ఇలలో ఋషులకు ఎప్పుడూ తపస్సు చేయనేగాని భోగ మనుభవించడానికి సమయం లేదు. గంతబొంతదప్ప గొప్ప సిద్ధపురుషులకు చేతిలో పరుసవేది ఉండి కూడా ఉపయోగం లేదు. రెక్కలుగల పక్షి చులకనగా గగనానికి ఎగురుతుందే గాని వైకుంఠానికి వెళ్ళగల వీలు దానికి లేదు. పుణ్యకార్యాలు సలపడంవల్ల ప్రాణికోటి ఆ యా లోకాలకు చేరినప్పటికీ అక్కడ శాశ్వతానందం లభించదు. శ్రీనివాసుని దాసులే శాశ్వతానందమును పొందగలరు. వారు మరల జన్మించుట అనే దుఃఖమును చూడబోరు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏ లోకమందు | 115 | 89 | 2 | 60 |

అవ: జీవుడు దేవునకు జరుపు ఆరాధనావిధాన మెట్టిదో అభివర్ణిస్తున్నాడు.

**సీ. తన యాత్మలోని యంతర్యామికిన్ గుడి**
**తనదు శరీరమే; తలయె శిఖర;**
**మెంచంగఁ బీఠమ్ము హృదయమే; చూపులు**
**పార్శ్వదీపమ్ములు; పలుకె మనువు;**
**గణగణమను పిడిఘంట తనదు నాల్క;**
**నై వేద్యముల్ నిజ నవ్యరుచులు;**
**అమరిన యూర్పులే యాలవట్టంబులు;**
**పొడమెడు పులకలే పూలసరులు;**

**తే. కలిత చిత్తరాగమె చంద్రకావి వలువ;**
**సత్త్వగుణమె ధూపమ్ముగా సవదరించు**
**జీవుఁ డతిభక్తి ప్రత్యక్షదైవమునకు**
**సత్యశేషాద్రివిభునకు నిత్యపూజ. 282**

తన ఆత్మలోనే శ్రీహరి ఉన్నాడు. ఆయనకు ఈ శరీరమే గుడి. తన తలయే ఆలయశిఖరం. ఆలోచించగా తన హృదయమే పీఠం. తన రెండు కన్నులూ అతనికి ఇరువైపుల నుండే రెండుదీపాలు. తన మాటయే మంత్రం. తన నాలుకయే గణగణమని మ్రోగే చేగంట. తను తినే ఆహారమే ఆ అంతర్యామికి నై వేద్యం. తన ఉచ్ఛ్వాస నిశ్వాసములే ఆయనకు వేసే వింజామరలు. భక్తి పారవశ్యంచేత తనకు కలిగే గగురు పాటే ఆయనకు పూలదండలు. తన మనసులోని అనురాగమే ఆ దేవుడికి సమర్పించే చెంగావి వలువ. తన సాత్త్వికగుణమే ధూపం. జీవు డీ విధంగా ప్రత్యక్షదైవమైన సత్యుడైన శేషగిరీశ్వరునకు నిత్యపూజ నిర్వర్తిస్తుంటాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నిత్యపూజ | 114 | 82 | 2 | 55 |

అవ: శ్రీనివాసునిదక్క తక్కిన దేవతల గొల్చి ఫలము లేదను చున్నాడు

**సీ. ముదమున నొక భ్రాని మొదలఁ బోసిన నీరు**
**కొనకెక్కి ఫలములం గూర్చుఁ గాక**
**ఆదిమూలమ్మగు నచ్యుతు సేవింప**
**కన్యదైవముఁ గొల్వనగునె సిద్ధి?**
**తల్లి భుజించిన దెల్ల గర్భములోని**
**శిశువున కొదవి పోషించుఁగాక !**
**ఉల్లమందలి శౌరి కొసఁగని పూజలు**
**వఱుతఁ గల్పిన చింతపండు గావె?**

**ఆ. అతఁడు శ్రీకళత్రుఁ డన్నియు నిచ్చుగా**
**కితరులను భజింప నేమి లాభ?**
**మెచటినుండి పడిన నిలయె యాధారమౌ**
**కరణి కొండలయ్య శరణు మనకు. 283**

సంతోషంతో చెట్టుమొదట బోసిన నీరు కొమ్మలకు రెమ్మలకు ప్రాకిఫలముల నిస్తుంది. అట్లే అఖిల దేవతలకు ఆదిమూలమైన హరిని సేవించకుండ ఇతరదేవతలను కొలిస్తే సిద్ధి అవుతుందా? కాదని భావం. తల్లితినే ఆహారమంతా కడుపులోని బిడ్డకు లభించి పోషిస్తుంది. అట్లే మనసులో నుండే దేవునికి చేయని పూజలు ప్రవాహంలో కలిపిన చింతపండువలె నిష్ఫలముకదా? అతఁడు లక్ష్మీదేవి భార్యగా కలవాడు గాన సర్వము అనుగ్రహించుటకు సమర్థుడు. ఇతరులను ప్రార్థించడం వల్ల లాభమేమి? లేదని భావం. ఎక్కడనుండి పడిననూ చివరకు భూమియే ఆధారమన్నట్లు శ్రీ వేంకటేశ్వరుఁ డొక్కడే శరణం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| అతఁడు లక్ష్మీకాంతుఁడు | 310 | 59 | 4 | 40 |

అవ: భగవన్నామ సంస్మరణం చేతనే శారీరక మానసిక బాధలన్నీ శమిస్తాయనుచున్నాడు.

**సీ. వేరు వెల్లఁకు లేల? వేదమంత్రము లేల?**
**పరమౌషధము మాకు స్మరగురుండు;**
**హరి యచ్యుతా యన్న నణఁగు కిల్బిషములు**
**కమలాక్ష యనిన దుఃఖములు తొలఁగుఁ;**
**బురుషోత్తమా యన్న పుండ్లు బూచులు మాను**
**నరసింహ యనిన బంధములు వదలు;**
**వాసుదేవా యన్న వంతలు వాయును**
**శ్రీసతీశ యనిన చింత లుడుగుఁ;**

**తే. బరఁగ గోవింద యనిన సంపదలు పొదలు;**
**మురహరా యన్న నిహపరమ్ములు లభించు;**
**సొగసి మాధవ యన దేహసుఖము గలుగు;**
**శేషగిరిపతి మాకు సిద్ధౌషధమ్ము. 284**

మన్మథుని తండ్రియైన శ్రీనివాసుడే మాకు మంచిమందు. ఆయన యొక్క స్మరణ ఉండగా ఇక మందుమాకులు, వేదమంత్రాలు నిరుపయోగాలు, హరి, అచ్యుత అంటే పాపాలు పటాపంచ లవుతాయి. కమలాక్ష అంటే దుఃఖాలు తొలగి పోతాయి. పురుషోత్తమా అంటే పుండ్లు బూచులు మాయ మవుతాయి. నరసింహా అంటే బంధాలు ఊడిపోతవి. వాసుదేవా అంటే బాధలు, పరితాపాలు పరువెత్తిపోతాయి. శ్రీసతీశా అంటే చింతలు చెదరిపోతాయి. గోవిందా అంటే సంపదలు కుదురుకుంటాయి. మురహరా అంటే ఇహపరసుఖాలు కలుగుతవి. మాధవా అంటే శరీరారోగ్యం చిక్కుతుంది. కనుక శేషాద్రినాథుడే మాకు (భక్తులకు) సిద్ధౌషధం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| వెడమంత్ర మిఁక | 93 | 461 | 1 | 309 |

అవ: తన్ను దాను సంస్కరించుకొనక ఇతరుల లోపా లెన్నుట తగదని పలుకుతున్నాడు.

**సీ. ఒరుల దూషించెద, నొక్కమాతేని నా**
**దురితకర్మమ్ముల దూఱఁ బోను;**
**పరుల నవ్వుదుఁగాని, పలు యోనికూపాల**
**నరకపు నా మేను నవ్వుకొనను;**
**లోకులఁ గోపింతు, లోపలి కామాది**
**వైరులమీఁదఁ గోపమ్ము గొనను;**
**అదరి బుద్ధులు సెప్పి యన్యుల బోధింతు**
**నాత్మలోఁ గల హరి నరయలేను;**

**తే. పరుల దుర్గుణాలకు రోఁతపడెదఁ గాని**
**మదినిగల యాస లెన్నఁడు మానలేను;**
**గతిగ శ్రీవేంకటేశ్వరుఁ గని బ్రదికితి**
**నతని మహిమ లిన్నాళ్లు నే నాత్మఁ దలఁప. 285**

ఇతరులను దూషిస్తానే గాని ఒకసారైనా నా పాపకర్మలను నిందించను. ఇతరులను హేళన చేయుదునే గాని పలుగర్భ నరకాలలోపడి పాప భూయిష్ఠమైన నా శరీరాన్ని నేను హేళన చేసుకోను. ఇతరులపై కినుక వహిస్తానే గాని నాలో దాగిన కామక్రోధాదులైన విరోధులపై కోపించలేను. ఇతరులకు బుద్ధులు గఱపుదునే గాని నా ఆత్మలో నుండే హరిని తెలుసుకోలేను. ఇతరులందున్న చెడుగుణాలను చూచి రోతపడుదునే గాని నాలో నున్న ఆసలను వదలలేను. శ్రీవేంకటేశ్వరుని మహిమలను ఇన్నాళ్లు తలంచలేదు. ఇప్పు డత డెట్టివాడో తెలుసుకొని అతనిని పరమగతిగా నమ్మి బ్రతికినాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| చదివితిఁ దొల్లి | 313 | 74 | 4 | 50 |

అవ: శ్రీవేంకటేశ్వరు డొక్కడే తనకు పతి, గతీ అనుచున్నాడు.

**సీ. సర్వాత్మభావన సమకొన్న పిమ్మట**
**నుర్వి నేరికి మ్రొక్కకుండ రాదు;**
**వదల కిన్నింట శ్రీవల్లభుం డున్నను**
**చిత్త మన్నిటియందు హత్తుకొనదు;**
**ఎటుగన్న ప్రాణుల కిన్ని యాచారాలె**
**యొగి వానిఁ గొని చేయకుండరాదు;**
**మక్కువ నివి హరిమతములే యైన నే**
**నొదఁబడను ప్రపత్తి యొకఁడు దప్పఁ;**

**తే. గొందఱకుఁ దీపిపులుపులఁ గోర్కి గలుగు;**
**సోమరికి నాకు నిన్నిటఁ జొరదు తలఁపు;**
**దైవములె యందఱును, గొల్వఁ దగినవారె**
**కాని, వెంకన్నయే నాకు గతియుఁ బతియు. 286**

సకలమునందు భగవంతు డున్నాడనే భావంకలిగిన పిమ్మట అందరికీ మ్రొక్కవలసినదే. ఆ నమస్కారం జీవాంతర్యామియైన దేవునికే చెందుతుంది. అఖిలమునందు సదా శ్రీహరి యున్నప్పటికినీ నా మనస్సు ఆ యన్నింటిలో లగ్నం కాదు. పలువురకు పలురకాలైన ఆచారాలుంటాయి. అవన్నీ పాటించదగ్గవే. అందరికీ నమస్కరించడం, ఆచారాలన్నీ పాటించటం హరిమతములే అయినప్పటికీ నాకు మాత్రం శరణాగతి మిక్కిలి ఇష్టమైనది. లోకో భిన్నరుచిః అన్నట్లు కొందరికి తీపి ఇష్టం. మరికొందరికి పులుపు ఇష్టం. అట్లే పలువురు పలువిధాల భగవత్ప్రాప్తికి ప్రయత్నిస్తారు. కానీ నేను భగవత్ప్రాప్తికి ప్రపత్తియే ముఖ్యసాధన మంటాను. నేను సోమరిపోతును. నానామార్గాలలో నా మనసు చొచ్చుకోదు. ఇతర దైవాలు ఎందరో ఉన్నారు. వారందరూ కొలువ దగినవారే. కాని నాకు శ్రీవేంకటేశ్వరు డొక్కడే పతి. అతడే నాకు గతి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| ఏమన వచ్చును | 28 | 14 | 4 | 370 |

అవ:సంస్కృతములో రామచరితము సంగ్రహాముగా వర్ణిస్తున్నాడు.

**సీ. దశరథతనయాయ, తాటకాదమనాయ,**

**కుశికసంభవ యజ్ఞగోపనాయ,**

**శివచాప దళనాయ, సీతామనోవల్ల**

**భాయ, భార్గవగర్వభంజనాయ,**

**సత్యధర్మరతాయ, జనక వాక్పాలాయ,**

**ఖరదూషణాద్యరి ఖండనాయ,**

**భానుపుత్రహితాయ, వాలిప్రమథనాయ,**

**పావనాయ, శరధిబంధనాయ,**

**తే. లాలితవిభీషణాయ, లీలానరాయ**
**నిహత దశకంధరాయ, నందిత సురాయ,**
**మునిశరణ్యాయ, సాకేతపురవరాయ,**
**శ్రీనివాసాయ, రఘుపతయే నమో ఽస్తు. 287**

దశరథమహారాజునకు కుమారుడు, తాటక అనే రక్కసిని చంపినవాడు, విశ్వామిత్రుని యాగమును కాపాడినవాడు, శివునివిల్లు విరచినవాడు, సీతకు ప్రాణవల్లభుడు, పరశురాముని గర్వ మణచినవాడు, సత్యధర్మములం దాశ కలవాడు, తండ్రిమాటను పాలించినవాడు, ఖరదూషణాది శత్రువులను ఖండించినవాడు, సూర్యుని కుమారుడైన సుగ్రీవునికి మిత్రుడు, వాలిని కూల్చినవాడు, పవిత్రుడు, సముద్రాన్ని బంధించినవాడు, విభీషణుని లాలించినవాడు, లీలా మానుష విగ్రహుడు, రావణుని సంహరించినవాడు, దేవతల నానందింప సినవాడు, మునులకు రక్షకుడు, సాకేతనగరానికి ప్రభువు అయిన శ్రీవేంకటేశ్వరుడు అనే రఘునాయకునకు నమస్కారం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| రాజీవనేత్రాయ | 157 | 273 | 2 | 183 |

అవ: శ్రీనివాసుని సంస్కృతంలో స్తుతించుచున్నాడు.

**సీ. కేశవాత్పర మహం కించి న్నజానామి**
**సర్వాంతరాత్మనే, సప్తశైల**
**నిత్యనివాసాయ, నిరుపమానందాయ,**
**నిగమాంతవేద్యాయ, నిర్మలాయ,**
**భవబంధహరణాయ, భక్తమందారాయ,**
**విశ్వరూపాయ, జీవేశ్వరాయ,**
**కలిదోష విధ్వంసకా, యాచ్యుతాయ, ద**
**యాసాగరాయ, కాలాత్మకాయ,**

**తే. శ్రీవధూటీ ధరాసతీ సేవితాయ,**
**పాలితాఖిలలోకాయ, పరమపూరు**
**షాయ, మౌనిప్రియాయ, నారాయణాయ,**
**వేంకటేశాయ మమ గురవే నమో ఽస్తు. 288**

కేశవునికన్న ఇతరము దేనినీ ఎరుగమ. సర్వమందు అంతరాత్మగా ఉండువాడును, ఏడుకొండలపై సర్వదా నివసించునట్టివాడును, సాటిలేని ఆనందస్వరూపుడును, వేదాంతముల(ఉపనిషత్తుల) చే ఎఱుగదగిన వాడును, పరిశుద్ధుడును, సంసారబంధాలను హరించేవాడును, భక్తులకు కల్పవృక్షం వంటివాడును, ప్రపంచ స్వరూపుడును, జీవులకు ఈశ్వరుడైనవాడును,కలిలో కలిగే దోషాలను నిర్మూలించేవాడును, చ్యుతిలేనివాడును, దయకు సముద్రంవంటి వాడును, కాలస్వరూపుడును, శ్రీ భూదేవులచే సేవించబడువాడును, సకలలోకాలను కాపాడువాడును, క్షరాక్షరులకంటె ఉత్తముడైన పురుషుడును, నారదాదిముని ప్రియుడును, నారాయణుడును, నాకు గురువును అగు శ్రీ వేంకటేశ్వరునకు నమస్కారం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కిన్నజానేహం | 114 | 83 | 2 | 56 |

అవ: శ్రీ వేంకటేశ్వరుని సగుణస్వరూపాన్ని సంస్కృతములో సంభావిస్తున్నాడు.

**సీ. అక్షీణ విజ్ఞానదక్ష యోగీంద్ర సం**
**రక్షాదయేక్షణా, యాక్షరాయ,**
**నిత్యాయ, విబుధసంస్తుత్యాయ, శోభన**
**కృత్యాయ, సత్యాయ, కేవలాయ,**
**తరుణేందుకోటీర తరుణీ కృతస్తోత్ర**
**పరితోషచిత్తాయ, పావనాయ,**
**కరిరాజవరదాయ, కౌస్తుభాభరణాయ,**
**మురవైరిణే, జగన్మోహనాయ,**

**తే. శుక్రశిష్య వినిర్మూలన క్రియాయ,**
**శక్రముఖ దేవ భయభంగ విక్రమాయ,**
**పక్షివాహాయ, శ్రీవత్సలక్షణాయ,**
**శ్రీనివాస పరబ్రహ్మణే నమోఽస్తు.** **289**

తరుగులేని విజ్ఞానంచేత నిపుణులైన యోగిశ్రేష్ఠులను రక్షించే దయామయములైన చూపులు కలవాడును, నాశరహితుడును, నిత్యుడును, దేవతలచే స్తోత్రం చేయదగ్గవాడును, మంగళకరములగు పనులు చేయువాడును, సత్యస్వరూపుడును, కేవలుడును, పార్వతిచే చేయబడిన స్తుతులచేత సంతోషించిన మనస్సుకలవాడును, పవిత్రుడును, గజరాజునకు వరాలిచ్చిన వాడును, కౌస్తుభమణి ఆభరణముగా కలవాడును, ముర డనే రాక్షసుని సంహరించినవాడును, రూపముచే జగత్తును మోహింపజేయువాడును, శుక్రాచార్యుని శిష్యుడగు బలిని అడుగంటజేసిన వాడును(శుక్రాచార్యుల శిష్యులగు రక్కసులను సంహరించిన వాడును అనియు), ఇంద్రాది దేవతల భయాన్ని పోగొట్టగల్గిన పరాక్రమం కలవాడును, గరుడుడు వాహనంగా కలవాడును, శ్రీవత్సమనే మచ్చగల వాడును, పరబ్రహ్మ స్వరూపుడగు శ్రీనివాసునకు నమస్కారము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నమో నారాయణాయ | 44 | 269 | 1 | 180 |

అవ: శ్రీనివాసుని బహుభంగుల గీర్వాణభాషలో కీర్తించుచున్నాడు.

**సీ. మురహారాయ, పరమపురుషాయ, నిజభక్త**
**సులభాయ, సుముఖాయ, సువ్రతాయ,**
**మృగనరాంగాయ, పన్నగరాజశయనాయ,**
**దురితదూరాయ, సింధుర హితాయ,**
**నగసముద్ధరణాయ, నందగోపసుతాయ,**
**భావనాతీతాయ, భావనాయ,**
**దేవదేవేశాయ, దివ్యచరిత్రాయ,**
**జితదైత్యనికరాయ, చిన్మయాయ,**

**తే. పూర్ణకామాయ, కారుణ్యభూషణాయ,**
**నళినదళలోచనాయ, జనార్దనాయ**
**రఘుకులాబ్ధిసోమాయ, పరాత్పరాయ,**
**వేంకటేశాయ, భూవిభవే నమోఽస్తు.** **290**

మురుడనే రాక్షసుని చంపినవాడు, పరమపురుషుడు, తనభక్తులకు అందుబాటులో నుండేవాడు, ప్రసన్నుడు. మంచి నియమములు కలవాడు, నరసింహావతారమును ధరించినవాడు, ఆదిశేషునిపై పవళించువాడు, పాపము లంటనివాడు, గజేంద్రుని కాపాడినవాడు, గోవర్ధనపర్వతాన్ని ఎత్తినవాడు, నందుడనే గోపకుని కుమారుడు, భావించుటకు సాధ్యము కానివాడు, భావనుడు, దేవదేవులకు ప్రభువైనవాడు, దివ్యమైన చరిత్ర కలవాడు, రాక్షసుల సమూహము నంతా జయించినవాడు, జ్ఞాన స్వరూపుడు, అన్నికోరికలు తీరినవాడు, దయయే అలంకారముగా కలవాడు, తామరరేకులవంటి కన్నులు కలవాడు. జనులచేత కోరబడువాడు, రఘువంశమనే సాగరమునకు చంద్రుడైనవాడు, పరాత్పరుడు, భూదేవికి భర్త అయిన శ్రీ వేంకటేశ్వరునకు నమస్కారము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| జడమతి రహం | 96 | 481 | 1 | 322 |

అవ: సంస్కృతములో స్వామిని స్తోత్రించి నమస్కరించుచున్నాడు.

**సీ. ధరణీసతీ ఘనస్తనశైలపరిరంభ**
**సంభృతానందాయ, శాశ్వతాయ,**
**సరసిజ వాసినీ సరసప్రణామయు**
**క్చరణయుగ్మాయ, విశ్వంభరాయ,**
**సత్యభామాగండ సంశోభి మకరికా**
**విరచనానిపుణాయ, సురహితాయ,**
**దివిజాధిప కిరీట దివ్యరత్నాంశు సం**
**దీప్తాంఘ్రికమలాయ, నిర్మలాయ,**

**తే. పార్వతీస్తోత్రతుష్టాయ, భానుచంద్ర**
**లోచనాయ, మహాఘౌఘమోచనాయ,**
**వేంకటాచలశృంగాగ్ర విహరణాయ,**
**నందతనుజాయ తే నమో నరసఖాయ. 291**

భూదేవి ఘనమైన కుచములను ఆలింగనం చేయుటచే అధికంగా ఆనందించువానికీ, శాశ్వతునకూ, లక్ష్మీదేవియొక్క సరసములైన నమస్కారములతో కూడిన పాదయుగం కలవానికీ, ప్రపంచమును భరించువానికీ, సత్యభామయొక్క చెక్కిళ్ళపై ప్రకాశించే మకరికాపత్రములు వ్రాయడంలో సమర్థుడైనవానికీ, దేవతలకు మేలుచేయువానికీ, అమరాధీశ్వరుడైన ఇంద్రుని కిరీటములోని దివ్యరత్నాల కాంతులతో ప్రకాశించే పాదపద్మాలు కలవానికీ, సూర్యచంద్రులే కన్నులైనవానికీ, మిక్కుటమైన పాపాలరాశిని వదిలించేవానికీ, వేంకటాచల శిఖరాగ్రంమీద విహరించే వానికీ, నందగోపతనయుడూ, నరసఖుడూ అయిన శ్రీ వేంకటేశ్వరా ! నీకు నమస్కారం.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| నమో- నారాయణాయ నమః | 40 | 245 | 1 | 164 |

అవ: సంస్కృతభాషలో భగవంతుని స్తుతిస్తున్నాడు.

**సీ. నిగమాగమాంతవర్ణిత మనోహరరూప !**
**దశదిశాపరిపూర్ణ ! దైత్యదమన !**
**దురిత నివారణ! దుఃఖవినాశన !**
**భవబంధమోచన ! పరమపురుష!**
**ఘన ఘనాఘన వర్ణ ! కారుణ్యసాగర !**
**సర్వ సర్వంసహా సార్వభౌమ !**
**రాజీవనేత్ర ! ధర్మధురీణ ! వైకుంఠ!**
**సనకాదిసేవిత చరణపద్మ!**

**తే. శేషగిరివాస! పీతకౌశేయవసన!**
**పావనచరిత్ర! కేకిపింఛావతంస!**
**జగదవనకృత్య ! భక్తవత్సల ! పరేశ!**
**నమితసురలోక! తే శరణం గతోఽస్మి.** **292**

ఉపనిషత్తులచే కీర్తింపబడిన రమ్యమగు అకారముగలవాడా! పది దిక్కులందు నిండినవాడా! రాక్షసులను సంహరించినవాడా! పాపములను పోగొట్టువాడా! దుఃఖాలను నశింపజేయు నట్టివాడా! సంసారమనే బంధమును వదలించునట్టివాడా ! ఓ పరమపురుషా! దట్టమైన మేఘమువంటి శరీరము గలవాడా! దయకు సముద్రమైనవాడా ! సకల ప్రపంచమునకు చక్రవర్తియైనవాడా! పద్మములవంటి కన్నులు గలవాడా! ధర్మరక్షకుడా! వైకుంఠుడా! సనకుడు మున్నుగాగల దేవర్షులచే సేవింపబడిన పాద పద్మములు కలవాడా! శేషగిరిపై నివసించేవాడా! పచ్చని పట్టుపుట్టము ధరించినవాడా! పవిత్రమైన నడవడి గలవాడా! సిగలో నెమలిపింఛము కలిగినవాడా! లోక సంరక్షణమే కృత్యముగా కలవాడా! భక్తులందు వాత్సల్యము కలవాడా! పరాత్పరా! నమస్కరింపబడిన దేవతాసమూహము కలవాడా! శ్రీనివాసా! నీ శరణమును పొందినవాడ నగుచున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| తే శరణ మహం | 180 | 401 | 2 | 270 |

అవ:శ్రీవేంకటేశ్వరుని మాటిమాటికి శరణు వేడుచున్నాడు.

సీ. **మాధవ! భూధవ! మధుకైటభాంతక !**

**సాధుసంరక్షణ! శరణు శరణు**

**వసుదేవనందన! వైకుంఠ! వామన !**

**సకలలోకేశ్వర! శరణు శరణు**

**వటపత్రపర్యంక ! వాచామగోచర !**

**సారసదళనేత్ర ! శరణు శరణు**

**అండజవాహన ! పండరిపురనాథ !**

**చండభార్గవరామ! శరణు శరణు**

ఆ. **కృష్ణ! నాగశయన ! కేశవ ! బలరామ!**
**శౌరి ! హరి ! మురారి! శరణు శరణు**
**దేవదేవ ! వరద ! దీనవత్సల! రామ!**
**సప్తశైల రమణ ! శరణు శరణు.** 293

లక్ష్మీదేవికి భూదేవికి భర్తయైనవాడును, మధుకైటభులనే రాక్షసులను చంపినవాడును, సజ్జనులను కాపాడువాడును, వసుదేవుని పుత్రుడైనవాడును, వైకుంఠవాసుడును, వామనరూపుడును, సకల లోకములకు ప్రభువైనవాడును, మఱ్ఱియాకు పానుపుగా గలవాడును, వాక్కుల కందనివాడును, తామరరేకులవంటి కన్నులు గలవాడును, గరుత్మంతుడు వాహనముగా గలవాడును, పండరిపురనాథుడును, పరశురాముడుగా నవతరించినవాడును, కృష్ణుడును, శేషునిపై పవ్వళించువాడును, మంచి కేశములు కలవాడును, బలరాముడును, శూరు డనువానికి మనుమడును, హరియును, మురుడను రక్కసునకు విరోధియు, దేవతలకు దేవుడును, వరము లిచ్చువాడును, దీనులయందు వాత్సల్యము కలవాడును, ఏడుకొండలపై క్రీడించువాడును అగు ఓ శ్రీనివాసా! నిన్ను శరణు వేడుచున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మాధవ భూధవ | 355 | 321 | 4 | 216 |

అవ: శ్రీనివాసుడు సర్వోత్కృష్టుడై విరాజిల్లుగాక అనుచున్నాడు.

**సీ. జయ పుండరీకాక్ష ! జయ పురుషోత్తమ !**

**జయ జనార్దన ! జయ సమరవిజయ !**

**జయ కృపాపరిపూర్ణ ! జయ కమలానాథ !**

**జయ నగధర ! జయ శరధిశయన !**

**జయ ధర్మరక్షక ! జయ గరుడధ్వజ !**

**జయ హలధర ! జయ సరసిజాక్ష!**

**జయ జగదాకార ! జయ భక్తవత్సల !**

**జయ భయహర ! జయ జలజనాభ !**

**తే. జయ పరాత్పర ! జయ శంఖచక్రహస్త !**
**జయ సనాతన ! జయ కృష్ణ ! జయ నృసింహ !**
**జయ జలదవర్ణ ! జయ దీనజనశరణ్య !**
**జయ తిరుమలేశ ! జయ జయ స్వప్రకాశ ! 294**

తెల్లదామరలవంటి కన్నులు గలవాడు, పురుషులలో ఉత్తముడు, జనులచే పొందబడువాడును, యుద్ధాలలో జయాన్ని పొందేవాడు, కృపారసంతో నిండినవాడు, పద్మావతికి నాథుడు, గోవర్ధనపర్వతాన్ని ఎత్తినవాడు, పాలసంద్రాన పవళించేవాడు, ధర్మాన్ని రక్షించేవాడు, గరుత్మంతుడు ధ్వజముగా కలవాడు, నాగలి ధరించినవాడు, పద్మములవంటి కన్నులుగల వాడు, జగమే స్వరూపముగా కలవాడు, భక్తులయెడ వాత్సల్యం కలవాడు, భయాన్ని భంజించేవాడు, బొడ్డున తామరకలవాడు, పరాత్పరుడు, శంఖచక్రములు హస్త ములందు కలవాడు, అనాదియైనవాడు, కృష్ణుడు, నృసింహుడు, మేఘంమాదిరి నల్లనివాడు, దయనీయులైన జనులకు దిక్కయినవాడు స్వయంప్రకాశమానుడగు తిరుమలేశునికి జయమగు గాక !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కలిగె నిదె | 191 | 466 | 2 | 314 |

అవ: అలమేలుమంగా శ్రీనివాసుల పెండ్లిసంబరం వర్ణిస్తున్నాడు

సీ. కనులపండువుగాఁగ గరుడధ్వజం బెక్కె
సేవింప పరసలు చేరినారు;
పాడిరి సోబాన భారతి గిరిజయు;
నాడిరి రంభాదు లప్సరసలు;
కూడిరి వేల్పులు గుంపులై శేషాద్రిఁ;
గురిసె పువ్వులవాన కుప్ప లగుచు;
నెందుఁ జూచిన దేవదుందుభి మ్రోఁతలే;
బెరసె సంపదలెల్లఁ బేటు లగుచు;

తే. కొప్పెరల వేలకానుకల్ గ్రుమ్మరిల్లె;
పోసినారలు తలఁబ్రాలు పుణ్యసతులు;
మించి వేంకటపతి యలమేలుమంగ
ప్రేమసేసలు పెట్టిన పెండ్లివేళ. 295

పెళ్ళిసమయంలో శ్రీ వేంకటాచలపతి అలమేలుమంగ ఒకరిపై ఒకరు సేసలు పోసుకుంటున్నారు. గరుడపతాక కనులపండువుగా రెప రెప లాడుతున్నది. యాత్రికబృందం కల్యాణోత్సవం సేవించడానికి వచ్చి చేరింది. సరస్వతి, పార్వతి సోబానపాటలు పాడినారు. రంభాది దేవవేశ్యలు నాట్యం చేశారు. దేవతలందరు గుంపులు గుంపులుగా శేషాద్రికి చేరుకున్నారు. స్వర్గంనుంచి పూలజల్లు కురిసింది. అంతటా దేవతల నగారాలు మ్రోగిపోయాయి. సకలవిధ సంపదలు కొండచరియలుగా వ్యాపించాయి. హుండీలు భక్తుల కానుకలతో నిండాయి. పతివ్రతాంగనలు పద్మావతీ శ్రీనివాసులకు తలంబ్రాలు పోశారు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| గరుడధ్వజం బెక్కె | 204 | 21 | 3 | 15 |

అవ: భక్ష్యభోజ్యములను కడుపార ఆరగింపు మని స్వామిని వేడుచున్నాడు.

**సీ. సూర్య చంద్రులవంటి చట్టుపళ్ళెములందు**
**వనరుహేక్షణలు వడ్డన మొనర్పఁ**
**గలవంటకము పులగమ్ము దుగ్ధాన్నమ్ము**
**గిలకొట్టుచును నారగింపుమయ్య !**
**పెక్కులౌ సైంధంపు పిండివంటలమీఁదఁ**
**బిక్కటిల్లెడు పొడిబెల్లములును**
**ఒలుపు ప్రప్పులు నప్పములు నొక్కటిగఁ గల్పి**
**క్రిక్కిఱియఁగ నారగింపుమయ్య !**

**తే. కూర లూరుగాయలు పంచదార నేయి**
**వెన్న మీఁగడ పెరుఁగులు వేఁడి వేఁడి**
**స్వచ్ఛరాజాన్నములును పచ్చళ్ళు మెదిపి**
**యెప్పు డిటు లారగింపవే వృషగిరీంద్ర ! 296**

ఓ గరుడశైలాధిపా ! తామరపూలవంటి కన్నులుగల కామినులు పులిహోర, చిత్రాన్నమును, పెసరపప్పుచేర్చి వండిన పొంగలిని, పాయసమును, సూర్యచంద్రులవంటి స్వచ్ఛమైన విశాలమైన బంగారుపళ్ళెరములలో వడ్డన చేయగా వ్రేళ్ళతో చక్కగా కలుపుకొని ఆరగింపుము. పలురకములైన గోదుమపిండి వంటలపై పరచిన పొడిబెల్లమును, పొట్టు తీసిన పప్పుముద్దలను, అప్పములను ఏకముగా చేర్చి నోరుపట్టనంత పెద్దముద్దలు చేసి భుజించుము. కూరలు, ఊరుగాయలు చక్కెర, నెయ్యి, వెన్న, మీగడ, పెరుగు, పచ్చళ్ళు–వీటిని వెచ్చవెచ్చని మేలిరకం మొలగొలుకుల వరి అన్నంతో కలిపి శ్రీవేంకటేశ్వరా ! కలకాలం ఈ విధంగానే ఆరగించవయ్యా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| పంకజాక్షులు | 23 | 138 | 1 | 94 |

అవ: శ్రీవేంకటేశ్వరుని బంగారురథమును వర్ణించుచున్నాడు.

సీ. **కులశైలములమీఁద నిలువ కేగిన తేరు**
**జలధులపైఁ జక్కఁ జనిన తేరు**
**పెనులంక ముంగిటఁ బేరె మెత్తిన తేరు**
**కుండినపురిఁ జుట్టుకొన్న తేరు**
**సమరమ్ములో జరాసంధుఁ దోలిన తేరు**
**అమరుల వెనుబలమైన తేరు**
**తరలి పౌండ్రకునిపై దాడివెట్టిన తేరు**
**హంసడిభకులపై నడరు తేరు**

తే. **అల సృగాలుని భంగించినట్టి తేరు**
**మిన్ను నేలయు నొకటైన మేటి తేరు**
**రంగుగా వేంకటేశుఁడు మంగఁగూడి**
**పట్టమేలుచు తిరుగు నాపైఁడి తేరు.** **297**

కులపర్వతాలమీద అడ్డూ ఆపూ లేక పయనించేదీ, సముద్రాలమీద కూడ చక్కగా వెళ్ళేదీ, లంకలో పరుగులు తీసినదీ,కుండినపురం చుట్టూతిరిగినదీ, సంగ్రామంలో జరాసంధుని తరిమికొట్టినదీ, దేవతలకు వెన్ను బలమై నిలిచినట్టిదీ, పయనంకట్టి పౌండ్రక వాసుదేవునిపై దాడిసల్పినదీ, హంస డిభకులపైకి పోయినదీ, సృగాలుని భంగపరచినదీ, నింగీ నేలకూ ఒక్కటిగా నున్నదీ, అలమేలుమంగతో అందంగా అధివసించి పట్టభద్రుడై తిరుగునట్టిదీ శ్రీవేంకటేశ్వరుని బంగారుతేరు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మిన్ను నేలా | 149 | 227 | 2 | 152 |

అవ: స్వామివారి రథోత్సవం వర్ణిస్తున్నాడు.

**సీ. దేవదుందుభులు ధింధింధి మ్మనుచు మ్రోఁగ**
**గరుడధ్వజుని తేరు గదలె నదిగొ !**
**పదివేల సూర్యబింబము లేకమైనట్లు**
**మేరుశైలము వచ్చి చేరినట్లు**
**మురువొప్ప గరుడుండు ముందు నిల్చినయట్లు**
**వన్నెలమేఘమ్ము వ్రాలినట్లు**
**కనువిందుగా సాగె కడపరాయని తేరు**
**దివిదాకు పువ్వుల తెప్పయట్లు**

**తే. దేవదేవోత్తముని తేరు తిరిగె నదిగొ !**
**జయజయ ధ్వానములు సల్ప దేవకోటి**
**అచ్చరమిటారు లచ్చుగ నాడిపాడ**
**హరికి సింహాసన మ్మదే యన్నయట్లు.** **298**

పదివేల సూర్యులు ఒకచోట గుమిగూడినట్లు ప్రకాశమానమై, మేరుపర్వతం పొరాడుతూవచ్చి చేరినదాయన్న విధంగా మిగుల పెద్దదై, అందమొప్పగా గరుత్మంతుడే ముందునిలిచిన మాదిరిగా వేగముకలదై, రంగురంగుల కారుమబ్బులు నేలకువ్రాలిన ప్రకారంగా వైపుల్యం కలదై, ఇది అంబరమునంటే పూవులతో నిర్మింపబడిన తెప్ప కాబోలు నన్న రీతిగా గుబాళించుచున్నదై, దేవతలు గుంపులుగట్టి జయజయ ధ్వానములు చేయుచుండగా, దేవవేశ్యలు పాడుతూ ఆడుతుండగా, శ్రీహరికి, సింహాసన మిదే యన్నట్లు గరుత్మంతుడు పతాకముగా గల దేవదేవోత్తముడైన శ్రీవేంకటేశ్వరుని తిరుతేరు అదిగో ! కదలివచ్చుచున్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| కన్నులపండుగ లాయె | 217 | 93 | 3 | 63 |

అవ: తిరునాళ్ళకు విచ్చేసిన బ్రహ్మాదులకు శ్రీనివాసుని వీడ్కోలు వర్ణిస్తున్నాడు.

**సీ. పోయిర మ్మజుఁడ ! శంభుఁడ ! పోయిరా పయి**

**తిరునాళ్ళకును మీరు తిరిగి రండు**

**ఇన్నాళ్ళు బడలితి రిఁకఁ బోయిరం డయ్య !**

**ద్విజులార ! మునులార ! వేల్పులార !**

**భోగీంద్రులార ! మీ రేగి తప్పక రండు**

**వేడ్కతో ముందటి విభవములకు**

**శశి దివాకరులార ! సకల దిక్పతులార !**

**పోయిరం డలసటఁ బొందినారు**

**తే. నారదమహర్షి ! సనక సనందనాది**
**యోగివరులార ! యేగిన ట్లేగిరండు**
**దూరముగఁబోక శేషాద్రిఁ జేరి యిట్టె**
**నను భజింపుఁడు మీకు శోభనము లగుత ! 299**

ఓ విరించీ ! ఇక నీవు వెళ్ళిరమ్ము. శంకరా ! పోయి రమ్ము. రాబోయే తిరునాళ్ళకు మీరు మళ్ళీరండి. ఓ బ్రాహ్మణులారా ! మునులారా ! దేవతలారా! ఈ ఉత్సవసంరంభంలో ఇన్నాళ్లు మీరు శ్రమపడినారు. స్వస్థానముల కరిగి విశ్రాంతి గైకొనండి. ఓ నాగులారా ! ముందు జరుగబోయే ఉత్సవానికి ఉత్సాహంతో రండి. సూర్యచంద్రులారా ! దిక్పాలకులారా ! మీరు బడలిక చెందినారు. పోయిరండు. నారదా ! సనక సనంద నాది యోగులారా ! చాలాదూరం పోక పోయినట్టే పోయి వెంటనే తిరిగి శేషాద్రికి రండి. నా సేవలో పాల్గొనండి. మీకు శుభములు కలుగుగాక !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| భోగీంద్రులును | 70 | 368 | 1 | 246 |

అవ: మహాలక్ష్మి నాశ్రయించు కొనుచున్నా మనుచున్నాడు.

**సీ. జయలక్ష్మి! వరలక్ష్మి! సంగ్రామవీరల**
**క్ష్మి! ముకుందునకు ప్రేయసివి గదమ్మ !**
**పాలకడలిలోని పసనైన మీఁగడ**
**మేల్మి తామరలోన మించుతావి**
**నీలవర్ణుని గుండెనిండిన నిధివయి**
**యేలెదు జగము మ మ్మేలవమ్మ !**
**శశితోడఁ బుట్టిన సంపదల మెఱుంగ !**
**కమలజాదులఁ గాచు కల్పవల్లి !**
**అంద గోవిందున కటుతోడునీడవై**
**యుందువు మా యింట నుండుమమ్మ !**

**తే. పదియు నార్వన్నె బంగరుప్రతిమ ! వేద**
**శిఖల నెసలారు లేమావి చిగురుఁబోఁడి !**
**యెదుట శ్రీవేంకటేశున కింతి వగుచు**
**వరలు కలుములతల్లి ! నీవార మమ్మ ! 300**

అమ్మా ! నీవు జయము లిచ్చే లక్ష్మివి. వరము లనుగ్రహించే శ్రీలక్ష్మివి. యుద్ధవీరులను వరించే మహాలక్ష్మివి నీవే. శ్రీమన్నారాయణునకు నీవు ప్రియు రాలవు. దేవదానవులు క్షీరసముద్రము మథించు నప్పుడు అందుండి పైకితేలిన మిసిమి మీగడవు. తామరపువ్వులోని సువాసనపు నీవే. మేఘశ్యాముడైన శ్రీహరి వక్షఃస్థలంలో నిధానమువలె నెలకొని ఉన్నావు. లోకములేలే దానవు, మమ్ము పాలించు. చంద్రునితో పాటు జలధినుంచి జనించిన సంపదల మెరుగ్గా ఉన్నావు. బ్రహ్మాదుల పాలిటికి కల్పలతవు నీవే. గోవిందుని ఎన్నడూ ఎడబాయకుందువు. తల్లీ ! నీవు మా యింట కాపురముండు. నీవు పదారువన్నె బంగారు బొమ్మవు. ఉపనిషత్తులందు ప్రకాశించే లేతమామిడి చిగురువలె కోమలమైన శరీరము గలదానవు. శ్రీనివాసునకు ఇల్లాలివై చెలువొందుచున్నావు. సంపదల తల్లివి నీవే. జననీ ! మేము నిన్నాశ్రయించికొని ఉన్నాము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| జయలక్ష్మి వరలక్ష్మి | 989 | 520 | 25 | 348 |

అవ: శ్రీనివాసునకు మంగళాశాసన మొనరించుచున్నాడు.

**సీ. పంకజాలయ కుచ కుంభ కుంకుమాంకిత పీన**
**వక్షునకున్ యాగరక్షకునకు**
**ఆద్యంతరహితున కాగమమూలున**
**కవ్యక్తునకు నరకాంతకునకు**
**గరుడవాహనునకుఁ గమలాప్తకులునకు**
**విశ్వమూర్తికిఁ బరమేశ్వరునకు**
**శార్‌ఙ్గ గదా శంఖ చక్రాసిధరునకు**
**నాశ్చర్యరూపున కచ్యుతునకు**
**తే. సర్వసాక్షికి ధర్మసంస్థాపకునకు**
**భక్తభవభంజనునకుఁ గైవల్యపతికి**
**మౌనిసురవంద్యునకు జయమంగళమ్ము**
**మహితమంగేశునకు శుభమంగళమ్ము. 301**

పద్మనివాసినియైన పద్మావతియొక్క కుచముల మీది కుంకుమపూతచే గుర్తింపబడిన విశాలమైన వక్షము గలవానికీ, విశ్వామిత్రుని యాగసంరక్షణ చేసినవానికీ, ఆదియు అంతములేనివానికీ, వేదముల ఆవిర్భావానికి కారణమైనవానికీ, వ్యక్తముకాని వానికీ, నరకాసురు నంతమొందించిన వానికి, గరుత్మంతుడు వాహనముగా గలవానికీ, కమలములకు హితుడైన సూర్యునివంశములో జన్మించినవానికీ, ప్రపంచ స్వరూపునికీ, పరమేశ్వరునికీ, శార్‌ఙ్గ మనే వింటిని, కౌమోదకి అనే గదను, పాంచజన్య మనే శంఖమును, సుదర్శన మనే చక్రమును, నందక మనే ఖడ్గమును ధరించినవానికీ, చ్యుతిలేనివానికీ, సకలమునకు సాక్షియైనవానికీ, ధర్మమును నిలబెట్టేవానికీ, భక్తుల పుట్టువులను పోకార్చువానికీ, ముక్తినిచ్చే ప్రభువునకూ, మునులచేత సురలచేత మ్రొక్కబడే వానికీ జయమంగళ మగును గాక ! అలమేలుమంగా ప్రియుడైన శ్రీవేంకటాచలపతికి శుభమంగళ మగును గాక!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపు | పుట |
|---|---|---|---|---|
| మంగళము గోవిందునకు | 7 | 46 | 1 | 30 |

**బలం విష్ణోః ప్రవర్ధతామ్.**

# సంకీర్తనల అకారాదిసూచిక


| సంకీర్తన మొదలు | పుట సంఖ్య |
|---|---|
| **అ** | |
| అంతటనె వచ్చి | 248 |
| అంతయు నీవే హరి | 156 |
| అంతరంగమెల్లా | 282 |
| అంతర్యామి | 101 |
| అందరి కాధారమైన | 160 |
| అందరి రక్షించే | 218 |
| అందుకే పో | 71 |
| అందుకే సుమ్మీ | 234 |
| అక్కటా నీ మాయ | 277 |
| అచ్యుత మిమ్ము | 108 |
| అజ్ఞానుల కివి | 175 |
| అదర శ్రావణ | 36 |
| అణురేణు పరిపూర్ణుఁడైన | 186 |
| అతఁడు లక్ష్మీకాంతుఁడు | 288 |
| అతఁడు లోకోన్నతుఁడు | 217 |
| అతఁడే పరబ్రహ్మ | 27 |
| అతఁడే బ్రహ్మణ్య | 26 |
| అతఁడే యెక్కుడు | 17 |
| ఆతఁడే సకల | 202 |
| అదివో అల్లదివో | 2 |
| అదిగాక నిజమతం | 190 |
| అధమునికి | 170 |
| అని యానతిచ్చె | 16 |
| అన్నియు నడుగవే | 92 |
| అన్నియును నతని | 279 |
| అన్ని విధముల | 47 |
| అప్పటి సుఖమె | 261 |
| అయ్యో నేనే | 164 |
| అయ్యో పోయ | 161 |
| అయ్యో వారి భాగ్య | 260 |
| అరుదు నీ చెరిత్రము | 76 |
| అతిముతి హనుమంతు | 59 |
| అలర నుతించరో | 174 |
| అల్లనాఁడే యిదెరఁగ | 237 |
| అవియు నాకు | 124 |
| అహోబలేశ్వరునకు | 29 |
| **ఆ** | |
| ఆఁకటి వేళల | 201 |
| ఆచార విచారాలవి | 114 |
| ఆడుతా పాడుతా | 151 |
| ఆతుమ సంతసపెట్టుటది | 252 |
| ఆదిదేవుఁ డనఁగ | 15 |
| **ఇ** | |
| ఇంతకంటె | 46 |
| ఇంత సేసెఁబో | 51 |
| ఇందతికి నభయంబు | 18 |
| ఇందఱు జీవులే | 222 |
| ఇందఱు నీ కొక్కసరి | 68 |
| ఇందుకు జింతించ | 285 |
| ఇందుకే పో | 72 |
| ఇట్టి నా వెఱ్ఱి | 121 |
| ఇతరులకు | 120 |

| సంకీర్తన మొదలు | పుట సంఖ్య |
|---|---|
| ఇతరుల దూఱనేల | 198 |
| ఇది నమ్మలేఁడు | 178 |
| ఇదివో సంసారమెంత | 193 |
| ఇన్ని లాగుల | 20 |
| ఇప్పుడిటు కలగంటి | 3 |
| ఇహామే కాని | 163 |
| **ఈ** | |
| ఈ జీవునకు | 246 |
| ఈ పాదమే గదా | 23 |
| ఈ విశ్వాసంబు | 228 |
| **ఊ** | |
| ఊరకే దొరకునా | 205 |
| ఊరకైతే నిన్ను | 98 |
| **ఎ** | |
| ఎంచి చూడరో | 264 |
| ఎంత కఠినమో | 107 |
| ఎంతకత | 96 |
| ఎంత చదివిన | 191 |
| ఎంత మాత్రమున | 70 |
| ఎంత విభవము | 196 |
| ఎంత సేయఁగ లేదు | 225 |
| ఎందరి వెంట | 267 |
| ఎందాక నిద్ర | 61 |
| ఎందుకుఁ బని గొందము | 270 |
| ఎందుకు విచ్చేయనేల | 139 |
| ఎక్కడి నరకములు | 106 |
| ఎక్కువ కులజు | 226 |
| ఎట్టి వారికి | 97 |
| ఎటు మోసపోయిరొకో | 230 |
| ఎట్టు సేయ | 75 |
| ఎన్నఁడు నే గందు | 89 |
| ఎన్నఁడొకో | 249 |
| ఎనుపోతుతో | 221 |
| ఎవ్వఁడో కాని | 43 |
| ఎరిగీ నెరుఁగదు | 210 |
| ఎఱుక గలుగు | 229 |
| ఎల్లలోకముల | 13 |
| ఎవ్వరు లేరూ హితవు చెప్పఁగ | 167 |
| ఎవ్వ రెవ్వరి వాఁడొ | 262 |
| **ఏ** | |
| ఏటి పరిణామము | 276 |
| ఏడవలపేడ | 213 |
| ఏణ నయనల | 266 |
| ఏతదఖిలంబు | 34 |
| ఏది గతి | 100 |
| ఏది చూచిన | 95 |
| ఏది వలసె | 195 |
| ఏదీ నుపాయము | 219 |
| ఏ దుపాయము | 122 |
| ఏ నోరు వెట్టుక | 103 |
| ఏ పనులు సేసినా | 268 |
| ఏమన వచ్చును | 291 |
| ఏమని చెప్పఁగవచ్చు | 55 |
| ఏమని పొగడవచ్చు | 14 |
| ఏమరక తలఁచరో | 254 |
| ఏమిగల దిందు | 224 |
| ఏమి చెప్పేదిది | 216 |
| ఏఃయుఁ జేయఁగ | 208 |

| సంకీర్తన మొదలు | పుట సంఖ్య |
|---|---|
| ఏమి వలసిన నిచ్చు | 25 |
| ఏమీ నడుగనొల్ల | 80 |
| ఏమీ నెఱఁగనినాఁడు | 73 |
| ఏలవయ్య లోకమెల్ల | 60 |
| ఏ లోకమందు | 286 |
| **ఒ** | |
| ఒక్కఁడే మోక్షకర్త | 171 |
| ఒక్కమాటు శరణని | 57 |
| ఒసఁగితి విన్నియు | 111 |
| **క** | |
| కంటి నఖిలాండపతి | 4 |
| కంటి నిదే యర్థము | 185 |
| కంటిరా | 172 |
| కటకట యీ మాయ | 272 |
| కట్టెదుర వైకుంఠము | 1 |
| కడు పెంత | 197 |
| కనుగొనఁగ | 207 |
| కన్నుల పండుగ | 116 |
| కన్నుల పండుగలాయె | 303 |
| కరుణానిధివి | 109 |
| కలకాలమిట్లాయ | 233 |
| కలది గలట్టే | 188 |
| కలదందే పో | 179 |
| కలశాపురముకాడ | 58 |
| కలిగె నిదె | 299 |
| కలిమి గలిగియు | 269 |
| కలియుగ | 90 |
| కాకున్న మా పాటు | 150 |
| కాలము గాలముగాదు | 192 |
| కిన్న జానేహం | 293 |
| కూడులేక | 134 |
| కొండలలో నెలకొన్న | 24 |
| కొనరో కొనరో | 235 |
| **గ** | |
| గతులన్నిఖిలమైన | 169 |
| గద్దరి జీవుఁడు | 245 |
| గరిమల నెరఁగరు | 271 |
| గరుడధ్వజం బెక్కె | 300 |
| గాలినే పోయ | 263 |
| గుల్ల గుల్లే | 140 |
| గోనెలె క్రొత్తలు | 239 |
| **ఘ** | |
| ఘోరవిదారణ నారసింహ | 54 |
| **చ** | |
| చదివితిఁ దొల్లి | 290 |
| చాలదా మా జన్మము | 69 |
| చాలదా మా జన్మము | 82 |
| చాలదా హరినామము | 227 |
| చాలుఁ జాలు | 49 |
| చింతలు రేఁచకు | 232 |
| చిత్తానఁ బెట్టకు | 99 |
| చీచీ వో బ్రదుకా | 231 |
| చూడఁ జూడ | 7 |
| చెప్పితే నాశ్చర్యము | 32 |
| చెల్లఁబో యీ జీవుల | 215 |

| సంకీర్తన మొదలు | పుట సంఖ్య | సంకీర్తన మొదలు | పుట సంఖ్య |
|---|---|---|---|
| ఛ | | దైవ మొక్కఁడే | 214 |
| ఛీ ఛీ నరుల | 281 | దోమటి నింతెరఁగరా | 258 |
| జ | | ధ | |
| జగన్మోహనాకార | 117 | ధరణి నెందరెన్ని | 256 |
| జడమతిరహం | 295 | న | |
| జయలక్ష్మి వరలక్ష్మి | 305 | నమో నారాయణాయ | 294 |
| త | | నమో నారాయణాయ నమః | 296 |
| తందనాన | 50 | నమ్మితే నితఁడే | 41 |
| తక్కిన చదువు | 255 | నాకుఁ గల పని | 126 |
| తన కర్మమెంత | 250 | నాకు నందుకేమి | 135 |
| తనకేడ చదువులు | 240 | నా తప్పు లోఁగొనవే | 148 |
| తలఁపు కామాతురత్వము | 275 | నా పాలి ఘననిధానమవు | 112 |
| తల్లిఁ బాసి బిడ్డలెల్ల | 168 | నారాయణ | 147 |
| తానెంత బ్రదుకెంత | 125 | నిండు మనసే | 136 |
| తాపలేక | 247 | నిఖిలమంతయు మేలు | 128 |
| తెలియఁ జీఁకటికి | 165 | నిత్యాత్ముఁడై | 5 |
| తెలియుట యెన్నఁడు | 159 | నిత్యపూజ | 287 |
| తెలిసితే | 200 | నిన్నుఁ దలఁచి నీపేరు దలఁచి | 158 |
| తెలిసిన తెలియుఁడు | 38 | నిన్ను నమ్మి | 86 |
| తెలిసియు నత్యంత దీనుఁడై | 251 | నిరుహేతుకాన | 145 |
| తే శరణ మహం | 297 | నీకుఁ దొల్లే యలవాటు | 104 |
| తొల్లిటివారు | 284 | నీ దాసుల | 64 |
| తొల్లిటి వారికంటె | 118 | నీదు గుఱుతులు చూచుకో | 81 |
| ద | | నీ యంతటి | 79 |
| దేవ నీ యాధీనము | 74 | నీ వనఁగ | 102 |
| దేవుఁడు గలవారికి | 209 | నీవు సర్వసముఁడవు | 85 |
| దేహము సమ్మంధము | 132 | నీ వెరఁగనిది | 146 |
| దేహి నిత్యుఁడు | 220 | నీవే నీ దాసులని | 115 |
| దైవము దూరఁగనేల | 223 | నీ వేలికవు | 155 |

| సంకీర్తన మొదలు | పుట సంఖ్య |
|---|---|
| నీ సొమ్ము చెడకుండ | 138 |
| నెప్పున ధర్మ | 78 |
| నే ననఁగా | 199 |
| నే నొక్కఁడ | 83 |
| నేనేపో ఘనుఁడను | 84 |
| నేనేమిఁ జేయఁగ | 91 |
| నేల మిన్ను నొక్కటైన | 66 |
| **ప** | |
| పంకజాక్షులు | 301 |
| పంటల భాగ్యులు | 278 |
| పదువులోనే హరిని | 182 |
| పనిగొన | 88 |
| పరమ యోగీశ్వరుల | 244 |
| పరము నిహము | 6 |
| పరుల సేవలుచేసి | 184 |
| పరుస మొక్కటే కాదా | 253 |
| పలు విచారములేల | 123 |
| పొడైన యెఱుకతో | 110 |
| పాటెల్ల నొక్కచో | 154 |
| పావనము | 173 |
| పాలదొంగవద్ద | 194 |
| పుట్టినది మొదలు | 131 |
| పురుషుఁడే యధముఁడు | 273 |
| పురుషోత్తముఁడ | 87 |
| పెంచిన తమ | 105 |
| పెరిగి పెద్దగాను | 149 |
| పెఱుగఁగఁ బెఱుగఁగ | 93 |
| **బ** | |
| బయ లీదించీ | 236 |
| బలువుఁడు హరి | 189 |
| బిరుదు లన్నియు | 77 |
| బొడ్డు తామెరలోన | 35 |
| బ్రహ్మ గడిగిన | 22 |
| **భ** | |
| భక్తి నీపై దొకటే | 137 |
| భవరోగ వైద్యుఁడవు | 94 |
| భావించరే చెలులాల | 11 |
| భోగించఁ బుట్టిన | 127 |
| భోగీంద్రులును | 304 |
| **మ** | |
| మంగళము గోవిందునకు | 306 |
| మనుజుఁడై పుట్టి | 248 |
| మమ్ముఁ జూడనేల | 153 |
| మరగితి నేమిసేతు | 144 |
| మతి విచారింప | 274 |
| మహి నుద్యోగి | 212 |
| మాధవ భూధవ | 298 |
| మాయల కగపడి | 204 |
| మాయామయము | 129 |
| మిన్నక వేసాలు | 62 |
| మిన్నునేలా | 302 |
| ముందే తొలగవలె | 177 |
| మొక్కరే మొక్కరే | 28 |
| **ర** | |
| రాజీవనేత్రాయ | 292 |
| రామచంద్రు | 33 |
| రామా రామభద్ర | 56 |
| రాముఁడు | 31 |
| రూకలై మాడలై | 206 |

| సంకీర్తన మొదలు | పుట సంఖ్య |
|---|---|
| **వ** | |
| వందే వాసుదేవం | 52 |
| వలెనను వారిదె వైష్ణవము | 187 |
| వాఁడెవో | 30 |
| వాఁడె వేంకటేశుఁ డనేవాఁడె | 39 |
| వారివారి కర్మములే | 67 |
| విచ్చేయవయ్యా | 65 |
| విన్నపమిదే | 113 |
| విష్ణుఁ డొక్కఁడే | 45 |
| వీఁడెవో యిదె వింతదొంగ | 42 |
| వీని జూచియైన నేము | 181 |
| వెగ్గల మింతా | 241 |
| వెదమంత్రమిcక | 289 |
| వెనుకేదో ముందరేదో | 162 |
| వెన్న ముద్ద కృష్ణుఁడు | 37 |
| వెన్నలు దొంగిలునాఁటి వెట్టివా | 157 |
| వెన్నపట్టుక నేయి | 242 |
| వెఱపించ | 180 |
| వెట్టి దెలిసి | 141 |
| వెట్టి దెలిసి రోకలి | 142 |
| వెలుపల వెదకితే | 280 |
| **శ** | |
| శరణాగత వజ్ర | 63 |
| శ్రీపతి యీతఁ డుండఁగా | 243 |
| శ్రీవేంకటేశ్వరుని | 21 |
| శ్రీవేంకటేశుఁడు | 12 |
| **స** | |
| సంతలో చొచ్చితి | 133 |
| సందడి సొమ్ముల | 8 |
| సంసారమే మేలు | 176 |
| సకలమైన వారికి | 283 |
| సకల సందేహమై | 10 |
| సమబుద్ధే యిందరికి | 211 |
| సర్వోపాయముల | 48 |
| సహజవైష్ణవాచార | 166 |
| సిరి దొలంకెడి | 9 |
| సుఖమును దుఃఖమును | 183 |
| సులభుఁడు | 40 |
| సేవింతురా | 203 |
| సొమ్ము గలవాఁడు | 143 |
| **హ** | |
| హరి నిను | 152 |
| హరి నెఱుఁగని | 257 |
| హరి హరి | 130 |

**T.T.D. Religious Publications Series No. : 430**
**Price : Rs.**



# ముదివర్తి కొండమాచార్య జీవిత విశేషాలు

శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులు నెల్లూరు జిల్లా గూడూరు వాస్తవ్యులు. జననం 02.09.1923. మద్రాసు విశ్వవిద్యాలయ 'విద్వాన్' పట్టభద్రులు. నెల్లూరు జిల్లా పరిషత్తు ఉన్నతపాఠశాలల్లో 30 సం॥లు ప్రధానాంధ్రపండితులుగా పనిచేసి ఉద్యోగవిరమణానంతరం 1980 లో తిరుమల తిరుపతి దేవస్థానం వారి పుస్తక ప్రచురణ విభాగంలో ఉపసంపాదకులుగా చేరి ప్రస్తుతం ఆ విభాగ సమన్వయకర్తగా పనిచేస్తున్నారు.

ముదివర్తి వారు తమ 'ధర్మదీక్ష'తో కవితావ్రతమారంభించి అమరసందేశము, వీరమనీడు, నారాయణమ్మ, పూర్ణాహుతి వంటి నలభైకిపైగా పద్య, గద్యకృతులు ప్రచురించారు. తాళ్లపాక అన్నమాచార్యులు. పెద తిరుమలాచార్యులు, చిన తిరుమలాచార్యుల అధ్యాత్మసంకీర్తనల్లో 1500 పదాలను సీసపద్యాలుగా మలచి అమృతసారము, అన్నమయ్య విన్నపాలు, బ్రహ్మగాంధర్వము, ఆనంద నిలయము, శ్రీనివాసతేజము అనే శీర్షికలతో పంచప్రబంధాలను ప్రకటించారు.

వీరి రచనలు తిరుపతి వేంకటకవులు, శేషాద్రిరమణకవులు, వేటూరి, పింగళి, రాళ్లపల్లి, రాయప్రోలు, విశ్వనాథ, గడియారం వేంకటశేషశాస్త్రి, దీపాల పిచ్చయ్యశాస్త్రి, మధునాపంతుల, పుట్టపర్తి, విద్వాన్ విశ్వం, దివాకర్ల, కరుణశ్రీ, సినారె, దాశరథి, కుందుర్తి, ఆరుద్ర, ఆత్రేయ, గుంటూరు శేషేంద్రశర్మవంటి కవీంద్రుల ప్రశంసలందుకున్నాయి.

వివిధ విశ్వవిద్యాలయాలలో వీరి గ్రంథాలు పాఠ్య గ్రంథాలుగా నిర్ణయించబడ్డాయి. వీరి రచనలపై శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిశోధనలు జరిగాయి.

టి.టి.డి ప్రచురించిన భారత, భాగవతాలలో కొన్ని భాగాలకు వీరు వ్యాఖ్యానం రచించారు. కవిశేఖర, విద్వత్కవి శిరోమణి, మహాకవి బిరుదాంకితులు శ్రీ ముదివర్తి కొండమాచార్యులవారు ఆంధ్రదేశంలో పలు నగరాల్లో అనేక సన్మానాలు పొందారు. 2006 సం॥నికి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారి ప్రతిభాపురస్కారాన్ని గ్రహించారు.

**Printed and Published by Sri K.V.Ramanachary, I.A.S., Executive Officer, T.T.Devasthanams, Tirupati and printed at T.T.D. Press, Tirupati.**